telugubooks

# స్టూవర్ట్‌పురం పోలీస్ స్టేషన్

యండమూరి వీరేంద్రనాథ్

*ఆ రోజు ఉగాది!*

అందుకే ట్రెయిన్ అంత రష్‌గా లేదు. రైలు గాలిని చీల్చుకుంటూ వెళుతూంది.

అతడు కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు. అతడి వయసు 25-30 మధ్య వుంటుంది. తీక్షణమైన కళ్ళు, బిగించిన పెదవులు పట్టుదలని సూచిస్తూంటే నుదుటిమీద అల్లరిగా పడే జుట్టు, వంగిన క్రింది పెదవి అల్లరిని సూచిస్తున్నాయి. ఒక మనస్తత్వవేత్తగానీ అతడిని చూస్తే, ఒక మిక్స్‌డ్ పర్సనాలిటీగా అభివర్ణిస్తాడు.

ట్రెయిన్ మరింత వేగం అందుకుంది.

అతడు జేబులోంచి కాగితం తీసి మరోమారు చదువుకున్నాడు. ట్రాన్స్‌ఫర్ ఆర్డర్.

అతడి కళ్ళముందు లారీలు కదుల్తున్నాయి. రైలు శబ్దానికి బదులు ఆక్రందనలు వినపడుతున్నాయి. అతడు చప్పున కాగితం మూసి జేబులో పెట్టుకున్నాడు.

"అంకుల్ ఇదిగో చాక్లెట్."

అతడు తలతిప్పి చూశాడు. ఎదురుగా పన్నెండేళ్ళ పాప చిరునవ్వుతో నిల్చుని వుంది. అవతలివైపు కూర్చున్న పాప తల్లి ఇటే చూస్తూంది.

"ఈ రోజు నా పుట్టినరోజు."

"ఓహో! అలాగా!! ఉగాదిరోజున పుట్టావన్నమాట. మెనీ రిటర్న్స్ ఆఫ్ ది డే" చాక్లెట్ అందుకుంటూ అన్నాడు. "పుట్టినరోజు ఫ్రెండ్స్‌తో ఆడుకోకుండా రైల్లో ప్రయాణం చేస్తున్నావేమిటి?"

పాప దానికి సమాధానం చెప్పకుండా "మరి పండుగరోజు నువ్వెందుకు తిరుగుతున్నావ్?" అని తిరుగుప్రశ్న వేసింది. అతడు బిగ్గరగా నవ్వి, "మేం ఉద్యోగస్తులం కదా, బంతిలాగా ఈడ కొడితే అక్కడకు వెళ్ళాలి. ట్రాన్స్‌ఫర్ అయింది. వెళ్తున్నాను" అన్నాడు.

"నువ్వు చేసేది ఏం ఉద్యోగం అంకుల్?"

"నేను పోలీస్ ఇన్‌స్పెక్టర్ నమ్మా."

చెవులు దద్దరిల్లేలా కూతవేస్తూ రైలు సాగిపోతోంది. పాప మొహం మారిపోయింది. అప్రయత్నంగా దూరంగా జరిగిన పాపని చూస్తూ, "ఎందుకంత భయం?" అని అడిగాడు.

ఒక కుర్రవాడు మజ్జిగ గ్లాసులు ట్రేలో పెట్టుకుని అమ్ముకుంటూ వస్తున్నాడు.

"నాకు పోలీసులంటే భయం" పాప అన్నది. అతడికి బాధేసింది. ఈ పెద్దవాళ్ళు పిల్లల మనసుల్లో చిన్నప్పటి నుంచే భయాన్ని ప్రవేశపెడతారెందుకో అనుకున్నాడు. ఆ పాపవైపు

చూస్తూ, "పోలీసులూ మంచి వాళ్ళేనమ్మా. దొంగల్ని పట్టుకుని జైల్లో పెడతారు. కావాలంటే మీ నాన్నగార్ని అడుగు."

"మా నాన్నగారు జైల్లో వున్నారంకుల్."

దాదాపు అతడి కిటికీని రాసుకుని వెళ్తున్నట్టు పక్క ట్రాక్‌మీద నుంచి రైలు వేగంగా వెళ్ళిపోయింది. పాప తల్లి తలవంచుకుని కూర్చుని వుంది.

"నాన్నగారికి బర్త్‌డే చాక్లెట్ ఇవ్వడం కోసం వెళ్తున్నాను. మా నాన్న చాలా మంచాయనకంకుల్. మీ పోలీసులే జైల్లో పెట్టారు."

అతడు పాప తల్లివైపు చూశాడు. ఆమె కంటినుంచి నీటిచుక్క రాలి చేతిమీద పడింది. అతడికేం మాట్లాడాలో తెలియలేదు. 'పుట్టినరోజునాడు ప్రయాణమేమిటమ్మా' అని అడగటం తనకే గిల్టీగా అనిపిస్తోందిప్పుడు.

"నీ పేరేమిటి పాపా?"

"అభిషిక్త."

"మీ నాన్నగారు ఏ జైల్లో వున్నారు?"

తల్లి కల్పించుకుని "జైల్లో కాదండి. పోలీస్‌స్టేషన్ లాకప్‌లో వున్నారు. నాల్రోజుల క్రితం అరెస్ట్ చేశారు."

అతడు అభిషిక్తవైపుకు తిరిగి, "చూడు పాపా. తప్పు చేయని మనిషిని దేముడు కూడా శిక్షించలేడు. మీ నాన్నగారు ఏ తప్పూ చేయకపోతే ఆయన పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తారు" అన్నాడు.

పాప మొహంలో ఆనందం కనపడింది. బహుశ ఆ మాత్రం ఓదార్పు ఇచ్చినవాళ్ళు ఎవరూ వుండి వుండరు. తల్లికూడా కృతజ్ఞతతో చూసింది.

అతడు కళ్ళు మూసుకున్నాడు. రైలు వేగం తగ్గింది. తన మాటలు తనకే వికృతంగా ధ్వనిస్తున్నట్టున్నాయి.

---- తప్పుచేయని మనిషిని దేముడు కూడా శిక్షించలేడు.

---- తప్పుచేయని మనిషిని దేముడు కూడా శిక్షించలేడు.

నిజమా? నిజమేనా?

దూరం నుంచి గ్లాసులు ట్రేలో పెట్టుకుని "మజ్జిగ" అని అరుచుకుంటూ వస్తున్నాడు కుర్రవాడు. అతడి దృష్టి ఆ గ్లాసుమీద పడింది. తెల్లటి ద్రవం ..... కిటికీలోంచి పడుతున్న ఎర్రటి సూర్యకాంతికి రుధిర వర్ణంలోకి విశ్లేషణం చెంది, రైలు కుదుపులకి తరంగాలుగా మారుతోంది.

సరీగ్గా వారం రోజుల క్రితం ఇలాటి దృశ్యమే అతడి ట్రాన్స్‌ఫర్‌కు కారణమైంది.

## 1

*అతడి* తండ్రి దేశభక్తుడు. అందుకేనేమో కొడుక్కి "రాణా ప్రతాప్" అని పేరు

పెట్టుకున్నాడు. రాణా చిన్నతనం నుంచీ కట్టుదిట్టాల్లో పెరిగాడు. గాంధీగారు ఆ రోజుల్లో దేశాన్ని శాసించినట్టే, రాణా తండ్రి ఆ ఇంటిని శాసించాడు. ఖద్దరే కట్టాలి, ఎవరూ అబద్ధం చెప్పకూడదు మాంసాహారం నిషిద్ధం వగైరా.

రాణా తన పదహారో ఏట మొట్టమొదటిసారి సిగరెట్ తాగాడు. ఆ విషయం తండ్రికి మరుసటి రోజే తెలిసింది. సాధారణంగా కొడుకులు సిగరెట్ తాగుతున్నారన్న విషయం తండ్రులకి కొన్ని నెలలకో, సంవత్సరాలకో తెలుస్తుంది. కానీ రాణా దీన్ని రహస్యంగా వుంచే ప్రయత్నమేమీ చేయలేదు. నడిబజార్లోనే కాల్చాడు. ఈ విషయం నిముషాల్లో అతడి తండ్రి దగ్గరకు ఎవరో మోసుకొచ్చి పడేశారు. ఆయన మండే కొలిమిలా దహించుకుపోతూ కొడుకు రాగానే రెక్కపట్టుకుని "ఏరా? సిగరెట్ తాగావా లేదా?" అని నిలదీశాడు బెల్టు ఝుళిపిస్తూ.

"తాగాను" అన్నాడు రాణా, ఆ సమాధానానికి అతడి వీపు ఆ రోజు పగిలిపోవలసిందే. కానీ కొడుకు మొహంలో కనపడుతూన్న నిజాయితీతో కూడిన ధైర్యం తండ్రిని ఆపుచేసింది. అయినా ఆవేశం ఆపుకోలేక "ఓరి భ్రాష్ఠుడా తప్పు చేసింది చాలక ఆ విషయం సిగ్గులేకుండా చెప్పుకుంటావా?" అని అరిచాడు.

"నువ్వేగా నాన్నా- ఏ పని చేసినా ధైర్యంగా చెయ్యాలి అన్నావ్. పైగా గాంధీగారు అసత్యం చెప్పరాదు అన్నారన్నావ్."

"అసత్యం చెప్పరాదు అన్నారేగాని సిగరెట్లు తాగమనలేదురా గాంధీగారు--"

"తాగమనలేదు- తాగొద్దనలేదు! నిజంగా గాంధీగారికి మనం సిగరెట్లు తాగడం ఇష్టం లేకపోతే విదేశీ సరుకులొద్దు అని సత్యాగ్రహం చేసినట్టే ..... స్వతంత్రం రాగానే దేశంలో సిగరెట్టు ఫ్యాక్టరీలొద్దు అని సత్యాగ్రహం చేసి వుండేవారు కదా?"

కొడుకుది వితండ వాదమైనా ఆ క్షణం తండ్రిని నిలదీసింది. ఈ రకమైన వితండవాదమే పెద్దయ్యాక వృత్తిపరంగా రాణాని చాలాసార్లు చిక్కుల్లో పడేసింది.

రాణాని ఇంజనీర్ చెయ్యాలని అతడి తండ్రి కోరిక. "ఏరా? బి.ఇ. చదువుతావా?" అని అడిగాడు తండ్రి.

"ఉహూ, బి.ఎ. చదువుతా!"

ఆయన ఆశ్చర్యపోయి "బి. ఏనా? ఎందుకు?" అన్నాడు.

"ఐ.పి.ఎస్. అవ్వాలని వుంది నాన్నా నాకు" అన్నాడు రాణా.

ఖాకీ బట్టలేసుకుని ఠీవిగా జీపులోంచి దిగే డి.యస్పీలని చూస్తుంటే రాణాకి చిన్నతనం నుంచీ ముచ్చటగా వుండేది.

కొడుకు పట్టుబట్టడంతో తండ్రికి తప్పలేదు. ఆ విధంగా రాణా ఆర్ట్స్ గ్రాడ్యుయేట్ అయ్యాడు. కానీ ఆ తరువాత చదవలేకపోయాడు. చదువనేది ఎటువంటి పదార్థమో కానీ, ఎంత తోసినా అతడి బుర్రలోకి ప్రవేశించలేకపోయేది. బొటా బొటిగా పాసయ్యిన కొడుకు మార్కుల లిస్టు చూసి, "బి.ఎ. ప్యాసవటానికే ఇంత కష్టపడ్డావ్. రేపు ఐ.పి. యస్. ఎలా

అవుతావురా?" అని అడిగాడు తండ్రి.

"అవును నాన్నా అవలేను. ఆ విషయం నాకూ ఇప్పుడే అర్థమైంది. అందుకే సబ్-ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాను."

ఆ ముసలాయన పెనం మీద గింజలా పేలిపోయాడు. "ఇంజనీరువి అవుతావనుకున్నాను. లేదా ఐ.పి.యస్. చదువుతావనుకున్నాను. సబినస్పెక్టర్‌వి అవుతావా?"

"అందని దానికి అర్రులు సాచకూడదని గాంధీగారే చెప్పారు కదా నాన్నా."

"ఒరేయ్ నిన్నూ ..... "

"చిన్న చిన్న విషయాలకి అనవసరంగా కోపం తెచ్చుకోకూడదని కూడా ఆయన చెప్పినట్టు గుర్తు-"

ఆయన నిస్సహాయుడై కొడుకు వైపు చూస్తూ వుండిపోయాడు రాణా ఆ విధంగా సబ్-ఇన్‌స్పెక్టర్ అయ్యాడు.

రాణా మనస్తత్వ శాస్త్రం చదువుకోలేదు. రాబర్ట్ లింగర్, డాక్టర్ మాక్స్ ఎవరో కూడా తెలీదు. అయినా అతనికి ఎలా అలవడిందోకానీ జీవితాన్ని ఎప్పుడూ ప్రశాంతంగా వుంచుకోవడం అలవాటయింది. ఈ ప్రశాంతత అన్నది మనిషికి తను నమ్మిన సిద్ధాంతం నిజాయితీగా అమలు జరపడంవల్ల మాత్రమే వస్తుంది. ఆ సిద్ధాంతం ఎటువంటిదైనా కానీ, దానివల్ల ఎంతమంది శత్రువులైనా కానీ ఆ సంతోషం అతడి కళ్ళల్లో నిరంతరం ప్రతిబింబిస్తూ వుంటుంది. ఆశ్చర్యకరంగా రాణాకి అది చిన్నతనం నుండే అలవడింది. చాలా చిన్న వయసులోనే అతడి తల్లి కథలు చెప్పేది. ఆ కథలు రాముడి గురించీ, కృష్ణుడి గురించీ కావు. అతడి తండ్రి గురించి.

అభూతకల్పనల కన్నా యథార్థ గాథలు చిన్ని మనసుల మీద మంచి ప్రభావాన్ని చూపిస్తాయి.

గాంధీగారు తమ ఇంటికి వచ్చారన్నది రాణా నమ్మలేని ఒక అద్భుతమైన నిజం!

తండ్రిని ఏడిపించటానికి గాంధీని ఉదాహరణగా తీసుకునే వాడే తప్ప, అతడికి తండ్రి అంటే ఎంతో గౌరవం వుండేది. తల్లి పోయిన ఏడాదికి తండ్రి పోయాడు. ఒక స్నేహితుడి దగ్గిర వీడ్కోలు తీసుకుని వెళ్ళిపోయినట్టు ఆయన కొడుకు దగ్గిర శలవు తీసుకుని వెళ్ళిపోయాడు. "అక్కయ్య జాగ్రత్త. తమ్ముడిని బాగా చూసుకో"లాటి అంపకాలు ఏమీ లేవు. ఆయన చిరునవ్వు వెళ్ళొస్తానంది. అతడి కన్నీటి చుక్కలు వెళ్ళిరమ్మంది.

తండ్రి పోయేటప్పటికి తమ్ముడు తొమ్మిదో క్లాసు చదువుతున్నాడు. అక్క పురుళ్ళకి ఇంటికొచ్చేది. చేసేది సబ్-ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం. వచ్చే జీతం దేనికీ సరిపోయేది కాదు. తను చేసేది "బంగారపు గని"లో అని అతడికి తెలుసు.

నిజాయితీగా ఆలోచించటం వేరు. నిజాయితీగా బ్రతకటం వేరు. చాలామంది గొప్పగా ఆలోచిస్తూ, మామూలుగా బ్రతికేస్తుంటారు.

అక్కకి సిజేరియన్ చేయించవలసి వచ్చింది. అర్జెంటుగా అయిదు వేలు కావల్సి వచ్చాయి. మొదటిసారి అతడు లంచం తీసుకున్నాడు. ఒక దొంగ సారా కాంట్రాక్టరు దగ్గిర అతడు చేయి సాచాడు.

రాణాకి ఆ అనుభవం ఆనందకరంగా ఏమీ అనిపించలేదు. ఆ రాత్రంతా తండ్రి కలలో వస్తూనే వున్నాడు. నిద్రలేక కళ్ళు ఎర్రబడ్డాయి. ఆస్పత్రినుంచి పిల్లాడిని తీసుకుని అక్క ఇంటికి వచ్చింది. "ఒరేయ్, నీ మేనల్లుడికి నాన్న పేరు పెడదామనుకుంటున్నార్రా" అన్నప్పుడు అతడు మరింత గిల్టీగా ఫీలయ్యాడు. ఆమె నిశితమైన దృష్టినుంచి అదేమీ దాటిపోలేదు. వెళ్తూ వెళ్తూ అయిదువేలు అతడి చేతిలో పెట్టింది. అతడు ఆశ్చర్యంగా "ఇదేమిటి అక్కా" అని అడిగాడు.

ఆమె పేలవంగా నవ్వి "నాకోసం నువ్వు ఖర్చు పెట్టిన డబ్బుల్రా" అంది. అతడు విభ్రాంతుడై "ఇవి తిరిగి ఇస్తున్నావా" అన్నాడు. "బావకి తెలియకుండా నీ దగ్గిర ఇంత డబ్బు ఎక్కడిది?"

"ఇంత డబ్బు ఎలా సంపాదించావో చెప్తే సరే" అంది.

అతడి దగ్గర జవాబులేదు. ఆమె అతడి దగ్గిరకి వచ్చి "ఒరే తమ్ముడూ! చిన్నప్పుడు అమ్మ చెప్పిన కథలు నువ్వే కాదు. నీతోపాటు నేనూ విన్నాను. నీ బాధ నేను గ్రహించలేననుకున్నావట్రా. నా నగలు కుదువపెట్టాను" అంది. బలమైన కారణం లేదుగానీ అతని కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. ఆ రోజే తీసుకువెళ్ళి కాంట్రాక్టర్‌కి డబ్బు తిరిగి ఇచ్చేసి "రేపట్నుంచీ ఈ వ్యాపారం చెయ్యటానికి వీల్లేదు" అని వార్నింగ్ ఇచ్చాడు.

కాంట్రాక్టర్ తెల్లబోయి "ఈ ఇన్‌స్పెక్టర్‌కి కాస్తంత వెర్రివున్నట్టుంది" అనుకున్నాడు. ఇచ్చిన లంచాన్ని తిరిగి తీసుకువచ్చి ఇచ్చేసి -- వద్దు అనడం అతడి కదే ప్రథమం. "పోనీ అయిదు వేలూ మిగిలిందిలే" అనుకున్నాడు. అదే అతడు చేసిన తప్పు, మరుసటిరోజు అతని బట్టీల మీద రైడింగ్ జరిగింది. ఇరవై మందిని రాణా అరెస్ట్ చేశాడు. తరువాత ఎవరెవరు ఎలా తమ పలుకుబడులు ఉపయోగించి బయటపడ్డారు. రాణాకి ఎందుకు బదిలీ అయిందీ అన్నవి వేరే విషయాలు కానీ, ఒకటి మాత్రం నిజం.

క్రితంరోజు బాధ, డబ్బులు ఇచ్చేశాక రాణాకి లేదు. హాయిగా నిద్రపోయాడు. హాయిగా నిద్రపోగలగడం కన్నా ఇంకొక వరం మనిషికి లేదన్న సంగతి అతడికి అప్పుడే తెలిసింది. ఆ రకంగా అతడి జీవితపు పుస్తకంలో ఒక కొత్త అధ్యాయాన్ని అతడి అక్క తెరిచింది. ఆ తరువాత అతడు చాలా పెద్ద సమస్యల్లో ఇరుక్కున్నప్పుడు కూడా అక్కయ్యే అతడికి కావల్సిన మానసిక బలం యిచ్చింది.

ఉద్యోగంలో చేరిన నాలుగు సంవత్సరాలకి అతడికి ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ వచ్చింది. అప్పటికి రాణాకి పరిపూర్ణమైన వ్యక్తిత్వం ఏర్పడింది. డిపార్ట్‌మెంట్‌లోని లోటుపాట్లని కూడా తెలుసుకున్నాడు. అయినా అతడి సిద్ధాంతాలలో మార్పేమీ లేదు. ఒక "టఫ్" ఆఫీసర్‌గా పేరుపడ్డాడు. అతడితో గొడవ పెట్టుకోవటానికి పైవాళ్ళుకూడా కాస్త తటపటాయించేవాళ్ళు. అయితే అతడి ఉద్యోగ జీవితం పూలపాన్పు కాలేదు. అతడు అన్నట్లే -- ఒక బంతిలా రాష్ట్రం నలుమూలలకీ తన్నబడ్డాడు. ఈ 'చివరి' పెనాల్టీ కిక్ మాత్రం కాస్త బలంగా తగిలింది. దీనిగురించి తెలుసుకోవాలంటే వారంరోజులు వెనక్కి వెళ్ళాలి.

*  *  *  *  *

ఎప్పుడూ నిస్తేజంగా దాదాపు నిర్మానుష్యంగా వుండే ప్రభుత్వ రహదారి బంగ్లా ఆ రోజు కళకళలాడుతూ వుంది. కొత్తగా రంగులు వేయటంవల్ల దానికి కళ వచ్చింది. పోలీసులూ, పైరవీ కారులూ హడావుడిగా తిరుగుతున్నారు.

పెళపెళలాడుతూ పైన ఎండ. అయినా అక్కడ "వేడి"తో పోల్చుకుంటే అది అంత లెక్కలోది కాదు. వస్తూంది హోం మినిస్టర్ మరి!

వరుసగా నాలుగు కార్లు, రెండు జీపులూ ఆ కాంపౌండ్‌లో ప్రవేశించాయి. అక్కడున్న జనం అంతా వాటిచుట్టూ మూగారు. సరీగ్గా అక్కడికి ఫర్లాంగు దూరంలో వున్న చిన్న సైజు బజార్లో షాపులకి కాస్త ఇవతలగా ఒక గుడిసెలాంటి తడికల కొట్టులో ఒక ముసలమ్మ కూర్చుని వుంది. ఆమె ముందు నాలుగైదు కుండలున్నాయి. ఒక తడికకి "మజ్జిగ- పెద్దగ్లాసు ఇరవై అయిదు పైసలు, చిన్నగ్లాసు-పదిహేను పైసలు" అని వ్రాసి వుంది. షాపుల్లో జరుగుతున్న హడావుడి చూసు ముసలమ్మ, పక్కనే గట్టుమీద జంతికలు అమ్ముతున్న కుర్రాడితో "ఏట్రా వీరాసామీ ఆ గొడవ?" అని అడిగింది.

"ఈ రోజు బంద్ అవ్వా, దుకాణాలు మూసెయ్యాలె" అన్నాడు.

అంతలో అక్కడికి మోటార్ సైకిల్ వచ్చి ఆగింది.

"ఒక గ్లాసు మజ్జిగియ్యి."

"పెద్దదా? చిన్నదా బాబూ."

"ఎండ పేలిపోతోంది. పెద్దదే ఇవ్వు" గ్లాసందుకుని తాగి పావలా ఇచ్చాడు.

"డబ్బులా? వద్దులే బాబూ."

అతడు ఆశ్చర్యంగా "వద్దా? నువ్వు డబ్బులకి కాదా అమ్మేది?" తను వచ్చింది ఉచితంగా దాహం తీర్చే కేంద్రానికేమో అన్న అనుమానంతో అడిగాడు. ముసలెమె తటపటాయించింది.

"తీసుకో అవ్వా"

ఆవిడ డబ్బులు తీసుకుంటూ, "ఇన్నేళ్ళకి మజ్జిగ తాగి డబ్బులిచ్చిన మొదటి పోలీసోడివి నువ్వే బాబూ" అంది. రాణాకి నవ్వాలో, ఆ మాటలకు బాధపడాలో అర్థంకాలేదు.

అంతలో అవ్వ అడిగింది. "దుకాణాలు కట్టెయ్యమంటున్నారు. ఎందుకు బాబూ ఈ రోజు బంద్ అట?" అని. అతడికి ఎలా వివరించాలో అర్థంకాలేదు. "ఢిల్లీలో సరీగ్గా పనిచెయ్యడం లేదని హైదరాబాద్ ప్రభుత్వం బంద్ చేయిస్తోంది" అన్నాడు.

"పెభుత్వాలన్నీ ఒకటి కాదా బాబూ"

చాలా అమాయకమైన చిన్న ప్రశ్నే. రాణా దగ్గిర సమాధానం లేదు సరీగ్గా అదే సమయానికి రహదారి బంగ్లా ముందు ఒక లారీ వచ్చి ఆగింది. అందులోంచి ఇరవైమంది గుండాలూ దిగారు. బనీను పంచెల్తో కొందరూ, పాంటూ షర్టులతో కొందరూ వున్నారు. చేతుల్లో వున్న ఆయుధాల్ని వారేమీ దాచుకునే ప్రయత్నం చేయటం లేదు.

ముందు కార్లోంచి దిగుతూన్న హోం మినిస్టర్ దగ్గరికి డి.ఐ.జి. పరుగెత్తుకు వచ్చాడు (డి.ఐ.జి.) అస్తి పంజరానికి బట్టలు తొడిగినట్టు వున్నాడు పక్కనెవరైనా గట్టిగా తుమ్మితే ఉలిక్కిపడి ఆంజనేయ దండకం చదివేవాడిలా వున్నాడు. హోం మినిస్టర్ పొడుగ్గా వున్నాడు. మధ్య పాపిడి, నొక్కుల జుట్టు కాళ్ళకి బిగుతుగా వుండే పైజామా వేసుకుని, వదులు లాల్చీతో వున్నాడు. కాస్త మేకప్ మారుస్తే నర్తనశాల బృహన్నలవుతాడు. డి.ఐ.జి. లంటే భారీ విగ్రహాలు, హోం మినిస్టర్లంటే పెద్ద రౌడీల్లా వుంటారు అని అనుకుంటే పొరపాటు అని వాళ్ళిద్దరూ నిరూపిస్తారు.

అతడు హోం మినిస్టర్ అవటానికి కారణభూతురాలైన స్త్రీ నెమ్మదిగా కారులోంచి దిగింది అందరి దృష్టి ఆమె మీద పడింది. కాకీ పాంటు వేసుకున్న వాడినుంచీ ఖద్దరు చొక్కా వేసుకున్న వాడివరకూ ఆమెనే చూస్తున్నారు. ఆమె సుతారంగా కారు దిగుతూ అక్కడ వున్నవారందరికీ చిరునవ్వుతో నమస్కారం చేసింది.

హోం మినిస్టర్ భార్య ఆమె!

అతగాణ్ణి హోం మినిస్టర్ చేసింది ఆమే!

ఆమె పేరు కామిని. ఆమె ఒకప్పుడు ఆంధ్రదేశాన్ని ఉర్రూతలుగించిన అభినేత్రి. ఆమె నటించిన సినిమాలు కనకవర్షం కురిపించేవి. ఆ తరువాత ఆమె రాజకీయాలవైపు ఆకర్షింపబడింది. అయితే స్వయంగా పాల్గొనలేదు పార్టీ తరపున ప్రచారం చేసింది. ఆమె ఉపన్యాసాలకు జనం లక్షల సంఖ్యలో వచ్చేవారు ఆమె ప్రచారం చేసిన పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆమెకు ఏ పదవి కావాలంటే అది ఇచ్చేటందుకు పార్టీ సిద్ధంగా వుంది. కానీ ఆమె తిరస్కరించింది.

ఆమె భర్తపేరు టి.కె. రెడ్డి. అతడి పూర్తి పేరు ఎవరికీ తెలీదు.

కామిని సినీ ఫీల్డులో నిలదొక్కుకుంటున్న కాలంలో ఆమెకో నోటీసు పోస్టులో వచ్చింది. అప్పటికే ఆమె నటించిన రెండు చిత్రాలు సూపర్‌హిట్ అయ్యాయి బుచ్చిరెడ్డిపాలెంకి పది కిలోమీటర్ల దూరంలో వున్న పల్లెనుంచి వచ్చిన ఆ నోటీసు సారాంశం ఏమిటంటే "కామిని వురఫ్ కామేశ్వరి తన పదిహేనేళ్ళ వయసులో కన్నారెడ్డి అనే వ్యక్తిని వివాహం చేసుకుందని,

పొలంలో కూలి పని చేసే (ప్రస్తుతం కీర్తిశేషుడయిన) కామేశ్వరి తండ్రి ఈ వివాహం జరిపినట్టు ఋజువులున్నాయనీ'' వగైరా వగైరా.

కామిని కంగారుపడలేదు కన్నారెడ్డిని పిలిపించింది. అతడు ఇద్దరు ముగ్గురు పెద్దమనుషుల్ని తీసుకుని బుచ్చిరెడ్డిపాలెం నుంచి వచ్చాడు. "చూడమ్మాయ్ శుభ్రంగా కాపురం చేసుకో నువ్విలా ఇంట్లోంచి పారిపోయి వచ్చిన సంగతి మేం మర్చిపోతాం. ఈ కోర్టు గొడవలూ అవీ నువ్వు పడలేవు'' అన్నారు వాళ్ళు.

కామిని నవ్వింది. "పది సంవత్సరాల క్రితం వెళ్ళిపోయిన నేను ఇప్పుడు గుర్తొచ్చానా? లేక నా పొజిషన్ నిన్ను గుర్తుకు తెచ్చిందా?'' అని అడిగింది వాళ్ళు మాట్లాడలేదు కన్నారెడ్డిని లోపలికి తీసుకెళ్ళి ప్రైవేటుగా మాట్లాడింది.

"చూడూ, నేను నిన్ను పెళ్ళాడినప్పుడు ఎంత అమాయకంగా వున్నావో ఇప్పుడూ అంత అమాయకంగా వున్నావ్. దీని వెనుక ఎవరున్నారో నాకు తెలుసు. అదెవరో నువ్వు కరెక్ట్‌గా చెప్తే నేను నిన్ను ఏలుకుంటాను లేదంటావా ..... సై ..... చూసుకుందాం నువ్వు నా వైపా వాళ్ళ వైపా అని తేల్చుకోవడానికి ఇదో పరీక్ష'' అంది.

కన్నారెడ్డి హీరోహిన్‌గా "నేనూ ఒక లాయరూ కలిసి ఇదంతా చేస్తున్నాం. రెండు లక్షలు ఇస్తే నీ సంగతి మర్చిపోతాను'' అన్నాడు.

"అందులో ఆ లాయర్ కెంత ఇవ్వాలి?''

"అది నీ కనవసరం''

ఆమె బాత్ రూమ్ తలుపు తెరిచి, "ఇతనేనా మీ లాయరు?'' అంది.

లోపల దృశ్యాన్ని టి.కె. రెడ్డి జీవితాంతం మర్చిపోలేదు. (అలా మర్చిపోలేకపోవటం అతడికి లాభించిందికూడా) లోపల గచ్చుమీద కుర్ర లాయరు పడివున్నాడు. రాత్రే కొట్టిన దెబ్బలేమో ఇంకా ఫ్రెష్‌గా వున్నాయి. ఇంకో అరగంట అలా వదిలేస్తే ప్రాణాలు పోవటం ఖాయం.

బాత్‌రూమ్ తలుపు వెయ్యకుండానే ఆమె రెడ్డిని ముద్దు పెట్టుకుని "నువ్వు నాతో వుండిపో. సాయంత్రం బీచ్‌కి వెళ్దాం. మిగతా విషయాలు అక్కడ మాట్లాడుకుందాం'' అంది. ఆమె వేళ్ళు అతని వెన్నుముక క్రింద భాగాన నాట్యం చేస్తున్నాయి.

ఇద్దరూ బయటకొచ్చారు. " కామిని నన్ను ఇక్కడే వుండమంది. మీరిక వెళ్ళొచ్చు'' అన్నాడు రెడ్డి. పెద్ద మనుష్యులు తెల్ల మొహం వేశారు. కామిని ఏడుస్తుందనుకున్నారు లేదా పెద్ద గొడవ జరిగితే మధ్యవర్తిత్వం జరపొచ్చుననుకున్నారు. కనీసం ఓ లక్ష దొరుకుతుందనుకున్నారు. ఇది వాళ్ళు వూహించని మలుపు. తలవంచుకుని వెళ్ళిపోయారు.

ఆ రాత్రి కామినిని దగ్గరకు తీసుకోబోయాడు రెడ్డి. "నాకిలాటివి ఇష్టం వుండవ్. స్ట్రక్చర్ పాడైపోతుంది'' అంది. సాయంత్రపు 'లాలన' ఇప్పుడామె కంఠంలో లేదు.

"మరెందుకు వుండిపొమ్మన్నావ్?''

“నాకు నమ్మకమైన సెక్రటీలు దొరకటం లేదు. నా డేట్సు చూడటానికీ, నా పారితోషికాల విషయం మాట్లాడటానికీ ఒక మనిషి వుంటే బావుండునని ఎప్పటినుంచో అనుకుంటున్నాను.”

“అంటే నేన్నీకు మొగుణ్ణికాదా?”

“ప్రస్తుతానికి నాతో వుండు. అవసరం వొచ్చినప్పుడు డిక్లేర్ చేస్తాను. పెళ్ళయినట్టు ఇప్పుడే చెప్తే హీరోయిన్‌కి దెబ్బ”

“మధ్యలో నువ్వు నన్ను తన్నితగలేస్తే”

“కావాలనుకుంటే ఆ పని ఇప్పుడే చెయ్యగలనుగా-”

“మన పెళ్ళయినట్టు నా దగ్గర సాక్ష్యాలున్నాయి.”

“సాయంత్రం సముద్రంలోకి శవాన్ని విసిరేసినట్టు నా దగ్గర ఫోటోలున్నాయి ---”

రెడ్డి అదిరిపడ్డాడు. ఆమె నవ్వింది.

“నువ్వూ ఓ కుర్ర లాయరూ నా దగ్గిరకు వచ్చి బ్లాక్ మెయిల్ చేశారు నేను ఓ రెండు లక్షలిచ్చాను. అది పంచుకోవటంలో ఇద్దరికీ గొడవొచ్చింది. నువ్వు వాడిని చంపి సముద్రంలో పడేసేవు ఎలా వుందీ కథ?”

చేతిలో నాగుపాముని పట్టుకున్నట్టు భయపడి అతడామెని వదిలేసాడు. ఆ తరువాత మరెప్పుడూ ఆమెని చేరుకోవటానికి అతడు సాహసించలేదు.

ఆ విధంగా ఆమె కాణీ ఖర్చులేకుండా ఒక సెక్రటరీని సంపాదించుకుంది.

సినిమా రంగంలో టాప్ పొజిషన్‌లో వుండగానే ఆమె దృష్టి రాజకీయాల మీదకి మళ్ళింది. ఆమె మైకు పట్టుకుని మాట్లాడుతూంటే ప్రజలు మంత్రముగ్ధులై వినసాగారు. అన్ని పార్టీలూ ఆమెని తమలో కలుపుకోవటానికి ప్రయత్నించాయి.

ఆమె ఆలోచించింది.

పెరుగుతున్న ధరలు, కష్టమవుతున్న జీవన విధానం ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తిని కలుగజేస్తోంది అయిదు సంవత్సరాలు అధికారం లోనున్న పార్టీని దింపటం ఒకటే వాళ్ళ అసాంతృప్తినీ, కసినీ తగ్గించగలిగేది. అదొక్కటే వాళ్ళు చేయగలిగింది కూడా! అదే చేస్తారని ఆమె వూహించి ప్రతిపక్షంలోని ముఖ్య పార్టీలో చేరింది అయితే తను నిలబడలేదు. భర్తని నిలబెట్టింది! ఆమె వూహించినట్టే ప్రతిపక్షం అధికారంలోకి వచ్చింది రెడ్డి ఎమ్మెల్యే అయిన తరువాత మినిస్ట్రీ కావాలని కోరింది. వప్పుకోలేదు. ఏమాత్రం రాజకీయ జ్ఞానం లేనివాడికి మంత్రిపదవి ఏమిటని అన్నారు ఆమె నిరాశ చెందలేదు ఢిల్లీలో ఆమె ఎవరెవర్ని కలిసిందో, ఏం చేసిందోగానీ అనుకున్నది సాధించింది.

హైద్రాబాద్ వచ్చేసరికి రెడ్డికి మినిస్ట్రీ ఇచ్చారు. ఢిల్లీ వర్గాలతో ఆమెకున్న పరిచయం ఆ విధంగా నిరూపణ అయింది. ఆమె మరింత పెరిగింది.

కామిని సెక్స్ లైఫ్ గురించి పుకార్లేమీ పెద్దగా లేవు సాధారణంగా ఇన్ని పనులు ఇంత

అవలీలగా చేసినామె శృంగార జీవితం గురించి రకరకాల కథలు ప్రచారంలో వుండాలి. కానీ అంతగా ప్రచారం కాలేదు. కేవలం పెద్దవాళ్ళతోనే గడుపుతుందని కొందరంటే, ఆమెని చేరుకోవటం కష్టం అని కొందరంటారు. కొంతమంది "నిజంగా" పెద్దవాళ్ళు ఆమె కోసం ప్రయత్నించి భంగపోయారు కూడా! ఆమె మనసులో పురుషవాంఛ ఎలా వుందో ఎవరికీ తెలీదు. ఆమె భర్తకి కూడా.

తను రాజకీయాల్లోకి రాకుండా భర్తని నిలబెట్టడం కామిని తెలివి తేటలకి పరాకాష్ట వెండితెర మీద ఆధిపత్యం కొనసాగుతూనే వుంది. రాజకీయాల్లో ఆమె చెయ్యి వుండనే వుంది.

పోలీసు అధికారులందరూ ట్రావెలర్స్ బంగ్లాలో సమావేశమయ్యారు హోంమినిస్టర్ చెప్పడం ప్రారంభించాడు. "ఇదో- ఈడకి నేనెందుకొచ్చానో మీ అందరికీ తెలుసు కదా. ఢిల్లీ ప్రభుత్వం సరిగ్గా పని చెయ్యడంలే. అందుకు వ్యతిరేకంగా మా పార్టీ రాష్ట్రంలో బంద్ నిర్వహిస్తోంది. ఈ బంద్‌ని ఎట్టగయిన పాడుచెయ్యాలని ఢిల్లీ ప్రభుత్వం కంకణం కట్టుకుందట రాష్ట్రంలో మా పార్టీ అధికారంలో వుండటం ఢిల్లీకి కన్నెర్రగా వుంది. ఈ వూర్లో చిన్న సైజు రేడియో స్టేషనుంది. అది ఢిల్లీ ప్రభుత్వానిది. అక్కణ్ణుంచి మొదలెట్టాల బందు."

రాణా కన్నార్పకుండా టి.కె. రెడ్డి వైపే చూస్తున్నాడు. రెడ్డి మధ్య పాపిడి అతడికి నవ్వు తెప్పిస్తూంది. రెడ్డిగాని రోడ్డుమీద కనబడితే హోం మినిస్టర్ అనుకోరు, 'చిల్లరలేదోయ్' అంటారు. చదువు, విజ్ఞానం, సంస్కారం లాంటి పెద్ద పదాలు కాదుకదా-కనీసం చిరునవ్వు, ధైర్యం, ధీమాల్లాటివి కూడా అతడిలో కనబడలేదు. ఎప్పుడూ ఏదో కంగారులో వున్నట్టు భయం భయంగా చూస్తూ వున్నాడు.

"ఈ బంద్ సరిగ్గా జరిగేలా చూడమని మన ముఖ్యమంత్రిగారు మంత్రులందర్నీ ఒక్కొక్క జిల్లాకి ఒక్కొక్కర్ని పంపినారు. అందుకే నేనీ జిల్లా కొచ్చినానన్న మాట. అర్థమైందా? మీ పోలీసోళ్ళకి ఏం చెప్పినా సరీగ్గా అర్థం కాదని మా ముఖ్యమంత్రి చెప్పాడు."

వెనకాల వున్న ఎమ్మెల్యేలందరూ ఆ జోక్‌కి నవ్వేరు.

రాణాకి విచారమేసింది. తన గురించి కాదు. ఎవరి మీదో తెలియని విచారం అతడికి ముసలమ్మ మాటలు గుర్తొచ్చాయి. 'రెండు పెభుత్వాలూ ఒకటి కాదా బాబూ' అన్న అమాయకమైన ప్రశ్న! ఇక్కడ ఈ ప్రభుత్వం ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దుకాణాలు మూయిస్తోంది. ట్రాఫిక్ బంద్ చేయిస్తూంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చెయ్యవద్దని తన సిబ్బందినే ఆదేశిస్తూంది.

రాణాకి తండ్రి గుర్తొచ్చాడు. గాంధీగారు తనింటికి వచ్చాడా? అనుకున్నాడు. మళ్ళీ ఏమిటి ఈ అర్థం పర్థం లేని ఆలోచన్లు? ఇక్కడ హోం మినిస్టర్‌గారు బంద్ గురించి మాట్లాడుతూ వుంటే తనెక్కడో ఆలోచించడం ఏమిటి అనుకున్నాడు.

హోం మినిస్టర్ తిరిగి చెప్పడం ప్రారంభించాడు. "ఇప్పుడు మిమ్మల్నందర్నీ ఇక్కడికి పిల్చిందెందుకంటే, ఈ జిల్లా నా కప్పగించారు. కాబట్టి ఈ జిల్లాలో బంద్ జరిగేలా, మీరంతా సాయం చెయ్యాలి."

డి.ఐ.జి. నరహరి గొంతు సవరించుకున్నాడు. రాణా అతడివైపు చూశాడు. అయిదడుగుల నాలుగంగుళాల ఎత్తుతో పొట్టిగా, ఇరవై ఎనిమిది అంగుళాల ఛాతీతో సన్నగా వుండే ఈ వ్యక్తి డి.ఐ.జి. ఎలా అయ్యాడా అన్నది సమాధానం తెలియని ప్రశ్న.

నరహరి నమ్రతగా అన్నాడు. "సార్! ఈ బంద్‌లో ఏ గొడవా జరక్కుండా చూసే బాధ్యత నాది మా కొదిలెయ్యండి."

"అందుకేనయ్యా మీ పోలీసులకి తెలివిలేదంటాడు మా చీఫ్ మినిస్టరు. గొడవలు జరక్కపోతే బంద్ ఏటి? బాగా గొడవలు జరగాల. ఇదంతా ఢిల్లీ ప్రభుత్వమే చేయించిందని మేం చెప్పుకోవాల. అందుకే మా వాళ్ళని ఓ లారీ నిండా తెప్పించినా, వాళ్ళు చేస్తార్లే గొడవలు. ఇప్పుడు ఈడకి మిమ్మల్నందర్నీ పిలిపించిన దానికి కారణమేమిటంటే-- మీరంతా దీన్ని చూసి చూడనట్టు ఊరుకోవాల. జిల్లాలోని ఏ మాత్రం శాంతి ఎక్కువయినా నా మినిస్ట్రీ పోద్ది."

జిల్లాకి సంబంధించిన పోలీస్ అధికారులందరూ మొహాలు చూసుకున్నారు.

*　　*　　*　　*　　*

మధ్యాహ్నం ఒంటిగంటకు జరిగిందా సంఘటన.

పన్నెండింటి వరకూ అంతా ప్రశాంతంగానే వుంది. ఉప్పెన వచ్చే ముందు ప్రశాంతత ..... ఒంటిగంట ప్రాంతంలో ఒక రేడియో షాపు తెరిచి వుందని వర్తమానం తెలిసి నలుగురు మనుష్యులు అక్కడికి వెళ్ళారు. అందులో ఒకడు ఒక ట్రాన్సిస్టర్ తీసుకోవడంతో గొడవ ప్రారంభమైంది. క్షణాల్లో ఆ బజారు లూటీ చేయబడింది. ఎక్కణ్నుంచి పుట్టుకొచ్చారో-- సంఘ వ్యతిరేక శక్తులకి ప్రతీకలు నేలలోంచి పుట్టినట్టు పుట్టుకొచ్చారు. మరో అరగంటలో గృహ దహనాలు మొదలయ్యాయి.

"ఏం జరిగినా చూసీ చూడనట్టు ఊరుకోమ"న్న సూచన్లు అందిన పోలీసులు ప్రేక్షకులే అయ్యారు. డి.ఐ.జి. నరహరి మామ ముఖ్యమంత్రికి సన్నిహితుడు. నరహరికి తన పర్సనాలిటీకీ, గత రికార్డుకీ డిప్యూటీ కాదు కదా, నైట్ వాచ్‌మెన్‌గా కూడా పనికిరాననీ, అంతా తన మామగారి చలవ అనీ తెలుసు.

మెయిన్ బజారుని ఆనుకుని వున్న సందులోంచి రాణా పరుగెత్తుకుంటూ వచ్చాడు. అక్కడ నిలబడివున్న పోలీసులు అతడికి సెల్యూట్ చేసి, "సార్, చెంగయ్య దుకాణం తాళాలు బ్రద్ధలుకొడుతున్నారు" అన్నారు. చెంగయ్య దుకాణం ఆ ఊర్లోకెల్లా పెద్ద బట్టలషాపు.

"కమాన్, ఫాలోమీ" అంటూ వేగంగా మెయిన్‌బజారులోకి వచ్చాడు. చెంగయ్య దుకాణం ముందు రౌడీలు గుంపులుగా వున్నారు. కొద్ది దూరంలో ఏదో పాక

తగలబడుతూంది. ఎక్కణ్నుంచో ఫైర్ ఇంజన్ మోత వినపడుతూంది. రోడ్డుమీదంతా రాళ్ళు, కాగితం పొకెట్లు, గాజు పెంకులు చెల్లాచెదురుగా పడివున్నాయి. షాపు లూటీ జరిగితే, దొరికినన్ని వస్తువులు
తీసుకుపోదామని అమాయక(?) జనం దూరంగా నిలబడి చూస్తున్నారు. పక్కవీధిలోంచి జనంగోల వినిపిస్తోంది. పరిస్థితి ఎప్పుడో చేజారిపోయింది. వీధి మొదట్లో సినిమాహాలు నామరూపాలు లేకుండా నాశనమైంది. దూరంగా ఎవరో హృదయవిదారకంగా ఏడుస్తున్నారు.

"ఛార్జ్" అన్నాడు రాణా.

అతడి వెంటవున్న పోలీసులు ఒక సైన్యంలా ముందుకు దూకారు. అప్పటికే వాళ్ళకడుపు మండిపోతోంది. తమ కళ్ళముందు ఇంత దారుణం జరుగుతున్నా చేతులు కట్టేసినట్టయింది ఇప్పటిరకూ! తమ పై అధికారి నుంచి ఆజ్ఞ వచ్చేసరికి వాళ్ళు కసితో గూండాల మీదకు దూకారు.

ఇంతలో రోడ్డుకి అవతలి పక్కనుంచి ఆర్తనాదాలు వినిపించాయి. రాణా అటు వెళ్ళాడు. అక్కడంతా చిన్న చిన్న పాకలు, కొట్లు వున్నాయి. వాటినెవరో తగులబెట్టారు. రోజుకి పది, ఇరవై సంపాదించుకునే చిన్న చిన్న దుకాణాదారులవాళ్ళు. ఇక జీవితంలో పైకి లేవకుండా వాళ్ళజీవనాధారాలు తగలబడిపోతున్నాయి. రాణా మొహం ఆ మంటలకన్నా ఎర్రగా మారింది. 'గవర్నమెంట్ -- బ్లడీ గవర్నమెంట్' అనుకున్నాడు.

చెంగయ్య దుకాణందగ్గర పరిస్థితి మరీదారుణంగా వుంది. పోలీసులు మామూలు జనాన్ని లాఠీ చెయ్యగలరు. చెదరగొట్టగలరు. కానీ ఒక పోలీసు తన ఉద్యోగ రీత్యా పొందే ట్రెయినింగ్‌కన్నా, ఒక ప్రొఫెషనల్ గుండా ఇటువంటి పనుల్లో ఎక్కువ ఆరితేరివుంటాడు. వాళ్ళ దగ్గరవున్న బరిసెలు, కత్తుల ముందు-- పోలీసుల బోయినెట్స్ ఆగలేవు. ఫైరింగ్‌కి పైనుంచి ఆదేశాలు లేవు. గూండాలదే పైచెయ్యి అయింది. విజయవిహారం చేసి వాళ్ళు జీపు ఎక్కారు. కొందరు జనంలో కలిసిపోయి మరో బజారు వైపు సాగిపోవడానికి ఉద్యుక్తులవుతున్నారు.

ఆ సమయానికి పాకల మధ్యనుంచి నడుస్తూన్న రాణా కాళ్ళకింద తడి పైకి లేచింది. తెల్లగా వుండడంతో రాణా ఆగాడు.

మజ్జిగ!

అతడు తల తిప్పి చూశాడు.

కుండ పగిలి మజ్జిగ ధారగా ప్రవహిస్తోంది. ఆ తెల్లటి మజ్జిగతో పాటు ఎర్రగా చారలు చారలుగా--

రక్తం.

ముసలవ్వ ముందుకు కూలిపోయి వుంది.

ఆమె దగ్గర పది రూపాయల చిల్లర కోసం ఏ రౌడీ తలమీద మోది ప్రాణాలు తీశాడో తెలీదుగాని జాతీయ జెండా తెలుపు ఎరుపుల మధ్య చిక్కుపడిన నిస్సహాయమైన

అశోకచక్రంలా ఆ ముసలి శరీరం నిర్జీవంగా పడివుంది.

ముందుకు వొరిగిన ఆమె ఆకృతి విరిగిన రాట్నంలా వుంది. శుష్కించిన ఆమె శరీరం సోషలిజానిన ప్రశ్నిస్తున్నట్టు వుంది. కారిన రక్తం భోక్తల పళ్ళెల్లో పాయసంలా వుంది. 'నాకు డబ్బులిచ్చిన మొదటి పోలీసువి నువ్వే నాయనా' అన్నమాట రక్షణ వ్యవస్థకే ప్రశ్నలా వుంది.

రాణా కదిలేడు. అతడిది ఫోటోగ్రాఫిక్ మెమరీ. ప్రతీ గూండా అతడికి గుర్తున్నాడు. జనంలోకి చొచ్చుకుపోయాడు. అతడి చెయ్యి మెరుపు కన్నా వేగంగా కదుల్తోంది. పిస్తోలు అవసరమే రాలేదు. ఎదుటివాళ్ళూ సామాన్యులు కాదు. అయినా పూనకం వచ్చినవాడిలా విజృంభించే ఆ ఇన్‌స్పెక్టర్ ముందు ఆగలేకపోయారు. చట్టం, చట్టం పరిధి-- ఏమీ చూసుకోలేదు అతడు. కనపడిన వాడిని కనపడ్డట్టు కొట్టాడు. వాళ్ళని వ్యాన్‌లో పడేసుకోవడమే మిగతా పోలీసుల పని అయింది.

ఇరవైమంది గూండాలు శవాకారాల్లో తేలారు. అరగంటలో పరిస్థితి సాధారణ స్థితికొచ్చింది.

*　　　*　　　*　　　*　　　*

ఆ ఊరి ఎమ్మెల్యే నర్సింహులు నాయుడు చాలా ఆనందంగా, ఆరో రౌండ్‌లో వున్నాడు. మధ్యాహ్నం సమయానికి బంద్ విజయవంతమైందని తెలిసింది. అప్పట్నుంచి తాగుతూనే వున్నాడు.

నర్సింహులు నాయుడు అంత ఆనందంగా వుండడానికి కారణం వుంది. ముఖ్యమంత్రి భక్తుడు అతడు. ఆయన ఆశీర్వాదం కోసం  నిరంతరం చూస్తూ వుంటాడు. తన జిల్లాలో బంద్ పూర్తిగా సక్సెస్ అయ్యేబాధ్యత తన మీద వేసుకున్నాడు. అందులోనూ ఆ జిల్లాకి హోమ్ మినిస్టర్ అబ్జర్వేటర్‌గా వస్తున్నాడంటే మరింత రెచ్చిపోయాడు. తన ఊళ్ళో తనకెంత పలుకుబడి వుందో పై నాయకులకి చూపించడం కోసం లారీ నిండా పేరొందిన గూండాల్ని దింపాడు.

సాయంత్రం నాలుగింటికి తెలిసింది-- గూండాలు చావుదెబ్బతిని అరెస్ట్ అయిన సంగతి కల్లు తాగిన కోతిలా లేచాడు. జీపేసుకుని సొంతంగా డ్రైవ్ చేసుకుంటూ ట్రావెలర్స్ బంగ్లా వైపు గంటకు వంద కిలోమీటర్ల వేగంతో వెళ్ళాడు. అతడి రౌద్రాకారం చూసి అనుచరులే బెదిరిపోతున్నారు. ఇది తన పరపతికి సంబంధించిన సమస్యగా అతడు భావించి ఉడికిపోతున్నాడు. అధికారంలో వున్న పార్టీ 'బంద్' పిలుపునిస్తే స్వయంగా హోమ్ మినిస్టర్ వచ్చి మకాం వేస్తే, తన ఏరియాలోనే అది ఫెయిలైందంటే---

తన పరిస్థితి ఏమిటి?

రేపు ముఖ్యమంత్రికి తను మొహం ఎలా చూపించుకోగలడు?

గూండాలకి, బాంబులకీ పేరుమోసిన తన ఏరియాలోనే ఇలా జరిగినట్టు పేపర్లో వస్తే, రేపు తోటి ఎమ్మెల్యేలు నవ్వరూ?

అతడి కాలు బలంగా ఆక్సిలేటర్‌ని నొక్కింది. జీపు బాణంలా ట్రావెలర్స్ బంగ్లాలోకి చొచ్చుకుపోయింది. అప్పుడో అనుకోని సంఘటన జరిగింది.

ప్రొద్దుటినించీ డ్యూటీ చేసి అలసిపోయిన పోలీసులు తిరిగి తిరిగి వచ్చిన హోం గార్డులూ ఆ ఆవరణలో రెస్ట్ తీసుకుంటున్నారు! నాయుడి జీపు ఒకరిద్దర్ని ఢీకొని, సర్రున తిరిగి మెట్ల ముందు ఆగింది. వాళ్ళ ఆర్తనాదాలు బ్రేకు శబ్దాల్లో కలిసి వికృతంగా ధ్వనించాయి.

జీపు దిగుతూనే నాయుడు రంకె వేశాడు. "ఎవడ్రా వాడు? ఎవడు అరెస్టులు చేసింది?"

ఆ టైమ్‌కి రాణా లోపల్నుంచి బయటకు వస్తున్నాడు. అప్పటికే అతను గూండాల్ని వదిలిపెట్టే విషయమై అరగంటసేపు హోం మినిస్టర్‌తో వాదించి వస్తున్నాడు. నాయుడి మాటలకు ఆగి, "నేనే, ఏం?" అన్నాడు విసుగ్గా.

"వాళ్ళని వెంటనే వదల్రా ..... కొడకా, లేకపోతే నీ అంతు తేలుస్తాను" అని అరిచాడు నాయుడు.

రాణా అప్పటికే చిరాగ్గా వున్నాడు. వాదించి వాదించి అలసిపోయి వున్నాడు. నాయుడి మాటలు గాయం మీద కారం జల్లినట్టు అనిపించాయి. అప్పుడే అతని దృష్టి గాయపడిన పోలీసులు మీద పడింది. అతడి సహనపు ఆనకట్ట తెగింది. ఎంతకాలం ఎలా? ఎప్పటికయినా దీనికో ముగింపు వుండాలి. ఆ ముగింపుకి ఎక్కడో ఒకచోట ప్రారంభం వుండాలి. పోలీసులు ప్రత్యక్షసాక్షుల్లా వున్నారు.

చటుక్కున బేడీలు తీసి నాయుడి చేతులకి వేసి "నిర్లక్ష్యంగా జీపు తోలి ఆక్సిడెంట్ చేసినందుకు నిన్ను అరెస్ట్ చేస్తున్నాను" అన్నాడు.

అనుకోని ఈ సంఘటనకి నాయుడు బిత్తరపోయాడు.

డి.ఐ.జి. నరసింహం ఫ్రీజ్ అయ్యాడు.

పోలీసుల మొహంలో ఆనందం పొంగింది.

ఒక పెద్ద విస్ఫోటనానికి ప్రారంభంగా వత్తి వెలిగింది. అది పేలుతుందో - చప్పబడిపోతుందో కాలమే నిర్ణయించాలి.

ఆ విధంగా ఒక విస్ఫూత చరిత్రకి ప్రథమాధ్యాయం ప్రారంభమైంది.

పోలిస్ ---- వర్సెస్ ---- పాలిటిక్స్

*  *  *  *  *

చాలా కొద్ది టైమ్‌లో అక్కడ పరిస్థితి దారుణంగా విషమించింది. నర్సింహులునాయుడు అయిదు నిముషాల్లో బెయిల్‌మీద విడుదలయ్యాడు. అక్కడ సమస్య అదికాదు. రాజకీయాల్లో పాతుకుపోయి, ఆ జిల్లాకే పెట్టని కోటగా నిలబడిన మనిషి నాయుడు! అతడు ఏ పార్టీని సపోర్ట్ చేస్తే అది అధికారంలోకి రావడం తథ్యం. అటువంటి వాడిని అరెస్ట్ చేయడమంటే--

రాజకీయ నాయకులందరూ ఇది తమకే జరిగిన అవమానంగా భావించారు. హైదరాబాద్ ఫోన్లు వెళ్ళాయి. రాణాని వెంటనే సస్పెండ్ చేయవలసిందిగా ముఖ్యమంత్రి మీద

వత్తిడి తీసుకొచ్చారు.

ముఖ్యమంత్రి అది చేసేవాడే. ఒక చిన్న ఇన్‌స్పెక్టర్ కోసం నాయకుల్ని దూరం చేసుకోలేడు అతడు. కాని పోలీసు బలగాల్లున్నుంచి అంత గట్టిగా వత్తిడి వచ్చింది. జీప్ ఆక్సిడెంట్‌లో దెబ్బలు తిన్న పోలీసుల పరిస్థితి అంత ప్రమాదకరంగా లేకపోయినా - ఆ దృశ్యాన్ని చూసిన సాక్షులు చాలామంది వుండటంతో రాణాకి సపోర్ట్ ఎక్కువైంది.

తను జీపు స్పీడుగా నడపలేదనీ, పోలీసులే అడ్డొచ్చారని నాయుడు వాదించాడు. క్షణాల్లో దానికి సాక్షులు తయారయ్యారు.

పోలీసుల మీద అత్యాచారం చేసిన ఎమ్మెల్యే తప్పించుకోవడానికి వీల్లేదని, అసలు కోర్టు వరకూ వెళ్ళకుండా ఈ వ్యవహారం తామే తేల్చుకుంటామనీ పోలీసులు మూకుమ్మడిగా వసతిగృహం మీదకు దాడిచేశారు. ప్రవాహంలా వచ్చిన పోలీసుల్ని చూసి రాజకీయ నాయకులు లోపలి రూముల్లోకి పరుగెత్తారు.

మెట్ల దగ్గరే రాణా వాళ్ళని ఆపు చేశాడు పిస్టల్ తీసి కణతకి గురి పెట్టుకుని "మీరు లోపలికి వెళ్తానంటే నేనిది పేల్చుకుని ఇక్కడే చచ్చిపోతాను. నా మీదా చట్టం మీదా ఏమాత్రం నమ్మకమున్నా వెనక్కి తప్పుకోండి" అన్నాడు. అతడిమీద వారికి గౌరవం వుంది. నిస్సహాయంగా వెనక్కి తగ్గారు.

ఒక్కసారి పోలీసులు తగ్గారని తెలిసేసరికి నాయకులు మళ్ళీ పేట్రేగిపోయారు. సమాజాన్ని రక్షించవలసిన పోలీసులే ఇలా దాడి చేయడం భయంకరమైన విషయంగా వాళ్ళు అభివర్ణించారు. సెంట్రల్ గవర్నమెంట్‌కు సంబంధించిన రేడియో స్టేషన్ ముందు శాంతియుతమైన ధర్నా నిర్వహించబోతుంటే పోలీసులు అడ్డుకున్నారని వాదించడం మొదలుపెట్టారు.

ముఖ్యమంత్రికి ఏం చెయ్యాలో పాలుబోలేదు. ఇటు తన పార్టీ సహచరుల్ని వదులుకోలేడు. అటు పోలీసుల్తో గొడవ పెట్టుకుని ప్రజాభిమానం పోగొట్టుకోలేడు. ఈ సమస్యని అక్కడికక్కడే పరిష్కరించమని హోం మినిస్టర్‌ని ఆదేశించాడు.

హోం మినిస్టర్ పని ఇరుకున పడ్డట్టయింది. ఇటువంటి పరిస్థితుల్లో అతడు చేయగలిగిందీ ఎప్పుడూ చేసేదీ ఒకటే.

భార్య చేతులు పట్టుకోవడం.

ఆ పనే చేసి, "నువ్వే, ఎలాగయినా దీన్ని సాల్వ్ చెయ్యాలి" అన్నాడు. కామిని మనోహరంగా నవ్వి, "నాయకుడిని పిలిపించండి. మాట్లాడదాం" అంది.

నాయుడు వప్పుకోలేదు. "గాయపడిన ఒక్కో పోలీసుకీ లక్ష రూపాయలు నష్టపరిహారం ఇస్తాను. వాళ్ళని కేసు ఉపసంహరించుకొమ్మనండి. పోతే ఆ రాణాగాడు మాత్రం ఎటువంటి పరిస్థితిలోనూ సస్పెండ్ కావాల్సిందే"

"అతను సస్పెండ్ అయిన పక్షంలో పోలీసులు సంధికి వప్పుకోరు" అన్నారు హోమ్ మంత్రి.

కామిని అంది "లక్షరూపాయలిచ్చినా సంధికి వప్పుకోరంటే పోలీసులకి అతడి మీద అంత గౌరవాభిమానాలున్నాయన్నమాట."

"అవును అతడు చాలా సిన్సియర్" రెడ్డి అన్నాడు.

"ఎంత సిన్సియర్ అన్నా కానీ - ఆడి రక్తం కళ్ళ చూడాల్సిందే" అన్నాడు నాయుడు.

"పాపం ఆ ఇన్‌స్పెక్టర్‌రేగా పిస్టల్ కణతకి గురిపెట్టుకుని మిమ్మల్ని రక్షించింది- లేకపోతే పోలీసులు మీమీద దాడిచేసి వుండేవారు."

"అవును. అందుకేగా మన పరాభావం సంగతి ప్రజలకి తెలిసిపోయింది! ఎంత సెన్సార్ చేసినా వార్త పేపర్లో వచ్చింది! నా చేతులకి సంకెళ్ళేసినోడు బ్రతకటానికి వీల్లేదు."

"మీ కోరిక ఏమిటో సరీగ్గా చెప్పండి ఆ రాణా చావడమా? సస్పెండ్ కావడమా? ఏది కావాలి మీకు."

కామిని అదిగిన ప్రశ్నకు నాయుడు వెంటనే సమాధానం చెప్పలేక తబ్బిబ్బు అయ్యాడు. నిశ్శబ్దాన్ని తనకి అనుకూలంగా వాడుకోగలగడమే తెలివైన వాళ్ళ లక్షణం. కామిని అంది ---

"మీరతన్ని సస్పెండ్ చేయించారనుకోండి. అక్కడితో అందరూ మీ పగ చల్లారిపోయింది అనుకుంటారు. పోలీసులు గొడవ చేస్తే అతడి సస్పెన్షన్ కొన్నాళ్ళకి తీసేస్తారు. మిమ్మల్ని చూసి అందరూ నవ్వుకుంటారు. ఆ తరువాత అతన్ని చంపించారనుకోండి. ఆ మర్డర్ మీరే చేయించారనీ, మీ పగ తీర్చుకున్నారనీ ఎవరూ అనుకోరు. దానివల్ల మీ ప్రిస్టేజి కొద్దిగా కూడా పెరగదు. దీనికన్నా మంచిమార్గం వొకటుంది. మీరతన్ని ఇక్కణ్ణుంచి ట్రాన్స్‌ఫర్ చేయించారనుకోండి. అతను సస్పెండ్ కాలేదు. కాబట్టి మీరు ఓడిపోయారనుకుంటారు. ఒక రెండు నెలలు పోయిన తరువాత అతనిని మీరు మర్డర్ చేయించారనుకోండి. నాయుడుగారి పగంటే అలా వుంటుంది" అని అందరూ అనుకుంటారు. మీ వాళ్ళ మధ్య మీ పరువు పెరుగుతుంది. పోలీసులకి అసలు సంగతి తెలిసినా మీమీద ఏ కేసూ పెట్టలేరు. ఎలా వుందీ ఆలోచన."

'అమ్మ నా పెళ్ళావో' అనుకున్నాడు టి.కె. రెడ్డి భార్యని చూస్తూ. నాయుడు లేచి 'సరే- అట్టాగే చేయిద్దాం. కానీ ఆణ్ణి నెలరోజుల కన్నా ఎక్కువ బ్రతకనివ్వను' అన్నాడు. ఈ నెల రోజులు కూడా సుఖంగా బ్రతకడానికి వీల్లేదు. దొంగలూ, గూండాలు దండిగా వుండే వూరికి ట్రాన్స్‌ఫర్ చెయ్యాలె" అన్నాడు.

" స్టూవర్ట్‌పురం చేద్దాం" అన్నాడు హోమ్ మినిస్టర్.

" స్టూవర్ట్‌పురంలో పోలీస్‌స్టేషన్ లేదు" అంది కామిని. రెడ్డి నాలుక్కర్చుకున్నాడు. తన అజ్ఞానాన్ని కప్పిపుచ్చుకోవడానికి "ఏమిటే? అటువంటి వూళ్ళో పోలీస్‌స్టేషన్ లేదా?" అన్నాడు ఆశ్చర్యంగా.

గుంటూరు దగ్గర చీరాల ప్రాంతంలో చిన్న వూరు స్టూవర్ట్‌పురం. జైలునుంచి విడుదలైన వాళ్ళ పునరావాసం కోసం ఏర్పర్చిన ఆ ఊరుని సెటిల్‌మెంట్ ఏరియా అంటారు. పెద్ద గుండాని గానీ, దొంగతనాల్లో ఆరితేరిన వాడి గురించిగానీ మాట్లాడవలసి వస్తే " స్టూవర్ట్‌పురం కేసా?" అనడం ఆనవాయితీ దొంగలకి ఆ ఊరు అంత పేరొందింది అని బయటవాళ్ళు అనుకుంటూ వుంటారు. అటువంటి ఊళ్ళో పోలీస్‌స్టేషన్ లేదంటే రెడ్డికి ఆశ్చర్యం కలగడంలో వింతలేదు.

"ఈ దేశంలో అన్నీ స్టూవర్ట్‌పురాలే. ఎక్కడేసినా అదేం కష్టంలెండి" అంది కామిని తేలిగ్గా.

నాయుడు వెళ్ళిపోయాడు తృప్తిగా.

రెడ్డి భార్యవైపు దూసుకొచ్చి చేతులు పట్టుకున్నాడు. "నిజంగా నీ ఆలోచన అద్భుతం కామినీ! నాయుడు పంతాన్ని వదిలిపెట్టాడంటే మన చీఫ్ మినిస్టర్‌గారికి అదో పెద్ద రిలీఫ్. తరువాత వాళ్ళు ఎలాగయినా చావనీ. ముందు సమస్య పరిష్కారమైపోయింది. ఆ- అన్నట్టు ఆ ఇన్‌స్పెక్టర్ ట్రాన్స్‌ఫర్ ఒకటుంది కదూ- అయినా నాయుడి లాంటి ఢక్కామొక్కీలు తిన్న రాజకీయ నాయకుడినే క్షణాల్లో పడేసిన దానివి, నీకిదో లెక్కా?"

ఆమె అదే నవ్వుతో, "ఆ ఇన్‌స్పెక్టర్ని పిలిపించండి" అంది.

అయిదు నిముషాల తరువాత రాణా తలుపు తోసి, "మే ఐ కమిన్ సర్" అన్నాడు.

సరీగ్గా ఆ టైమ్‌కి కామిని కాఫీకప్పు నోట్లో పెట్టుకోబోతోంది. అతడిని చూడగానే ఆమెలో అదోలాటి జెర్క్ లాటిది కలిగింది. ఆ కదలిక ఆమె వంటిని జలదరింపజేసింది. రాణా పెద్ద అందగాడేమీ కాదు. కానీ అతడి "మ్యాస్కులేవిటి"లో ఏదో తెలియని హుందాతనం ఆమెని కదిలించివేసింది. ఆమె సెక్స్ జీవితం గురించి ఋజువులు లేకపోయి వుండవచ్చు. కానీ నిశ్చయంగా ఆమెకు సినీ రంగంలో నైతేనేం, రాజకీయ రంగంలో నైతేనేం కొన్ని వందల మందితో పరిచయాలున్నాయి. కానీ ఎవరూ ఆమెని ఈ రకంగా తబ్బిబ్బు చేయలేదు.

భార్య అకస్మాత్తుగా మౌనం వహించడాన్ని రెడ్డి చూశాడు. అయితే అతడికి స్త్రీ అంతరంగాన్ని తెలుసుకునేటంత శక్తిలేదు. 'ఇది చాలా చిన్న విషయం కదా! అందువల్ల తనని డీల్ చెయ్యమని భార్య వదిలేసిందేమో' అనుకున్నాడు.

"చూడు రాణా! మన ఎమ్మెల్యే నాయుడుగారు లేరూ- నువ్వు చేసిన పనికి కష్టపడి బెయిల్ మీద బయటికి తీసుకొచ్చామనుకో అయినా ఆయన చాలా మండిపడుతున్నారు" అన్నాడు ఉపోద్ఘాతంగా.

తనని పిలిపించారు అనగానే రాణా 'విషయం' ఏదో వుందని గ్రహించాడు. హోం మినిస్టర్ ఈ మాట అనడంతో "దానిదేముంది సార్. అరెస్ట్ అంటేనే మనసు బాధగా వుంటుంది కదా. రేపు పేపర్లో ఈ వార్త వస్తే మరీ పరువు నష్టం నేనూ చాల బాధపడుతున్నాను" అన్నాడు. రాణా అలా అనగానే రెడ్డి మొహం విప్పారింది. "అయిందేదో అయింది. ఇక జరగవలసింది

చూడు జరిగినదానికి బాధపడి ప్రయోజనం ఏముంది?" అన్నాడు.

"అబ్బే. నేను బాధపడుతున్నది కూడా జరగబోయే దానికోసమే సర్- పోలీసుల మీద చేసిన జబర్దస్తీ విషయంలో కష్టపడి ఆయన బెయిల్ తెచ్చుకున్నాడు. ఇప్పుడు లాకప్‌లో వున్న గూండాల్ని చావబాదితే వాళ్ళు నిజం చెప్పారు. ఎమ్మెల్యే నాయుడే తమని తీసుకొచ్చాడు. అని వప్పుకున్నారు. అందుకని ఇప్పుడు నేను ఇక్కణ్నుంచి బయటకు వెళ్ళగానే అర్జెంటుగా ఆయన్ని వేరే సెక్షన్ క్రింద మళ్ళీ అరెస్ట్ చేయాలి. అదే బాధగా వుంది" తాపీగా అన్నాడు.

నాయుడు మొహం సున్నం కొట్టినట్టు పాలిపోయింది. ఇంకోసారి ఆయన్ని అరెస్ట్ చేస్తావా? అసలు నిన్ను సస్పెండ్ చేయకుండా వదిలెయ్యమన్నది అయనే తెలుసా" అన్నాడు తనకున్న రాజకీయ పరిజ్ఞానంతో - సంధికి మొదటి మెట్టుగా.

"ఆయనకు నా కృతజ్ఞతలు అని చెప్పండి. నిజంగా నన్ను సస్పెండ్ చేస్తే ఈ అవమానం భరించలేకపోయేవాడిని. ఈ ఖాకీ బట్టలు నన్ను చాలా ఇబ్బంది పెడుతున్నాయి."

రెడ్డి విప్పారిన మొహంతో "చూశావా మరీ-" అన్నాడు.

"ఆగండి నేను చెప్పేది మీరు పూర్తిగా వినలేదు. ఈ ఖాకీ బట్టలు నన్ను చాలా ఇబ్బంది పెడ్తున్నాయి ఆయన సస్పెండ్ చేయిస్తే - నేను మామూలు బట్టలు వేసుకుని ఆయన బట్టలు పూర్తిగా విప్పించి నడిబజార్లో కొట్టేవాడిని" అన్నాడు చాలా క్యాజువల్‌గా.

టి.కె. రెడ్డి తల తిరిగినట్టు అనిపించింది. అంతకుముందు సంగతి ఏమోగానీ హోమ్ మినిస్టర్ అయ్యాక మాత్రం అతనితో ఎవరూ ఇంక మాట్లడలేదు. కోపంతో మొహం ఎర్రబడగా- "నువ్వెవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" అని అరిచాడు కోపంగా.

రాణా నవ్వేడు. "తెలుసు సార్ సెంట్రల్ గవర్నమెంట్‌కి వ్యతిరేకంగా బంద్ నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ రూలింగ్ పార్టీ ప్రముఖుడితో!! రేడియో స్టేషన్ సెంట్రల్‌కి సంబంధించింది కాబట్టి దాన్ని నాశనం చెయ్యాలనుకున్న స్టేట్ పొలిటీషియన్ల ప్రతినిధితో ..... బంద్ నిర్వహించడానికి, గవర్నమెంట్ ఖర్చుతో జిల్లా జిల్లాకీ వచ్చి మకాం వేసిన రాజకీయ నాయకుల్లో ఒకరితో ..... ఏ ప్రభుత్వం క్రింద పని చెయ్యాలో తెలియక ప్రజలు ఆస్తిని రక్షించబోయి చావుదెబ్బతిన్న పోలీసులు తమ మీదకు జీపు ఎక్కించిన ఒక గూండాని అరెస్ట్ చేస్తే ఆ గూండా దయాదాక్షిణ్యాలు మీద నన్ను సస్పెండ్ చెయ్యాలా వద్దా అని ఆలోచిస్తున్న గౌరవనీయ హోమ్ మినిస్టర్‌తో--"

అతడి మాటలకి అడ్డు తగులుతూ " రాణా " అంది కామిని. వీణ తీగ లాగి బిగించి, వేలితో మీటితే కంపనాలు ప్రతిధ్వనించినట్టుందా స్వరం అతడు ఆమెవైపు చూశాడు. ఆమె అన్నది.

"రెడ్డిగారు చాలా ఇబ్బందిలో పడ్డారు. రాణా! చీఫ్ మినిస్టర్ ఆయన మీద చాలా పెద్ద బాధ్యత పెట్టారు. ఈ సమస్య ఎలా పరిష్కరించాలో మాకు అర్థంకావడంలేదు. అని కొంచెం ఆగి, కొనసాగించింది.

" ..... నాయుడికి ఈ జిల్లాలో చాలా పలుకుబడి వుంది. అతడిని కాదని మా పార్టీ ఈ జిల్లాలో బ్రతికి బట్టకట్టలేదు. అటువంటి వాడిని నువ్వు చాలా నిజాయితీగా అరెస్ట్ చేశావ్. హేట్సాఫ్ టు యు. కానీ ఇంత అవమానాన్ని అతడు భరించలేక పోతున్నాడు. నిన్ను సస్పెండ్ చేయాలని మా మీద వత్తిడి తీసుకొచ్చాడు. నిన్ను సస్పెండ్ చేయడం మాకు కష్టం కాదు. కానీ అలా చేస్తే పోలీసు ఫోర్సు వెంటనే తిరుగబడుతుంది. ఇదంతా నీ మీద సానుభూతితోనో, పోలీసులకి భయపడో మేము ఆపుచేయడంలేదు. నిజం చెప్పాలంటే, ప్రెస్‌కి భయపడి, ప్రజల సానుభూతి మా పార్టీమీద పోతుందని భయపడి నిన్ను సస్పెండ్ చేయలేకపోతున్నారు. మా రాజకీయాల సంగతి నీకు తెలియనిది ఏముంది? ..... పోతే నాయుడితో ఇప్పుడే మేం మాట్లాడేము. నిన్ను సస్పెండ్ చేయకుండా ట్రాన్స్‌ఫర్ చేస్తే చాలు అని అతి కష్టం మీద అతడిని వప్పించగలిగాం. మేమేదో నీకు సాయంచేసామనుకోకు. మాకు మేం చేసుకున్నాం రాణా! బంతి ఇప్పుడు నీ కోర్టులో వుంది. కణతకి పిస్తోలు అడ్డు పెట్టుకున్న పోలీసుల్ని ఆపావు.

ఇప్పుడు కూడా అలాంటి త్యాగమే చెయ్యి. నిన్ను మేం ట్రాన్స్‌ఫర్ చేసేది నీ కోర్కెమీదే అని పోలీసులకీ, ప్రెస్‌కీ చెప్పు. వాళ్ళ వైపునుంచి ఏ గొడవా రాకుండా చూడు. 'నీ ఋణం ప్రభుత్వం ఉంచుకోదు' అని ఆశపెట్టడం నాకిష్టంలేదు. అలాటి ప్రలోభాలకి నువ్వు లొంగవని నాకు తెలుసు. ఇదంతా నీ మీద వత్తిడి తీసుకురావడం కాదు- మా అభ్యర్థన అంతే ..... చెప్పు. వప్పుకుంటావా?" ఆమె కంఠంలో లాజిక్ వుంది.

రాణా తలూపి, "చేసేదేముంది. అలానే కానివ్వండి" అన్నాడు.

భారా భర్తలిద్దరూ ఆశ్చర్యపోయారు. అతడింత తొందరగా వప్పుకుంటాడని కలలో కూడా అనుకోలేదు. థాంక్స్. నిజంగా థాంక్స్. నా కన్నా చిన్నవాడివైనా నీకు థాంక్స్ చెపుతున్నాను. చాలా ఇబ్బంది పరిస్థితి నుంచి నన్ను తప్పించావు" అన్నాడు రెడ్డి.

రాణా ఏమీ మాట్లాడలేదు. తలుపు దగ్గరికి నడిచాడు.

రెడ్డి మళ్ళీ అన్నాడు. "నీ అంత మంచివాళ్ళు, పరిస్థితిని అర్థంచేసుకునే వాళ్ళూ వుంటారని నేను అనుకోను. నీ గురించి మా వాళ్ళకి బాగా చెపుతాను."

అప్పుడు రాణా తలుపుదగ్గర ఆగి వెనుదిరిగి చూశాడు. "ఏం బా ..... గా చెపుతారు సార్? మీరేం చెపుతారో నాకు తెలుసు. అంతవరకూ ఎందుకు? నేనిలా బైటకి వెళ్ళగానే మీరేం మాట్లాడుకుంటారో కూడా నాకు తెలుసు. మీరు పరుగెత్తుకుంటూ చాలా ఆనందంగా మీ భార్య దగ్గరికి వెళ్ళి ఆమె చేతులు పట్టుకుని "ఎంత బాగా ఇన్‌స్పెక్టర్‌ని బుట్టలో వేశావ్. కామినీ నీ నటన చూస్తుంటే నాకే మతిపోయింది. ఆ ఇన్‌స్పెక్టర్‌ని 'నువ్వు చాల గొప్పవాడివి' అంటూ ఆకాశానికెత్తేసి మొత్తంమీద మన పని పూర్తి కానిచ్చావ్. అసలు నువ్వు అడగాలే కాని కాదనే మొగాడు ఈ భూమ్మీద లేడు" అంటారు. మీ భార్యగారు గర్వంగా నవ్వుతుంది. ఆ తరువాత ముఖ్యమంత్రిగారి దగ్గరకెళ్ళి 'పాము చావకుండా, కర్ర విరక్కుండా పని సాధించుకొచ్చాం సార్' అని చెప్పుకుంటారు ..... సార్! మా డిపార్ట్‌మెంట్ మిషన్‌లో చిన్న బోల్టులాటి ఇన్‌స్పెక్టర్‌ని

నేను! అలాటి నా ముందు కూడా పని చేయించుకోవడం కోసం, మీరు మీ భార్యని ఉపయోగించుకున్నారంటే-" ఆగి, అన్నాడు. "నాకు జాలేస్తుంది సార్. ఆ జాలితోనే ఈ ట్రాన్స్‌ఫర్‌కి వప్పుకున్నాను తప్ప- మీ భార్యగారి మనోహరమైన చిరునవ్వులగ్గానీ, మాటలగ్గానీ కాదు."

రెడ్డి మొహం ఎర్రబడింది. మినిస్టరయ్యాక అతడిని ఎవరూ ఇంత పెద్ద దెబ్బ కొట్టి వుండరు.

రాణా తలుపువేస్తూ కామినిని చూసి నవ్వేడు. మీ సినిమాలు మా తమ్ముడికి చాలా ఇష్టం మాడమ్. ఎందుకో ఇప్పుడు నాకు తెలిసింది. బాగా నటిస్తారు మీరు కంగ్రాట్స్."

భార్యాభర్తలిద్దరూ చిత్తరువుల్లా వుండిపోయారు.

*　　　*　　　*　　　*　　　*

రాణా సామాన్లు సర్దుకుంటున్నాడు.

అతడికి తమ్ముడు తప్ప ఎవరూ లేరు. అక్క పెళ్ళయి బావతో వుంటోంది. మరుసటిరోజు ఉగాది. అయినా అతడు వెంటనే ఆ వూరు వదిలి వెళ్ళిపోదల్చుకున్నాడు. అతడి సిబ్బంది వద్దంది. అతడు వినలేదు. "ఇక్కడుంటే నాయుడితో ప్రతిరోజూ గొడవే! ..... దానికి నేను భయపడడం లేదు. కాని ఎన్నో నేరాల్ని అరికట్టవలసిన ఒక ఇన్‌స్పెక్టర్ టైము, ఈ విధంగా ఒక మనిషి కోసం వృధా అవడం నాకిష్టంలేదు. ఇంకొక చోట ఇంకొక నాయుడిని పట్టుకోవడానికి వెళ్తున్నానంతే."

అతడు వెళ్ళవలసిన వూళ్ళో అతడికి ఎవరూ తెలీదు. అందువల్ల పూర్తి సామానులు తీసుకెళ్ళకుండా వెళ్తున్నాడు. ఇల్లు తీసుకున్నాక మిగతా సామానులు పట్టుకెళ్ళవచ్చని అతడి వుద్దేశ్యం.

అతడు వెళ్ళే ట్రెయిన్ ఆ వూరు వచ్చేసరికి వంటిగంట అవుతుంది.

అప్పుడు టైమ్ పదకొండున్నర అయింది. ఇంకా చాలా టైమ్ వుండటంతో అతడు బెడ్డింగ్‌కి ఆనుకుని పడుకుని పుస్తకం తెరిచాడు.

ఊరంతా నిద్రలోకి జారుకుని చాలా సేపయింది.

నిశ్శబ్దాన్ని చెదురుస్తూ బయట చిన్న అలికిడి. తలుపులు తీసే వున్నాయి.

అతడు చప్పున లేచి కూర్చున్నాడు. అప్రయత్నంగా అతడి దృష్టి పిస్తోలు మీద పడింది.

బయట అడుగుల చప్పుడు దగ్గరైంది.

గుమ్మం దగ్గర ఒక ఆకారం నిల్చింది.

మెరుపు వేగంతో కదలబోయిన అతడు ఎరుపులైటు చూసిన వాడిలా ఆగిపోయాడు.

ఎదురుగా కామిని నిలబడి వుంది.

అంత రాత్రి ఆమె అక్కడకు రావడాన్ని అతడు వూహించలేదు.

"లోపలకు రమ్మంటారా? ఇక్కడే నిల్చొని మాట్లాడమంటారా?" నవ్వుతూ అడిగింది.

"రండి" అన్నాడు.

"వద్దులెండి. వెళ్తాను. అదృష్టవశాత్తు చుట్టుపక్కల అందరూ నిద్రపోతున్నారు. ఎవరయినా గుర్తుపడితే ప్రమాదం."

"అటువంటి ప్రమాదం మీకేమీ రాదు."

"ప్రమాదం నాకు కాదు. మీకు" అన్నదామె.

అతడు నిరుత్తరుడయ్యాడు.

"అవును ప్రతాప్. నాయుడితో మా అగ్రిమెంట్ --- మిమ్మల్ని ట్రాన్స్‌ఫర్ చేయడం వరకే అని మీతో చెప్పాము. నెలరోజుల తరువాత మిమ్మల్ని చంపెయ్యడం ఆ అగ్రిమెంట్‌లో ఒక భాగం అని చెప్పలేదు. అది చెప్పడానికే వచ్చాను."

రాణా ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు ఆమె అంది--- "ఎలాగో ఒకలా మా పని పూర్తిచేసుకోవాలనుకున్న ఆశతో మీ ఇద్దరిమధ్యా ఈ సంధి కుదిర్చామే తప్ప-- కేవలం మీ ట్రాన్స్‌ఫర్‌తో నాయుడు కసి చల్లారుతుందా? మీమీద అతడు బాగా పగబట్టి వున్నాడు. ఇక్కడ కాకుండా తన వూళ్ళో అయితే మిమ్మల్ని చంపడం సులభం అని సలహా ఇచ్చింది నేనే."

అతడు విచలితుడై - ఆమె వైపు నమ్మశక్యం కానట్టు చూస్తూ "అంత గొప్ప సలహా ఇచ్చిన వాళ్ళు ఇప్పుడు మరి ఇక్కడకు వచ్చి నాకీ విషయం ఎందుకు చెపుతున్నారు?" అని అడిగాడు.

"నేనా సలహా ఇచ్చే సమయానికి మిమ్మల్ని చూడలేదు కాబట్టి"

చాలా చిన్న వాక్యం అది. బాణంలా తగిలింది. అతడు చివుక్కున తలెత్తాడు.

ఆమె గుమ్మం దగ్గర వెనుదిరుగుతూ అంది-- "నేనో అద్భుతమైన నటిని అని మీ తమ్ముడి లాటివాళ్ళు అంటూ వుంటారు. నటనలో జీవిస్తాను. జీవితంలో నటిస్తాను అని మీ అందరికీ తెలుసు. మనసు పెట్టి నటిస్తానే తప్ప మనసుతో నటించమని మాత్రం ఎవరికీ తేలీదు."

ఆమె నీడ చీకట్లో కలిసిపోయింది. అతడు అలాగే కూర్చుండిపోయాడు. మధ్యాహ్నం తను మాట్లాడిన మాటలు గుర్తొచ్చాయి. ఆ సంభాషణకి 'కామాయే'గానీ, ఫుల్‌స్టాప్ అయినట్టులేదు.

వడివడిగా బయటకొచ్చాడు. మాట్లాడవలసింది మిగిలిపోయింది.

డ్రైవర్ లేడు. ఆమే స్టీరింగ్ దగ్గర కూర్చుని వుంది.

అతడు రావడం చూసి ఆమె కారు స్టార్ట్ చేయకుండా ఆపి "థాంక్స్ చేప్పడానికొచ్చారా?" అంది.

"కాదు. స్టేషన్ వరకూ లిఫ్ట్ ఇస్తారేమోనని అడగటానికొచ్చాను. మీరేమీ భయపడరు

కదా?" అన్నాడు ఆమె తటపటాయించడం చూసి కవ్విస్తున్నట్టు.

"అటువంటిదేమీ లేదు. పదండి-"

అతడు లోపలికి వెళ్ళి పెట్టె, బెడ్డింగ్ కార్లో పెట్టాడు. ఆమె కారు స్టార్ట్ చేస్తూ "మిమ్మల్ని తీసుకు వెళ్ళడానికి మీ జీపు రాదా?" అంది.

"పన్నెండున్నరకి రమ్మన్నాను. అయినా ఇంత మంచి కంపెనీ వుండగా ఇక ఆ జీపెందుకు?"

ఆమె చివుక్కున తలతిప్పి అతనివైపు చూసింది. అతడు నవ్వేడు. కారు కదిలింది.

అతనన్నాడు--- " నాయుడి చేతులకి నేను బేడీలు వేసింది పదిమందీ చూస్తూ వుండగా! అంతటి అవమానాన్ని అతడు దిగమ్రింగి వూరుకోడని నాకు తెలుసు. దానికి శిక్షగా మీరు 'ట్రాన్స్‌ఫర్' అనగానే నాకు అనుమానం వచ్చింది మీరప్పుడు చెప్పలేదు. కాబట్టి నేనూ చెప్పలేదు. ఇప్పుడు చెప్పారు గాబట్టి నేనూ చెపుతున్నాను."

ఆమె అనుమానంగా "ఏమిటది?" అని అడిగింది.

"ఫ్రెంచిలో ఒక సామెత వుంది. నీ శత్రువుని ఎంతసేపు నొక్కిపట్టి వుంచాలంటే అంతసేపు నువ్వూ వంగొని వుండాలి అని! అంటే అంత టైమ్ మనకీ వృధా అన్నమాట, మా వాళ్ళతో నేనామాటే చెప్పాను. ట్రాన్స్‌ఫర్‌కి నేను వప్పుకున్నది కూడా అందుకే నన్నెలా చంపాలా అని నాయుడు ఇంతకాలం ఆలోచిస్తూ సమయం వేస్టు చేస్తున్నాడు. అతడి చేతులకి బేడీలు వేసిన మరుక్షణం నుంచీ నేను రంగంలోకి దిగాను. అతడి గురించి మొత్తం ఎంక్వయిరీ చేశాను. ఒకప్పుడు అనామకుడిగా వున్న నాయుడు ఇప్పుడు లక్షాధికారి ఎలా అయ్యాడు? అతనెందుకు పదిరోజులకి ఒకసారి ఎస్. పురం వెళ్తున్నాడు? వెళ్ళినప్పుడల్లా ఎందుకు అరవింద్ చౌరసియాని కలుసుకుంటున్నాడు?"

ఆమె చేతులు స్టీరింగ్ మీద బిగుసుకున్నాయి. మొహంనిండా చెమటలు పట్టాయి. ఒకప్పుడు ఆమె భర్త ఆమెని నాగుపాము అనుకున్నాడు. ఆమె తన పేరు సార్థకం చేసుకుంటూ ఎంతో మందిని ఆడించింది. కానీ ఇప్పుడు తన పక్కనున్న ఇన్‌స్పెక్టర్‌ని చూసి మొదటిసారి భయపడుతోంది. నాయుడు తాలూకు సంఘటన జరిగి వారంరోజులు కూడా కాలేదు. అప్పుడే ఈ ఇన్‌స్పెక్టర్ ఇన్ని విషయాలు కనుక్కున్నాడు. ముఖ్యంగా --

అరవింద్ చౌరసియా గురించి ప్రస్తావిస్తున్నాడు.

అ...ర....విం....ద్....చౌ...ర....సి....యా

ఆమె తన మొహంలో భావాలు దాచుకోవడానికి ప్రయత్నిస్తోంది. రాణా చెప్పుకు పోతున్నాడు.

"నా అదృష్టం బావుంది. నన్ను మీరు సరిగ్గా ఆ అరవింద్ చౌరసియా వున్న వూరుకే ట్రాన్స్‌ఫర్ చేశారు. థాంక్స్. నాయుడు నన్ను చంపడానికి నెలరోజులు పథకం వేస్తున్నాడు. కానీ నేనింకో ఇరవైతొమ్మిది రోజుల్లోనే అతడి డొంక కదుపుతాను. థాంక్స్. స్టేషన్ వచ్చింది. ఇక

కారు ఆపుతారా?"

ఆమె అప్రయత్నంగా కారు ఆపింది. అతడు సామాను దింపుకుంటూ అన్నాడు.

"ప్రతీ యుద్ధంలోనూ ఒక రాజనీతి వుంటుంది. ఇరుపక్షాలూ దాన్ని పాటించాలి. నా చావు విషయం మీరు నాకు చెప్పారు. దాన్ని నేను రహస్యంగా వుంచుతాను. అలాగే నేను చేస్తున్న ఎంక్వయిరీ విషయం కూడా మనిద్దరి మధ్యే వుండాలి. ఆ రాజనీతిని మీరు పాటిస్తారనే ఆశిస్తున్నాను. మీకు మరోమారు కృతజ్ఞతలు."

అతడు వెళ్ళిపోయాడు.

దూరంగా కూత వినిపిస్తోంది.

రైలు వచ్చి స్టేషన్‌లో ఆగింది.

అతడిని ఎక్కుంచుకుని కదిలింది.

ఆమె ఇంకా అలాగే కార్లో కూర్చుని వుండిపోయింది. ఆమె శరీరంలో రక్తం అంతా ఎవరో పిండేసినట్లు తెల్లగా పాలిపోయింది.

రేపు మధ్యాహ్నానికి ఈ రైలు "తన" వూరు చేరుతుంది.

తనే అతడిని తన వూరు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది. జీవితంలో మొట్టమొదటిసారిగా ఒక మొగవాడిని చూసి చలించింది. అదే తను చేసిన తప్పా?

అందుకు తాను పెద్ద "ఖరీదు" చెల్లించబోతుందా?

అతడు దిగగానే అరవింద్ చౌరసియా గురించి నిశ్చయంగా వాకబు మొదలుపెడతాడు.

ఇతడి ఎంక్వయిరీ నాయుడితో ఆగిపోతే బావుండును.

ఆగక ..... పో...... తే?

తన సామ్రాజ్యంలోకి అనధికారంగా ఒక ఈగ ప్రవేశించినా అరవింద్ చౌరసియా క్షమించడు. రాణా ( నాయుడు అనే) తీగె పట్టుకుని వెళ్తున్నాడు. డొంకవైపు కాదు. ఆక్టోపస్ వైపు.

## *2*

***"మజ్జిగ*** తీసుకుంటారా సార్?" అన్న మాటలకి ఆలోచనల్లనుంచి తెప్పరిల్లాడు రాణా. వద్దన్నట్టు తలూపాడు.

ట్రెయిన్ వేగంగా వెళ్తొంది. దిగవలసిన వూరు రావడానికి ఇంకా గంట టైముంది.

తను ఇన్‌స్పెక్టర్‌నని చెప్పాక పాప తల్లి దగ్గర కూర్చుంది. ఆవిడ తనవైపు ప్రార్థనా పూర్వకంగా చూస్తూ వుండడంతో, "ఆయన్ని ఎందుకు లాకప్‌లో పెట్టారు?" అని అడిగాడు.

"తెలీదండీ---"

"ఆయన ఏం చేస్తుంటారు"

"జర్నలిస్టు"

"ఏ వూళ్ళో?"

ఆమె చెప్పింది. అతడు ఆశ్చర్యంగా, "మరి ఈ వూళ్ళో అరెస్ట్ చేయడం ఏమిటి?" అన్నాడు.

"ఆయన ఏదో పనిమీద ఈ వూరొచ్చారు. ఇక్కడ అరెస్ట్ చేశారట."

"ఏ పని మీద?" ..... పోలీసుల కుండే స్వభావ సిద్ధమైన మనస్తత్వంతో ప్రశ్నలు వేస్తున్నాడు అతడు.

"తెలీదు. ఏదో వ్యాసం వ్రాస్తున్నారు ఆయన. ఆ పనిమీద ఈ వూరు వెళ్తున్నాననీ, నాలుగు రోజుల్లో తిరిగి వస్తానని చెప్పారు. మధ్యలో ఇది జరిగింది. వాళ్ళ నాన్నగారిది ఈ వూరే ఆయన టెలిగ్రాం ఇవ్వడంతో మేం వెళ్తున్నాం."

"ఆయన దేనిమీద వ్యాసం వ్రాస్తున్నారు?"

"పేరు గుర్తులేదు. ఫుట్‌పాత్ మీద బ్రతికే వాళ్ళపై అనుకుంటా"

"దాని గురించి ఈ వూరు రావడం ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"తెలీదు. కానీ వెళ్ళే ముందురోజు మాత్రం చాలా పరధ్యానంగా వున్నట్టు కనిపించారు."

రాణాకి రాజాచంద్ర అనే కుర్రవాడు గుర్తొచ్చాడు. తను ముందు పనిచేసే వూళ్ళో ప్రతిరోజూ ప్రొద్దున్నే పోలీస్‌స్టేషన్‌కి టీ, టిఫిన్ తీసుకువచ్చేవాడు. రాత్రి ఒంటిగంట వరకూ హోటల్ పనిచేసి, హోటల్ బయటే ఫుట్‌పాత్ మీద పడుకునేవాడు. అకస్మాత్తుగా వాడు కనిపించడం మానేసాడు. యజమానిని అడిగితే, "వీళ్ళింతేసార్. గాలిలాటి వాళ్ళు. ఇంకొక చోట కాస్త మంచి పని దొరికితే చెప్పా పెట్టకుండా వెళ్ళిపోతారు" అన్నాడు. నిజమేనేమో. అర్ధరాత్రి వరకూ పని. మళ్ళీ తెల్లవారుఝామునే లేచి గిన్నెలు కడుక్కోవడంతో దినచర్య ప్రారంభం. చలిలో, వర్షంలో, తుఫానులో కూడా హోటల్ బయట అరుగుమీద పడుకోవాలి. ఇలాటి బ్రతుకుల మీద వ్యాసం.

'సారే జహాసే అచ్చా' అన్న టైటిల్ పెడితే బావుంటుందా?

"ప్రియభారత జనయిత్రీ" అంటే బావుంటుందా?

అతడు వాళ్ళని ఓదార్చడం కోసం "నేను వెళ్ళేది ఆ పోలీస్‌స్టేషన్‌కే. విషయం ఏమిటో చూసి విడిపిస్తాన్లెండి" అన్నాడు. ఆ మాత్రం హామీకే వాళ్ళ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఆయన పేరేమిటి?" అని అడిగాడు.

"భరత్."

"అతడు కాస్త ఆశ్చర్యపోయాడు. సారే జహాసే అచ్చా- రచయిత భరత్- సబ్జెక్ట్ - ఫుట్‌పాత్ మీద బ్రతుకులు.

* * * * *

రైలు దిగి రిక్షా ఎక్కి మంచి లాడ్జీకి తీసుకెళ్ళమన్నాడు. రిక్షా వెళ్తూ వుండగా సంభాషణ కలిపాడు. ఆ అయిదు నిముషాల్లోనూ, రిక్షా వాడు లాడ్జింగులో బ్రోతల్స్ నుంచీ

వేదాంతం వరకూ మాట్లాడాడు. ఆ వూళ్ళో రెండు పార్టీలున్నాయి. పులిరాజు, నరసింహం చెరొక పార్టీకి ప్రతినిధులు. నరసింహనాయుడు ఎమ్మెల్యే. అతడి పార్టీయే ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో వుంది. పులిరాజు తక్కువవాడేమీ కాదు. అతడు పార్లమెంటు మెంబరు. ఆ పార్టీ సెంట్రల్‌లో అధికారంలో వుంది.

చాలా అకస్మాత్తుగా జరిగిందా సంఘటన! కిళ్ళీకొట్టు దగ్గర నలభై ఏళ్ళ వ్యక్తి సిగరెట్లు కొనుక్కుని వస్తున్నాడు. ఒక ఇంటి పక్కనుంచి ఇద్దరూ, మరో సందులోంచి ఇద్దరూ కర్రలతో అతడివైపు దూసుకొచ్చి దిగ్బంధం చేశారు. ఆ వయసులో కూడా అతడు అలా పరుగెడతాడనుకోరు ఎవ్వరూ.

జువ్వలా పరుగెత్తాడు.

వాళ్ళూ అతడి వెనకాల వెంటబడ్డారు.

రాణా రిక్షా దిగి అటు వెళ్ళేసరికి ఆ వ్యక్తిమీద కర్రలు పడ్డాయి. రక్తపు మడుగులో కూలిపోయాడు.

క్షణాల్లో వీధి నిర్మానుష్యమైపోయింది.

కిళ్ళీ కొట్టువాడు తలుపులు దింపేసేడు. రోడ్డు కిరువైపులా ఇళ్ళవాళ్ళు తలుపులు వేసుకున్నారు. రిక్షావాడు ఎప్పుడో వెళ్ళిపోయాడు. దూరంగా మలుపులో బండి ఒకటి కనిపిస్తుంది. అటు పరుగెత్తి "తొందరగా ఆ వీధిలోకి పోనీ" అన్నాడు.

"ఎందుకు బాబూ"

"ఆస్పత్రికి వెళ్ళాలి. తొందరగా" రాణా కంఠంలో కనపడిన అధికారానికి భయపడి బండి అటు తిప్పాడు. వాళ్ళు తిరిగి వచ్చేసరికి అక్కడ గాయపడిన మనిషి లేడు.

రాణా నిరుత్తరుడయ్యాడు.

అతడిని చూసి పరిహసిస్తున్నట్టు వీధి నిర్మానుష్యంగా వుంది.

బండివాడు గొణుక్కుంటూ అక్కడనుంచి వెళ్ళిపోయాడు. గాంధీ విగ్రహం నీడ అతడిమీద పడుతూంది. అతడు చుట్టూ చూశాడు. అతడి దృష్టి ఒక ఇంటి మేడమీద పడింది. మెట్లు బయటనుంచి వున్నాయి. పైన చిన్న వసారాలా వుంది. దానికి చెక్క రెయిలింగ్ వుంది. ఆ రెయిలింగ్ మీద చేతులు ఆన్చి నిలబడి వున్నాడొక వ్యక్తి.

అతడు కూడా శిలాప్రతిమలాగే వున్నాడు.

రాణా మెట్లెక్కి అతడి దగ్గరకు వెళ్ళేడు. అతడికి అరవై - డెబ్బై మధ్య వయసుంటుంది. అయినా వయసుకు మించి దృఢంగానే వున్నాడు.

“ఇక్కడ జరిగినదంతా మీరు చూశారా?”

“ఎవరు బాబూ నువ్వు?”

రాణా అప్పటికే విసిగిపోయి వున్నాడు. అధికార యుక్తమైన కంఠంతో “మీరు చూశారా లేదా అది చెప్పండి” అన్నాడు కటువుగా.

“చూశాను”

“వాళ్ళెవరో మీకు తెలుసా?”

“ఎవరు? కొట్టిన వాళ్ళా?పడిపోయిన వాడా?”

“ఇద్దరూ”

“కొట్టినవాడు మస్తాన్‌రెడ్డి  పడిపోయిన వాడు పులిరాజు మనిషి.”

“ఎవడా మస్తాన్‌రెడ్డి?”

“నువ్వీ వూరికి కొత్తా బాబూ.”

అప్పటికి ఆవేశం తగ్గిన రాణా “అవును” అన్నాడు.

“మస్తాన్‌రెడ్డి నరసింహనాయుడి మనిషి.”

“నరసింహనాయుడు ఎవరు?”

వృద్ధుడు ఆశ్చర్యంగా “నాయుడు తెలీదా- ఈ వూరి ఎమ్మెల్యే” అన్నాడు. రాణాకి పరిస్థితి అర్థమైంది. ఆ మస్తాన్ గురించి నేను కనుక్కుంటాలెండి. రేపు మళ్ళీ వస్తాను. మీ దగ్గర స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుంటాను. “మీ పేరు”

“వరాహమూర్తి. నువ్వెవరో చెప్పనే లేదు.”

“నేనీ ఊరుకి కొత్తగా వచ్చిన ఇన్‌స్పెక్టర్ని” అంటూ మూర్తి ఏదో అనబోతూ వుంటే రాణా కదిలాడు.

అతడు మెట్లెక్కి మాట్లాడడం బండివాడు చూశాడు. ఇంకా చాలా మంది చూశారు. రాణా వెళ్ళిపోయాక పక్క కిళ్ళీ కొట్టువాడు మెట్లెక్కి పైకి చూశాడు. “ఎవరు సార్ అతను?”

“కొత్తగా వచ్చిన ఇన్‌స్పెక్టర్ అట” అన్నాడాయన సరిగ్గా రెండు నిముషాల్లో ఆ వార్త మస్తాన్‌రెడ్డికి తెలిసింది.

*　　*　　*　　*　　*

“యాభై రూపాయలు అడ్వాన్సు” అన్నాడు. రిసెప్షనిస్టు డబ్బిచ్చి రూమ్ తీసుకున్నాడు రాణా పక్కనుంచి సన్నటి మెట్లు. క్రింద రూమ్‌లో పదిమంది పేకాడుకుంటున్నారు. పొగ- ఒక పాక తగలబడినట్టు వస్తోంది. మెట్ల పక్కనే సిగరెట్టు పీకలు, మల్లెపూల వాడిన దండలు గుట్టగా పడివున్నాయి.

గది మరీ అసహ్యంగా వుంది. కిళ్ళీ మరకలు. చిరిగిన దుప్పటి బయట వరండాలో ఖాళీ సోడా సీసాలు.

కిటికీ బయటనుంచి ఇద్దరాడవాళ్ళు బిగ్గరగా నవ్వుకుంటూ వెళ్తున్నారు.

రాణాకి అక్కడ వుండబుద్ధికాలేదు. పోలీస్‌స్టేషన్ పక్కనే అభిషిక్తా వాళ్ళ ఇల్లని చెప్పింది. రెండూ చూసినట్టు వుంటుందని బయల్దేరాడు.

*    *    *    *    *

మస్తాన్‌రెడ్డి మెట్లెక్కి వసారాలో నిలబడి చూశాడు.

వరాహమూర్తి పేపరు చదువుకుంటున్నాడు. అతడి కోడలు బియ్యం ఏరుకుంటూంది. చిన్న కొడుకు, పధ్నాలుగేళ్ళ కూతురు చదువుకుంటున్నారు. పెద్ద కూతురు లోపల వంట చేస్తూంది.

అలికిడికి మూర్తి తల తిప్పి చూశాడు.

మస్తాన్ లోపలికి వచ్చాడు. ఒక్కసారిగా అక్కడ నిశ్శబ్దం అలుముకుంది. పాప చేతిలో పుస్తకం జారిపోయింది. మస్తాన్ అందరి వైపు చూశాడు. వరాహమూర్తి దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. పెద్ద కూతురు వంటింటి గుమ్మం దగ్గరకు రాబోయి ఆగిపోయింది.

"ఏమిటి? ఏదో స్టేట్‌మెంట్ ఇస్తానన్నావుట."

..... నిశ్శబ్దం

"ఇవ్వవు కదా"

మూర్తి మాట్లాడలేదు.

"గుర్తుంచుకో" అని రెడ్డి వెళ్ళబోతూ ఆగాడు. అతడి దృష్టి పధ్నాలుగేళ్ళ పాప మీద పడింది. దగ్గరకు వెళ్ళాడు.

" ..... నీ రెండో కూతురా?"

ఎవరూ సమాధానం చెప్పలేదు. మస్తాన్‌రెడ్డి ఆ పాప గెడ్డం పట్టుకుని పైకెత్తబోయాడు. పక్కనున్న కుర్రవాడు అది చూసి విసురుగా లేచాడు. తండ్రి అతడి భుజం పట్టుకుని ఆపుచేశాడు. మస్తాన్‌రెడ్డి ఆ కుర్రవాడిని చూసి నవ్వేడు. పాపని వదిలి కిటికీ వైపు నడిచి, అక్కణ్ణుంచి క్రిందికి ఉమ్మేశాడు. గుమ్మం దగ్గరకి నడుస్తూ మూర్తి దగ్గర ఆగి "ఎదుగుతున్న పిల్లలున్నోడివి కాస్త జాగ్రత్త" అంటూ తిరిగాడు.

గుమ్మం దగ్గర రాణా నిలబడి వున్నాడు.

అతడు అంత దగ్గరగా వున్నాడని రాణా చూసుకోలేదు.

ఒకే ఒక దెబ్బ!

రాణా పిడికిలి బిగించి కొట్టిన దెబ్బకి అక్కడి నిశ్శబ్దం చెదిరింది. ఇద్దరూ మెట్లమీద నుంచి కొట్టుకుంటూ క్రిందపడ్డారు. జనం పోగయ్యారు. రాణా శివమెత్తిన వాడిలా వున్నాడు. మస్తాను కూడా తక్కువ తినలేదు. ఊహ తెలిసిన తరువాత మొదటిసారి ఒకడు తనని కొట్టడం.

రోడ్డు పక్కన మురికి గుంటలో పడి కొట్టుకుంటూ వుండగా పోలీస్ విజిల్ వినిపించింది. పోలీసులు నలుగురు బిరబిరా జీపు దిగి పరుగెత్తుకుంటూ వచ్చి వాళ్ళని విడిపించారు. మస్తాన్ ముందు సీట్లో డ్రైవర్ పక్కన కూర్చున్నాడు. రాణాని పోలీసుల మధ్య వెనుక సీట్లో

కూర్చోబెట్టారు.

వ్యాన్ కదిలింది. వరాహమూర్తి ఆశ్చర్యంగా చూస్తూండగా వ్యాన్ కదిలింది. అతడు చెప్పేది ఎవరూ వినిపించుకోలేదు.

"ఒక సిగరెట్ వుంటే ఇవ్వరా" అన్నాడు మస్తాన్. హెడ్‌కానిస్టేబుల్ జేబులోంచి తీసి ఇచ్చాడు.

"ఏ వూర్రా మనది?" అన్నాడు మస్తాను రాణాని చూసి. రాణా జవాబు చెప్పలేదు.

వ్యాను పోలీస్‌స్టేషన్ ముందు ఆగింది మస్తాను వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

"ఇప్పుడు చెప్పరా లం ..... కొడుకా. ఎవర్నువ్వు."

రాణా చుట్టూ చూశాడు అది పోలీస్‌స్టేషన్‌లా లేదు. పాడైపోయిన సత్రంలా వుంది. నలుగురి కంటే ఎక్కువమంది పోలీసులు లేరు.

"ఈడ్ని లాకప్పులో ఎయ్యండి. రాత్రికొచ్చి ఈడి సంగతి చూస్తా" అన్నాడు మస్తాను.

"టీ తాగుతావా అన్నా" అని అడిగాడు బాలకిషన్(హెడ్ కానిస్టేబుల్) అంతలో ఫోను మ్రోగింది. హెడ్‌క్వార్టర్స్ నుంచి ఫోన్ అనగానే అటెన్షన్‌లోకి వచ్చాడు బాలకిషన్.

" ఇన్‌స్పెక్టర్ గారొచ్చి జాయిన్ అయ్యారా?"

బాలకిషన్ ఫోన్‌లో "లేదుసార్. ఆయన కోసమే చూస్తున్నాం" అన్నాడు.

3

యస్. పురం పోలీస్‌స్టేషన్.

ఫోన్ రింగవగానే, రిసీవర్ ఎత్తి "హలో--- వ్" అని విసుగ్గా అన్నాడు బ్రహ్మానందం.

"వనజుందా?"

"ఎవరూ?"

"వనజ లేకపోతే సుమతిగానీ, అనసూయగానీ ---"

"ఏ నెంబర్ కావాలి మీకు?"

"సీతా లాడ్జి కాదా?"

"కాదిది పోలీస్‌స్టేషన్"

అవతల్నుంచి ఫోన్ కట్ అయింది. బ్రహ్మానందం కుర్చీ వెనక్కి జారి పడ్డాడు. టైమ్ పదకొండయింది. ఇంకా సబ్- ఇన్‌స్పెక్టర్ రాలేదు.

మళ్ళీ ఫోన్ మోగింది.

"హల్లో"

"ఏరా రామ్మూ ర్తి - ఎవరెవరున్నారు?" బొంగురుగొంతు అట్నుంచి అడిగింది.

"రామ్మూ ర్తి ఎవడు?"

"బ్రోకరు నా కొడుకా? నీ పేరు కూడా మర్చిపోయావ?"

"నాలుక కోసెయ్యగల్ను, ఇది పోలీస్‌స్టేషన్. నేను కానిస్టేబుల్ బ్రహ్మానందాన్ని

మాట్లాడుతున్నాను" క్షణం ఆలస్యం కాకుండానే ఫోన్ పెట్టేసిన చప్పుడు అట్నుంచి వినపడింది. బ్రహ్మానందం ఫోన్‌వైపు కసిగా, కోపంగా చూశాడు.

దూరంగా మరో కానిస్టేబులు శర్మ రైఫిలు తుడుచుకుంటున్నాడు. శర్మకి యాభై ఏళ్ళు వయసుంటుంది. ఎన్నో సంవత్సరాల్నుంచీ ఆ పోలీస్‌స్టేషన్‌లోనే పని చేస్తున్నాడు. పైసా తీసుకోడు. నిజాయితీపరుడు అని పేరుంది.

"ఏం శర్మగారూ, ఆ తుపాకులు కాలాలంటే కిరసనాయిలు పోసి తగలెట్టాలి. వాటిని క్లీన్ చేయటం వేస్టు."

"ఏదోలే నాయినా ఆఫీసన్నాక అన్నిటినీ శుభ్రంగా వుంచాలి"

"మీరీ కానిస్టేబుల్ వుద్యోగంలోకి ఎలా వచ్చారా అని నా కిప్పటికీ ఆశ్చర్యంగా వుంటుంది సుమాండీ."

"ఎవరి పనులు వాళ్ళు చేసుకోవటంలో తప్పులేదుగా."

"ఆఁ మీలాంటి వాళ్ళుండబట్టే పనిపిల్ల జీతానికి కూడా మనకి శాంక్షన్ లేదు. అంతవరకూ ఎందుకు? పేరుకు పోలీస్‌స్టేషనేగానీ, లాకప్‌కి వేసే తాళం కొనటానికి బడ్జెట్ శాంక్షన్ లేదు." అని ఇంకా ఏదో అనబోతూ వుండగా ఫోన్ మ్రోగింది.

"హాలో ..... వ్"

"ఏరా రామ్మూర్తీ- మృదంగం ఖాళీగా వుందా?"

"లేదు, సిన్మాకెళ్ళిందండి" బ్రహ్మానందం జవాబిచ్చాడు.

"అనసూయుందా?"

"రాత్రి పురాణ కాలక్షేపానికి వెళ్ళి ఇంకా రాలేదండి."

"అభిలాష?"

"ఇప్పుడే మోర్నింగ్ షో కెళ్ళిందండి తమ రెవరండీ మాట్లాడుతూంటా?"

"ఓ వెధవా? నన్నే మర్చిపోయావురా? కలప బాబూరావు కొడుకుని"

"ఓర్నా కొడకా అప్పుడే లాడ్జింగులకి ఫోన్ చేసేంత పెద్దాడివై పోయావురా నువ్వు?"

"ఎవడ్రా మాట్లాడేది?"

"హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మానందాన్ని! సాయంత్రం అటొస్తా. ఓ వంద తీసుంచు. నువ్వు లేకపోతే మీ నాన్నని కలుసుకుంట" అని ఫోన్ పెట్టేసి బిగ్గరగా నవ్వి శర్మతో, "గురూగారూ బ్రహ్మాండమైన లాటరీ పట్టేసేనండీ" అన్నాడు.

"ఏమిటి బాబూ అది?"

"మన స్టేషన్ నెంబరు మారి, సీతా లాడ్జిది మనకొచ్చింది. ఇక చూస్కోండి. ఈ వూళ్ళో ఒక్కొక్క నా కొడుకు జాతకమూ బైటపడిపోద్ది. సాయంత్రమయ్యేసరికి మనకి అయిదారొందలు మిగులుద్ది" అంటూండగా ఫోన్ ఎత్తి"సీతా లాడ్జి సార్" అన్నాడు.

"రాంబాయమ్మ వుందా?"

"లేదాన్సర్. ఇంకా యంగ్ సరుకుంది."

"ఓల్డ్ ఈజ్ గోల్డ్ రామ్మూర్తి మన టేస్టు సంగతి తెలుసుండీ అలా అడుగుతావేంటి"

"ఎవరండీ అబ్బాయిగారూ మాట్లాడేది?"

"నేనే సుబ్బారావ్‌ని"

"ఏ సుబ్బారావండీ?"

"కానిస్టేబుల్ బ్రహ్మానందం కొడుకుని"

చిన్న చప్పుడవటంతో, రైఫిల్ తుడుస్తూన్న శర్మ తల తిప్పి చూశాడు. బ్రహ్మానందం ఫోన్ పక్కన వొరిగిపోయి వున్నాడు. "ఏమైంది బ్రహ్మానందం?" శర్మ అడిగాడు.

"ఆ నా కొడుకు నా కొడుకేనండీ" నూతిలోంచి వచ్చినట్టు బ్రహ్మానందం స్వరం. అంతలో అడుగుల చప్పుడు వినబడింది. యస్సై కర్రా లోపలికి వచ్చాడు. అతడి అసలు పేరు సుధాకర్. అతడు లాఠీ నిరంతరం నిందితుల వీపుమీద నాట్యం చేస్తూనే వుంటుంది. అందుకని అందరూ అతడికి పెట్టిన పేరు కర్రా.

కర్రా వచ్చిన ఐదు నిముషాలకి ముగ్గురు బ్యాచి లీడర్లూ వచ్చారు. ఆ వూళ్ళో ప్రముఖంగా మూడు బ్యాచీలున్నాయి. సోడా బ్యాచి, చైను బ్యాచి, బ్లేడు బ్యాచి. ఎవరికి వాళ్ళు వారానికొకసారి పోలీసు మామూలు స్టేషన్‌కే తెచ్చి ఇస్తారు. ఈ మూడు బ్యాచీలను వీరదాస్ 'కంట్రోలు' చేస్తాడు.

వీరదాసు కేవలం లోకల్ లీడరే కాదు. ఆ జిల్లాలోనే ప్రముఖుడు. ఎమ్మెల్యే నాయుడికి అతడు కుడి భుజం. వీరదాసులో నాయుడికి నచ్చినదేమిటంటే, అతడికి రాజకీయ కాంక్ష లేదు. తన కుడి భుజానికి తన రంగంలో ఇంటరెస్ట్ లేకపోవటం కన్నా కావల్సింది ఏముంది? అందువల్లే నాయుడు- వీరదాసు 'రిలేషన్స్' చాలాకాలం నుంచి నిరాటంకంగా జరిగిపోతున్నాయి.

యస్. పురం పోలీస్‌స్టేషన్‌కి 'బంగారు స్టేషన్' అని ముద్దుపేరు అక్కణ్ణుంచి బయల్దేరిన దొంగలు రాష్ట్రంలోనే కాక పొరుగు రాష్ట్రాలయిన కర్ణాటక-తమిళనాడులలో కూడా దొంగతనాలు చేసి వస్తూ వుంటారు బంగారం దొంగిలించగానే ముక్కలుచేసి, ఆకారం ముందు మార్చేస్తారు. చివరిముక్క పోలీసులకి సమర్పించుకుంటారు. అందుకే దాన్ని బంగారు స్టేషన్ అంటారు.

యస్. పురం పోలీస్‌స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ కావాలని పోలీసులు ఉవ్విళ్ళూరుతూ వుంటారు. అదొక జాక్‌పాట్ స్టేషను. అయితే కొందరు నిజాయితీ ఆఫీసర్లు అక్కడకు బదిలీ అయివచ్చినా వాళ్ళు ఎక్కువకాలం మనుగడ సాగించలేక అక్కడ కొనసాగాలంటే వీరదాస్‌తో 'మంచి సంధి' ఏర్పరచుకోవాల్సిందే. లేకపోతే నాయుడికున్న రాజకీయ పలుకుబడి, వారిని బంతిని తన్నినట్టు తంతుంది.

యస్. పురానికి పదిమైళ్ళ దూరంలో ఒక పట్నం వుంది. అక్కడ నలుగురు గోల్డ్ బ్రోకర్లున్నారు. వాళ్ళలో రామాచారి ప్రథముడు. దొంగ బంగారాన్ని సగం ధరకి కొని, కరిగించి, అమ్మేస్తూ వుంటాడు. తమకు బంగారం అమ్మిన దొంగల ఆచూకీ చెప్పకపోవటం బంగారం రవాణా లాంటి బాధ్యతలన్నీ ఈ బ్రోకర్లవే. అప్పుడప్పుడు ఈ దొంగలు 'ప్రముఖుల' ఇళ్ళల్లో చోరీచేసి సరుకు తీసుకువస్తూ వుంటారు. అప్పుడు పోలీసుల మీద వత్తిడి ఎక్కువ అవుతుంది. అటువంటి పరిస్థితుల్లో పోలీసులు ఈ బ్రోకర్లమీద రైడ్ చేసి, సంప్రదింపులు కొనసాగిస్తారు. పోయిన ఆభరణాలు దొరికితే సరే- లేకపోతే అంతేవిలువగల మరో ఆభరణాలు ఇచ్చుకోవలసి వుంటుంది. ఇంత రిస్కు వుంది కాబట్టే దొంగ బంగారం ధరలో సగం విలువ మాత్రమే దొంగలకి లభిస్తుంది.

యావజ్జీవ కారాగార శిక్ష ననుభవించి బయటకు వచ్చిన వాళ్ళకీ, దారుణమైన నేరాలు చేసి సమాజంలో స్థానం కోల్పోయిన వాళ్ళకీ ప్రభుత్వం శాశ్వతమైన నెలవు కల్పించింది. భూములిచ్చి పోషణ కల్పించింది. వీళ్ళని 'సెటిల్‌మెంట్ గ్యాంగ్' అంటారు. వీళ్ళు పోలీస్‌స్టేషన్ కొచ్చి రిజిష్టర్‌లో సంతకం పెట్టాలి. తాము వూరొదిలి వెళ్ళడంలేదని నిరూపించుకోవాలి.

ఎక్కడైనా ఏదైనా పెద్ద దొంగతనం జరిగినా, బస్సు దోపిడీ జరిగినా పోలీసుల దృష్టి ఈ సెటిల్‌మెంట్ గ్యాంగ్ మీద పడుతుంది. అయితే వాళ్ళని, ఆ ప్రదేశంలో ఎదుర్కోవటం కష్టం. కారం కళ్ళల్లో కొట్టి బరిసెల్తో ఎదుర్కొంటారు.

ఈ సెటిల్‌మెంట్ గ్యాంగ్‌లు పౌర్ణమి రోజుల్లో 'జల్సా' చేసుకుని అమావాస్య రోజుల్లో పనికి బయల్దేరతాయి. మంచి లాభసాటి అవకాశం దొరికిందంటే పొటేలుని కోసి విందు చేసుకుంటారు. సారా ధారగా ప్రవహిస్తుంది.

ఈ సెటిల్‌మెంట్ గ్యాంగ్‌లో కొందరు నిజాయితీపరులు లేకపోలేదు. ఎప్పుడో చేసిన నేరానికి శిక్ష అనుభవించి, ప్రభుత్వం ఇచ్చే సంస్కరణలని ఉపయోగించుకుని, పొలాన్ని దున్నుకుంటూ మంచి మార్గంలో జీవిద్దామనుకునేవాళ్ళు వీళ్ళు.

వీళ్ళ జీవితాలు దుర్భరం.

బ్లేడ్ బ్యాచ్, సోడా బ్యాచ్ చేసే దిరాగతాలకు, వీరదాస్ అక్రమాలకు, సెటిల్‌మెంట్ గ్యాంగ్‌లో మిగతా వాళ్ళు చేసే దొంగతనాలకు వీళ్ళే జవాబుదారి అవుతారు. పోలీసులు నిజ నిర్ధారణ కోసం వీళ్ళని చితకబాదుతూ వుంటారు.

అలాంటి ఒక జీవచ్ఛవం చరిత్రే ఈ కథాంశం.

*          *          *          *          *

మళ్ళీ ఫోన్ మ్రోగింది.

ఆ సమయానికి యస్సై కర్రా రెండు బ్యాచీల వాళ్ళదగ్గరా కమీషన్‌లు లెక్క చూస్తున్నాడు. "అరేయ్ బాలకిషన్. ఆ ఫోను చూడు" అన్నాడు.

బ్రహ్మానందం (బ్రహ్మానందం బాలకిషన్ అతని పూర్తిపేరు)

విశాలంగా నవ్వి "సీతా లాడ్జి నెంబర్ మనకొచ్చింది సార్. అనసూయుందా? సావిత్రుందా అని అడుగుతున్నారు" అంటూ రిసీవరెత్తి "ఎవరు కావాలి? రత్తాలా - రాంబాయమ్మా" అని అడిగాడు ధీమాగా.

"నేను డియస్పీని మాట్లాడుతున్నాను. ఎవరు? నువ్వేనా బాల్‌కిషన్?"

బ్రహ్మానందం బాలకిషన్ ముందుకు తూలిపడబోయి తమాయించుకుని "సార్ - అవును సార్" అన్నాడు. ఆ డియస్పీ ఎప్పుడూ ఈ బంగారు స్టేషన్ చుట్టూ తిరుగుతూ వుంటాడు. కాబట్టి పోలీసుల పేర్లన్నీ బాగా తెలుసు. అతడి తొందర అతడిది. అందుకే అరగంట కొకసారి "ఇనస్పెక్టర్ గారొచ్చారా?" అని అడుగుతున్నాడు.

"ఇంకా రాలేదాసర్."

"రాలేదా- అర్జెంటు పనుందే"

"అర్జెంటయితే రాగానే చెప్తాను సార్"

'అర్జెంట్' అనగానే ఇక సస్పెన్స్ బావోదని, లాకప్ సెల్‌లో వున్న రాణా, "ఆ ఫోన్ ఇలా అందివ్వు బ్రహ్మానందం బాలకిషన్ నేనే ఇన్‌స్పెక్టర్ రాణాని" అన్నాడు.

ఒక్కసారిగా ఆ గదిలో నిశ్శబ్దం వ్యాపించింది. డబ్బులెక్క పెడుతున్న కర్రా తలెత్తాడు- సెంట్రీతో సహా పోలీసులందరూ శిలాప్రతిమలై చూస్తూ వుండిపోయారు.

రాణా బయటకొచ్చి, ఫోన్‌లో డియస్పీతో మాట్లాడాడు. జరిగిన విషయం ఏమీ చెప్పలేదు. తను ఛార్జీ తీసుకోవడం ఆలస్యమయిందని మాత్రం చెప్పాడు.

అతడు ఫోన్ పెట్టేసి అందరివైపూ చూశాడు. అందరి మొహాలు వాడిపోయి వున్నాయి. ఏం జరుగుతుందో అన్న టెన్షన్‌తో నిండివున్నాయి.

అతడు సన్నగా నవ్వి "పొరపాట్లు ఎవరికైనా జరుగుతూ వుంటాయి. నా లైఫ్‌లో ఇంత జోకు ప్రాక్టికల్‌గా జరగటం ఎప్పుడూ చూడలేదు" అన్నాడు. ఇన్‌స్పెక్టర్ దీన్ని అంత తేలిగ్గా తీసుకోవటంతో అందరూ రిలీఫ్ అయ్యారు.

అక్కడి వాతావరణం తేలికైంది.

"ఈ పోలీస్‌స్టేషన్ మీద మస్తాన్ పెత్తనం చాలా వున్నట్టుందే" అన్నాడు రాణా.

మస్తాన్‌దేముంది సార్. అంతా వీరదాసే.

"బాబోయి. మస్తానే నన్నిలా కొట్టాడంటే ఆ వీరదాస్ ఇంకా బలవంతుడై వుండాల" గెడ్డం నొక్కుకుంటూ అన్నాడు రాణా.

తమ బాస్- వీరదాస్- గురించి ఇన్‌స్పెక్టర్ అలా పొగడడంతో గర్వంగా నవ్వుకుంటూ బ్యాచీల తరపు నుంచి డబ్బు తీసుకువచ్చినవాళ్ళు కర్రాకి దాన్ని ఇచ్చేసి, రాణాని విష్‌చేసి వెళ్ళిపోయారు. రాణా చార్జీ తీసుకున్నాడు. పోలీస్‌స్టేషన్ చాలా దారుణమైన పరిస్థితిలో వుంది. లాకప్ రూమ్‌లో బొద్దింకలు. ఆ రూమ్‌కి తాళంలేదు. పుల్ల అడ్డుపెట్టారు నీళ్ళులేవు. ఖైదీలతోనే

వూడిప్పిస్తారు.

రాణా మరో విషయం గమనించాడు.

ఆ స్టేషన్‌లో పోలీసు బలగం చాలా తక్కువ. వాళ్ళలో చాలా మందికి ధైర్యం లేదు. దొరికిన దొంగని చావబాదగలరేగానీ దొంగల దగ్గిర ఆయుధం వుందని తెలిస్తే మాత్రం చొరవగా చీకట్లోకి చొచ్చుకుపోలేరు. మేకపోతు గాంభీర్యం మాత్రం ఎక్కువుంది.

ఉన్నవాళ్ళలో కానిస్టేబుల్ శర్మ మాత్రం నిజాయితీగా కనిపించాడు. కానీ అతడో వృద్ధుడు. రేపో మాపో రిటైరవబోతున్నాడు.

రాణా పెండింగ్ కేసుల ఫైలు పరిశీలిస్తూ వుండగా సీటు దగ్గరికి కత్రా వచ్చాడు.

"ఇల్లు దొరికిందా సార్?"

"ఇంకా లేదు."

పక్కనే వున్న శర్మ "మా ఇంట్లో పోర్షన్ ఖాళీగా వుంది సార్. మీ ముందున్న ఇన్‌స్పెక్టర్ అక్కడే వుండేవారు" అన్నాడు.

"ఒంటరిగాడిని. నాకెందుకోయ్ పోర్షను? గది చాలు"

"అద్దె చాలా తక్కువ సార్"

కత్రా కల్పించుకుని "అంటే ఇన్‌స్పెక్టర్‌గారు డబ్బులకోసం వెనుకాడి పోర్షను వద్దంటున్నాడనుకుంటున్నావురా దొంగముండాకొడకా" అన్నాడు. శర్మ మొహం చిన్న పుచ్చుకుని వెళ్ళిపోయారు.

రాణాకి బాధేసింది. డిపార్ట్‌మెంట్‌లో దొంగల్తో ఆ తిట్లు మామూలే గానీ, పై అధికారి క్రింది వాళ్ళని తిట్టడం అతడు చూడటం అదే ప్రథమం. ముఖ్యంగా ఆ వయసు మనిషిని.

కానిస్టేబుల్ వెళ్ళిపోయాక కత్రా అసలు విషయం ప్రస్తావించాడు. వచ్చిన దాంట్లో పది శాతం ఇన్‌స్పెక్టర్‌కి చెందుతుంది. వారం వారం సెటిల్‌మెంట్‌లు జరుగుతూ వుంటాయి.

"సాధారణంగా ఎంతొస్తుంది?"

"చెప్పలేం. ఏదైనా పెద్ద దొంగతనం జరిగితే బాగా వస్తుంది. లేకపోతే బ్యాచి కమిషన్లే. ఇప్పుడు వాళ్ళు తెచ్చిచ్చారు ఇమ్మంటారా?"

"ఎంత?"

"మీ వాటా పన్నెండొందలు" అని అందించాడు. రాణా అందుకుని జేబులో పెట్టుకున్నాడు. యస్సై ఇంకా కదలక పోవడంతో ఏమిటన్నట్టు చూసాడు.

"జరిగిన దానికి మస్తాన్ చాలా బాధపడుతున్నాడు. మీరు ఎవరో వీధి సైడు కొత్తగా వచ్చిన గూండా అనుకుని దెబ్బలాడాడట."

"అదేమిటి సుధాకర్. ఈ దేశంలో ప్రతీ పౌరుడికీ దెబ్బలాడే హక్కుంది! నన్ను కొట్టి, పోలీస్ వ్యాన్‌లో పడేసి, స్టేషన్‌కి తీసుకొచ్చి తనే స్వయంగా లాకప్‌లో పెట్టేటంత శ్రమ మస్తాన్ లాటి ఒక సాధారణ పౌరుడు తీసుకున్నాడంటే మన భారతదేశం గౌరవించాలి కదా."

అందులో ఏదైనా సెటైర్ వుందేమో అని కర్రా ఓరగా రాణావైపు చూసి, అటువంటిదేమీ కనపడక పోవడంతో, తేలిగ్గా వూపిరి పీల్చుకుని అక్కడనుంచి వెళ్ళాడు.

నాయుడు రాజకీయంగా తనని ఎలాంటిచోట ఇరికించాడో అర్థమైంది. లంచగొండితనము, నిర్లిప్తత, బద్ధకం, భయం ఇక్కడ పునాదులు. నాణేనికి రెండు వైపులున్నట్టే పోలీసు బలగంలో రెండు రకాలు. ఒక మంత్రిని చంపటానికి ధైర్యంగా తుపాకులు ఎత్తిన పోలీసులూ వున్నారు. దొంగల్నుంచి వాటాలు పంచుకునే వారూ వున్నారు. తన మీద చాలా బాధ్యత వుంది. నాయుడిని దెబ్బకొట్టాలంటే ముందు వీరిని చక్కదిద్దాలి.

అతడు మధ్యాహ్నం సమయంలో శర్మ ఇంటికి వెళ్ళి పోర్షను చూసి వచ్చాడు. సాయంత్రం వచ్చి చేరిపోతునన్నాడు. శర్మ వరాహమూర్తికి అన్నయ్య.

సాయంత్రం అయిదు గంటల ప్రాంతంలో ఒక సంఘటన జరిగింది.

ఊరికి తూర్పున వున్న ఉపాధ్యాయ కాలనీ వాళ్ళు ఓ ఆరుగురు వచ్చారు. కాలనీలో జరిగే దుండగాల గురించి చెప్పుకుపోయారు. మహిళల్ని వేధించటంతో మొదలైంది. శ్రీరామనవమికి జబర్దస్తీగా చందాలు వసూలు చేస్తారు. కాలనీలో ఖాళీస్థలాలుంటే మొన్న జబర్దస్తీగా ఆక్రమించికొట్లు పెట్టారు. 'ఇదేమిటి' అని అడిగితే పెద్దవాళ్ళు దిగారు. చివరికి వాళ్ళ దయాదాక్షిణ్యాల మీదే కాలనీ వాళ్ళు బ్రతకాల్సిన స్థితి ఏర్పడింది.

రాణా మొత్తం సావధానంగా విన్నాడు.

"దీని వెనుక ఎవరున్నారు?" అని చివరగా అడిగాడు. పోలీస్‌స్టేషన్‌లో తమ గోడు ఆ మాత్రం విన్నవాళ్ళు ఎవరూ ఇప్పటివరకూ లేరు. వాళ్ళు మరింత ఉత్సాహంతో "వీరదాస్ సార్" అన్నారు. వాళ్ళలో ఒకరు "మా కాలనీమీద కొచ్చేది మస్తాన్ సార్. మా ఇళ్ళలోకి రాత్రిళ్ళు గోడదూకి వస్తారు. డ్రైనేజి ఇనుప కవర్లు, బాల్చీలు, ఇంకా ఏవైనా వస్తువులూ అవీ వుంటే కొట్టుకుపోతారు. ఒకరోజు కాపువేసి కుర్రాడిని పట్టుకున్నాం. గంటలో మస్తానొచ్చి తీసుకెళ్ళిపోయాడు సార్. ఈ కుర్రాళ్ళ బ్యాచీకి వాడు లీడరు. మధ్యాహ్నం పూట ఇల్లు తాళం వేసుకు వెళ్ళాలంటేనే భయంగా వుంది."

"మరి ఇంతకుముందు ఈ విషయం పోలీస్‌స్టేషన్ కొచ్చి చెప్పలేదా?"

"నాలుగైదుసార్లు వచ్చాం సార్. రిపోర్టు వ్రాసుకుని పొమ్మన్నారు."

"మరి అంతకనా ఏం చేస్తాం? ఆ బ్యాచీల వాళ్ళు వారానికొకసారి మా మామూళ్ళు మా కిస్తున్నారుగా"

అప్పటివరకూ మామూలుగా ఆ సంభాషణ వింటున్న యస్సై, మిగతా పోలీసులు ఉలిక్కిపడ్డారు.

రాణా తాపీగా అన్నాడు----

"అవునండీ. ఒక్కొక్క బ్యాచీకి ఒక్కొక్క లీడరు. ఆ లీడర్లందరికీ వీరదాసు లీడరు. అతడిపైన ఎమ్మెల్యే నాయుడు. మాకు కుక్కకి పడేసినట్లు బిస్కట్లు పడేస్తారు. ఇదిగో ఈ రోజే

నా వాటా పన్నెండొందలు నా కిచ్చారు. ఇప్పుడేం చెయ్యను చెప్పండి?"

ఊహించని ఈ పరిణామానికి వాళ్ళు బిత్తరపోయారు. యస్సై నోట్లో తడారిపోయింది. చీమ చిటుక్కుమంటే వినపడేటంత నిశ్శబ్దం.

"మేమిలా దొంగలకీ, గూండాలకీ భయపడుతూ బ్రతక వలసిందేనా?"

"అది నిర్ణయించుకోవాల్సింది నేను కాదు. మీరు."

"మరి మీకెందుకు జీతాలివ్వటం?"

"అది అడగాల్సింది నన్ను కాదు. ప్రభుత్వాన్ని"

"మీరు డొంకతిరుగుడుగా మాట్లాడుతున్నారు."

రాణా విసురుగా కుర్చీలోంచి లేచాడు. "నేను కాదండీ ..... మీరూ ..... మీరు తప్పుగా ఆలోచిస్తున్నారు. ఉపాధ్యాయ కాలనీ అని పేరు పెట్టుకుంటే చాలదు. సమస్యని విశదీకరించి చూడాలి. ఆ రౌడీల్లో వున్న 'కట్టు' మీలో లేదు. ఒక చిన్న కుర్రాడు దొంగతనం చేసి పట్టుబడితే, వాడిని విడిపించటానికి పెద్ద రౌడీ వస్తాడు. వాడి వెనుకున్న రాజకీయ నాయకుడు మమ్మల్ని కంట్రోలు చేస్తాడు. మాకూ వాటాలు పంచుతాడు. లేకపోతే ట్రాన్స్‌ఫర్ చేస్తాడు. వెళ్ళండి ..... మీరడగాల్సింది మమ్మల్ని కాదు. పొలిటికల్ లీడర్‌ని! నాయుదిగార్ని నాతో ఒక్కమాట చెప్పమనండి. ఆ వీరదాస్‌తో మొదలెట్టి అందరి ఎముకలూ విరగదీస్తాను."

" ఇన్‌స్పెక్టర్‌కి నేను చెప్పటం దేనికి? నాకేం తెలీదు అంటాడాయన"

"మీరు ప్రెస్‌కి రిపోర్ట్ చేయండి"

"వాళ్ళేం చేస్తారు?"

"రాజకీయ నాయకుడు భయపడేది కేవలం పత్రికలకే"

"మేం ప్రెస్‌కి వెళ్ళామని తెలిస్తే ఆ గూండాలు మా ఇళ్ళమీద కొస్తారు."

"కనీసం మీలో ఆ మాత్రం చైతన్యం వస్తే, మీతోపాటు నేనుంటాను"

"ఎమ్మెల్యే నాయుడు తన కా గొడవతో ఏ సంబంధమూ లేదంటే---"

"ఆ ఋజువులు నేను సంపాదించి పెడతాను"

యస్సై కర్రా చేతివేళ్ళు వణుకుతున్నాయి. మిగతా వాళ్ళందరూ అదో లోకంలో వున్నట్టు వింతగా చూస్తున్నారు.

అదే టైంకి మస్తాన్ లోపలికి వచ్చాడు. రాణా వైపు చూస్తూ విశాలంగా నవ్వాడు. "నమస్తే ఇన్‌స్పెక్టర్ సాబ్ మీరు నన్ను క్షమించాలి ..... సారీ. మీరు ఇన్‌స్పెక్టర్ అనుకోలేదు" అతడి మాట పూర్తికాలేదు. రాణా లేచి అతడి మెడమీద ఛెళ్ళున కొట్టి చెయ్యి వెనక్కి విరిచిపట్టుకుని, ఒక్కవూపుతో సెల్‌లోకి తోశాడు. కనురెప్పపాటు కాలంలో జరిగిపోయిందది.

నిశ్చేష్టులై చూస్తున్న ఉపాధ్యాయ కాలనీ వాళ్ళ వైపు చూసి రాణా అన్నాడు. "చూశారు కదా. మీముందే వాడిని కొట్టి లోపల పెట్టాను. మీరందరూ కంప్లెయింట్ ఇస్తే రేపే కోర్టులో హాజరు పరుస్తాను. ఈ లోపులో నాయుడు ఈ విషయంలో కల్పించుకోకుండా మీరు అతని ఇంటి ముందు ధర్నాయే చేస్తారో, మీ పలుకుబడి ఉపయోగిస్తారో మీ ఇష్టం. నేను ట్రాన్స్‌ఫర్ కాకుండా చూసే బాధ్యత మీది."

"ఇవన్నీ జరిగే పనులేనా?"

"చెప్పాను కదా. మీరెన్నుకున్న నాయకుడు మా పన్లకి అడ్డొస్తున్నాడు. మాతో పనులు చేసుకోవాలంటే అతడికి మీరే నచ్చచెప్పుకోవాలి. నా పని నేను పూర్తి చేశాను. మీ కవసరం లేదనుకుంటే, నా కెలాగూ ట్రాన్స్‌ఫర్ అవుతుంది. వెళ్ళిపోతాను."

వాళ్ళు చాలాసేపు నిశ్శబ్దంగా వుండి, లేచారు. వాళ్ళలో ఏదో 'కదలిక' కనిపించింది. "సరే సార్. ఇదెలా జరుగుతుందో, ఎంతవరకూ వస్తుందో చూద్దాం. మా ఫ్రెండ్ ఒకాయన వున్నాడు. జర్నలిస్టు మేం చందాలు వేసుకునైనా సరే, అసోసియేషన్ స్థాపిస్తాం. ఏదో దొంగతనం జరిగిందంటే వస్తువు పోయిందిలే అని వూరుకోవడమే తప్ప దీని వెనుక ఇన్ని గొడవలు వాటాలు వుంటాయని మాకు తెలీదు"

రాణా టేబుల్‌మీద వున్న డబ్బు ముందుకు తోశాడు. "ఇదిగో నా తరపు చందా పన్నెండొందలు. దీనితో ప్రారంభించండి" ఓరగా యస్సై వైపు చూస్తూ అన్నాడు. యస్సై తన మొహంలో భావాలు పైకి కనపడకుండా వుండడానికి చాలా కష్టపడుతున్నాడు. అయినా కూడా అలజడి తెలుస్తోంది.

వాళ్ళు వెళ్ళిపోయాక, లేచి మస్తాన్ దగ్గిరకు వచ్చాడు. బోనులో పులిలా వున్నాడు మస్తాన్.

"నేను మీ వీరదాసుని కలుసుకోవటానికి వెళ్తున్నాను. నీ తరఫున ఏమైనా చెప్పాలా?" అని అడిగాడు.

మస్తాను మాట్లాడలేదు. "ఒక గంటలో వస్తాను" అని జనాంతికంగా అని రాణా బయటకు నడిచాడు. అతడి మోటార్ సైకిల్ వెళ్తున్నట్టు శబ్దం వినిపించగానే యస్సై ఫోన్ దగ్గిరకు వడివడిగా వెళ్ళి నెంబరు తిప్పి "నాయుడు గారున్నారా?" అని అడిగాడు.

"ఎమ్మెల్యే నాయుడుగారా?"

"అవును" విసుగ్గా అన్నాడు.

"ఆయన ఇక్కడి కెందుకొస్తారు బాబూ? సరుకు ఆయన దగ్గిరకే మేం పంపిస్తాంగా"

"ఆయనిల్లు కాదా ఇది"

"నెంబరు మారింది. ఇది సీతాలాడ్జి"

యస్సై ఫోన్ విసిరికొట్టి కుర్చీలో కూలబడ్డాడు.

రాణా వెంటనే పనిమీద వెళ్ళలేదు. ఇంటికెళ్ళి స్నానం చేసి సివిల్ దుస్తుల్లో బయల్దేరాడు. రాణా వీరదాస్ 'అడ్డా' చేరుకునే టైమ్‌కి బాగా చీకటి పడింది.

ఇంటి ముందే మెట్లున్నాయి. చెక్కమెట్లు. పై అంతస్థుకి చేక్క రెయిలింగ్ వుంది. అడ్డా బయట వేపచెట్టు. చుట్టు చప్టా వున్నాయి.

చెట్టు నీడలో నలుగురు కూర్చుని క్యారంబోర్డు ఆడుతున్నారు చెక్క మెట్ల కింద స్థంభాలకి ఆనుకుని ఇద్దరు సిగరెట్లు తాగుతున్నారు. ఇంటి ముందు రెండు మూడు స్కూటర్లు, సైకిళ్ళు పార్క్ చేయబడి వున్నాయి. వేపచెట్టుకి కాస్త దూరంలో ఆంజనేయస్వామి విగ్రహం వున్న చిన్న గుడి వుంది. దాని వెనుకే వ్యాయామశాల వుంది.

దూరం నుంచి ఒక పసిపాప ఏడుపు ఆపకుండా వినిపిస్తోంది. రాణా మోటార్ సైకిల్ ఆపుచేసి రెండడుగులు వేసేసరికి మెట్లకింద కూర్చున్న ఇద్దరూ అతడి దగ్గరికి వచ్చారు.

"ఎవరు కావాలి?"

"వీరదాస్"

"నువ్వెవడివి?" కాస్త హేళనగా అడిగారు.

" రాణా ..... ఇన్‌స్పెక్టర్ రాణా."

ఇద్దరూ చప్పున అటెన్షన్‌లోకి వచ్చారు. "నమస్తే సాబ్" అన్నాడు. ఇద్దరిలోకి పెద్దగా వున్నవాడు--- "వెళ్ళి చెప్పిరా" అని పక్కవాడిని గద్దించాడు.

వాడు మేడ మీదకు పరుగెత్తాడు!

"నీ పేరు?" రాణా ప్రశ్నించాడు.

"సింహం"

"పూర్తిపేరు చెప్పు" అధికారయుక్తంగా అడిగాడు.

"గజ్జెల నరసింహం సాబ్"

ఈ లోపులో పైకి వెళ్ళినవాడు పరుగెత్తుకు వచ్చి "రమ్మంటున్నారు సాబ్" అన్నాడు. రాణా మెట్లెక్కి లోపలికి వెళ్ళాడు. ముందు గదిలో ఒక మూల ఆరేడుగురు గుండ్రంగా కూర్చుని పేకాడుతున్నారు. అక్కడంతా గొడవగా వుంది. 'ఇస్పేట్ రాజు' అంటున్నాడెవడో. "అరగంట నుంచీ కార్డ్ షో గురూ" అంటున్నాడు మరొకడు. రాణా ముందుకి నడిచాడు. రెండో గదికి మాసిపోయిన కర్టెను వేలాడుతూ వుంది. గోడలు నల్లగా, దుమ్ముపట్టి వున్నాయి. పెయింటింగ్ వెలిసిపోయివుంది. లోపల గదిలో టేబుల్‌కి ఎదురుగా---

వీరదాస్ కూర్చుని వున్నాడు.

లాల్చీ, గళ్ళపంచె అంగుళం కన్నా పెరగని జుట్టు. చెంపలనించి క్రిందికి పాకిన పలుచటి గెడ్డం .....

రాణా అతని వైపే చూస్తున్నాడు.

వీరదాస్ రాణా వైపు చూడడంలేదు. తన పనిలో నిమగ్నమై వున్నాడు. పనంటే పెద్ద పని

కాదు. పేక ముక్కల్తో ఒక్కడే పేషెన్స్ ఆడుకుంటున్నాడు. పక్కన ఇంకో మనిషి వున్నాడు గానీ మొహం అటు తిరిగి, పడిపోయి వున్నాడు. గ్లాసు మాత్రం టేబిల్ మీదే వుంది. వీరదాస్ మధ్య మధ్యలో గ్లాస్ సిప్ చేస్తూ పేకముక్కల్ని తిప్పుతున్నాడు. పది క్షణాలు గడిచాక తలెత్తి రాణాని చూసి "హల్లో ఇన్‌స్పెక్టర్ సాబ్ రండి" అన్నాడు నవ్వుతూ - కుర్చీలోంచి లేవకుండానే.

తను లోపలికి వస్తున్నానని అతడికి తెలుసు. ముందే అతనికి ఆ విషయం మనిషొచ్చి చెప్పాడు. అయినా తను రాగానే అతడు చూడలేదు. ఏదో పనిలో వున్నట్టు నిర్లక్ష్య మైన ఏకాగ్రతతో తన ఉనికిని గమనించడం ఆలస్యం చేశాడు. ఇలాటి చిన్న విషయాలే అవతలి వ్యక్తి మనస్తత్వం మీద గొప్పగా ఆడుకుంటాయి. 'నువ్వు నాకన్నా తక్కువలో వున్నావు' అని అన్యాపదేశంగా చెప్పడం అది!

"నేనే వచ్చి మిమ్మల్ని కలుసుకుందామనుకున్నాను సాబ్. అనవసరంగా మీరే శ్రమ తీసుకున్నారు"

"శ్రమ ఏం వుంది? ఇది మా డ్యూటీ కదా. ఛార్జీ తీసుకోగానే ఆ వూరి ప్రముఖుల్ని కలుసుకోవడం-" అంటూ కుర్చీలో కూర్చుంటూ టేబిల్‌మీద వున్న విస్కీ గ్లాస్‌ని కొద్దిగా తోశాడు. అది దొర్లి వీరదాస్ మీద ద్రవించి, క్రిందపడి బ్రద్ధలైంది.

"అరెరె, సారీ వీరదాసు" తుడవబోయాడు.

"ఫర్వాలేదు" వీరదాసు లుంగీమీద పడిన విస్కీని తుడుచుకుంటూ అన్నాడు. అతడి కృత్రిమమైన రిజర్వ్‌డ్‌నెస్ పోయింది. రాణాకి కావాల్సింది అదే.

"చెప్పండి సార్, ఏం తీసుకుంటారు? విస్కీ, బీర్ ఇంపోర్టెడ్ కూడా వుంది."

"థాంక్యూ. డ్యూటీలో వుండగా తాగను"

"అదేమిటి సార్- మొదటిసారి ఈ బీదవాడి అడ్డా కొచ్చారు. ఏవీ తాగరా?"

"బ్లడీ మేరీ వుంటే తెప్పించు"

"బ్లడీ మేరీ- హ్హాహ్హా- లేద్సార్ - వుట్టి మేరీ కావాలంటే తెప్పిస్తాను!"

"సారీ. డ్యూటీలో వుండగా వ్యభిచారం చెయ్యను" నిజాయితీగా చెప్పాడు రాణా. అందులో ఏదైనా వ్యంగ్యం వుందేమో అన్నట్టు చూశాడు వీరదాస్. అటువంటిదేమీ కనబడలేదు. దాంతో తిరిగి నవ్వేడు.

"యస్. పురం పోలీస్‌స్టేషన్‌కి ఏ ఇన్‌స్పెక్టరొచ్చినా వచ్చి కలవడం నా కలవాటు సార్! ఫ్రెండ్‌షిప్ ..... ఫ్రెండ్‌షిప్‌కి నేను ప్రాణం ఇస్తాను మీరేమో వచ్చీ రాగానే మా మనిషి మస్తాన్‌ని బొక్కలో తోశారు. ఆహా డ్యూటీ ..... డ్యూటీ చెయ్యాల్సార్. మీరు కరెక్టుగా చేశారు. రాగానే అసలు మనం ఏమిటో చూపించాలి కదా" అతని కంఠంలో మార్పు వచ్చింది. " ..... మీ గురించి చాలా విన్నాను సార్. నాయుడుగారు చెప్పారు"

"ఏం చెప్పాడు. ఆయన్ని కూడా బొక్కలో తోశానని చెప్పాడా?"

అతడు కన్నార్పకుండా చూశాడు. రాణా కూడా సూటిగా చూశాడు అతడు నవ్వేడు

"ఏం తీసుకుంటారు సార్? లెమన్ సోడా అయినా కనీసం తీసుకోండి"

"థాంక్స్. మళ్ళీ కలుద్దాం" వెనుతిరుగుతూ అన్నాడు.

"మళ్ళీ కలుద్దామా? అమ్మో! పోలీసుల్తో 'మళ్ళీ కలుద్దాం' అంటే డేంజర్"

రాణా ఆగాడు "ఎవరికి? నీకా. పోలీసులకా?"

"మాకే సాబ్"

"అలా కలవకుండా వుండాలంటే మీ వాళ్ళని ఉపాధ్యాయ కాలనీ వైపు తిరగొద్దని చెప్పు"

వీరదాస్ చప్పున కళ్ళెత్తిచూశాడు. రాణా అన్నాడు- "అలా తిరిగితే ఏమవుతుందో రేపు మస్తాన్ బయటకొచ్చాక అడుగు"

"అంటే-" అన్నట్టుగా చూశాడు వీరదాస్.

"సంఘంలో మర్యాదగా బ్రతికేవాళ్ళ జోలికి వెళ్ళకుండా వుండే పాఠాలు ఒకటి - రెండు ఈ రాత్రి మస్తాన్‌కి చెపుతాను"

వీరదాస్ వెంటనే మాట్లాడలేదు క్షణం ఆగి. నెమ్మదిగా, తాపీగా అన్నాడు - "మస్తాన్ అయిదు నిముషాల క్రితమే సెల్ నుంచి బయటికొచ్చాడు సాబ్"

చల్లటి నీళ్ళు మొహం మీద కొట్టినట్టయింది రాణాకి వీరదాస్, అతడిని ఆ ఇబ్బందికరమైన స్థితినుంచి తప్పించడానికా అన్నట్టు- "మనమంతా ఒకటేసాబ్. ఒకరికొకరు సాయం చేసుకోకపోతే పనులెలా జరుగుతాయి? మొదటిసారొచ్చారు. ఈ బీద అడ్డాలో టీ కూడా తాగకుండా వెళ్తున్నారు. ఏదైనా అవసరం వస్తే చెప్పండి సాబ్. మన దగ్గర చాకుల్లాటి కుర్రాళ్ళున్నారు. నన్ను రమ్మంటే నేనే వస్తాను. స్నేహమంటే ప్రాణమిస్తాను సాబ్ నేను" అతడి మాటలు మధ్యలో కట్ చేస్తూ "మస్తాన్‌ని వదిలెయ్యమని ఎవరు చెప్పారు?" కటువుగా ప్రశ్నించాడు రాణా.

"డి.యస్పీ సాబ్. మనకి పెర్సనల్ ఫ్రెండ్"

రాణా కోపాన్ని అతి కష్టం మీద అణుచుకుని "ఆయనతో నేను మాట్లాడతాను" అన్నాడు.

"ఆయనిప్పుడు మాట్లాడే పొజిషన్‌లో లేరు సార్"

"నీకెలా తెలుసు?" అనుమానంగా అడిగాడు.

"చూస్తే తెలియడం లేదా సాబ్"

రాణా వీరదాస్ చూసిన వైపు తల తిప్పాడు. మత్తు కాస్త తక్కు వై మరో గ్లాసు కోసం ఇటు తిరుగుతున్నాడు--

ఆ ఏరియా డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్!

5

రాణాకి ఆ ఇల్లూ, ఇంట్లో వారూ బాగా నచ్చారు. కానిస్టేబుల్ శర్మకి ఒక కూతురు, ఒక కొడుకు. భార్య చాలా నెమ్మదస్తురాలు. కొడుకు టెన్త్‌లోస్టేట్ ఫస్ట్ వచ్చాడు. ఇప్పుడు

ఇంటర్మీడియెట్ పరీక్షలు వ్రాశాడు. అతని పేరు శ్రీనివాస్. చాలా నెమ్మదస్తుడు. చూడగానే రాణాకి ఆ కుర్రవాడు బాగా నచ్చాడు. తన స్టూడెంట్ లైఫ్‌లో తనెప్పుడూ అంత బ్రిలియెంట్‌గా, నెమ్మదిగా లేడు.

మొట్టమొదటిసారి తన పోర్షన్‌లో ప్రవేశిస్తూ రాణా చాలా ఆశ్చర్యపోయాడు. గది మధ్యలో ముగ్గేసి వుంది. చూరు నుంచి క్రిందికి గుమ్మడికాయ వ్రేలాడగట్టబడి వుంది. కిటికీ గట్టుమీద ఆరు నిమ్మకాయలున్నాయి. గోడకి పన్నెండు - వివిధ దేవుళ్ళ ఫోటోలు వున్నాయి.

"ఏమిటిది? నాకు ముందు ఈ పోర్షన్‌లో ఎవరైనా క్షుద్ర దేవతోపాసకుడు వుండేవాడా?" విస్మయంగా అడిగాడు రాణా.

"మా అక్కయ్యకి భక్తి ఎక్కువ. శనిని పారద్రోలడానికి ఇలా పెట్టాలని మొన్న సిద్ధాంతిగారు చెప్పారుట" అన్నాడు శ్రీనివాస్.

"మీ అక్కయ్యగారికి ఎంతమంది పిల్లలు?"

"పిల్లలా. భలే తనకింకా పెళ్ళే కాలేదు."

"ఇంట్లో కనబడడం లేదేం?"

"దేవీ నవరాత్రులు కదా. హరికథా కాలక్షేపానికి వెళ్ళి వుంటుంది."

"మీ అక్కయ్య పేరు?"

"అలక్‌నంద"

అతడికిదంతా విచిత్రంగా కనిపించింది కానీ ఎక్కువ ప్రశ్నలు వేయలేదు.

అతడి పోర్షన్‌కి బయట్నుంచి విడిగా దారి వుంది. పెరడు, బాత్ రూమ్ మాత్రం కామన్.

అతడు తన కొద్ది సామానూ సర్దుకుని తిరిగి బయటపడ్డాడు.

ఇరవై కిలోమీటర్ల దూరంలో వుంది పట్నం. అక్కడి ఇన్‌స్పెక్టర్‌ని కలుసుకున్నాడు.

"భరత్ అనే జర్నలిస్ట్‌ని లాకప్‌లో పెట్టారు కదా. అతడికోసం వచ్చాను"

"మీ పోలీస్‌స్టేషన్ వారే కదా, అతడు ఎక్కడున్నదీ ఎవరికీ చెప్పకుండా రహస్యంగా వుంచమని మా దగ్గర దాచారు."

"అవును. ఇప్పుడు నేను డ్యూటీ తీసుకున్నాను కదా. నేను తీసుకువెళ్తాను."

"జాగ్రత్త. అతను రాడికల్ అట. చాలా అపాయకరమైన మనిషి అని యస్సై సుధాకర్ చెప్పాడు."

రాణా కోపాన్నీ, విసుగునీ అణుచుకుని "ఫర్వాలేదు. నేను చూసుకుంటాను" అన్నాడు.

భరత్‌ని తీసుకుని అతడు తిరిగి తన వూరు బయల్దేరాడు.

"ఎవరు మీరు?" భరత్ అడిగాడు.

"పోలీస్ డిపార్ట్‌మెంట్ మనిషిని అని చెప్పుకోవడానికి సిగ్గుపడుతున్నవాణ్ణి. నా పేరు రాణా ..... ఇన్‌స్పెక్టర్ రాణా" అంటూ ట్రెయిన్‌లో అతడి భార్య, కూతురు కనపడిన సంగతి చెప్పాడు. అంతా చెప్పి-

"ఇప్పుడు చెప్పండి. మిమ్మల్ని నా వాళ్ళెందుకు అరెస్ట్ చేశారు?" అని అడిగాడు.

"నాకు తెలీదు" అన్నాడు భరత్ నవ్వుతూ. "నేను ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌ని. రకరకాల వ్యాసాల కోసం పరిశోధన చేస్తూ వుంటాను. అది ఎవరికయినా బాధాకరంగా పరిణమించి వుండవచ్చు."

"ప్రస్తుతం మీరు ఏ టాపిక్స్ మీద వ్రాస్తున్నారు?"

"ఫుట్‌పాత్ బ్రతుకుల మీద ఒకటి వ్రాస్తున్నాను. 'దేముడి సంపద' అని ఒక ఆర్టికల్ వ్రాస్తున్నాను."

"దేముడి సంపద ఏమిటి?"

"మన వూళ్ళో వున్న భావనారాయణ గుడిలో విగ్రహానికి వున్న ఆభరణాల సంగతి తెలుసు కదా. దాదాపు యాభై లక్షల విలువచేసే ఆభరణాలు అవి పురాతన కాలం నుంచీ వస్తున్నాయవి. వాటి చరిత్ర, ఖరీదు మొదలైన వివరాలన్నీ సేకరించి వ్యాసం వ్రాయాలని నా ఉద్దేశ్యం."

"అది ఎవరికీ హాని చేయదే"

"రెండోది ఫుట్‌పాత్ బ్రతుకుల గురించి"

"అది కూడా ఎవరికీ హాని చేయదు!"

"అలా అనకండి. దీనిలో చిత్రమైన మెలిక వుంది. అర్థరాత్రి వరకూ హోటల్లో టీ కప్పులు కడిగి, రాత్రి చలిలో, వానలో ఫుట్‌పాత్‌ల మీద పడుకునే కుర్రాళ్ళ జీవితాలు అవి."

"అయితే?"

"కొద్దిగా మంచి జీవితాన్ని రుచి చూపించి, సౌకర్యాలు కల్పించామంటే వాళ్ళు మనం ఏం చేప్తే అది చేసే ఆల్సేషన్ డాగ్స్‌లా తయారవుతారు ఆటంబాంబ్ కన్నా, హైడ్రోజెన్ భయంకరమైతే మారణాయుధం 'మనిషి'. గురి తప్పకుండా పనిచేసుకొచ్చే అణ్వాస్త్రం అతడు.

రాణా అర్థంకానట్టు చూశాడు.

"ఫుట్‌పాత్‌ల మీద బ్రతికే వాళ్ళకు జీవితం నిస్సారంగా కనిపిస్తుంది. భవిష్యత్తు తెలీదు. అంతా ఫ్రస్ట్రేషనే. అలాటి కుర్రాళ్ళని పట్టుకుని జాగ్రత్తగా దువ్వి వాళ్ళకి ట్రైనింగ్ ఇస్తే ..... ?"

భరత్ ఆగి అన్నాడు----

మంచి గూండాలుగా తయారవుతారు. సామాన్యుల్ని భయపెట్టడంలో వుండే ఆనందం ఏమిటో కాస్త రుచి చూపిస్తే చాలు.

ఆ థ్రిల్‌లో వుండే ఆనందం మరెందులోనూ లేదు. బాల్యంలో తాము అనుభవించిన నరకం వాళ్ళని రాక్షసుల్ని చేస్తుంది. అంతేకాదు ఆ నరకం నుంచి తమని తప్పించిన ఆ యజమానిపట్ల వాళ్ళు కృతజ్ఞులై వుంటారు. అతడికోసం వాళ్ళు ఏ పని చేయటానికైనా సిద్ధంగా తయారవుతారు. దానికి ప్రతిఫలంగా ఆ యజమాని కూడా వాళ్ళకి చాలా పెద్ద మొత్తంలో డబ్బు ముట్టజెపుతాడు."

రాణాకి --- తను ఇంతకుముందు పనిచేసిన పోలీస్‌స్టేషన్ దగ్గిర టీ లందించే 'రాజాచంద్ర' గుర్తొచ్చాడు. అకస్మాత్తుగా వాడు మాయమయ్యాడు. ఎవరూ వాడి అదృశ్యం గురించి పట్టించుకోలేదు. సాధారణంగా పట్టించుకోవలసిన అవసరం లేదుకూడా.

భరత్ అన్నాడు--- "ఈ కుర్రాళ్ళందరూ ఏమవుతున్నారు? ఎవరో తెలివైన కాపిటలిస్టు తన పెట్టుబడిగా వీళ్ళని చేరదీస్తున్నాడన్నది నిర్వివాదాంశం. అతడెవరో తెలుసుకుందామని నేను కాస్త ప్రయత్నించాను. ఈ లోపులో పోలీసులు నన్ను అరెస్ట్ చేశారు."

"ఈ కుర్రాళ్ళని చేరదీస్తున్నది ఎవరో నాకు తెలుసు భరత్---"

"ఎవరు?"

"అరవింద్ చౌరసియా."

భరత్ చప్పున తలెత్తి చూశాడు.

"అవును భరత్. నువ్వు చెప్పినట్టే నేనూ ఎంక్వయిరీ చేశాను. కానీ మరో కోణం నుంచి, ఇప్పుడు నాకు విషయం తేటతెల్లంగా అర్థమైంది. గత కొన్ని సంవత్సరాల నుంచి చాపకింద నీరులా ప్రవహిస్తూన్న అండర్ వరల్డ్ రాకెట్ ఇది. నీ క్రింద వందమంది మనుష్యులున్నారనుకో. ఒక వూరిని శాసించడానికి వాళ్ళు చాలు. వాళ్ళు ప్రాణాలకి తెగించిన వాళ్ళు. జైలుకి భయపడరు. వాళ్ళే నీ పెట్టుబడి. నీ కోసం వాళ్ళు చందాలు వసూలు చేస్తారు. ఖాళీస్థలాలు ఆక్రమిస్తారు. ఎవరైనా రాజకీయ నాయకుడు ఎలక్షన్స్ కోసం ఆశ్రయిస్తే, నీ తరపున ఈ మనుష్యులు రిగ్గింగ్ చేస్తారు. ఆ నాయకుడు పదవిలోకి వస్తాడు. నీకు కృతజ్ఞుడై వుంటాడు. ఆ తరువాత ఆటోమాటిక్‌గా పోలీసులూ నీ కంట్రోల్‌లోకి వస్తారు. నువ్వు కాస్త పక్క నగరాలకి విస్తరిస్తావ్. క్రమంగా ఒక స్టేజిలో అసెంబ్లీలో నీ మనుష్యులే వుంటారు. ముఖ్యమంత్రిని నువ్వు శాసించగలుగుతావు. రాష్ట్రం మొత్తం నీ చేతిలోకి వస్తుంది. మామూలు 'లేబర్'కి బయట కన్నా నీ క్రింద బ్రతకడమే సుఖమనిపిస్తుంది. ఒక్కో ఎలక్షన్‌లో ఒక్కో ఎమ్మెల్యేని గెలిపించడం కోసం పాతిక లక్షలు వసూలు చేస్తావు. ఒక లైసెన్స్‌కి పది లక్షలు అడుగుతావు. నీ సంవత్సరాదాయం చాలా సులభంగా సాలుకి ఐదారు కోట్లు వుంటుంది. నీ క్రింది మనుష్యులకి, విడిగా బయట దొరికేది కాక నీ నుంచి నెలకు అయిదారువేలు లభిస్తుంది. నీ మనుష్యులకి దాదాలుగా పేరు, నీకు సంఘంలో పలుకుబడి, ఎక్కడికి వెళ్ళినా నిముషాల మీద పని జరగడం -- ఇంతకన్నా కావల్సింది ఏముంది?"

భరత్ ఊపిరి పీల్చడం మర్చిపోయినట్టు రాణా వైపు చూస్తూ వుండిపోయాడు.

చివరికెలాగో నోరు పెగల్చుకుని "నేను వ్రాస్తున్న ఫుట్‌పాత్ బ్రతుకుల వ్యాసం వెనుక ఇంత కథ వుందా?" అన్నాడు.

"అరవింద్ చౌరసియా అనవసరంగా తన నీడని చూసి తనే భయపడ్డాడు. వీళ్ళు భయపడేది ప్రెస్‌కే. ఇప్పుడు నేను చెప్పినదంతా మీరు ఇన్వెస్టిగేట్‌చేసి వ్రాస్తున్నారేమో అని బహుశ చిన్న వార్నింగ్ తెర వెనుక నుంచి ఇచ్చి వుంటాడు."

"ఇప్పుడు నిశ్చయంగా వ్రాస్తాను."

"అంతకన్నా ముందు మీరొక పని చెయ్యండి. ఉపాధ్యాయకాలనీ వారిని కలుసుకోండి. వాళ్ళు ప్రెస్‌కి చెప్పాల్సింది చాలా వుంది."

"తప్పకుండా."

ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు.

భరత్‌ని చూడగానే ఇంట్లో కలకలం రేగింది. అభిషిక్త పరుగు పరుగున వచ్చి తండ్రి చేతుల్లో వాలిపోయింది. భరత్ భార్య ఆనందంతో కంట నీరు పెట్టుకుంది.

రాణాకి ఎందుకో బాధేసింది.

పోలీసులు ఎన్నోసార్లు ఎంతోమందిని కారణం చెప్పకుండా స్టేషన్‌కి తీసుకువెళ్ళడం తనకు తెలుసు. ఇంటిల్లిపాదీ ఎంత తల్లడిల్లిపోతారో ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాడు.

ఇక అక్కడ వుండకుండా పోలీస్‌స్టేషన్‌కి వచ్చేశాడు.

*　　*　　*　　*　　*

అతను స్టేషన్‌కి వచ్చేసరికి అక్కడ కాలనీవాళ్ళు ఎదురు చూస్తున్నారు.

"ఏమిటి విషయం?" అని అడిగాడు.

"గంట క్రితం ఎమ్మెల్యే నాయుడుగారు వచ్చారు సార్. విషయమంతా తెలుసుకుని, మిమ్మల్ని స్టేషన్ కెళ్ళి వుండమని ఆయన వెళ్ళారు."

"ఎక్కడికి?"

"తెలీదు."

"ఏ విషయమంతా తెలుసుకుని?"

వాళ్ళేదో చెప్పబోతూంటే మెట్ల దగ్గర అలికిడి వినిపించింది. నాయుడు మస్తాన్‌ని దాదాపు మెడపట్టుకుని లాక్కొస్తూ కనిపించాడు.

మస్తాన్‌ని రాణా ముందుకుతోస్తూ "వీడేదో గొడవ చేశాడట కదా. ఈ రౌడీ ముండాకొడుకుల్ని ఎందుకు వదిలిపెడ్తారు" అన్నాడు. రాణా ఏదో చెప్పబోతూ వుంటే, "ముందు ఈడిని బొక్కలో తొయ్యండి తరువాత మాట్లాడుకుందాం" అంటూ తనే స్వయంగా మస్తాన్‌ని సెల్‌లో వేసి వచ్చి కూర్చున్నాడు.

ఈ వెధవలు పొలిటికల్ ఇన్‌ఫ్లుయెన్స్‌ని బాగా వుపయోగించుకుంటారండీ. పెద్ద పెద్ద వాళ్ళపేరు చెప్పుకోవడం వీళ్ళకి బాగా అలవాటయిపోయింది. వీడిని వదిలిపెట్టమని మీ

డియస్పీ గారికి నా పేరుమీద ఎవరు చెప్పారో తెలీదు. ఈ కాలనీ వాళ్ళొచ్చి వీడి గ్యాంగు చేసిన పనులన్నీ చెపుతూంటే ఆశ్చర్యపోయాను. నేను ప్రజల మనిషిని. నా పేరు ఇంకొకరు వాడుకోవడం సహించలేక వెంటనే వీడ్ని పట్టుకుని తీసుకొచ్చాను. ఎటువంటి పరిస్థితుల్లోనూ, ఎవరు పలుకుబడి ఉపయోగించినా, చివరికి ముఖ్యమంత్రి ఇన్ఫ్లుయెన్స్ చేసినా వీడిని వదలకండి. మీ వెనుక నేనుంటాను."

రాణా ఇంకా విస్మయం నుంచి తేరుకోలేదు.

ఉపాధ్యాయ కాలనీ వాళ్ళ మొహంలో ఆనందం కనపడుతూవుంది. నాయుడి మీద వాళ్ళకి గౌరవం పర్వతమంత పెరిగిపోయినట్టు వాళ్ళని చూస్తుంటేనే తెలుస్తోంది.

"థాంక్స్" అన్నాడు రాణా క్లుప్తంగా.

కాలనీవాళ్ళు లేచి ముక్తకంఠంతో "వెళ్ళొస్తాం సార్" అన్నారు నాయుడితో. వాళ్ళ స్వరంలో "మిమ్మల్ని అనవసరంగా అపార్థం చేసుకున్నాం" అన్న భావం ధ్వనిస్తోంది.

ఈ టైమ్‌లో వైర్‌లెస్ మెసేజ్ వచ్చింది. ఒక కానిస్టేబులు హడావుడిగా చెప్పాడు "సార్-- రౌడీలు ఉపాధ్యాయ కాలనీని ఛిన్నాభిన్నం చేశారు. అక్కణ్ణుంచే మాట్లాడుతున్నాను నేను."

రాణా కంగారుగా లేచాడు. విషయం తెలిసి నాయుడు- "అట్లానా. పదండి. వీళ్ళు నా కార్లోనే వస్తారు" అంటూ బయల్దేరాడు. నాయుడి సరికొత్త మారుతీ కార్లో కొందరు, పోలీసు జీపులో కొందరు ఎక్కి కాలనీకి బయల్దేరాడు.

అప్పటికే జరగవలసినదంతా జరిగిపోయింది. గూండాలు కాలనీని నానా భ్రష్టు పట్టించారు. కొందరిళ్ళల్లో సామాన్లు బయటకు విసిరేశారు. అడ్డొచ్చిన వాళ్ళని కొట్టారు. "మా దాదాని పోలీసులకి పట్టిస్తారా?" అంటూ భీభత్సం సృష్టించారు. ఆర్థికంగా నష్టపోవడం స్పష్టంగా తెలుస్తోంది.

నాయుడు అన్నాడు-- "వీళ్ళు నిశ్చయంగా ఆ మస్తాన్ గాడి మనుష్యులే అయివుంటారయ్యా. ఎవరినీ వదిలిపెట్టకు. అందరి మక్కెలూ విరగదన్ను" అని కాలనీ వాళ్ళవైపు చూసి, "మీరేం భయపడకండి" అంటూ మరి కొంచెంసేపు ధైర్యం చెప్పి అక్కడినుండి వెళ్ళిపోయాడు. ఇంకో గంటలో పార్టీ తాలూకు మహిళా విభాగం వాళ్ళు వచ్చి కాలనీ ఆడవాళ్ళకి ధైర్యం చెపుతారని అన్నాడు.

రాణాకి నాయుడు ఎత్తు అర్థమైంది.

దీని వెనుక వున్నది అతడే అంటే కాలనీ వాళ్ళు ఇప్పుడు నమ్మే స్థితిలో లేరు. అంత డ్రామా ఆడాడు. ఇప్పుడీ గొడవంతా మస్తాన్‌ను అరెస్ట్ చేసినందుకు వాడి అనుచరులే చేసినట్టు రంగు పూశాడు. వాళ్ళని పట్టుకోవలసిన బాధ్యత తనమీద పెట్టి అతడు తప్పుకున్నాడు.

రాణాకి కసిగా వుంది. ఎవరిమీదో తెలియని కసి!

"మీ కాలనీలో గూండాయిజం చేసిన వాళ్ళని పట్టుకుంటాను" అన్నాడు.

"ఎవర్నీ వదిలిపెట్టను"

“వద్దు సార్” అన్నాడు కాలనీ వాళ్ళలో ఒకరు. “మమ్మల్ని ఇలా బ్రతకనివ్వండి. మీ మీ గొడవల మధ్య మమ్మల్ని ఇరికించకండి.”

రాణా ఏదో అనబోయి ఆగిపోయాడు. అందరి మొహాల్లో అదే భావం కనపడుతూంది. “..... వాళ్ళు మంచివాళ్ళు కాబట్టి మా ఆడవాళ్ళ మీద చెయ్యి వేయలేదు. కావాలంటే చందాలు ఇచ్చుకుంటూనైనా బ్రతుకుతాం. మమ్మల్ని బాధపెట్టకండి” అన్న భావం.

వాళ్ళు వెళ్ళిపోయారు.

కాలనీలోంచి ఎవరిదో పిల్లాడి ఏడుపు వినిపిస్తోంది.

రాణా ఒక్కడే నిస్సహాయతకు ప్రతీకగా మిగిలాడు.

“నాయుడూ” అనుకున్నాడు.

అతడు పోలీస్‌స్టేషన్ కొచ్చేసరికి లాయరు రెడీగా వున్నాడు. “ఏ నేరం మీద మస్తాన్‌ని అరెస్ట్ చేశారో తెలుసుకోవచ్చా సార్?” అని నమ్రతగానే అడిగాడు.

“ఒక పోలీసు అధికారిమీద చెయ్యి చేసుకున్నందుకు.”

“క్షమించండి సార్ ఇలా అడుగుతున్నందుకు. మీరప్పుడు డ్రెస్‌లో వున్నారా?”

“లేను.”

“సివిల్ డ్రెస్‌లో మీరే ముందు అతడిని కొట్టడంతో అతడు మిమ్మల్ని మామూలు మనిషిగా అపార్థం చేసుకుని తిరగబడ్డాడు.”

“ ..... రేపు కోర్టులో నేనిలాగే వాదించబోతున్నాను. నువ్వు అనవసరంగా కష్టాల్లో ఇరుక్కోబోతున్నావ్ ఇన్‌స్పెక్టర్” అన్న మందలింపు వుంది లాయర్ కంఠంలో.

“మనం మస్తాన్‌ని వదిలిపెట్టి కాంప్రమైజ్‌కి వెళ్తేనే బావుంటుందేమో సర్” అన్నాడు యస్సై కబ్రా.

రాణా తలూపాడు. అంతకన్నా చేసేది లేదు 24 గంటల్లో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలి. కేసు నిలబడదు. అనవసర పంతాలకు పోయి మస్తాన్ మీద కేసు పెట్టడం వేస్టు.

మస్తానుని తీసుకుని లాయరు వెళ్ళిపోయాడు.

రాత్రి ఎనిమిదయింది.

రేపొద్దున్నే ఈ విషయం కాలనీ వాళ్ళకి తెలుస్తుంది.

ఇప్పటికే వాళ్ళు కుతకుతా వుడికి పోతున్నారు. ఇప్పుడు తను మస్తాన్‌ని వదిలేశాడంటే ఇక అసలు క్షమించరు. తన పరిస్థితి అర్థం చేసుకోరు. అటు గూండాల కాలనీలో గొడవ చేయడానికి తనే కారణమయ్యాడు. మస్తాన్‌ని తనే వదిలేశాడు. వాళ్ళ దృష్టిలో నాయుడు దయామయుడయ్యాడు.

చాలా అందమైన వల పన్ని అందులో తనని ఇరికించాడు నాయుడు.

"నా రాజకీయం ముందు నువ్వు అర్భకుడివిరా" అని నిరూపించాడు.

నిజంగా తను అర్భకుడేనా?

రాత్రి భోజనం చేస్తూ అదే ఆలోచించాడు.

పదకొండింటికి డ్రెస్ వేసుకుని బయల్దేరాడు. పోలీస్‌స్టేషన్‌కి కాదు. నాయుడు ఇంటికి.

మోటార్ సైకిల్ దూరంగా ఆపి, గోడదూకి వెనుకనుంచి పోర్టికోలోంచి వచ్చాడు. కొత్త మారుతీకారు ..... ఇంకా రిజిస్ట్రేషనూ, ఇన్సూరెన్సూ కూడా లేవు.

పెట్రోలుటాంక్‌లోంచి గుడ్డతడిపి అంటించి అక్కడనుంచి బయటపడ్డాడు. అతడు మోటారు సైకిల్ స్టార్ట్ చేస్తూ వుండగా మంటలు ఉవ్వెత్తున లేస్తూ కనపడ్డాయి.

విపరీతమైన వేగంతో డ్రయివ్ చేస్తూ రెండు నిముషాల్లో పోలీస్‌స్టేషన్‌కి వచ్చాడు. సరీగ్గా పది సెకన్ల తరువాత ఫోన్ వచ్చింది.

"నా మారుతీకారు ఎవరో కాల్చేశారు" అట్నుంచి దాదాపు అరుస్తున్నట్టు అన్నాడు నాయుడు.

"ఏది సార్? ఆ కొత్త కారేనా?"

"ఆ అదే" విసుగ్గా, కోపంగా అన్నాడు.

"నేనిప్పుడే వస్తున్నాను."

అతడు వెళ్ళేసరికి అక్కడ జనం గుమిగూడి వున్నారు. కాలనీ వాళ్ళు కూడా వున్నారు. కారు దాదాపు బూడిదగా మారిపోయింది. లక్షా యాభైవేలు విలువచేసే బూడిద!

"ఇదెవరు చేసి వుంటారని మీరు భావిస్తున్నారు?" అన్న ప్రశ్నకి, రాణా

"ఇది నిశ్చయంగా మస్తాన్‌గాడి పనే. సాయంత్రం లాయరొచ్చి వాడ్ని విడిపించుకుపోయాడు. మీరేమో వాడి మెడ పట్టుకుని కొట్టుకుంటూ పోలీస్‌స్టేషన్‌కి లాక్కువచ్చారాయె. ఆ కసి మనసులో పెట్టుకుని కారు కాల్చేసి వుంటాడు" అన్నాడు.

నాయుడు మొహంలో రంగులు మారాయి. ఏదో ముడి విడిపోయినట్టు రాణావైపు చూశాడు. అతడి చూపుల్ని రాణా పట్టించుకోలేదు.

"వాడిమీద పక్కా కేసు నిలబడుతుంది సార్. రెండేళ్ళకి తక్కువ శిక్ష పడదు."

..... ఈ లోపులో పోలీసులు వ్యాన్‌లో మస్తాన్‌ని పట్టుకొచ్చారు.

"వీడి మక్కెలిరగదన్ని నిజం ఒప్పిస్తాను. మీరేం కంగారు పడకండి --"

"కంగారేమిటి -- లక్షన్నర విలువ చేసే కారు కాలిపోతే" ఎవరో గొణుగుతున్నారు.

"ప్రజల కోసం నిలబడిన మనిషి నాయుడుగారు! ప్రజలకి సింహస్వప్నంగా మారిన ఒక రౌడీని పోలీసులకి పట్టించడం కోసం తన కారుని త్యాగం చేయవలసివచ్చినా ఆయన బాధపడరు" అంటూ మస్తాన్‌వైపు తిరిగి వాడిని ఫెడేల్మని కొట్టి, "ఏరా -- కాలనీవాళ్ళు నీమీద కంప్లెయింట్ ఇచ్చారని వాళ్ళ మీదకు రౌడీలని పంపావు. ఇప్పుడు నాయుడుగారే ఇచ్చారు.

ఏం చేస్తావాయన్ని? మళ్ళీ రౌడీల్ని పంపుతావా? పద ..... సెంట్రల్ జైల్లో కూర్చుని ఏం చెయ్యాలో ఆలోచిద్దూగానీ" అని తన్నుకుంటూ వ్యాన్ ఎక్కించాడు.

కాలనీ వాళ్ళ మొహంలో రిలీఫ్ కనబడుతూంది.

నాయుడు మొహం మాత్రం జేగురురంగుకి తిరిగి వుంది.

జరిగినదంతా ఇప్పుడు క్లియర్‌గా అతడికి అర్థం అవుతోంది.

6

రాణా ఇంటికొచ్చేసరికి వంటిగంట దాటింది. కరెంట్ లేదు. అతడు బట్టలు మార్చుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

తలుపు తీసేసరికి ఒక శరీరం అతడిమీద పడింది.

మరెవరయినా అయితే కెవ్వున అరిచేవారే. అతడు కాబట్టి తమాయించుకుని ఆ శరీరాన్ని గట్టిగా పట్టుకుని నెమ్మదిగా క్రిందికి జార్చాడు.

బయటంతా చీకటి. నిశ్శబ్దం.

రాణా ప్రొఫెషనలిస్టు. అప్పటికే అతడు పోలీసు డిపార్టుమెంటులో చాలా కాలంగా పనిచేస్తూ వున్నాడు. చీకట్లో ఒక ఆకారం మీదపడితే భయపడేటంత భీరువు కాదు.

ఆ శరీరాన్ని అలాగే గోడకి ఆన్చాడు.

ముందు శ్వాస ఆడుతుందో లేదో అని ముక్కు దగ్గిర వేలుపెట్టి చూశాడు. ఊపిరి బలహీనంగా వస్తోంది. ఏమైనా కత్తిపోట్లు వున్నాయేమో అని మెడ దగ్గరా, వీపు మీదా తడిమిచూసి, నడుము మీదకి చేయిజార్చి, చీరకి జాకెట్టుకీ మధ్య చూశాడు. రక్తపు తడి ఏమీ తగల్లేదు. అతడు చేతిని మరింత క్రిందికి జార్చబోతుంటే---

"నేను బాగానే వున్నానండీ, నాకేమీ కాలేదు" అన్న మాటలు వినిపించాయి.

అతడు అదిరిపడి చెయ్యి తీసేసి, "ఎవరు నువ్వు? మా బాత్‌రూమ్‌లోకి ఎలా వచ్చిపడ్డావ్?" అని అడిగాడు.

"నా పేరు అలక్‌నంద" అంది ఆమె. అతడు అప్రయత్నంగా చేయి తీసేసి, " ..... నువ్వా" అన్నాడు.

"మన ఇద్దరి పరిచయం ఇలా బాత్‌రూమ్ మీద గచ్చుమీద మొట్టమొదటిసారి అవటం యాదృచ్ఛికమైనా, ఆనందంగా వుంది. అలా స్పృహ తప్పి పడిపోయావేమిటి? లోపల భయపడ్డావా?"

ఆమె ఏదో జవాబు చెప్పబోతూ వుంటే, "ఎవరదీ? అమ్మాయ్ అలకా?" అని తల్లి గొంతు వినిపించింది. రాణా అడుగు వెనక్కి వేశాడు.

"ఇలా అర్థరాత్రి మనిద్దర్నీ నీ తల్లి చీకట్లో బాత్‌రూమ్ దగ్గిర చూసిందంటే అపార్థం చేసుకునే ప్రమాదం వుంది. లోపలికి వెళ్ళు" అన్నాడు.

అయోమయంగా చూసింది అతడివైపు.

“అబ్బే. నీ మనసులోకి దుష్టాలోచనలు ప్రవేశపెట్టడం నా వుద్దేశ్యం కాదు” అని అతడు ఇంకా ఏదో అంటూ వుంటే అలక్‌నంద తల్లి అక్కడికి వచ్చింది.

“ఏమిటే! ఏమైందే?” అంది గోడకి ఆనుకుని కూర్చుని వున్న కూతుర్ని చూసి కంగారుగా.

రాణా మరింత కంగారుపడి, “అబ్బే ఇంకా ఏం కాలేదండీ” అన్నాడు. కూతుర్ని రెక్కపట్టుకుని లేపుతూ “ఇలా ఉపవాసాలు వుండొద్దంటే విన్నావా?” అంది.

“ఉపవాసాలా?” అన్నాడు రాణా ఆశ్చర్యంగా.

“అవున్నాయనా. మొన్న శనివారం. నిన్న ఏకాదశి. ఈరోజు కార్తీక సోమవారం.”

అతడు అలక్‌నంద వైపు చిత్రంగా చూసి, “ఈ వయసులో ఈ అమ్మాయి ఇలా అప్పుడప్పుడు మాత్రమే భోజనం చేయటానికి కారణం? ఏదైనా అజీర్తా?” అని అడిగాడు. అలక్‌నంద అతడివైపు కోపంగా చూసింది. అతడు ప్రశ్నని కాస్త మార్చి, “ఎందుకీమెకి భుక్తి మీద అనాసక్తి?” అన్నాడు.

“భక్తి” అంది తల్లి.

“భక్తా?? ఈ వయసులోనే ఇంత భక్తి అయితే ఫార్టీ ఇయర్స్ వచ్చేసరికి తప్పకుండా ‘ఆడబాబా’ అయితీరుతుంది. ఇక మీ పంట పండినట్టే! ఒక్కసారి ‘బాబా’ అయితే బోలెడంత డబ్బు. అందులోనూ ఆడబాబాలు ఈమధ్య తక్కువయ్యారు.”

అలక్‌నంద మొహం ఎర్రబడింది.

“డబ్బు సంపాదించటం కోసం, బాబా నవ్వటం కోసం నేను ఉపవాసాలుండటం లేదండీ. మనసు ప్రశాంతంగా వుంచుకోవటం కోసం ఉపవాసాలు వుంటున్నాను.”

“మనసు ప్రశాంతంగా వుండడానికి ఉపవాసాలే కారణమైతే, ఈ దేశంలో ముప్పాతికమంది జనం ప్రశాంతంగా బ్రతకాలే” అన్నాడు.

“ఎవరి ఉద్దేశాలు వాళ్ళవి” అంది అలక్‌నంద క్లుప్తంగా.

“ఉద్దేశ్యం ఏదైనా ఒక్కనిజం మాత్రం నువ్వు కాదనలేవు అలక్‌నందా!”

“ఏమిటది?”

“అర్థరాత్రి దాటి మంగళవారం వచ్చేసింది. నువ్వింక భోజనం చెయ్యవచ్చు.”

ఆమె నయనాలు సగం మూసుకుని “మంగళవారం ఆంజనేయస్వామి మొక్కు. భోజనం చెయ్యను” అంది.

“ఆయన బ్రహ్మచారి. ఆయన్ని మొక్కితే జీవితాంతం కన్నెపిల్లగానే మిగిలిపోతావు” బెదిరించినట్టు అన్నాడు.

“అదే నాకు కావల్సింది” అని అలక్‌నంద అక్కడనుంచి వెళ్ళిపోయింది.

“మీ అమ్మాయిని చూస్తుంటే చాలా ముచ్చటగా వుంది అత్తయ్యగారూ” అన్నాడు అటే చూస్తూ.

"ఏం ముచ్చటో నాయినా. దీన్ని చూస్తూంటే ఇక జీవితంలో ఒక ముద్దకీ ముచ్చటకీ నోచుకున్నట్టు లేదు. దాని జీవితం అలా అయిపోయింది-- "

"ఏమిటా ఫ్లాష్ బ్యాక్? ఏమా కథ?

"పెద్ద కథేం లేదు. దీని పదమూడో ఏట ఒక చిలక జ్యోతిష్కుడు దీని జాతకం చెప్పాడు. 'కన్నెగండం' వుందనీ, కన్నెరికం పోయిన మరుక్షణం మరణం తథ్యమని అన్నాడు. అది దీని మనస్సులో బలంగా నాటుకుపోయింది. అప్పట్నుంచీ ఇలా పూజలూ, పునస్కారాలూ మొదలుపెట్టింది."

"ఈ పూజలన్నీ పెళ్ళి నుంచి మరల్చుకోవటానికా -- లేక కన్నెగండం నుంచి తప్పించుకోవటానికా?"

"పెళ్ళంటేనే భయపడుతోంది నాయినా చూస్తూంటే తెలియటం లేదూ!"

"అమ్మాయి స్ట్రక్చర్ చూస్తూంటే మీ అభిప్రాయం తప్పనిపిస్తోంది. ఇలా అన్నానని ఏమీ అనుకోకండి అత్తయ్యగారూ! అమ్మాయి కన్నెగండం నుంచి తప్పించుకోవటానికే ఈ పూజలు చేస్తున్నట్టు నా అనుమానం. కొందరమ్మాయిలు శోభనం గురించి ఆలోచిస్తూ కూడా గుంభనంగా వుంటారు. ఎవరయినా పెద్ద జ్యోతిష్కుడికి చూపించి, ఆ చిలక జ్యోతిష్కుడు చెప్పింది తప్పని చెప్పించలేకపోయారా?"

"ఎంతమంది ఎన్ని చెప్పినా అమ్మాయి భయం పోలేదు బాబూ!"

"నన్ను ట్రై చెయ్యమంటారా?" అన్నాడు నిజాయితీగా. ఆవిడ మొహంలో రంగులు మారాయి. అనుమానంగా చూస్తూ "ఏమిటి నువ్వు ట్రైచేసేది?" అంది.

"అపార్థం చేసుకోకండి. కేవలం భయం పోగొడ్తానంతే."

ఆమె సమాధానం చెప్పలేదు.

ఆవిడవైపు ఆప్యాయంగా చూస్తూ "మొట్టమొదటిసారి మిమ్మల్ని చూడగానే మనిద్దరికీ జన్మజన్మల అనుబంధం వుందనిపించింది" అన్నాడు. ఆ ముసలావిడ భయంతో కెవ్వున అరవబోయింది. "ఆగండి అనుబంధం అనగానే అపార్థం చేసుకోకండి. అది అత్తా అల్లుళ్ళ అనుబంధం అంతే ..... మీ అమ్మాయిని చూడగానే మీ పట్ల నా గుండె పొరల్లో ఎక్కడో చిన్న కదలిక ప్రారంభమై మిమ్మల్ని 'అత్తా' అని పిలవాలనిపించింది."

అవిడకి ఏదో అర్థమైనట్టు అనిపించింది. అతడు నవ్వేడు "మీరీ విషయంలో ఏ అనుమానాలూ పెట్టుకోకుండా నాకు సహాయం చేస్తానంటేనే నేను మీ అమ్మాయి కన్నెరికం పోగొడ్తాను ..... సారీ ..... కన్నెగండం భయం పోగొడ్తాను."

"నీ ఇష్టం నాయినా-- నేనేం చెప్పగలను?" అన్నదావిడ.

* * * * *

కాడిలాడ్ కారు ఆ వీధి చివర్లో ఆగింది. అందులోంచి దిగినవ్యక్తి పక్కనే వున్న ప్లిమత్‌లో ఎక్కాడు.

రాత్రి పన్నెండు దాటింది. రోడ్డు నిర్మానుష్యంగా వుంది.

ప్లిమత్ ఒక భవనం లోపలికి వెళ్ళింది. గూర్ఖాకి లోపల వున్న వ్యక్తి ఎవరో తెలీదు. అతడు దాదాపు ఆరేడు సంవత్సరాల్నుంచీ ఆ ఇంటికి కాపలాదారుగా వున్నాడు. అది ఒక గెస్ట్‌హౌస్‌గా మాత్రమే అతడికి తెలుసు. వారానికి పది రోజులకీ ఒకసారి అక్కడికి అర్థరాత్రి దాటాక రెండు కార్లు వస్తూ వుంటాయి. పది నిమిషాల వ్యవధిలో ఆ రెండు కార్లూ చేరుకుంటాయి. తెల్లవారుఝామున వెళ్ళిపోతాయి. పగటి పూట మనుష్యులు, తోటమాలీ తమ పనులు తాము చేసుకుంటూ పోతూంటారు.

ప్రిస్మా ఏజెన్సీస్ గెస్ట్‌హౌస్ అది. ఆ కంపెనీ తరపు నుంచే వారికి జీతాలు అందజేయబడతాయి. అంతవరకు మాత్రమే పనివాళ్ళకు తెలుసు. గూర్ఖా ఎప్పుడూ కారులోకి తొంగి చూడలేదు. ప్రిస్మా ఏజెన్సీస్ సెక్రటరీ పగటి పూట వస్తూ వుంటాడు. రాత్రిపూట ప్లిమత్ కారు డ్రైవ్ చేస్తూ వుంటాడు.

ఆ ప్లిమత్ కారులోంచి దిగిన వ్యక్తి అరవింద్ చౌరసియా!

మధ్య హాల్లో కామిని కూర్చుని అతడి కోసం ఎదురు చూస్తోంది. అతడిని చూడగానే లేచి దగ్గరికి వచ్చి భుజాల మీదుగా చెయ్యివేసి ముద్దుపెట్టుకుని, ఫ్రిజ్ దగ్గరికి వెళ్ళి రెండు డ్రింక్స్ కలిపి తీసుకువచ్చి ఒక గ్లాసు అతడికిచ్చి ప్రక్కనే సోఫాలో కూర్చుంది.

"ఎంత సేపయింది నువ్వొచ్చి--- " అడిగాడు.

"పది నిముషాలు."

చౌరసియా గ్లాసు పూర్తి చేసి, ఆమెని పొదివి పట్టుకుని బెడ్‌రూమ్‌లోకి తీసుకువెళ్ళాడు.

కామినికి ఇది చాలా ఆశ్చర్యంగా వుంటుందెప్పుడూ.

గత ఆరేడేళ్ళుగా ఆమె అతడిని ఆ ఇంట్లో కలుసుకుంటూ వుంది. ఆమె తన కారు స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ తన ఇంటినుంచి బయటకు వచ్చి ఒక సంకేత స్థలంలో ఆగుతుంది. చౌరసియా సెక్రటరీ అక్కడికి వచ్చి ఆమెని కారు ఎక్కించుకుని, ఈ ఇంటికి తీసుకువస్తాడు. తెల్లవారు ఝామున విడిపోతారు.

ఈ రహస్యం కేవలం నలుగురికే తెలుసు. చౌరసియాకీ, ఆమెకీ, అతని సెక్రటరీకీ, ఆమె భర్తకి!

ఆమె భర్తకి -- ఆమె పదిరోజుల కొకసారి ఎక్కడికో వెళ్తుందని తెలుసుగానీ, ఎవరికోసం వెళుతుందో తెలీదు. అతడంత పట్టించుకోలేదు. కొత్తగా వచ్చిన హోం మినిస్టర్ పదవితో అతడు చాలా సంతోషంగా వున్నాడు.

కామినికి ఆశ్చర్యం కొలిపే విషయం అదికాదు.

ఇన్నేళ్ళుగా ఈ విషయాన్ని చౌరసియా ఇంత రహస్యంగా ఎలా వుంచగలిగాడా? అని.

ఆమె భర్త మినిస్టరు ..... అంతేగాక ఒక నటిగా ఆమెని అందరూ గుర్తుపడతారు. ఏమాత్రం ఈ విషయం పత్రికల వాళ్ళకిగానీ, ఎల్లో మాగ్‌జైన్స్‌కిగానీ తెలిసినా బాంబులా పేలుతుంది. అయినా బయటకి రాలేదు. చౌరసియా ఆ జాగ్రత్తలు తీసుకున్నాడు. కేవలం అతడు మాత్రమే అలాటి పనులు నిర్వహించగలడనేది నిర్వివాదాంశం.

ఒకసారి చిన్న ప్రమాదం జరిగింది.

అర్థరాత్రి పూట ఆమె ప్రిస్మా ఏజెన్సీస్ ఇంటిలోకి ప్రవేశించడం డేవిడ్ అనే వ్యక్తి చూశాడు. డేవిడ్ ఆమె భర్త తాలూకు కారు డ్రైవరు. కామిని షూటింగ్‌ల నిమిత్తమై అర్థరాత్రి ..... తెల్లవారుఝాముల వరకూ స్టూడియోల్లో గడపటం అలవాటే. కాని ఇటువంటి చోట వుండటమేమిటా అన్న ఉత్సుకతతో గూర్ఖాని 'అది ఎవరిల్ల'ని అడిగాడు. అదే సమయానికి ప్రవేశిస్తున్న చౌరసియా ఆ విషయం గమనించాడు. మరుసటి రోజు నుంచీ డేవిడ్ కనపడక పోవడానికి కారణం కేవలం ముగ్గురికే తెలుసు.

అంత జాగ్రత్తగా ఆ రహస్యాన్ని రహస్యంగా వుంచుతూ వచ్చాడు చౌరసియా. ఇటువంటి అద్భుతమైన తెలివితేటలకే కామిని అబ్బురపడి అతడికి దగ్గరైంది.

నైట్ లైట్ వేసి ఆమెకు దగ్గిరయ్యాడు అతడు.

మంచో చెడో - మర్డరో బిజినెస్సో - ప్రొద్దున్నించీ సాయంత్రం వరకూ నిరంతరం పనుల్లో మునిగి తేలుతూ వుంటాడు చౌరసియా. అతడికి ఆమె ఇచ్చే రిలాక్సేషన్ చాలా గొప్పది. చాలా కొద్దిమంది స్త్రీలకే పురుషుడిని "పూర్తిగా ఆనందపరచటం" అనే కళ తెలుస్తుంది. ఆమె లవ్ --- మేకింగ్ మూడు స్థాయిల్లో వుంటుంది. తను తృప్తి చెందటం, తన సంతృప్తిని అతడికి తెలియచెప్పడం ద్వారా మేల్ - ఈగోని తృప్తి పర్చటం, అతడి కిష్టమైన పనులని రోజు రోజుకీ మరింత ప్రతిభావంతంగా నిర్వ ర్తించటం! ఒక శాస్త్రీయ దృక్పథంతో ఇదంతా చేసినా, ఆమె చర్యల్లో ప్రొఫెషనలిజం కనపడదు. ఎప్పటికప్పుడు అతడికి కొత్తగా కనపడుతుంది. అతడితో చాలాసేపు రకరకాలుగా ఆడుకోవటం ఆమెకు ఇష్టం. Warning Up Acts ఆమెకు తెలిసినని బహుశా ఎవరికీ తెలియవేమో. వాళ్ళిద్దరి కలయికలో ఎప్పుడూ చురుకైన భాగం ఆమె తీసుకుంటుంది. ఆమె చేతివేళ్ళు మిషన్‌లాగా కదులుతాయి. ఫోర్-ప్లే జరిగినంతసేపూ ఆమె క్షణకాలం కూడా ఖాళీగా వుండదు. దాదాపు రెండు గంటలపాటు అతడిని ఉక్కిరి బిక్కిరి చేసి తను చెమటతో తడిసిపోతుంది. ఆమెలో అంత ఆర్టూ వుంది కాబట్టే నూటికి నూరుపాళ్ళు మెటీరియలిస్ట్ అయిన చౌరసియా కూడా ఆమెని వదలలేకపోయాడు. ఆమె పట్ల విపరీతమైన ఆకర్షణ, ప్రేమ పెంచుకున్నాడు. ఎక్కడ అయినా, ఎంతమందితో పరిచయాలున్నా కామినికి ఈ "విధమైన" పరిచయాలు మరేవీ లేవని అతడికి తెలుసు. అలాంటివేమైనా వుంటే అతడు ప్రాణాల్తో వదలడని ఆమెకీ తెలుసు. అలాంటి అవసరం ఆమెకు ఇంతవరకూ రాలేదు.

అతడామెని ఆక్రమించుకున్నాడు. అతడి భుజాలమీద ఆమె చేతులు యాంత్రికంగా

పెనవేసుకుని వున్నాయి.

"మొన్న ఎప్పుడో మీ ఆయనతో కలిసి 'బంద్' కోసం వెళ్ళావుటగా"అన్నాడు.

"అవును" అన్నదామె క్లుప్తంగా.

అతడు తన కుడిచేసి వేళ్ళలోకి ఎడమ చేతివేళ్ళు జొనిపి, ఆమె తలచుట్టూ వేసి, కాస్త పైకి అడ్జస్టు అయ్యాడు.

"ఎవరో ఇన్‌స్పెక్టర్ బాగా గొడవ చేశాడుటగా-- "

"అవునట--- "

"ఏమిటి అతని పేరు?"

"ఏదో వుంది సరీగ్గా గుర్తులేదు."

మరో నిమిషం తర్వాత ఆమె పక్కనుంచి అతను లేచాడు. అరగంట తరువాత అతడు కార్లో ఇంటివైపు వెళ్తున్నాడు. రాత్రి రెండు దాటింది.

గత కొన్నాళ్ళుగా కామిని పక్కమీద అన్యమనస్కంగా వుండటం అతడు గమనించాడు. లవ్ - మేకింగ్‌లో స్త్రీకీ, పురుషుడికీ తేడా వుంది. మనసక్కడ లేకపోయినా, పురుషుడు ఉత్సాహంగా పాల్గొనగలడు. స్త్రీ అలా కాదు. ఆమె చేతుల మధ్య వున్న పురుషుడిని మనసారా ఇష్టపడక పోతే, నిర్లిప్తంగా వుండిపోతుంది.

చౌరసియా విషయంలో అదే జరిగింది.

గత కొన్నాళ్ళుగా కామిని ఆ టైమ్‌లో ఏదో ఆలోచనలో వుండటం, నిర్లిప్తంగా వుండటం గమనించాడు. ఆమె మనసు అక్కడ లగ్నమవటం లేదని గ్రహించాడు. కారణం ఏమై వుంటుందా అని ఆలోచించాడు. సాధారణంగా అసూయాపరుడైన అతడి ఆలోచన వెంటనే ఇతర పురుషులవైపు వెళ్ళింది. ముందు -- సినీరంగంలో వుండే హీరోలెవరైనా పరిచయమయ్యారేమో అనుకున్నాడు.

అప్పుడు తెలిసింది ఈ బంద్ సంఘటన!

రెండు రోజులక్రితం ఆమె ఎవరినో ఎంక్వయిరీ చేసి " రాణా - యస్. పురంలో జాయినయ్యాడా" అని కనుక్కుంది. ఆ విషయం కూడా చౌరసియాకి తెలిసింది.

ఇప్పుడు --

చాలా క్యాజువల్‌గా అడుగుతున్నట్టు- "అతని పేరు నీకు తెలుసా?" అని అడిగిన ప్రశ్నకి ఆమె "ఏదో వుంది. సరీగ్గా గుర్తులేదు" అని సమాధానం ఇవ్వటం అతడికి అప్పటివరకూ వున్న అనుమానాన్ని నిజం చేసింది.

తన పక్కన పడుకుని---

తన చుట్టూ చెయ్యివేసి---

తను అనుభవిస్తూ వుండగా ---

ఆ తమకంలో ---

ఆ మత్తులో ---

స్త్రీ - ఇంకో పురుషుడి గురించి ఆలోచిస్తూందని తెలియటంకన్నా అవమానం ఇంకొకటి లేదు. ఏ మొగాడూ అది సహించలేడు.

చౌరసియా లాంటివాడు అసలే సహించలేడు.

7

విశాలమైన ప్రాంగణంలో పవిత్రతకు చిహ్నంగా గుడి.

దూరంగా చిన్న కోనేరు గట్టుమీద గన్నేరు చెట్లు.

అక్కడి వాతావరణం ప్రశాంతంగా వుంది.

"ఇక్కడ ప్రదేశాలన్నీ నీకు బాగా పరిచయం వుండివుండాలే" అన్నాడు రాణా అలక్‌నందాతో.

"గత పది సంవత్సరాల్నుంచీ ప్రొద్దున్నా, సాయంత్రం క్రమం తప్పకుండా వస్తున్నాను" అంది భక్తితో.

"మధ్యాహ్నం పూట కూడా రాకపోయావా?" అన్నాడు కసిగా.

"నిజంగానా?" అంది కళ్ళు పెద్దవి చేసి, ఇద్దరూ గుడిమెట్లు ఎక్కుతున్నారు.

"నీకు తెలుసో తెలీదో- మధ్యాహ్నప్పూట పడుకుని దొర్లితే బోలెడు పుణ్యం వస్తుంది."

"తప్పు గుడిలో అలాంటి కల్మషపు మాటలు మాట్లాడకూడదు. అదిగో ఆ గంట చూశారా? తప్పుచేస్తే ఆ గంటని తలతో కొట్టుకోవాలి" అంది. రాణా ఆమెవైపు చిలిపిగా చూశాడు.

నవ్వుతూ "నీ మనసులోనే ఏదో వుంది. దొర్లటం అనగానే అది కల్మషమేనా? నేను చెప్పేది ప్రదక్షిణం చేయటం గురించి, పక్కమీద దొర్లటం గురించి కాదు" అన్నాడు.

ఇద్దరూ పూజారి ముందు నిల్చున్నారు. దేముడి విగ్రహం నగలతో దేదీప్యమానంగా వెలుగుతోంది. ఆ రోజుల్లోనే పాతిక లక్షలుండేవిట! ఇప్పుడు కనీసం కోటిరూపాయలు ఖరీదు చేస్తాయి.

"ఏమ్మా! బావున్నారా?" అడిగాడు పూజారి.

"పొద్దున్నేగా వచ్చింది. సాయంత్రానికి ఏమవుతుంది?" అనుకున్నాడు రాణా మనసులో. పూజారి హారతి ఇచ్చాడు. పళ్ళెంలో దక్షిణ వేస్తూ "స్వామీ. మీరు పురాణాలన్నీ చదివారనుకుంటాను" అన్నాడు రాణా ఆయనవైపు భక్తిగా చూస్తూ.

"చదివాను నాయనా!"

"వాత్స్యాయన పురాణం చదివారా?"

"వాత్స్యాయన పురాణమా- శివ శివా- ఆ పేరే వినలేదే!"

"మీరు చదవకపోతే చదవలేదని చెప్పండి. అంతేకాని అసలటువంటి పురాణమే లేదని దబాయించకండి. అందులో కన్నెరికం పోవటం గురించి వ్రాశారు గుర్తుందా?"

"పురాణాల్లో కన్నెరికం గురించా? ..... శంకరా ..... " అంటూ విగ్రహంవైపు తిరిగాడు.

అలక్‌నంద ఇద్దరి వైపు విచిత్రంగా చూస్తోంది.

"స్వామీ. ఈ అమ్మాయికి కన్నెరిక గండం వుందని జ్యోతిష్కుడు పదేళ్ళక్రితం చెప్పాడుట. కన్నెరికం పోయిన మరుక్షణం చచ్చిపోతుందని అన్నాడుట. కొందరమ్మాయిలకి ఆ గండం వున్నమాట నిజమేకాని! వాత్స్యాయన పురాణంలో దీనికి కొన్ని మినహాయింపులు ఇచ్చారు. జఘనంమీద పుట్టుమచ్చ ..... ఆగండి! 'హా- శంకరా' అంటూ మళ్ళీ అటెళ్ళకండి. స్త్రీకి జఘన స్థానంలో పుట్టుమచ్చ వుంటే ఈ రూలు వర్తించదని వాత్స్యాయనుడు చెప్పాడు. అవునా?"

"జఘన స్థానంలో పుట్టుమచ్చా?"

"అవును స్వామీ!"

"జఘన స్థానంలో ..... "

"అబ్బా ..... పవిత్రమైన గర్భగుడిలో నిలబడి ఆ మాటని మాటిమాటికీ ఉచ్ఛరిస్తావెందుకు స్వామీ?" అంటూ కన్నుకొట్టాడు. పూజారి అయోమయంగా చూశాడు. రాణా మొహం విషాదంగా పెట్టి మరొకసారి కన్నుకొట్టి "స్వామీ! మీరూ ఒకప్పుడు వయసులో వుండి ఈ బాధలన్నీ అనుభవించిన వారే నన్నర్థం చేసుకోండి" అన్నాడు దీనంగా..

"ఎక్కడో చదివినట్టే గుర్తు నాయనా!"

"చాలు స్వామి చాలు. దేముడికి కాదు- మీకు చేయిస్తాను నిత్య కళ్యాణ పూజ ..... " అంటూ అలక్‌నంద వైపు తిరిగి "చూశావుకదా, వెళ్ళు 'నా జఘనం మీద పుట్టుమచ్చ వుండేలా చెయ్యి స్వామీ' అంటూ గుడిచుట్టూ మూడు ప్రదక్షిణలు చేసిరా" అని తొందరపెట్టాడు.

ఆమె అర్థంకానట్టు మొహంపెట్టి "జఘనమంటే ..... " అంది.

"అబ్బా అది నేను ప్రైవేటుగా వున్నప్పుడు చెపుతానులే. ముందు అర్జెంటుగా వెళ్ళిరా" అని పంపాడు.

ఆమె వెళ్ళిపోయాక "ఏమిటి నాయినా ఇదంతా?" అని అడిగాడు పూజారి.

"తప్పదు స్వామి. ఈమె అమాయకత్వానికి తన మూర్కత్వం జోడించాడు ఎవడో జ్యోతిష్కుడు దాన్ని తొలగించే ప్రయత్నం ..... దానికేంగాని మీరేమీ అనుకోనంటే నాదొక ప్రశ్న. ఇన్ని లక్షల రూపాయల నగలు స్వామివారికి అలంకరించారు కదా. దొంగల భయం లేదా?"

"దీని తాళం ఒకటి నా దగ్గర. మరొకటి దేవాలయపు ట్రస్టీదగ్గర వుంటాయి రాత్రింబవళ్ళు నలుగురు గార్డులు కాపలా కాస్తూ వుంటారు. ఇక భయమెందుకు?"

ఒక రౌండు అలక్‌నంద తిరిగొచ్చింది. రెండో ప్రదక్షిణకు వెళ్ళింది.

"సంవత్సరం క్రితం మీ కొడుకుతో సహా నలుగురు గార్డులు హత్య చేయబడ్డారు కదా."

పూజారి మొహం వాడిపోయింది. ఒక విషాద వీచిక తొంగిచూసింది. "అవున్నాయినా.

స్టూవర్ట్‌పురానికి చెందిన రామస్వామి అనే దుర్మార్గుడు ఆ అయిదుగురినీ పొట్టన పెట్టుకున్నాడు."

" ..... కాదు" అప్రయత్నంగా అరిచాడు రాణా. అతడి అర్పు దేవాలయమంతా ప్రతిధ్వనించింది. అతడి మొహం ఎర్రబడింది. కాని అంతలోనే తమాయించుకున్నాడు.

"క్షమించండి ఆవేశంలో ఏదో అన్నాను. అసలు జరిగిన దేమిటి?"

"ఒక అర్థరాత్రి ఆ దొంగ మా ఇంట్లో ప్రవేశించి నా కొడుకును చంపి, తాళాలు సంగ్రహించి దొంగతనం చేయబోయాడు. అడ్డొచ్చిన నలుగురు గార్డులనీ చంపాడు. రెండో జత తాళాలు దొరక్క అతడి ప్రయత్నం ఫలించలేదు."

అలక్‌నంద రెండో ప్రదక్షిణ పూర్తిచేసింది.

"ప్రభుత్వం తిరిగి నలుగురు గార్డులనీ నియమించింది. కానీ పోయిన నా కొడుకు తిరిగి రాడు బాబూ. రాక్షసుడయిన ఆ రామస్వామి ఇంత మందిని చంపి ఏం బావుకున్నాడు?"

రాణా పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"దేముడి నగలు దొంగతన చెయ్యాలనుకున్నవాళ్ళు సర్వనాశనం అయిపోతారు. వాళ్ళ జీవితాలే కాదు, కుటుంబం మొత్తం మట్టికొట్టుకుపోతుంది. నామ రూపాల్లేకుండా పోతుంది."

అలక్‌నంద మూడో ప్రదక్షిణ ముగించుకుని వచ్చి "వెళ్దామాండీ" అంది.

"పద" అని పూజారికి చెప్పి బయలుదేరారు.

"ఎందుకు మీరలా వున్నారు?" అని అడిగింది.

"ఏం లేదు బాగానే వున్నానే."

"ఏమో. మీరు నవ్వుతేనే బావుంటారు."

అతడు తిరిగి మామూలు మూడ్‌లోకి వచ్చాడు. నవ్వి "కాంప్లిమెంట్‌కి థాంక్స్" అన్నాడు. ఇంకా నాలుగు మెట్లున్నాయి దిగటానికి. అప్పుడతని కాలు జారింది. ఎక్సర్‌సైజులు చేసి కండీషన్‌లో వుంచుకున్న శరీరం కాబట్టి పెద్దగా బెదర్లేదు అతడు. ఆమె మాత్రం కంగారుపడింది.

"ఏమైందండీ?"

"ఏం లేదు కాలు జారిందంతే?"

"ఇప్పుడే వస్తాను" అని ఆమె పైకి పరుగెత్తుకు వెళ్ళింది. అయిదు క్షణాల తరువాత వచ్చింది.

"ఏం చేసి వచ్చావు?"

"గుళ్ళో అలాటి మాటలు మాట్లాడినందుకు దేముడికి కోపం వచ్చిందేమో అని గంట కొట్టి వచ్చాను."

అతడు అప్రతిభుడై ఆమె వైపు చూశాడు. ఆమె నుదురు నల్లగా కమిలి వుంది.

అది మూర్ఖత్వమే అయివుండవచ్చు. కానీ ఏ లాజిక్కూ ఏ అనాలిసిస్సూ ఇవ్వని తృప్తి ..... మనసు నిండా మందాకినిలా.

దక్షిణం వైపు నుంచి వీచే గాలి కోనేరుని పరామర్శించి గర్భగుడిలో గంటను స్పృశించి హారతి పళ్ళెంమీద నుంచి ఆశీర్వాదాన్ని తెచ్చినట్టుగా.

అతడు ఆప్యాయంగా ఆమె చెయ్యి పట్టుకుని "ఇంటికి వెళ్దాంపద" అన్నాడు.

*          *          *          *          *

ఆ మరుసటిరోజు అతడు కర్రాని పిల్చి "నాకా దేవాలయం గార్డుల మర్డర్ ఫైలు కావాలి" అని అడిగాడు.

"అదెప్పుడో మూసేసాం కదా సర్."

"మూసేసిన ఫైలే కావాలనేది" కటువుగా అన్నాడు. పది నిమిషాల్లో ఫైలు అతని బల్లమీద కొచ్చింది.

అతను చదవటం ప్రారంభించాడు.

చాలా దారుణంగా జరిగాయి మర్డర్లు. నలుగురు గార్డులు, పూజారి కొడుకు మొత్తం అయిదుగుర్నీ నిర్ధాక్షిణ్యంగా చంపేరు. అతడు క్షుణ్ణంగా ఫైలు చదివాడు. సుధాకర్ అతడివైపే చూస్తున్నాడు.

"ఊఁ" బలంగా విశ్వసించాడు రాణా. "అయిదుగుర్నీ రామస్వామి ఒక్కడే చంపేడా?"

"అవును సర్."

"నువ్వు సర్వీస్‌లో చేరి ఎన్నాళ్ళయింది సుధాకర్?"

"పదిహేను సంవత్సరాలైంది."

"నేను చేరి పదిహేను నెలలైంది. కానీ తార్కికంగా ఆలోచించటానికి ఇన్‌స్పెక్టర్ ఉద్యోగమే అవసరం లేదనుకుంటాను సుధాకర్."

"మీరు దేని గురించి మాట్లాడుతున్నారో నాకు అర్థం కావటంలేదు."

"యాభై ఏళ్ళ రామస్వామి అయిదుగురు వ్యక్తుల్ని, అందులో నలుగురు గార్డుల్ని చంపేడంటే నమ్మేవా సుధాకర్?"

"చంపినట్టు వాడే వప్పుకున్నాడు సర్."

"వప్పుకున్నాడా - వప్పించావా?"

కర్రా మొహం వాడిపోయింది. చాలాసేపు మౌనంగా వుండి "పై నుంచి ఇన్‌స్ట్రక్షన్స్ సర్" అన్నాడు గొణుగుతున్నట్టు. రాణా అతడి దగ్గరగా వెళ్ళి భుజంమీద చెయ్యివేసి "ఎవరి ఇన్‌స్ట్రక్షన్స్ సుధాకర్" అన్నాడు నెమ్మదిగా.

"ఎమ్మెల్యే నాయుడు, అరవింద్ చౌరసియా ..... "

రాణా వెళ్ళి తన సీట్లో కూర్చుని సిగరెట్ వెలిగించి, తిరిగి ఫైలు తెరిచాడు. ఒక

పేరాగ్రాఫు దగ్గర అతడి దృష్టి ఆగిపోయింది. మళ్ళీ చదివాడు.

"ఈ సంఘటనకి సాక్షి- ఎన్.టి. కంటి ..... ఎవరీ ఎన్.టి. కంటి?"

"ఆ అమ్మాయి ఈ వూరి యం.పి. పులిరాజు కూతురు సర్."

"పులిరాజు కూతురిపేరు 'కంటి' ..... చాలా గమ్మత్తుగా వుందే."

"అసలు పేరు నెమలికంటి త్రిపుర. చిన్నది చేసి, యన్.టి. కంటి అని పెట్టుకుంది. చాలా ఫాస్ట్ గర్ల్ సర్."

"నెమలికంటి త్రిపుర ..... ఎక్కడో విన్నట్టుంది ఈ పేరు" సాలోచనగా అన్నాడు రాణా.

* * * * *

ఎన్టీ ఎన్టి!

అయిదడుగుల మూడు అంగుళాలు ఎత్తు. బాబ్డ్ హెయిర్. జీన్స్ పాంటు. "స్వర్గం ఇక్కడే వుంది" అని వ్రాసి వున్న బనీను.

మూర్తీభవించిన చైతన్యపు ముద్దలా వున్న ఆ అమ్మాయి గంటకి నూరు కిలోమీటర్ల వేగంతో కారు డ్రైవ్ చేస్తూంది. రోడ్డుమీద ఒక అరటిపళ్ళ బండి ఇట్నుంచి వెళ్తోంది. ఒక రిక్షా అట్నుంచి వస్తోంది.

రెండింటి మధ్యనుంచి వెళ్ళగలనా అనుకుంది. ఆ అమ్మాయికి అటువంటి థ్రిల్ చాలా ఇష్టం.

స్పీడ్ ఏమీ తగ్గించకుండా రెండిటి మధ్యనుంచి దూసుకుపోయింది. అయితే ఆ టెన్షన్‌లో మరో పక్క నుంచి వస్తున్నామెని చూసుకోలేదు. ఆమె చేతిలో పూలసజ్జ గాలిలోకి ఎగిరిపడింది. ఆమె రోడ్డు పక్కకి పడిపోయింది.

'కంటి' ఉరఫ్ త్రిపుర కారు పక్కకి తీసి ఆపుచేసింది. కానిస్టేబుల్ పరుగెత్తుకుంటూ వచ్చి కిందపడిన అమ్మాయిని లేపి త్రిపుర దగ్గరికి వచ్చాడు.

క్రిందపడిన అమ్మాయి అలక్ నంద.

రాణా ఆ దృశ్యాన్ని దూరంనుంచి చూశాడు. ముందక్కడ ఏం గొడవ జరుగుతూందో అతడికి అర్థంకాలేదు. అలక్‌నంద బెదురు చూపులతో నిలబడి వుండటం ముందు కనపడింది. పోలీసు బ్రహ్మానంద బాలకిషన్ ఒకమ్మాయితో గొడవపడుతూ దూరంగా కారు దగ్గర వున్నాడు.

అంతలో ఆ అమ్మాయి బాలకిషన్‌ని చెంప అదిరేలా కొట్టింది.

రాణా నుదురు చిట్లించాడు. బాలకిషన్ లంచగొండి అని తెలుసుగానీ, స్త్రీలపట్ల అమర్యాదగా ప్రవర్తించడు. పోలీస్‌స్టేషన్‌లో ఆడఖైదీల పట్లకూడా గౌరవంగానే వుంటాడు. అటువంటి వాడిని ఆ అమ్మాయి ఎందుకు కొట్టిందో అర్థంకాలేదు. అందులోనూ అతడు డ్రెస్‌లో వున్నాడు. డ్రెస్‌లో వున్నవాడి మీద చెయ్యి చేసుకోవడం చట్టరీత్యా పెద్ద నేరం.

రాణా మోటార్ సైకిల్ ఆపుచేసి వాళ్ళ దగ్గిరగా వెళ్ళాడు. బాలకిషన్ బిక్కమొహం వేసుకుని నిలబడి వున్నాడు. ఆ అమ్మాయి మొహం ఇన్‌స్పెక్టర్‌ని చూడగానే విప్పారింది.

రాణా "డ్యూటీలో వున్న పోలీస్‌ని కొట్టడం నేరం మేడమ్" అన్నాడు. ఆమె ఆ విషయం పట్టించుకోకుండా, "సర్‌ప్రైజింగ్, నువ్విక్కడా" అంది. తనని అంత చనువుగా ఏకవచనంతో సంబోధిస్తున్న ఆ ఇరవయ్యేళ్ళ జీన్స్ అమ్మాయి ఎవరా అని అతడో క్షణం విస్తుబోయి, "నువ్వెవరు?" అన్నాడు ఏకవచనంతోనే.

"కాలేజీలో నేన్నీకు జూనియర్‌ని. పాటల ఫంక్షన్‌లో నీ దగ్గర ఆటోగ్రాఫు కూడా తీసుకున్నాను. అండ్ యూ నో ..... ఐయామ్ in love with you since then. ఒక సైడ్ లవ్ అన్నమాట. వెల్లకిలా పడుకుంటే సీలింగ్ ఫాను. బోర్లా పడుకుంటే నీ ఫీలింగు పొడుగ్గానూ" అంది నవ్వుతూ.

అలక్‌నంద బిత్తరపోయి చూస్తోంది. రాణా కూడా విస్తుపోయాడు. కొంతమంది అమ్మాయిలు ఫాస్ట్‌గా వుంటారని తెలుసుగానీ, మరీ ఇంత అని తెలీదు.

'ఒక సైడ్ లవ్ అన్నమాట' అని ఆ అమ్మాయి అంటూంటే నవ్వొచ్చింది. ఈ టీనేజర్స్ ప్రతిదానికీ లవ్ అనే పేరు పెడతారు. కాలేజీలో చదివే రోజుల్లో తను హీరోయే! చదువులో సున్నా అయినా, ఫుట్‌బాల్‌లోనూ, పాటల్లోనూ మొదట వుండేవాడు. చాలామంది ఆటోగ్రాఫులు తీసుకునేవారు. ఆ వయసులో వుండే థ్రిల్ అది. తనది ఇన్‌ఫాక్చుయేషన్ అనుకోకపోవడమే ఇన్‌ఫాక్చుయేషన్. ఈ అమ్మాయి ప్రేమ అటువంటిది అయివుండవచ్చు.

ఇంకొకటి కూడా వుంది. జీవితంలో ఏదో సంఘటనో --- పరిచయమో జరుగుతుంది. ఆ తరువాత మళ్ళీ వాళ్ళు కలవరు. కానీ కాలం గడిచేకొద్దీ ఆ మామూలు సంఘటన (లేక) ఆ వ్యక్తి తాలూకు జ్ఞాపకం ఎంతో మధురిమని సంతరించుకుంటుంది. ఎప్పుడో పెళ్ళిచూపుల్లో చూసిన వ్యక్తిని (సాధారణంగా మొదటి పెళ్ళిచూపుల సందర్భంలో) జీవితాంతం ఉత్తమంగా వూహించుకుంటూ మధురంగా వుంటుంది. తన ఎదురుగా నిలబడిన అమ్మాయిని ఆ రకపు వ్యక్తిగానే భావించి, రాణా ఆ అమ్మాయికి అంత ప్రాముఖ్యత ఇవ్వలేదు.

"నీ పేరు?" అని అడిగాడు.

"కంటి ..... ఎన్. టి. కంటి ..... పూర్తి పేరు నెమలికంటి త్రిపుర."

అతడు స్థాణువయ్యాడు. ఇంత తొందరగా ఈ అమ్మాయి కనపడుతుందనుకోలేదు. తన ఉద్వేగాన్ని అణుచుకుని "మా పోలీస్‌ని ఎందుకు కొట్టావు?" అని అడిగాడు.

"గీరగా మాట్లాడాడు."

"ఏం మాట్లాడాడు?"

"డ్రైవింగ్ లైసెన్స్ చూపించమన్నాడు."

"అది గీరగా మాట్లాడటమా?"

..... ..... .....

"నువ్వొకసారి పోలీస్‌స్టేషన్‌కి రావలసి వుంటుంది."

"ప్లెజర్, వెంటనే వెళ్దామా?"

అతడు ఆశ్చర్యాన్ని అణుచుకుని, "డ్యూటీలో పోలీస్‌ని కొట్టినందుకు నేను నిన్ను అరెస్ట్ చేస్తున్నాను" అన్నాడు.

"పోలీస్‌స్టేషన్‌లో 'టీ' ఇస్తారుగా?"

అతడామెవైపు కన్నార్పకుండా ఒక క్షణం చూశాడు. ఇదంతా అమాయకత్వపు నటనా? మితిమీరిన ఫాస్ట్‌నెస్సా? లేకపోతే డబ్బువల్ల వచ్చిన పొగరా?

అతడా అమ్మాయిని తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్‌లో కూర్చోపెట్టాడు. లాకప్ సెల్ చూపిస్తూ, "నేను అందులో కూర్చోవాలా? ఇలా నీ ఎదురుగా కూర్చోవాలా?" అని అడిగింది. అతడికేం సమాధానం చెప్పాలో తోచలేదు.

"అలా కూర్చుని నేనడిగే ప్రశ్నలకి సమాధానం చెప్పు."

"అరెస్టు అంటే చేతికి సంకెళ్ళు వేస్తారే, మరి నాకు వెయ్యలేదేం?"

"అన్ని అరెస్టులకీ వెయ్యరు. నేరస్తుడు పారిపోతాడని భయం వుంటే వేస్తారు."

"అంటే మేం చూసిన సినిమాలన్నీ తప్పంటావా?"

అతడు విసుక్కుంటున్నట్టు "నేన్నిన్ను ఇక్కడకు తీసుకొచ్చింది -- నేనడిగిన ప్రశ్నలకి నువ్వు సమాధానం చెప్పడానికి. అంతేకానీ, నువ్వు అడిగిన ప్రశ్నలకి నేను సమాధానం చెప్పడానికి కాదు" అన్నాడు.

"నాకు అన్నీ రివర్స్‌లు ఇష్టం" కాలుమీద కాలు వేసుకుంటూ చెప్పింది.

"నువ్వు ఒక కేసులో సాక్ష్యం చెప్పావు గుర్తుందా?"

"అవును. అదే ఫస్ట్ అండ్ లాస్ట్ టైం నేను కోర్టుకి వెళ్ళడం."

"గుడి గార్డుల హత్య విషయంలో?"

"అవును. గుర్తుంది."

"ఆ రోజు ఏం జరిగింది?"

"రామస్వామి అనే దొంగ, హత్యచేసి నా కారు క్రింద వచ్చి పడ్డాడు."

" ఆ టైమ్‌లో నువ్వు అక్కడ ఎందుకున్నావు?"

"కాలేజీ చదువు పూర్తయింది. సామానంతా సర్దుకుని ఈ వూరొస్తున్నాను. బాగా వర్షంగా వుంది. రోడ్డుకడ్డంగా వచ్చి కారును ఢీకొన్నాడు. నేను సడన్ బ్రేక్ వేశాను కాబట్టి సరిపోయింది. లేకపోతే అక్కడే హరీ అనేవాడు."

"అతడే హంతకుడు అని ఎలా చెప్పగలవు?"

"కోర్టు శిక్ష వేసిందిగా-"

"అతడు హంతకుడు అని కోర్టు శిక్ష వేసింది. అంతేకానీ నువ్వన్నట్టు కోర్టు శిక్ష వేసింది కాబట్టి అతడు హంతకుడు అవలేదు."

"ఏమో బాబూ- ఆ లాజిక్‌లన్నీ నాకు తెలీదు"

"నువ్వు కార్లో వూరివైపు వస్తూంటే రామస్వామి కారుక్రింద పడ్డాడన్నావు. అంటే అతడు

రోడ్ క్రాస్ చేస్తూ పడ్డాడా?"

"అవును."

"నీ కారు లైట్లు అతను చూడటం కానీ, అతనిని నువ్వు చూడటం కానీ జరగలేదా?"

"అకస్మాత్తుగా రోడ్డుమీదికి వచ్చేశాడు. పక్క తోపుల్లోంచి రావటంతో నేనా చీకట్లో చూసుకోలేదు."

"కుడివైపు నుంచి వచ్చాడా? ఎడమవైపు నుంచి వచ్చాడా?"

ఆమె ఒక క్షణం ఆలోచించి, "కారుకి కుడివైపు నుంచి వచ్చాడు. ఎడమవైపు తోపుల్లోకి పరుగెత్తాలని అతడి ప్రయత్నం. అందుకే నేను బ్రేక్ వేసినా లాభం లేకపోయింది."

"అంత చీకట్లో అర్థరాత్రి ..... ఒకపక్క తోపుల్లోంచి, మరో పక్క తోపుల్లోకి పరుగెత్తవలసిన అవసరం మనిషికి ఎందుకు వుంటుంది?"

"బహుశ హత్యచేసిన కంగారులో పరుగెత్తి వుంటాడు."

"అక్కడనుమ్చి గుడి ఎంతదూరం?"

"కిలోమీటరు పైగా వుంటుంది."

"ఎంత హత్యచేసినా ..... హత్యచేయడం అతడికి మొదటిసారే అయినా, ఏ హంతకుడూ కిలోమీటరు దూరం తోపుల్లో పరుగెత్తడు. రోడ్డుకడ్డంగా అసలురాడు- అందులోనూ రోడ్డుమీద లైట్లకాంతితో కారు వస్తూ వుండగా."

"నేనంత దూరం ఆలోచించలేదు."

"అందులో తప్పులేదు. ఆక్సిడెంట్ జరగ్గానే సాధారణంగా ఇంకేమీ ఆలోచించలేం మనం."

"థాంక్స్. కరెక్ట్‌గా వూహించావు. గాడ్ ..... ఇక్కడ ఎ.సి. లేదా వేడెక్కిపోతోంది."

అతడామె మాటలు పట్టించుకోలేదు. "రాత్రికి రాత్రే నువ్వెళ్ళి పోలీస్‌స్టేషన్‌లో రిపోర్ట్ ఇచ్చావా?"

"స్వయంగా వెళ్ళలేదు. ఫోన్‌చేసి చెప్పాను."

"ఆక్సిడెంట్ జరగ్గానే సాధారణంగా దాన్ని ఎంత తొందరగా మర్చిపోదామా అని ఆలోచిస్తారే తప్ప- పోలిసులకి ఫోన్ చెయ్యరే."

ఆ పోలీస్‌స్టేషన్‌లో ఒక్కసారిగా నిశ్శబ్దం వ్యాపించింది.

యస్సై కర్రా, మిగతా కానిస్టేబుల్స్ అంతా ప్రేక్షకుల్లా చూస్తున్నారు. కారు స్పీడుగా నడిపిన నేరానికి తీసుకొచ్చి, ఇంకో కేసులో ప్రశ్నలడుగుతూ- ఈ పాయింటు దగ్గరికి లాక్కొచ్చిన రాణా వాళ్ళకి అర్థంకాని వ్యక్తిగా మిగిలిపోతున్నాడు.

"చెప్పు మిస్ త్రిపురా- నా ప్రశ్నలో తప్పేమైనా వుందా? ఆక్సిడెంట్‌లో ఎవరూ మరణించలేదు గాయాలుకూడా తగల్లేదు. అయినా నువ్వెందుకు పనిగట్టుకు ఫోన్ చేశావ్?"

"నాకు ఫోన్ వచ్చింది. ఫోన్‌లో ఎవరో - ఈ విషయం ఎక్కడా చెప్పొద్దన్నారు. నా కసలే తలతిక్క అందుకే వెంటనే పోలీస్‌స్టేషన్‌కి ఫోన్‌చేసి చెప్పాను."

యస్సై కర్రా ఉత్సుకతతో చూస్తున్నాడు.

"ఈ ఫోన్ సంగతి కోర్టులో చెప్పావా?"

"చెప్పలేదు."

"ఎందుకు చెప్పలేదు?"

"ఎవరూ అడగలే" సింపుల్‌గా చెప్పింది.

రాణా కర్రావైపు చూశాడు. కర్రా మొహం అయోమయంగా, బ్లాంక్‌గా వుంది.

"ఫోన్‌లో నిన్నేమని హెచ్చరించాడు?"

" ..... మర్డర్ చేసి పారిపోతూ నీ కారుకి అడ్డొచ్చిన విషయం ఎక్కడ చెప్పినా ప్రాణాలు దక్కవన్నాడు."

"నువ్వేమన్నావ్?"

" ..... 'ఆ విషయం అక్కడే మర్చిపోయాను. కానీ ఇప్పుడు నువ్వు చెప్పొద్దన్నావ్ కాబట్టి తప్పక పోలీసులకి చెపుతాను' -- అన్నాను."

"నీ కారుక్రింద పడ్డ వ్యక్తి అప్పుడే మర్డర్ చేసి పారిపోతూ వున్నాడన్న సంగతి నీకెప్పుడు తెలిసింది?"

"అతనే ఫోన్‌లో చెప్పాడుగా."

"ఎవడయినా తనకు తనే - 'నేనే హంతకుడిని- నీ కారుక్రింద పడ్డాను. ఈ విషయం ఎక్కడా చెప్పకు' అని అంటాడా?"

"ఏమో. ఈ విషయాలన్నీ నేను ఆలోచించలేదు. కోర్టులో నన్నెవరూ అడగలేదు."

రాణా మొహంలోకి ఒక్కసారిగా రక్తం తన్నుకు వచ్చింది. విసురుగా కుర్చీ వెనక్కి తోసి లేచి నిలబడ్డాడు. "అడగరు. ఎందుకడుగుతారు? ముద్దాయి రామస్వామి తన తరఫున లాయర్ని పెట్టుకోలేనంత బీదవాడు. కోర్టు నియమించిన డిఫెన్సు లాయర్, ఎమ్మెల్యే నాయుడి బావమరిది. ఇంకెవరు అడుగుతారు?" అని అరిచాడు. ఎవరూ మాట్లాడలేదు.

అతడు తనలో తనే అనుకుంటున్నట్టు అన్నాడు "ఎంత సింపుల్‌గా జరిగిపోతాయి విషయాలు. ఒక మర్డర్ జరిగింది దానికి కొంతదూరంలో ఒకరు కారుక్రింద పడ్డారు. అతడు ఒకప్పుడు దొంగ. అంతే ..... రెండూ రెండూ కలిపితే నాలుగు. అతడు గుళ్ళో దొంగతనానికి ప్రయత్నించి, అడ్డొచ్చిన గార్డుని చంపి పారిపోతూ ఒక ప్రత్యక్ష సాక్షి కారుక్రింద పడ్డాడు కాబట్టి అతడే హంతకుడు కాదని వాదించడానికి డిఫెన్సు లాయరు లేడు. ప్రత్యక్షసాక్షిని ప్రశ్నించిన వాడు లేడు. ముద్దాయి ఏడుపు విన్నవాడు లేడు. హా పరమాత్మ ..... రక్షించు నా

పోలీస్‌స్టేషన్‌ని ..... ”

ఆ గదిలో శ్మశాన నిశ్శబ్దం నిశ్శబ్దపు వైరాగ్యం.

“సారీ! నేను కేసు సరీగ్గా ఇన్వెస్టిగేట్ చెయ్యలేదు. బెనిఫిట్ ఆఫ్ డవుట్ కూడా లేదు.”

రాణా పేలవగా నవ్వేడు. “సా ..... రీ ..... రెండక్షరాలు. ప్రాణం ..... అదీ రెండక్షరాలే.”

అంతలో బయట కార్లు ఆగిన చప్పుడైంది. వరుసగా మూడుకార్లు వచ్చాయి. మొదటి కార్లోంచి ముగ్గురు వ్యక్తులు, మధ్య కారులోంచి ఒక వ్యక్తి దిగాడు. నియో-రిచ్‌కి ప్రతీకగా వున్నాడు. జోథ్‌పూర్ కోటు, తెల్లపాంటు, నిగనిగలాడే బూటు, పైకి దువ్విన జుట్టు, బంగారు రంగు కళ్ళజోడు.

అతడు ముందు నడుస్తూ వుండగా, మిగిలిన ముగ్గురూ వెనుకగా వచ్చారు.

“హాయ్ డాడ్” అంది కంటీ కుర్చీలోంచి లేస్తూ. పులిరాజు కూతురివైపు చూడలేదు రాణా వైపు తీక్షణంగా చూస్తూ. “ఎంత ధైర్యం నీకు. నా కూతురుని పోలీస్‌స్టేషన్‌కి తీసుకొస్తావా” అన్నాడు.

రాజు దాన్ని వినిపించుకోలేదు. బ్లాంక్‌గా రాణావైపు చూసి, “నీకు నిముషం టైమ్ ఇస్తున్నాను. మా అమ్మాయి చేతులు పట్టుకుని క్షమాపణ వేడుకో?” అన్నాడు.

“ ..... లేకపోతే నిన్నిక్కడే సస్పెండ్ చేయిస్తాను.”

బైట జీప్ ఆగిన శబ్దం వినిపించింది. డియస్పీ వగరుస్తూ వచ్చాడు.

“తెచ్చావా?” అన్నాడు రాజు. డియస్పీ భయపడుతూ నమ్రతగా తెచ్చానుసార్” అంటూ కాగితం, ఫైలులోంచి తీసి అందించాడు.

రాజు కాగితం అందుకుని, రాణా వైపు తిరిగి, “ఏమిటి అలా చూస్తున్నావు? నీ సస్పెన్షన్ ఆర్డర్” అన్నాడు.

డబ్బుతో మదమెక్కి, పదవితో పొగరెక్కిన ఆ ప్రజా నాయకుని వైపు రాణా నిర్లిప్తంగా చూశాడు. తన కూతుర్ని ఒక ఇన్‌స్పెక్టర్ పోలీస్ స్టేషన్‌కి తీసుకొచ్చాడని తెలియగానే, పై అధికారికి ఫోన్ చేసి క్షణాల్లో తన సస్పెన్షన్ ఆర్డర్ తయారు చేయించగల్గిన ఆ రాజకీయ నాయకుడి వైపు భయంగా చూడాలో, గౌరవంగా చూడాలో, అసహ్యంగా చూడాలో తెలియని స్థితి!

“మీ అమ్మాయి ఆక్సిడెంట్ చేసి, పైగా ఒక పోలీస్‌ని కొట్టింది సార్. ముగ్గురం సాక్ష్యం వున్నాం దానికి” అన్నాడు.

“ఎవరా ముగ్గురు?”

“నేనూ, అలక్‌నంద, కానిస్టేబుల్.”

“కొట్టలేదని మా అమ్మాయి అంటే?”

“అయినా కూడా 1:3 యే కదా!”

“ఓహో నిష్పత్తులు మాట్లాడుతున్నావా?” అని కానిస్టేబుల్ వైపు-

“ఏరా! తిరిగి-అమ్మాయి నిన్ను కొట్టిందా” అన్నాడు.

అతడు తడబడుతూ “కా ..... కాద్సార్” అన్నాడు.

“సో ..... 2:2 నిష్పత్తి సరిపోయింది. కేసు లేదు. ఇప్పుడు చెప్పు, క్షమాపణ చెప్పుకుంటావా? ఉద్యోగం వదిలిపెట్టి పోతావా?”

రాణా షాక్‌నించి ఇంకా తేరుకోలేదు.

“మహిళా పోలీసు పక్కన లేకుండా ఒక ఆడపిల్లని పోలీస్‌స్టేషన్‌కి తీసుకొచ్చినందుకు నిన్ను సస్పెండ్ చేస్తున్నారు” అని డియస్పీ వైపు తిరిగి “అంతేకదా డియస్పీ” అన్నాడు.

డియస్పీ గుటకమింగి, ‘అంతే’ అన్నట్టు తలూపాడు.

“ఇంకా పది సెకన్‌లు టైముంది.”

ఆ గదిలో సూదిపడితే వినపడేటంత నిశ్శబ్దం. త్రిపురకూడా తన అల్లరి మర్చిపోయి చూస్తోంది.

“ఇంకా అయిదు సెకన్లు.”

రాణా చిన్నగా దగ్గి “ఒక ఆడపిల్లకి క్షమాపణ చెప్పుకోలేను సార్! మీరు వప్పుకుంటే, మిమ్మల్ని క్షమాపణ వేడుకుంటాను” అన్నాడు.

“కుదర్దు.”

“ఇంతమందిలో కాకుండా, అటొస్తే మీ చేతులు కాదు. కాళ్ళు పట్టుకుని క్షమాపణ వేడుకుంటాను.”

పులిరాజు అందరివైపు చూసి గర్వంగా నవ్వి, “పద” అన్నాడు.

ఇద్దరూ హాలు వెనుక వైపున్న గదిలోకి వెళ్ళారు. అతడి చేతిలో సస్పెన్షన్ ఆర్డర్ గాలికి కదుల్తోంది.

“మీకో ఆధునిక సూత్రం తెలుసా సార్!”

పులిరాజు మొహం చిట్లించి “ఏమిటిది?” అని అడిగాడు.

“రేపు తప్పనిసరి అయినప్పుడు నవ్వుతూ వప్పుకోవాల్ట” అని వూహించని వేగంతో లాగిపెట్టి అతని చెంపమీద బలంగా కొట్టాడు. ఆ చప్పుడికి గదిగోడలు ప్రతిధ్వనించాయి. రాజు ఇంకా ఆ దెబ్బ తాలూకు దిగ్భ్రమనుంచి తేరుకోకముందే ..... “కొట్టావనడానికి నువ్వు సాక్ష్యం. కొట్టలేదనటానికి నేను సాక్ష్యం 1 : 1 నిష్పత్తి సరిపోయింది. కేసు లేదు” అని ఆర్డర్ మడిచి జేబులో పెట్టుకుని అక్కడినుంచి ముందు గదిలోకి వచ్చాడు.

ఆ టెన్షన్‌లో నిలబడి డియస్పీకి సెల్యూట్ చేసి, బయటకు నడిచాడు. బయట కంటీ నిలబడి వుంది. “ఐయామ్‌సారీ రాణా. నువ్వేం బాధపడకు అయిందేదో అయిపోయింది. ఈ వూళ్ళోనే ఇద్దరం కలిసి మసాజ్ పార్లర్ పెడదాం. మొగాళ్ళకి నువ్వూ. ఆడవాళ్ళకి నేనూ ..... సంవత్సరంలో లక్షలు సంపాదించవచ్చు” అంది.

“తప్పకుండా పెడదాం. మొదటి కస్టమర్ మీ నాన్నే” అని అక్కడినుంచి వెళ్ళిపోయాడు

రాణా.

## 8

***రాత్రి పదయింది.***

వాళ్ళు నలుగురూ అతడివైపే చూస్తూ వున్నారు. నిశ్శబ్దంగా మాటరానట్టు చూస్తూ వున్నారు. అతను పచార్లు చేస్తున్నాడు. వాళ్ళు ఆలోచించుకోవటానికి కాస్త టైమిచ్చినట్టు అతడు కూడా మౌనంగా వున్నాడు.

చాలా రహస్య మైన సమావేశం అది.

అతడిప్పుడు మెంబర్ ఆఫ్ పార్లమెంట్‌లా లేడు. కోపంతో మొహం ఎర్రబడి, చిరాకు అణుచుకునే ప్రయత్నంలో వున్నాడు. తనలోని రాక్షసుడిని బయటకు రాకుండా ఆపుచేస్తున్నాడు.

అతడు పులిరాజు!

వాళ్ళు నలుగురూ స్టూవర్ట్‌పురం దొంగలు. ఒక్కొక్కరూ ఒక్కొక్క విద్యలో ఆరితేరినవాడు. అందులో ముఖ్యుడు ప్రసాద్. ఎన్ని అంతస్థుల భవంతి అయినా అతడు ఏ ఆధారమూ లేకుండా పైకి ఎక్కగలడు. ఎటువంటి ఇంటిలో కయినా అవలీలగా ప్రవేశించగలడని ప్రతీతి. వారిలో రెండవ వ్య క్తి పొడుగ్గా సన్నగా వున్నాడు. జడ పిన్నుతో ఎలాంటి తాళాన్నైనా తీయగలడు అతడు. వేళ్ళ స్పర్శతో ఇనప్పెట్టి మర్మం తెలుసుకోగలడు. మూడో వ్య క్తి లావుగా వున్నాడు. గుండ్రటి మొహం. కేవలం వాసన పట్టి, బంగారం ఎక్కడ వున్నా కనుక్కోగలడు. నాలుగో వ్య క్తి ఎంత చిన్న అలికిడినైనా పసిగట్టగలడు.

ఆ నలుగురినీ పులిరాజు ఒక ప్రత్యేకమైన పనిమీద పిలిపించాడు. అయితే ఆ పనేమిటో చెప్పలేదు.

"ఒక దొంగతనం చెయ్యాలి. చాలా సులభమైన దొంగతనం అది ఏమిటో, ఎక్కడో చెప్పను. మీరు వప్పుకుంటే చెప్తాను. ఈ పని చేసినందుకు ఒక్కొక్కరికి ఒక్కొక్క లక్ష ఇస్తాను" అన్నాడు.

ఒక్కొక్కరికి ఒక్కొక్క లక్ష అంటే- చాలా పెద్ద దొంగతనం అని వాళ్ళకు తెలిసిపోయింది. అయినా వాళ్ళలో కదలిక లేదు.

పులిరాజు అన్నాడు- "మీ వెనుక నేనుంటాను. ఏ కేసూ రాకుండా చూసుకుంటాను. నాకున్న పలుకుబడి ఏమిటో మీకీపాటికే తెలిసిపోయి వుంటుంది ఈరోజు మధ్యాహ్నం ఇన్‌స్పెక్టర్ రాణాని క్షణాల్లో సస్పెండ్ చేయించాను. మీ వరకూ వచ్చిందా విషయం?"

"తెలిసింది" అన్నట్టు ప్రసాదు తలూపాడు.

"దాన్నిబట్టే మీ కర్థమై వుంటుంది కాబట్టి చెప్పండి. ఈ దొంగతనం చేస్తారా? చేస్తానంటే వివరాలు చెప్తాను. చాలా సింపుల్ దొంగతనం."

ప్రసాదు గొంతు సవరించుకుని అన్నాడు- "అయ్యా! మీరు చాలా గొప్పవారు మే మింతకుముందు చాలా దొంగతనాలు చేసినమాట నిజమే. ఒక్కొక్కరం పది సంవత్సరాలకి తక్కువ కాకుండా జైల్లో గడిపిన మాటకూడా నిజమే. కానీ ఇప్పుడిక ఈ దొంగతనాలు మానేద్దామనుకుని ఒక నిశ్చయానికి వచ్చాము సార్. మా పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. మేము జైల్లో వున్నంతకాలమూ మా భార్యలు నానా కష్టాలూ పడుతున్నారు. ఇంకెంతకాలం ఇలా దొంగతనాలు చేస్తూ జైల్లో గడపాలి? మాకు దొరికేది తక్కువ, వాటాలుగా పోయేది ఎక్కువ. వీరదాసు, ఎమ్మెల్యే నాయుడుగారు కలిపి సగం, పోలీసులు పాతిక తింటారు. జైలు శిక్ష మాత్రం మాకు. అందుకని మేము మారిపోవాలని నిర్ణయం తీసుకున్నాం. స్టూవర్ట్‌పురం దొంగలకి ప్రభుత్వం పొలాలిచ్చింది. ఇళ్ళస్థలాలు ఇచ్చింది. ఆ అవకాశాన్ని మేము ఉపయోగించదల్చుకున్నాము. ఎంత కాలం ఇలా దొంగలుగా బ్రతకగలం- మీరే చెప్పండి. కాబట్టి మమ్మల్ని దయచేసి వదిలిపెట్టండి."

పులిరాజు బిగ్గరగా నవ్వేడు. ఆ అర్థరాత్రి నిశ్శబ్దంలో అతడి నవ్వు కంపనాలుగా వ్యాపించి, ఎంతటి వారికయినా భయం కొలిపేదిగా వుంది. "వదిలి పెట్టటమా?" అని తిరిగి నవ్వేడు. "నేను వదిలిపెడతాను. మీరింతగా అడిగితే బ్రతిమాలి మీతో పని చేయించుకోవలసిన అవసరం గానీ, ఆశగానీ నాకు లేవు"

అతడి మొహంలో నవ్వు మాయమైంది. దగ్గరగా వచ్చి వాళ్ళ మొహాల్లోకి చూస్తూ అన్నాడు-- "కానీ పోలీసులు మిమ్మల్ని వదిలిపెడతారా? నేను వేరే మనుష్యుల్ని తెప్పించి ఈ దొంగతనం చేయిస్తాను. దాంతో మీకు నరకం మొదలవుతుంది. అవునా?"

వాళ్ళు సమాధానం చెప్పలేదు.

అతనన్నాడు. "కానీ నేను అప్పుడు మీ వెనకాల వుండను. పోలీసులకి పైనుంచి ఫోన్‌లు రావు. పైగా దొంగసరుకు వెంటనే పట్టుకొమ్మని పైనుంచి వత్తిడి ఎక్కువ అవుతుంది. ఆ కోపమంతా మీమీదే చూపిస్తారు పోలీసులు. చెప్పండి ..... ఆ నరకం అనుభవిస్తారా? నాతో సహకరిస్తారా?"

వాళ్ళు కొద్దిసేపు మౌనంగా వుండి-- "మాకు కొంచెం టైమివ్వండి సారూ" అన్నారు.

"అయిదు నిముషాల్లో వస్తాను. ఆలోచించుకోండి" అని పులిరాజు అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

అతడు తిరిగి వచ్చేసరికి వాళ్ళొక నిర్ణయానికి వచ్చినట్టు కనపడ్డారు.

"ఏం ఆలోచించుకున్నారు?"

ప్రసాదు అన్నాడు--- "మేము ముందనుకున్నదానికే కట్టుబడి వుండాలని అనుకుంటున్నామయ్యా."

పులిరాజు మొహంలో లిప్తపాటుకాలం ఒక వక్రరేఖ క్రౌర్యంగా తొంగిచూసి మాయమైంది. "సరే వెళ్ళండ్రా. వెళ్ళి ప్రభుత్వం మీకిచ్చిన పొలాలు దున్నుకుంటూ బ్రతకండి. మీరు ప్రశాంతంగా జీవిస్తానంటే నేనెందుకు కాదనాలి? ఏదో ..... ఒక్కొక్కరికి ఒక్కొక్క లక్ష వస్తుందంటే సంతోషంగా వప్పుకుంటారనుకున్నాను. వెళ్ళండి కానీ జాగ్రత్త. మన మధ్య జరిగిన ఈ విషయం బయటకు పొక్కిందో, పోలీసులు కాదు. నేనే మీ రక్తం కళ్ళజూస్తాను. దొంగతనం సంగతి ఇక మీరు మర్చిపొండి."

"ఎంతమాట బాబయ్యా ..... ఇంతకన్నా పెద్ద రహస్యాలే మేము ఎన్నో కడుపులో దాచుకున్నాం. ఒక చిన్న విషయం బయటపెట్టినా ఎందరో పోలీసుల ఉద్యోగాలు గంగలో కలసిపోవును. మేం చెయ్యమన్నామే తప్ప మీ విషయాలు మాకెందుకు బాబూ. మమ్మల్ని ఇట్టా వదిలిపెట్టండి" అని వాళ్ళు వెళ్ళిపోయారు.

పులిరాజు అటే చూస్తూ నిలబడ్డాడు.

యాభై లక్షల విలువచేసే నగలు!!

ఎలక్షన్స్ దగ్గర్లో వున్నాయి. డబ్బు అవసరం చాలా వుంది. దాదాపు కోటి రూపాయలదాకా ఖర్చుపెడితే ఉపముఖ్యమంత్రి అవ్వచ్చు. ఈసారి రాష్ట్రంలో తమ పార్టీయే తప్పక వస్తుంది. అందులో సందేహం లేదు. ప్రస్తుత ఎమ్మెల్యే నాయుడు వున్న ఆ పార్టీకి డిపాజిట్టు కూడా రాదు. అందులోనూ సందేహం లేదు. తను పార్లమెంటు మెంబరుగా సాధించేది ఏమీలేదు. రాష్ట్ర రాజకీయాలమీద దృష్టి నిలిపి ఇప్పట్నుంచి 'లాబీయింగు' జరిపి, ఓ కోటి రూపాయలు సమర్పించుకుంటే పార్టీ అధిష్టానవర్గం తన పేరుని సూచించే అవకాశం వుంది. విషయం అంతవరకు వస్తే మిగతా విషయాలు తను చూసుకోగలడు. చొచ్చుకుపోగలడు.

ప్రస్తుతానికి కోటిరూపాయల అవసరం చాలావుంది.

అందులో దాదాపు యాభై లక్షలు .....

గుళ్ళో దేముడి నగలు దొంగిలిస్తే లభిస్తాయి.

అదీ అతడి ప్లాను.

* * * * *

రాణా అద్దెకున్న పోర్షన్‌కీ, ఇంటిగల వాళ్ళ పోర్షన్‌కీ మధ్య ఒక తలుపు వుంది. రాణా-అలక్‌నందతో ఆ తలుపు మీద కోడ్ ఏర్పాటు చేసుకున్నాడు. ఒక్కసారి 'టక్'మని కొట్టి, కొంచెం ఆగి రెండుసార్లు 'టిక్-టిక్' మని కొడితే అది అలక్‌నందకి సంకేతం. రెండు పోర్షన్ల మధ్యనున్న తలుపుని ఆ విధంగా తెరవటానికి అలక్ ముందు వప్పుకోలేదు కానీ, అతి కష్టం మీద వప్పించాడు. "బాధల్లో వున్నవాడికి కావల్సింది రవ్వంత ఓదార్పు, ప్రేమ అలకా! మనమధ్య వున్న ఈ అడ్డు తలుపుల్ని బ్రద్ధలుకొట్టి నీ ప్రేమని ప్రకటించు" అన్నాడు ఉద్వేగంగా ఆ సాయంత్రం.

ఆమె భయంగా భయంగా చూసింది.

"నిన్ను కారుతో డాష్ కొట్టి అవమానించిన స్త్రీని అరెస్ట్‌చేసి నా ఉద్యోగం కోల్పోయాను. నా మీద ఆమాత్రం కనికరం లేదా అలకా?"

ఆ అమ్మాయి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "అంతమాట అనకు రాణా. నీ కోసం సర్వస్వం అర్పిస్తాను. ప్రాణమైనా ఇస్తాను" అంది.

"సర్వస్వం అర్పిస్తే ప్రాణాలు పోతాయనే అపోహనుంచి నువ్వింకా బయటకు రాలేదా?" నీరసంగా అడిగాడు.

ఆమె మాట్లాడలేదు.

"కనీసం ముద్దువరకైనా వప్పుకో."

అలక్‌నంద అదిరిపడి అడుగు వెనక్కి వేసింది. రాణా పేలవంగా నవ్వాడు. "ప్రేమ కోసం సర్వస్వం అర్పిస్తానన్న స్త్రీ ప్రాణం పోతుందన్న భయంతో ప్రియుడికి ముద్దుకూడా ప్రియం చేసింది."

"అంతమాట అనకు రాణా" అంది ఆమె ఆవేశంతో అడుగు ముందుకేసి, అదే అదనుగా అతడు ఆమెచుట్టూ చేతులు వేసి, పెదవుల మీద ముద్దు పెట్టుకున్నాడు. ఆమె కళ్ళు మూసుకుంది.

"ఏవిటది? తాదాత్మ్యతా?" ఆప్యాయంగా అడిగాడు.

"కాదు. గుండెల్లో నొప్పిగా వుంది" అంది. రాణా మొహం ఎర్రటి కొలిమిలా మారింది. "మొదటిసారి ముద్దు అనుభవం ఎలా వుందీ అని అడిగితే ఇదా ఆన్సరు? అయినా ఆ చిలక జ్యోతిష్కుడు కన్నెరికహరణం మరణం సంభవం అని చెప్పాడే తప్ప ముద్దు పెట్టుకుంటే గుండె నొప్పి వస్తుందని చెప్పలేదుగా" కసిగా అని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

అది జరిగిన సాయంత్రం అలక అతడికి చిన్న చీటి తలుపు సందులోంచి అందించింది. "జరిగిన దానికి విచారిస్తున్నాను. ఈ రాత్రికి ముద్దిస్తాను" అని అందులో సారాంశం. డైరెక్టుగా 'ముద్దు' అన్న టాపిక్ లేకపోయినా సారాంశం అదే.

రాత్రి పన్నెండింటికి రాణా తయారయ్యాడు. అతడేమీ టెన్షన్‌లో లేడు. తను చెయ్యబోతున్న దేమిటో తిరిగి తన ఉద్యోగం ఎలా సంపాదించుకోవాలో అతడికి స్పష్టంగా తెలుసు.

అతడా పనిమీదే ప్రస్తుతం బయల్దేరుతున్నాడు.

అప్పుడే వర్షం పడి వెలిసింది. బయటంతా చీకటిగా వుంది. ఎంత పనిమీద వెళుతున్నా అలక్‌నంద వ్రాసిన వుత్తరం సంగతి మర్చిపోలేదు అతడు. తలుపు దగ్గరకి వెళ్ళి టక్ ..... టక్ ..... టక్ మని కోడ్ గుర్తుతో కొట్టాడు.

అరనిముషం తరువాత తలుపు తెరచుకుంది. "థాంక్స్ ఫర్ ది లెటర్" అంటూ చీకట్లోనే చప్పున ఆమెని దగ్గరకు లాక్కుని ముద్దు పెట్టుకోబోయాడు. కెవ్వున కేక వినిపించింది. అతడు

కంగారుగా ఆమెని వదిలేసి "మీరా అన్నపూర్ణమ్మగారూ" అన్నాడు.

"ఇదేం అఘాయిత్యం నాయనా. నమ్మకంగా పక్క పోర్షన్ అద్దెకిస్తే ఇదా నువ్వు చేసే పని?" అందావిడ కోపంగా.

"క్షమించండి అత్తయ్యగారూ! మీ అమ్మాయినీ మార్చే ప్రయత్నంలో ఇదొక భాగం మాత్రమే. కావాలంటే ఈ క్షణం తాళి కడతాను" అని ఆమె మాట్లాడకపోవటంతో - "ఒక ముఖ్యమైన పనిమీద వెళుతున్నాను. కాస్త ఎదురురండి" అంటూ టాపిక్ మార్చి శకునం రాగా బయల్దేరాడు.

అర్థరాత్రి పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఇన్‌స్పెక్టర్ (సస్పెండ్) ని చూసి రాత్రి సిబ్బంది ఆశ్చర్యపోయారు. అతడు ఫోన్ అడిగి తీసుకుని వరుసగా ఫోన్‌లు చేయడం ప్రారంభించాడు. ఆ వూరి నుంచి వార్తలు దినపత్రికలకు పంపే విలేకర్లు ముగ్గురు నలుగురు వున్నారు. వాళ్ళకు ఫోన్ చేసాడు.

"నేనూ -- పులిరాజుగారి పియ్యేని మాట్లాడుతున్నాను. ఇంకో అరగంటలో మా రాజాగారు పత్రికలకి ఒక ప్రకటన చెయ్యబోతున్నారు. మీరు వెంటనే రావాలి."

"ఇంత అర్థరాత్రా?"

"అవును అర్జంట్. ఇంటి కొచ్చెయ్యండి."

అలా నలుగురికీ ఫోన్‌లు చేసి రాణా అక్కణ్ణుంచి బయల్దేరి పులిరాజు ఇంటికి వెళ్ళాడు.

చీకట్లో ఆ భవంతి తాటిచెట్టులా వుంది. నీళ్ళపంపు పట్టుకుని రెండో అంతస్థులో ప్రవేశించాడు. త్రిపుర బెడ్‌రూమ్ కనుక్కోవటం అతనికి పెద్ద కష్టం కాలేదు. చిన్న వూచ సాయంతో గది లాక్ తెరచుకుని లోపలికి ప్రవేశించాడు.

కంటి లోపల నిద్రపోతోంది. పక్క దగ్గర నిలబడి ఒక్క క్షణం ఆమెవైపే చూశాడు. చాలా మంచి స్ట్రక్చర్ ఆ అమ్మాయిది. పరిపూర్ణమైన ఆరోగ్యంతో మిలమిల లాడుతోంది. ఆమె వేసుకున్న పలుచటి నైటీలోంచి శరీరాకృతి స్పష్టంగా కనిపిస్తుంది.

ఆ అలికిడికి ఆమె కళ్ళువిప్పి చూసింది. మంచం పక్కనే కత్తెరతో నిలబడ్డ రాణాని చూసి ఆ అమ్మాయికి కొంచెంసేపు ఏమీ అర్థం కాలేదు.

లేచి కూర్చుంటూ "ఏమిటిది?" అని అడిగింది.

"నేనిప్పుడు నిన్ను రేప్ చేయబోతున్నాను" అన్నాడు గంభీరంగా.

"కత్తెరతోనా? భలే-- "అంది.

మాట్లాడకుండా అతడు ఆమె నైటీ బొందుని కత్తెరతో కత్తిరించాడు. ఆమె ఆ కార్యక్రమాన్నంతా కళ్ళప్పగించి చూస్తోంది. మోకాళ్ళ పైగా పీలికలు చేశాడు.

"ఇంతేనా రేప్ అంటే? నేను ఇంకా చాలా వుంటుందనుకున్నానే" అంది. అతడు సమాధానం చెప్పలేదు. ఆమె చెయ్యి పట్టుకుని గోళ్ళతో గీరాడు.

"నఖక్షతలా?" అని అడిగింది.

"దంతక్షతాలు కూడా" అంటూ మొహం మీదకు వంగాడు. ఆమె కెవ్వున అరిచింది. అతడు చప్పున నోరు మూశాడు.

"రేప్ చేస్తున్నప్పుడు అరవాలిగా, అందుకని అరుస్తున్నాను" అంటూ మళ్ళీ ప్రయత్నం చేసింది. ఈ లోపులో బయట తలుపుకొట్టిన చప్పుడు. "ఏమ్మా త్రిపురా --- ఏమైంది?" అన్న పులిరాజు కంగారు గొంతు వినిపించాయి.

రాణా జేబులోంచి కర్చీఫ్ తీసి త్రిపుర మొహంమీద సుతారంగా అదిమాడు. ఆమె క్షణాల్లో స్పృహ తప్పినట్టు పడిపోయింది. పెన్ను ఆమె బుగ్గలమీద విదిలించాడు. ఎర్ర ఇంకు అక్కడక్కడ పడింది.

తాపీగా అప్పుడు వెళ్ళి తలుపు తీశాడు.

బలంగా తలుపు కొడుతూన్న పులిరాజు రాణా ఒక్కసారిగా తలుపు తీసేసరికి ఆ వేగానికి ముందుకు పడ్డాడు. రాణా అతడిని పొదిని పట్టుకుని ఆపుచేశాడు.

"ఎవరూ ..... నువ్వా ..... అర్థరాత్రి నా ఇంట్లో ప్రవేశిస్తావా? ఎంత ధైర్యం నీకు? ఐ విల్ షూట్ యూ"

"క్షమించండి. పశ్చాత్తాపంతో దహించుకు పోతున్న నన్ను అంతలేసి మాటలనటం భావ్యంకాదు" రాణా దీనంగా అన్నాడు.

"పశ్చాత్తాపమా? ఎందుకు పశ్చాత్తాపం? అసలేం జరిగింది?" అంటూ ముందుకొచ్చాడు పులిరాజు. అతడి దృష్టి పక్క పైనున్న కూతురి మీద పడింది. షాక్ తగిలిన వాడిలా నిలబడిపోయాడు. నోట మాట రాలేదు బుగ్గమీద ఎర్ర గాట్లతో చిరిగిన వస్త్రాలతో పక్కమీద పడివుంది కూతురు.

"నన్ను క్షమించండి" వెనుకనుంచి రాణా గొంతు వినిపించింది. " ..... మీరు నన్ను సస్పెండ్ చేయించారన్న ఉక్రోషంతో పిచ్చెక్కి పోయాను. మీమీదెలాగైనా కసి తీర్చుకోవాలనిపించింది. ఆ ఆవేశంతో ఏం చేస్తున్నానో నాకు తెలియలేదు. వచ్చి మీ కూతుర్ని రేప్ చేశాను."

ఒక్కొక్క వాక్యం బాంబు పేలినట్టు పేలింది. పులిరాజు మొహం కందగడ్డలా మారింది. మనిషి నిలువెల్ల వణికిపోతూ "నిన్ను ..... నిన్ను చంపేస్తాను" అన్నాడు.

అంతలో క్రింద కాలింగ్‌బెల్ వినిపించింది. అంత అర్థరాత్రి ఎవరొచ్చారో పులిరాజుకి అర్థంకాలేదు. అయోమయంగా చూశాడు.

"పత్రికా విలేకర్లు ...." అన్నాడు రాణా తాపీగా. ".... మీ కూతుర్ని రేప్ చేస్తున్నంతసేపూ నాలో వున్న ఆవేశం, ఆ పని అయిపోయాక తగ్గిపోయింది. రేప్ చేయబడ్డ మీ కూతుర్ని తెల్లటి బెడ్ షీట్ మీద ఆకుపచ్చ నైటీలో ఎర్రటి మరకల్తో చూస్తే నాకు .... పతాకం గుర్తొచ్చింది. పశ్చాత్తాపంతో కదలిపోయాను. వెంటనే ఈ గదిలోంచే పత్రికా విలేకర్లకు ఫోన్‌చేసి ఇక్కడకు రమ్మన్నాను. ఎలాగూ ఉద్యోగం లోంచి సస్పెండ్ కాబడ్డాను. నా నేరానికి శిక్ష అనుభవించాలి.

పన్నెండు సంవత్సరాలు జైల్లో మగ్గాలి. అదే నా నేరానికి ప్రాయశ్చిత్తం లోకానికి నా నేరం తెలియాలి.''

''నో ఇలా జరగటానికి వీల్లేదు.''

''తప్పదు పులిరాజుగారూ. అయినా ..... అయినా నా గురించి నాకు బాధలేదు. అన్యాయంగా మీ కూతురి జీవితం ఇలా అయిపోయిందే అనే బాధ. రేపు మీ అల్లుడొచ్చాక ఈ పాత పేపరు కట్టింగు అతనికి ఎవరైనా చూపిస్తే ఎలా అన్నదే నన్ను పీడిస్తున్న సమస్య. నాకు పన్నెండు సంవత్సరాలే శిక్ష. కానీ ..... అయ్యో .... మీరు చేసిన పాపానికి మీ కూతురికి జీవితాంతం శిక్ష.''

''నేను చేసిన పాపమా?''

''నన్ను సస్పెండ్ చేయించటం .... అందుకేగా, ఉచ్ఛ నీచాలు మరిచి పశువులా ప్రవర్తించాను. పులిరాజుగారూ ప్లీజ్ .... జరిగినదంతా మర్చిపోండి. నన్ను ఆ విలేకర్ల దగ్గరకు వెళ్ళనివ్వండి నేరం ఒప్పుకోనివ్వండి'' చేతిలో కత్తెరవైపు ఓరగా చూస్తూ అన్నాడు రాణా. పులిరాజు అంతా అర్థమైనట్టు తలూపాడు. ''నీ ఎత్తు అర్థమైంది. నీ సస్పెన్షన్ ఆర్డర్ ఉపసంహరించుకోకపోతే జైలుకి వెళ్ళటానికి కూడా నువ్వు సిద్ధమే కానీ నన్ను బజారు కీడుస్తావ్. అంతేగా నువ్వు చెప్పేది-''

''చాలా కరెక్టుగా గ్రహించాడు.''

పులిరాజు బలంగా విశ్వసించి ''సరే అయితే నీ సస్పెన్షన్ ఉపసంహరిస్తున్నాను'' అన్నాడు.

''థాంక్స్ ..... నేనూ మీ అమ్మాయినేం చెయ్యలేదు. ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్ .....'' చిలిపిగా నవ్వేడు రాణా.

పులిరాజు నవ్వలేదు. ''చూడు ... ఈ విషయం నేనిక్కడితో వదిలిపెడతాననుకోకు. అనవసరంగా కొరివితో తల గోక్కున్నావు. చాలా తొందర్లోనే అనుభవిస్తావు.''

రాణా కూడా అతడివైపు సీరియస్‌గా చూశాడు. ''చూడూ నీలాంటి వాళ్ళని లక్షమందిని చూశాను. ఈ చిన్న టౌన్‌కీ నువ్వు రాజువైతే అవ్వొచ్చుగానీ, మామూలుగా అతి సాధారణమైన వాడివి. నాతో గొడవంటే పార్లమెంట్‌లో వాకౌట్ చేసినంత సులభం కాదు. బీ కేర్‌ఫుల్ ....'' అంటూ అక్కడినుంచి వచ్చేశాడు.

*   *   *   *   *

''ఎలా సంపాదించారు సార్ తిరిగి ఉద్యోగం?'' బ్రహ్మానందం బాలకిషన్ ఎగ్జయిటింగ్‌గా అడిగాడు. రాణా నవ్వి వూరుకున్నాడు. సుధాకర్‌కి కూడా ఇదంతా గమ్మత్తుగా అనిపించింది. అతడూ అదే ప్రశ్న అడిగాడు. ఈసారి రాణా సమాధానం చెప్పాడు.

"చూడు కర్రా. మన మనసుకి మనం సమాధానం చెప్పుకోవలసివుంటుంది. అది కుదిరిందనుకో - ఎంతటి సమస్యనైనా అవలీలగా దాటి వెయ్యవచ్చు" అతడు చెప్పటం పూర్తికాకుండానే కానిస్టేబుల్ శర్మ పరుగెత్తుకు వచ్చాడు. "దేముడి నగలు కొట్టేశారు సార్. గార్డులని చంపేశారు" రొప్పుతూ అన్నాడు అక్కడంతా గగ్గోలుగా వుంది."

రాణా స్థాణువయ్యాడు.

యాభై లక్షలు దొంగతనం ..... దేముడి నగలు ...... గార్డుల హత్య .....

రెండు సంవత్సరాల క్రితం చరిత్ర మళ్ళీ పునరావృత్తం.....

ఈసారి నగల దొంగతనం కూడా జరిగింది.

"మనసుకి సమాధానం చెప్పుకోగలిగితే ఎంతటి సమస్యనయినా అధిగమించవచ్చు" నన్నాడు ఇప్పుడే ... మరి దీన్ని పరిష్కరించగలడా?

అసెంబ్లీలో, పార్లమెంటులో పోలీసుల అసమర్థత గురించి రాకుండా ఆపగలడా?

9

గుడిలో దేముడు కళావిహీనంగా వున్నాడు.

ఆ ప్రాంగణమంతా వెలవెలబోతూంది.

ఫోటో గ్రాఫర్లు, పోలీసు కుక్కలు, దూరంగా తండోపతండాలుగా జనం- అంతా హడావుడిగా వుంది.

రాణా ఆ తతంగాన్ని నిలబడి చూస్తున్నాడు. నిజానికి అక్కడ పోలీసులు చెయ్యగలిగినదేమీ లేదు. పోలీసు కుక్కల్ని గుడి ప్రాంగణంలోకి వదలారా లేదా అన్న విషయమై ఎంపీ, ఎమ్మెల్యేలు వాదులాడుకుంటున్నారు.

ఇద్దర్లో ఎవరో ఒకరు కొట్టేశారన్నది యధార్థం. అయితే ఎవరూ బయటపడటం లేదు. రేపు యస్పీ వస్తున్నాడు. అప్పటికే హైదరాబాద్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఇరవై నాలుగ్గంటల్లోగా నగలు దొరికేలా చూడమని.

సాధ్యమయ్యే పనేనా అది?

గదిలోకి పోలీసు కుక్కల్ని వదలాలా అన్న విషయం మీద తొందర్లో ఒక కమిటీ వేసినా ఆశ్చర్యపోనవసరం లేదు.

రాణా ఆలోచిస్తున్నది అదికాదు.

సరీగ్గా రెండు సంవత్సరాల క్రితం ఇలాటి దొంగతనం కోసమే ప్రయత్నం జరిగింది. కొందరు మరణించారు.... ఆ ప్రయత్నం ఎవరు చేశారు? వాళ్ళు మళ్ళీ ప్రయత్నించటం కోసం రెండు సంవత్సరాలు ఎందుకు ఆగారు? అదే అర్థంకాని ప్రశ్న.

..... డియస్పీ తెగ హడావుడి పడిపోతున్నాడు. పాపం ఈ వయసులో హాయిగా ఏ వీరదాసు 'అడ్డా'లోనో మందుకొట్టి హాయిగా పడిపోవటానికి వీల్లేకుండా ఈ కష్టం వచ్చిపడింది.

అంతలో యస్సై కర్రా వచ్చి సెల్యూట్ చేశాడు. " .... ఇది నిశ్చయంగా స్టూవర్ట్‌పురం

దొంగల పనే సార్'' అన్నాడు.

''ఎలా చెప్పగలవ్?''

''తాళాలు చెక్కుచెదరలేదు. ఇనుప ఊచల్తో తీశారు. అలా తీయగలిగింది వాళ్ళొక్కరే---''

''ఎక్కడ తాళాలు చెక్కుచెదరకుండా తీయబడినా అది స్టూవర్టుపురం దొంగల పనే అన్న నిర్ణయం మెచ్చుకోదగినదే కానీ --- రెండు సంవత్సరాల క్రితం రామస్వామి కూడా అలాగే ప్రయత్నించాడు కదా! మరి అతడెందుకు విజయం సాధించలేకపోయాడు?''

యస్సై జవాబు చెప్పకుండా అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

* * * * *

రాత్రి ఎనిమిది కావొస్తూంది.

వెన్నెల గుడిసెల మీద, ఇళ్ళమీద సమానంగా పడుతూంది. కొందరు పిల్లలు గుడిసెల ముందు ఆడుకుంటున్నారు. కొందరాడవాళ్ళు పక్కనే వంట చేసుకుంటున్నారు. అప్పుడే పొలాల నుంచి వచ్చిన వాళ్ళు మంచాల మీద పడుకుని వున్నారు. పిల్లల అరుపులు, మాటలు తప్ప అక్కడంతా నిశ్శబ్దంగా వుంది.

ఆ నిశ్శబ్దంలోంచి, దూరంగా మోటారు శబ్దం వినిపించింది. ఒకటి కాదు ... నాల్గయిదు వాహనాల చప్పుడు.

''పోలీసులొస్తు... న్నా... ర్రో....య్...'' ఎవరో అరిచారు. క్షణాల్లో అక్కడి ప్రశాంతత బ్రద్ధలైంది.

వ్యాన్లు నాలుగు వైపులనుంచీ చుట్టుముట్టాయి. పిల్లల ఏడుపులు, ఆడవాళ్ళ కేకలు- మొగవాళ్ళు పరుగెడుతున్నారు. వృద్ధులు చూస్తున్నారు. అంతా గందరగోళంగా తయారైంది. నాలుగు వైపులనుంచీ పోలీసులు చుట్టుముట్టడంతో ఎటు పారిపోవాలో తెలియలేదు. దొరికినవాణ్ణి దొరికినట్టు బాది వ్యాన్‌లో పడేస్తున్నారు.

అరగంటలో అంతా పూర్తయింది. మొగవాడు అన్నవాడెవడూ ఆ స్టూవర్ట్‌పురంలో మిగల్లేదు. ఆడవాళ్ళ ఏడుపులు మిగిలాయి ఊహ తెలిసిన పిల్లలు ఏడుస్తున్నారు. ఊహ తెలియని వాళ్ళు చిత్రంగా చూస్తున్నారు.

వ్యానులో జనాన్ని తీసుకొచ్చి స్టేషన్‌లో పడేశారు. అందరికీ లాకప్ రూము సరిపోలేదు. కాళ్ళకి గొలుసులు కట్టి కొంతమందిని స్టేషన్ బయట చెట్టుక్రింద వుంచారు. ఇంటరాగేషన్ ప్రారంభమయింది.

ఇంటరాగేషన్ అంటే ఎక్కువ ప్రశ్నలేమీ లేవు. ''నగలేం చేశావో చెప్పు---- '' అంటూ బాదడం. వాడు ''నాకేమీ తెలియదు బాబో'' అంటూ ఏడవటం, వాడికి శోషవచ్చి పడిపోగానే మరొకడ్ని తీసుకెళ్ళి బాదటం .....

ఇలా తెల్లవారే వరకూ సాగింది.

రాణా ప్రొద్దున్నే వచ్చి చూసేసరికి ఆ దృశ్యం హృదయవిదారకంగా వుంది. పోలీసు దెబ్బలు అవి. బయటికి కనపడవు. కానీ వాటి బాధ అతడికి తెలుసు. ఎన్నడూ రానంత కోపం యస్సై మీద వచ్చింది.

"ఏమిటది? ఎందుకలా చేశావ్?" అన్నాడు.

"మనం ఎంత తొందరగా ఈ కేసు తేల్చగలిగితే అంత మంచిది ..... "

"దానికీ ఈ కొట్టటాలకీ సంబంధం ఏమిటి?"

యస్సై తబ్బిబ్బై చూశాడు.

" పోలీస్‌స్టేషన్‌లో కొట్టటం తప్పుకాదు సర్" - 'ఇది మీకు కొత్తగా వుందా' -- అన్నట్టు అడిగాడు.

"ఒక దొంగచేత వివరాలు చెప్పించటానికీ, మన ఇన్వెస్టిగేషన్ సులువు అవటానికీ, థర్డ్ డిగ్రీ వుపయోగించవచ్చు సుధాకర్, కానీ ఎవరు దొంగలో తెలియకుండా ఈ లాకప్ లేమిటి?"

"వాళ్ళు క్రిమినల్స్ సర్--- "

"ఇప్పుడు కాదు. ఒకప్పుడు ..... " అన్నాడు రాణా. "వాళ్ళు పది సంవత్సరాలు, పన్నెండు సంవత్సరాలు శిక్ష అనుభవించి జైళ్ళనుంచి బయటకొచ్చారు. వాళ్ళు మారటానికి సిద్ధంగా వున్నారు. వాళ్ళని సెటిల్‌మెంట్ గ్యాంగ్‌గా ప్రకటించి ప్రభుత్వం ఇళ్ళస్థలాలు ఇచ్చింది. పొలాలు పంచింది. వాళ్ళ జీవితాల్లో ఆశాకిరణం ప్రతిబింబించే సమయంలో తిరిగి మనం లాకప్‌లో పెడుతున్నాం. 'మీరు క్రిమినల్స్‌రా! మీరు మారటానికి వీల్లేదు' అని తిరిగి చావబాదుతున్నాం. ఒక రకంగా మళ్ళీ మనమే వాళ్ళని పాతదారుల్లోనే తోసివేస్తున్నాం."

"వాళ్ళని వదిలిపెట్టెయ్యమంటారా?"

సుధాకర్ మాటల్లో వ్యంగ్యం ఏదయినా వుందేమో అని చివుక్కున తలెత్తాడు రాణా. అటువంటిదేమీ కనపడలేదు. మీ ఇన్‌స్ట్రక్షన్స్ ఏమిటో చెప్పండి- అని పై అధికారి సూచనకోసం వేచివున్నట్టు నిలబడ్డాడు యస్సై.

అంతలో డియస్పీ హడావుడిగా వచ్చాడు. "ఏమిటి- ఏమైంది? ఏమైనా విషయం తేలిందా? వాళ్ళు నోళ్ళు విప్పారా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

సుధాకర్ రాణా వైపు చూశాడు. జవాబు చెప్పవలసిన బాధ్యత తన మీద వున్నట్టు రాణా లేచి నిలబడ్డాడు. "వాళ్ళు కాదు అసలు దొంగలు."

"మరెవరు?"

రాణా జవాబు చెప్పలేదు. డియస్పీ అతనివైపు చిత్రంగా చూశాడు. "రెండ్రోజుల్లో మనం దొంగల్ని పట్టుకోకపోతే మినిష్టర్లకి జవాబు చెప్పుకోవలసి వుంటుంది తెలుసా"

రాణా దానికీ జవాబు చెప్పలేదు.

డియస్పీ అతని దగ్గిరగా వచ్చాడు. "నువ్వొక నెలరోజులు సెలవు మీద వెళ్తే బావుంటుందేమో చూడు రాణా" అన్నాడు.

అంతకన్నా అవమానం ఏ పోలీసు అధికారికీ వుండదు. తమాయించుకున్నాడు. "నాకో రెండురోజులు టైమివ్వండి సార్ నేను అసలు దొంగల్ని పట్టుకోగలననే అనుకుంటున్నాను" అన్నాడు.

డియస్పీ అతని దగ్గరకొచ్చాడు. "నువ్వు చాలా గొప్పవాడివి అని అనుకుంటూంటే మాకేమీ అభ్యంతరం లేదు రాణా. కానీ మా పనికీ, మా విధానానికీ మమ్మల్ని వదిలిపెట్టు" అఇన అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

* * * * *

అతడు దాదాపు నాలుగ్గంటల నుంచీ తాగుతున్నాడు. తాగుడు మనిషిని యుద్ధానికి ఆయత్తం చేయదు. తనలో తాను కృంగిపోయేలా చేస్తుంది. ఆ విషయం అతడికి తెలుసు. కానీ గుండెల్లో బ్రద్ధలవుతూన్న అగ్నిపర్వతపు లావాని ఆర్పటానికి తాగుడినే ఆశ్రయించక తప్పలేదు.

రాత్రి పదకొండింటికి ..... ఇంకా అతడి గదిలో లైటు వెలుగుతూ వుండటం చూసి అలక్‌నంద ఇక వుండబట్టలేక ఆ పోర్షన్‌లోకి వచ్చింది. ఏదో జరుగుతూందని తెలుసుకానీ, ఏం జరుగుతుందో తెలియక ఆమె ఆ రోజంతా కాలుకాలిన పిల్లిలా తిరుగుతూ వుండిపోయింది. ఆమె అతడి ఆకారం చూసి భయపడిపోయింది. అతడి కళ్ళు అగ్నిగోళాల్లా వున్నాయి. మనిషిగా లేడు- మూర్తీభవించిన దైన్యం క్రౌర్యం మిళితమైన వాడిలా వున్నాడు. అతడిని ఆవిధంగా చూడటం అదే ప్రథమం. "ఏమండీ. ఏమిటండీ ఇది" అని అడిగింది భయంగా.

"నన్ను కొంచెంసేపు ఒంటరిగా వుండనివ్వు" అన్నాడు కర్కశంగా. ఆమె కళ్ళనీళ్ళు పెట్టుకుంది. అతడు తమాయించుకుని "నీకు తెలీదు అలక్‌నందా- నా బాధ నీకు అర్థంకాదు" అన్నాడు.

"ఏమైందండీ."

"గుడి నగల దొంగతనం విషయంలో పోలీసులు స్టూవర్ట్‌పురం దొంగల్ని చావబాదుతున్నారు.

"అవును. వాళ్ళని జైల్లో పెట్టారట. చెప్పుకుంటున్నారు."

"కానీ వాళ్ళు ఆ దొంగతనం చేయలేదు. చేసింది ఎం.పీ. కొన్ని రోజుల క్రితమే వాళ్ళతో అతను బేరం పెట్టాడు. వాళ్ళు దానికి వప్పుకోలేదు. అతడు వేరే రకంగా ఆ దొంగతనం చేయించాడు. నేరం వాళ్ళ మీద పడింది. ఈ విషయం వాళ్ళు స్వయంగా నాతో చెప్పారు.

ఆమె మాట్లాడలేదు.

"రెండు సంవత్సరాల క్రితం ముందొకసారి ఈ ప్రయత్నం జరిగింది తెలుసా? గుడి గార్డులని, పూజారి కొడుకునీ చంపేశారు."

"అవును. రామస్వామి అని స్టూవర్ట్‌పురం గ్యాంగ్‌వాడే ఈ హత్యలు చేశాడట---"

"కాదూ ..... " రాణా గట్టిగా అరిచాడు. "రామస్వామి ఈ మర్డర్లు చేయలేదు. ఎందుకంటే ..... ఎందుకంటే ..... రామస్వామి నా తండ్రి కాబట్టి."

ఆమె స్తబ్ధురాలై చూసింది.

* * * * *

"ఎక్కడ ప్రారంభమైన మనిషి జీవితం ఎక్కడ అంతమవుతుందో చెప్పటానికి నేనే ఉదాహరణ. నా తండ్రి ఒక స్వాతంత్రయోధుడూ, దేశం కోసం సర్వం త్యాగం చేశాడు-- అనుకుంటూ గర్వపడుతూ వుండే నాకు, నా అసలు తండ్రి ఒక స్టూవర్ట్‌పురం దొంగ అని తెలిసినప్పుడు తల్ల డిల్లిపోయాను. ఒక కేసులో పన్నెండు సంవత్సరాలు శిక్ష అనుభవించి, జైలునే ఇల్లుగా చేసుకున్న నా తండ్రి, నన్ను చిన్నప్పుడే ఒక సర్వోదయ నాయకుడికి అప్పజెప్పాడు.

కామందుల నుంచి భూసేకరణోద్యమం ద్వారా మిగులు భూముల్ని సంపాదించి పేదలకు పంచటం వినోభాబావే శిష్యుల ఆశయాల్లో ఒకటి. అలా సేకరణ కోసం వెళ్ళినప్పుడు నా తండ్రి పసిగుడ్డుగా వున్న నన్ను ఆ సర్వోదయ నాయకుడి పాదాల దగ్గిర పడుకోబెట్టి బాధ్యత స్వీకరించమని వేడుకున్నాడు. ఆయన్నే నా తండ్రిగా భావిస్తూ నేను పెరిగాను.

స్టూవర్ట్‌పురం దొంగలకి ప్రభుత్వం పొలాలు ఇచ్చింది. మామూలు పౌరులుగా బ్రతకటానికి సాయపడింది. చెంబర్ లోయలో బందిపోట్లు వినోభాబావేకి లొంగిపోయినట్టే, స్టూవర్ట్‌పురంలో కొందరు దొంగలు మంచి వ్యక్తులుగా మారాటానికి నిశ్చయించుకున్నారు. అందులో నా తండ్రి ఒకడు.

నా పెంపుడు తండ్రి మరణిస్తే నా అసలు తండ్రి అయిన రామస్వామి దగ్గరకు నన్ను పంపాడు. స్వాతంత్ర యోధుడైన నా పెంపుడు తండ్రి బోధనలు నన్ను ఎంతో ప్రభావితుడిని చేశాయి. "ఒక మనిషి గత చరిత్ర చూసి ద్వేషించనవసరం లేదు. ప్రేమించటం కన్నా గొప్పవరం ఇంకొకటి లేదు ..... " ఇలాంటి భావాలతో స్టూవర్ట్‌పురం వచ్చిన నాకు నా తండ్రి తిరిగి పోలీస్‌స్టేషన్‌లో వున్నాడని తెలిసింది.

ఆ రాత్రి నాకు బాగా గుర్తు.

బాగా వర్షం కురుస్తూంది. హోరు గాలి రివ్వున వీస్తూంది.

ఉరుముల ధ్వనిని అధిగమిస్తూ పోలీస్‌స్టేషన్ నుంచి నా తండ్రి ఆర్తనాదాలు బయటకు వినిపిస్తున్నాయి.

పోలీసులు నా తండ్రిని చావబాదుతున్నారు.

కారణం చాలా చిన్నది. ఎక్కడో ఏదో దొంగతనం జరిగింది. ఆ సందర్భంగా ఎవరో, ఎవర్నో హత్య చేశారు. అనుమానం మీద నా తండ్రిని తీసుకువచ్చి కొడుతున్నారు. నేరం వప్పుకొమ్మని బలవంత పెడుతున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో యస్సైతో నేను బాగా గొడవపడ్డాను. యస్సై నన్ను బెదిరించాడు. రామస్వామి కొడుకునంటే, "ఆ చిన్న కారణం చాలు నిన్ను కూడా పడేసి కొట్టటానికి" అంటూ హేళన చేశాడు.

రక్తపు ముద్దలా పడివున్న నా తండ్రిని పొదివిపట్టుకుని ఇంటికి తీసుకొచ్చాను. "మా జీవితాలు ఇంతే బాబూ. మారదామన్నా మారనివ్వరు మమ్మల్ని. నువ్వు పోలీసువై మా వూరు తిరిగిరా. మా స్టూవర్ట్‌పురం వాళ్ళని ఉద్ధరించు" అని వేడుకున్నాడు నా తండ్రి. అంతవరకూ తిరిగిరానని నాతో ఒట్టు వేయించుకున్నాడు.

తిరిగి నేను పట్నం వచ్చాను. కష్టపడ్డాను. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చింది. నా తండ్రికి ఉత్తరం వ్రాశాను. " ..... నాన్నగారూ మీరు కోరినట్టే ఇన్‌స్పెక్టర్ నయ్యాను. మనవూరు ట్రాన్స్‌ఫర్ చేయించుకోవటానికి ప్రయత్నిస్తాను. నాకు చేతనయినంతలో అక్కడి పరిస్థితులు మార్చటానికి కృషి చేస్తాను" అని వ్రాశాను. నాకెందుకో నా కన్నతండ్రి అంటే అంతులేని అభిమానం ఏర్పడింది. ఏ పరిస్థితుల్లో ఆయన దొంగ అయ్యాడో తెలీలేదుకానీ కన్నకొడుకునే సర్వోదయ నాయకులకి అప్పగించాడంటే, జీవితంలో ఆయన ఎంత ఇనసెక్యూరిటీ ఫీలింగ్ అనుభవంచాడో ఊహించగలను. పోలీసులు కొడుతున్నా - రాజకీయ నాయకులు వత్తిడి తెస్తున్నా ఆయన తిరిగి దొంగగా మారలేదు.

పోలీస్ శాఖలో ఉద్యోగం వచ్చాక రాజమండ్రి జైలుకి ట్రెయినింగ్‌కి పంపారు. అక్కడికి వెళ్ళి జాయిన్ అవబోయేముందు స్టూవర్ట్‌పురం వెళ్ళాను. నా తండ్రి జాడలేదు. ఏదో కేసులో మళ్ళీ ఆయన్ని ఇరికించారనీ, ఏ పోలీస్‌స్టేషన్‌లో వున్నాడో కూడా తెలీదనీ అక్కడివారు చెప్పారు. అక్కడ పరిస్థితులు ఏమీ బాగాలేవు. మారదామన్నా మారనివ్వని పరిస్థితుల్లో అక్కడివారు తిరిగి దొంగలుగా మారిపోతున్నారు. నా తండ్రి ఆచూకీ కోసం ఎంక్వయిరీ చేయవలసిందిగా ఐ.జి.కి అప్లికేషన్ పెట్టి తిరిగి రాజమండ్రి వచ్చాను. ఎక్కువ ప్రయత్నించే అవసరం లేకపోయింది. నా తండ్రి నాకు రాజమండ్రిలోనే కలిశాడు.

ఉరితీత ఖైదీల గదిలో .....

* * * * *

అంత షాకు నేను నా జీవితంలో ఏనాడూ అనుభవించలేదు. ప్రపంచమంతా నా కళ్ళచుట్టూ గిర్రున తిరుగుతున్నట్టు అనిపించింది. నా తండ్రి మరొక్కరోజులో ఈ లోకాన్ని వదిలివెళ్ళిపోతున్నాడు. బ్రతికినంతకాలం ఏమీ అనుభవించలేక - బ్రతుకు చివర్లో కొంతకాలమైనా కొడుకు నీడలో సుఖమనుభవించాలనుకున్న నా తండ్రి ఆశ అత్యాశే అయింది. గాలికన్నా వేగంగా నేను కోర్టు చేరుకుని, కష్టంమీద సంపాదించి, జడ్జిమెంట్ కాపీ చదివాను.

ఏమీలేదు అందులో ..... డిఫెన్సు లాయర్ని కూడా కోర్టే నియమించింది. ముద్దాయిని పకడ్బందీగా ఇరికించారు కేసులో. మనసు కల్లోల సంద్రం కాగా- గొంతు గద్గదం అవుతూంటే,

తరబడి జైలుగదుల్లో గడిపిన చీకటి వుంది ..... పోలీసు లాఠీ కొట్టినప్పుడల్లా నోటినుంచి వచ్చే ఆక్రందనల దైన్యం వుంది ..... జడ్జి ఉరిశిక్ష వేసినప్పుడు మొహంలో మెదలిన నిర్లిప్తత వుంది.

నాకేం చెయ్యాలో తోచలేదు. సమయం పన్నెండు గంటల కన్నా ఎక్కువ లేదు. పోలీసు ఉన్నతాధికారులను కలుసుకున్నాను. జడ్జీని కలుసుకున్నాను. నేను తిరగని చోటులేదు. కానీ ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు 'నలుగురు గార్డులని ఒక్క మనిషి ఎలా చంపగలడు' అని ఎవరూ ఆలోచించలేదు. కార్లో వెళుతున్న అమ్మాయి సాక్ష్యం ఏ విధంగా నిలబడుతుంది? అని డిఫెన్సు లాయరు వాదించలేదు. అంతా ఒక స్కీమ్‌లా జరిగిపోయింది.

"ఇదంతా నాకు ముందే ఎందుకు చెప్పలేదు నాన్నా?" అని అడిగాను.

"చెపితే ఏం చేసేవాడివి బాబూ?" అన్నాడు. " ..... చదువు వదిలివచ్చేవాడివి. నాలాగే పోలీస్‌స్టేషన్ల చుట్టూ, కోర్టులచుట్టూ తిరిగేవాడివి. ఏమీ చేయలేక, చేసిన దానికి ఫలితం లేక నాలాగే నువ్వూ రాయిలా మారిపోయే వాడివి. ఇదంతా ఒక వలబాబూ. ఈ వలలో ఓసారి పడిన చేప మరి బయటకి రాలేదు. గూండాలు, రాజకీయ నాయకులు, పోలీసులు కలసి జాగ్రత్తగా వేసిన వల ఇది. ఒకరికోసం మరొకరు నేరం చేస్తారు. వారి స్థానంలో మరొకర్ని పెడతారు."

"ఎవరు ..... ? ఎవరు చేశారు ఇదంతా?"

"తెలీదు బాబూ."

నా తండ్రికి తెలుసు ..... చెప్పినా లాభం లేదని చెప్పటంలేదు. నేనన్నాను. "నాన్నా! నిజంగా నువ్వు దొంగతనం చేయదల్చుకుంటే దానికి గార్డులని చంపనవసరంలేదు. ఇంత భీభత్సం సృష్టించినవసరం లేదు. నీడకన్నా నిశ్శబ్దంగా నువ్వు ఆ గుడిలో ప్రవేశించగలవు. గాలికన్నా వేగంగా నగల్తో సహా మాయమవ్వగలవు ..... దీని వెనుకంతా ఎవరున్నారో చెపితే, నేను వాళ్ళ అంతు తేల్చే ప్రయత్నంలో పడతాననీ, ఆ ప్రయత్నంలోనే ప్రాణాలకి ప్రమాదమనీ నువ్వు నాకా విషయం చెప్పటంలేదు. అవునా?"

నా తండ్రి సమాధానం చెప్పలేదు.

తెల్లవారింది.

తొలిపొద్దు సూర్యుడు ఆకాశాన్ని రక్తవర్ణంతో నింపుతూంటే, నా తండ్రి ఉరికంబం వైపు నడిచాడు. వెనుకే పోలీసు అధికారి హోదాలో నేను వెంట నడిచాను. ఎంత విషాదభరితమైన సన్నివేశం! అది ఏ మనిషి జీవితంలోనూ తారసపడి వుండదు. ఒకప్పుడు ఇళ్ళకు రంధ్రాలు వేసిన చేతులే కావొచ్చు. కానీ తరువాత పొలం దున్నిన చేతులవి. చేతికొచ్చిన పంటని కళ్ళారా చూసుకోకుండానే చైతన్యం కోల్పోయిన చేతులవి. ఆ చేతులు పట్టుకుని వేలిముద్రలు వేయించువలసిన దౌర్భాగ్యం నాది. "గుడి గార్డులని చంపినందుకు సెక్షన్ 302 క్రింద నీకు ఉరిశిక్ష అమలు జరుపుతున్నాను" జడ్జిమెంట్ చదివి వినిపించాను. నా తండ్రి నిర్లిప్తంగా విన్నాడు.

"నీ ఆఖరి కోరిక ఏమైనా వున్నదా?" అడిగాను.

"నీకు చెప్పుకోవచ్చా బాబూ?"

"చె ..... చెప్పండి నాన్నగారూ" కంటినీరు అదిమిపెట్టి అన్నాడు.

"అక్కడందరూ దొంగలే కానీ ఒకరైనా నిజంగా మారదామనుకునే వారుంటారు. వారికోసం అక్కడికి వెళ్ళుబాబు. నువ్వు అన్నావే వాళ్ళ అంతు తేల్చే ప్రయత్నంలో ప్రాణాలకి ప్రమాదం తెచ్చుకుంటానని, ఆ పగలూ, కక్షలూ మనకొద్దు బాబూ. వలని నువ్వెలాగూ ఛేధించలేవు. నాలాటి అమాయక చేపలు ఆ వలలో పడకుండా రక్షించు. అదే నా చివరి కోరిక."

నా పెంపుడు తండ్రయిన సర్వోదయ నాయకుడు చెప్పిన భాష్యం కూడా అదే పగకన్నా కరుణ గొప్పదనే భాష్యానికి జీవితానుభవాన్ని జోడించి నా కన్నతండ్రి కోరిన చివరి కోరిక అది.

"తప్పక వెళతాను నాన్నగారూ!"

నేను మాట్లాడిన చివరిమాట అది. తూరుపు సూర్యుడ్ని మేఘం కమ్మింది. నిజాన్ని అబద్ధం మింగినట్లు వెలుగుని చీకటి కమ్మింది- నా తండ్రి మొహానికి నల్లటి ముసుగు తొడిగారు. నేను దగ్గిరుండి తాడుని పరీక్షించాను. చేతులకీ, బొటన వేళ్ళకీ తాడుకట్టి బంధించారు.

"అటెన్షన్."

పోతూన్న ప్రాణానికి గౌరవ సూచకంగా మేమంతా శ్రద్ధగా నిలబడ్డాం. ఓ రాజకీయమా! నీకు మా సపోర్టు వుంటుంది - అన్నట్టు మా పోలీసుల తుపాకులు నేలమీద దృఢంగా వున్నాయి. ఓ గూండాయిజమా! నీకు మా జోహార్లు - అన్నట్టు జైలర్లు తలవంచుకు నిలబడ్డారు.

నేను కర్చీఫ్ ఎత్తి పట్టుకున్నాను.

రామస్వామి మెడకు తాడు తగిలించాడు. ఈ చెయ్యి క్రిందకు దిగకుండా ఏ శక్తి ఆపగలదు? ఏ రాజకీయ నాయకుడు ఎన్నికల నిధి కోసం ఆ నగలు కొట్టెయ్యాలనుకున్నాడో ..... ఏ ధనవంతుడు తన ఇనప్పెట్టెలో మరో యాభై లక్షలు నింపుకోవటానికి గూండాల సాయం తీసుకున్నాడో ..... శాంతికి చిహ్నమైన నా తెల్లరుమాలు క్రూరంగా ఒక నిర్దోషి ప్రాణాలు తీస్తోంది.

నా చెయ్యి క్రిందకి దిగింది.

లివర్ కదిలింది.

టప టపా కొట్టుకుంటున్న కాళ్ళు - పక్షి రెక్కల చప్పుడు- ఇది ప్రాణం పోతున్న ధ్వనికి సంకేతమా? జగన్నాథ రథచక్రాల క్రింద నలిగే ధర్మపు ఫెళ ఫెళా రావమా?

ఓ సూర్యుడా! ఆగిపో. ఇదిగో నా దేశం. ఇక్కడ ప్రాణాలు డబ్బుకి అమ్ముతారు. ఇక్కడ మనుష్యులు పదవి కోసం, డబ్బుకోసం సాటి మనుష్యుల్ని కొనుక్కుంటారు. సత్యాన్ని వెలికితీయటం కోసం పోలీసులు కొడతారు. నేరం వప్పుకోలేని నిర్దోషి మరణిస్తే అది లాకప్ డెత్ అంటారు. దొంగతనం వప్పుకుంటే, మరొక పెద్ద లూటీ కోసం నాయకులే ప్రోత్సహిస్తారు.

చేసినట్టు సమాధి చేస్తారు. వాళ్ళు చేసే మారణహోమానికి సమిధలుగా ఉపయోగించుకుంటారు .....

"ఇది అలక్‌నందా నా కథ. ఇప్పుడు చెప్పు, ఎక్కడో గుళ్ళో దొంగతనం జరిగితే, దానికి ఈ స్టూవర్ట్‌పురం దొంగల్ని తీసుకువచ్చి తన్నడం సమంజసమా?"

అలక్‌నంద మాట్లాడలేదు. ఆమె ఇంకా ఈ ఘాతుకమైన కథ తాలూకు ప్రభావాన్నించి తేరుకోలేదు. రాణా ఆమెవైపే చీకట్లోకి చూస్తున్నాడు.

10

రెండు రోజులు గడిచాయి.

గుడి దొంగతనం గురించిన ఆధారాలేవీ బయటపడలేదు. స్టూవర్ట్‌పురం దొంగలు ఆ దొంగతనం చెయ్యలేదని తెలుసు. చాలా గొప్ప స్కీమింగ్‌తో, మంచి ప్లాన్‌వేసి చేశారు ఈ దోపిడీ. స్టూవర్ట్‌పురం వాళ్ళయితే ఈ విధంగా ఉండదు. తాళాలకి డూప్లికేటు తయారుచేయడం, వేలిముద్రల విషయంలో జాగ్రత్తపడటం, పోలీసు కుక్కలకి వాసన తెలియకుండా ప్రికాషన్స్ తీసుకోవటం లాటి పనులు వాళ్ళు చేయరు. వాళ్ళని మోటు పద్ధతులు.

ఇంత సైంటిఫిక్‌గా చెయ్యరు. అయినా పోలీసులు వాళ్ళనే లాకప్‌లో పెట్టారు. పోలీసులు పై అధికారులకి సంజాయిషీ చెప్పుకోవాలి మరి. ప్రోగ్రెస్ రిపోర్టు వ్రాయాలి. అందుకని ఏదో ఒకటి చెయ్యాలి. ఎవర్నో బలి పశువుల్ని చెయ్యాలి.

రాణాకి ఒక్క విషయం అర్థంకాలేదు.

సంవత్సరం క్రితం ఇదే దొంగతనం కోసం ప్రయత్నం జరిగింది. గార్డులనీ, పూజారి కొడుకునీ చంపేశారు. (ఆ నేరం తన వారిమీద వేశారు- అది వేరే సంగతి) వాళ్ళ ప్రయత్నం ఫలించలేదు.

కానీ --

కానీ --

మళ్ళీ దొంగతనం చెయ్యటం కోసం ఇంతకాలం ఎందుకాగారు? ఇదే దొంగతనం వెంటనే చేసి వుండవచ్చుగా! మొదటి నేరం ఎలాగూ తన తండ్రి మీదకు పోయింది. ఆ వైపు నుంచి భయమేమీ అఖ్కర్లేదు వాళ్ళకి. ఒకసారి రక్తం రుచి చూచిన పులి ఇంతకాలం ఎందుకాగింది?

అదే అర్థంకాని ప్రశ్న.

ఒక ప్రయత్నం జరిగాక ఇంత విలువైన ఆభరణాల్ని చూస్తూ ఎవరూ ఇంతకాలం వూరుకోరు. ఈ దొంగతనం ఎవరు చేశారో ఆ రహస్యం బయటపడాలంటే ముందు ఈ విషయం తెలియాలి. వాళ్ళు ఎందుకు వూరుకున్నారు ఇంతకాలం!

గంటల ప్రాంతంలో భరత్ అతడి దగ్గరకి వచ్చాడు. అతడి మొహమంతా ఉద్విగ్నంగా వుంది.

"మీతో అర్జంటుగా మాట్లాడాలి."

ఇద్దరూ వెళ్ళి హోటల్లో కూర్చున్నారు.

"చెప్పండి" అన్నాడు రాణా.

"నా వుద్యోగం పోయింది."

రాణా అదిరిపడి అతడివైపు చూశాడు. భరత్ మొహంలో దిగులేమీ లేదు. దానికన్నా ఎక్కువగా, ఏదో చెప్పాలన్న తపనే కనపడుతూంది.

"ఎలా పోయింది? ఎందుకు పోయింది?"

"అరవింద్ చౌరసియా ....." అన్నాడు భరత్. " ..... మా పత్రిక యజమానితో మాట్లాడాడు. చౌరసియాకి కూడా షేర్లున్నాయట. పోలీస్ లాకప్పులు, క్రిమినల్ కేసులు వున్నవాడిని ఎలా ఇంకా ఉద్యోగంలో వుంచారని అడిగినట్టున్నాడు. అసలు కారణం అదికాదు. 'ప్లాట్‌ఫాం బ్రతుకులు' వ్యాసం. అయినా దాని గురించి నాకేమీ బాధలేదు. జర్నలిస్టుకి వేరే ఉద్యోగం దొరకటం పెద్ద కష్టమేమీ కాదు. నేను ఇప్పుడొచ్చింది మీకు నా వుద్యోగం గురించి చెప్పటంకోసం కాదు. దేవాలయం నగల గురించి."

రాణాకి మరింత ఆకక్తి ఎక్కువైంది. ముందుకు వంగి, "నగల సంగతేమిటి?" అని అడిగాడు.

"ఈ వూళ్ళో బంగారం తాలూకు దొంగతనాలన్నిటికీ - రామాచారికి సంబంధం వుంది. బంగారం కరిగించటం, రాళ్ళు విడగొట్టటం, అమ్మటం, బ్రోకరేజి అన్నీ అతను చేస్తూ వుంటాడు."

"ఈ విషయ మీకెలా తెలిసింది?" అన్నాడు రాణా.

"కొంతకాలం పోలీసులు నన్ను లాకప్‌లో పెట్టారు కదా. ఒక దొంగ పరిచయమయ్యాడు. అతడు నన్ను కూడా ఒక దొంగే అనుకున్నాడు. ఒకే వృత్తిలో వున్న వాళ్ళ మధ్య సాధారణంగా రహస్యాలు వుండవు. మొన్న బజార్లో కలిశాడు. 'కొత్తగా ఏమైనా ప్లాన్ చేస్తున్నారా- పార్ట్‌నర్‌షిప్ కలుద్దామా'అని అడిగాడు. అతడిని మాటల్లో పెట్టాను. అతడు చెప్పింది నిజమైతే-"

"ఊ- నిజమైతే."

"సంవత్సరం-క్రితమే దేవాలయం నగలు దొంగిలించబడ్డాయి. ప్రస్తుతం దొంగిలించబడినవి గిల్టు నగలు."

గాఢమైన నిశ్శబ్దం వాళ్ళ మధ్య చోటు చేసుకుంది. రాణా ఆలోచనల్ల నుంచి తేరుకుని లేచి నిలబడుతూ, "థాంక్యూ. మిగతా విషయాలు నేను చూసుకుంటాను" అన్నాడు.

అతడి మనసులో అప్పటికే ఒక ఆలోచన రూపుదిద్దుకుంది.

*　　　*　　　*　　　*　　　*

రాణా కిప్పుడు విషయం పూర్తిగా అర్థమైంది.

సంవత్సరం క్రితం నగలు కొట్టేసి, దేముడికి గిల్టు నగలు అలంకరించారు. దొంగతనం జరిగి బయటకు వస్తూండగా గార్డులు చూశారు. వారిని కాల్చి చంపి తన తండ్రిని ఆ హత్యా కేసులో ఇరికించారు. దేముడికి(గిల్టు) నగలు యథాతథంగా వుండటంతో ఎవరి దృష్టి ఆ దొంగతనం మీదకు వెళ్ళలేదు. ఒకసారి దొంగతనం చేసి, వాళ్ళు గప్‌చిప్‌గా వుండిపోయారు. సంవత్సరం తరువాత ..... ఇప్పుడు ..... మళ్ళీ ఇంకొకరి దృష్టి ఆ నగల మీద పడింది. అవి గిల్టుని అని తెలియక వాటిని దొంగిలించారు.

ఎవరు?

తెలుసుకోవటం కోసం అతడు రామాచారి ఇంటి కెళ్ళాడు. ఇన్‌స్పెక్టర్ డ్రస్‌లో కాదు -- గొంగళి కప్పుకుని.

రాత్రి పదింటికి వచ్చిన ఆగంతకుడిని చూసి రామాచారి ఆశ్చర్యపోలేదు. అతడి వ్యాపారం మొదలయ్యేదే అప్పుడు.

"ఎవరునువ్వు?"

"మాది స్టూవర్ట్‌పురం బాబూ."

"ఇంతకుముందు నిన్నెక్కడా చూసినట్టు లేదే."

"రామస్వామి కొడుకుని. మొన్నే మా నాయన్ని ఉరి తీశారు."

"ఏమిటి విషయం?"

"ఒక ఉంగరం కొనాలె. దొంగిలించి రెండ్రోజులైంది. డబ్బు అవసరం చాలా వుంది" అంటూ అందించాడు.

"ఎక్కడ నుంచి కొట్టేశావురా దీన్ని?" అందుకుంటూ అడిగాడు.

"మొన్న గుళ్ళో దొంగతనం చేసింది నేనే సామీ."

రామాచారి మొహంలో రంగులు మారాయి. "ఆ దొంగతనం చేసింది నువ్వా? ఎవరు చేశారా అని చస్తున్నాను."

"ఉంగరం తీసుకుని డబ్బియ్యి సామీ."

"ఇది గిల్టు వుంగరంరా అబ్బీ నీకు పైసా రాదు."

"రాయిమీద పెట్టకుండా ఎలా తెలిసింది?"

చారి నాలుక్కర్చుకుని, "చూడగానే తెలుస్తుందిలే పో. తీసుకు పో." అంటూ ముందుకు తోశాడు. అది బల్ల సందుల్లో పడింది. రాణా వంగి దాన్ని తీసుకుని వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళగానే చారి తలుపు వేసుకున్నాడు. తను తెలుసుకున్న విషయం తనవాళ్ళకి చెప్పాలన్న తపన కాలు నిలువనీయలేదు ఫోన్ చేశాడు.

"ఎమ్మెల్యే నాయుడూ హియర్."

"నేనూ రామాచార్ని మాట్లాడుతున్నాను సార్. పాపం ఆ గిల్టు నగల్ని ఎవడో స్టూవర్టుపురం దొంగ కొట్టేశాడు. అవి నిజమైనవే అనుకుని నా దగ్గిరకు తీసుకొచ్చాడు. ఇంతకాలం వాటిని కొట్టేసిన మూర్ఖుడెవరా అనుకున్నాం."

"ఇంకా అక్కడ వాడున్నాడా?"

"లేడు సార్. గిల్టువని చెప్పి పంపేశాను."

"వాడు ఎం.పి. తాలూకు మనిషి అయి వుంటాడు."

"అదేమిటి సార్-?"

"అవును. మొన్న నగల్ని కొట్టేసింది ఎం.పి. అట. అది చెప్పుకునే నవ్వుకుంటున్నాం. తాను స్వయంగా అమ్మితే బాగోదని బహుశ తన మనిషిని పంపి వుంటాడు. పాపం, ఆ నగలన్నీ గిల్టువని తెలుస్తే వాడి మొహం ఎలా వుంటుందో ఇప్పుడు నాకు స్వయంగా చూడాలని వుంది."

"ఎవరో మళ్ళీ తలుపు కొడుతున్నారు. ఉంటాను సార్" ఫోన్ పెట్టేసి వెళ్ళి తలుపు తీశాడు రామాచారి.

ఎదురుగా రాణా వున్నాడు.

చారిని పక్కకు తోసి బల్ల దగ్గిరకు వచ్చాడు. అతడు అమర్చిన టేప్‌రికార్డరు ఇంకా 'ఆన్'లోనే వుంది.

రామాచారి మొహంలో కత్తివేటుకి రక్తం చుక్కలేదు. మనిషి వణికిపోతున్నాడు. రాణా మొత్తం సంభాషణ అంతా విన్నాడు.

అంతా విని రాణా "సో ....." అన్నాడు ..... "సంవత్సరం క్రితం ఒరిజినల్ నగలు ఎమ్మెల్యే కొట్టేసేడు. ఇప్పుడు గిల్టు నగలు ఎం.పి. కొట్టేసేడు."

రామాచారి మాట్లాడలేదు.

'దేముడా! రక్షించు నా దేశాన్ని' అనుకున్నాడు రాణా మనసులో. రామాచార్ని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కి తీసుకువెళ్ళాడు.

* * * * *

"వాడ్ని చంపెయ్యాలి" వీరదాస్ క్లుప్తంగా అన్నాడు. ఎమ్మెల్యే నాయుడు దాదాపు వణుకుతున్నాడు. మామూలు పరిస్థితుల్లో అయితే అంత భయపడేవాడు కాదు. కానీ తొందర్లోనే ఎలక్షన్స్ వస్తున్నాయి. కేసు నిలుస్తుందా లేదా అన్నది వేరే సంగతి. పేపర్లవాళ్ళు వదిలిపెట్టరు. సంవత్సరం క్రితం దొంగతనం-- గిల్టు నగలు- హత్యలు- అన్నీ ఇప్పుడు బయటపడ్డాయంటే కష్టం. ప్రజలకు భక్తి ఎక్కువ 'నగల దొంగ' అన్న పేరొస్తే చాలు- కోర్టు అవసరం లేదు-- డిపాజిట్టు కూడా దక్కదు.

ఎం.పి పులిరాజు కూడా వూరుకోడు. ఆ గిల్టు నగల్ని ఏ పెంటదిబ్బమీదో పడేస్తాడు.

దాంతో రామాచారి సాక్ష్యానికి మరింత బలం దొరుకుతుంది. అందుకే విషయం తెలియగానే అర్థరాత్రి వీరదాసు దగ్గిరకి పరుగెత్తుకు వచ్చాడు.

"వాడ్ని చంపెయ్యాలి" వీరదాసు లేచాడు. "ఈ రాత్రికే ..... వెంటనే."

నాయుడు వీరదాసుతో పాటు నడిచాడు ఎదురుచెప్పలేదు. విషయం ఎంత తీవ్రమైనదో తెలుసు. అప్పటికి రామాచారి అరెస్టు కాబడి రెండు గంటలైంది. వూరంతా నిద్రలో మునిగి వుంది.

వీరదాసు జీపు పోలీస్‌స్టేషన్‌కి ఫర్లాంగు దూరంలో ఆగింది. నలుగురు మనుష్యులు పెట్రోలు డబ్బాలు మోసుకొచ్చారు. పోలీస్‌స్టేషన్‌కి కుడివైపు వసారాలో వుంది లాకప్‌రూమ్. వసారా ముందు వరండాలో సెంట్రీ కునికిపాట్లు పడుతున్నాడు.

ఒకడు వెళ్ళి సెంట్రీతో "నిన్ను ఎం.పీ గారు పిలుస్తున్నారు" అన్నాడు. వాడు భయపడి "ఎక్కడ?" అన్నాడు. అంత అర్థరాత్రి ఎం.పీ గారు ఎందుకొచ్చారో తెలియలేదు.

"అక్కడ జీపులో వున్నారు."

సెంట్రీ పరుగెత్తుకు వెళ్ళాడు. అతడలా వెళ్ళగానే వీరదాసు చీకట్లోంచి ముందుకొచ్చాడు. నలుగురూ పెట్రోలు పోయటం, వీరదాసు అగ్గిపుల్ల వెలిగించటం ఒకేసారి జరిగాయి. వరద పారినట్లు లాకప్ రూమ్‌లోకి పెట్రోలు పారింది. దానితోపాటే మంటకూడా పాకింది. పెద్దగా ఆర్తనాదం చేస్తూ రామాచారి వూచలు వూపేస్తున్నాడు.

లాకప్ రూంలో నుంచి బయట పడడానికి ప్రయత్నం చేస్తున్నాడు. స్టేషన్‌లో నుంచి ఇద్దరు పోలీసులు బయటకొచ్చారు. లాకప్‌లో మండుతున్న శరీరం అటూ ఇటూ పరుగెడుతూంది. పోలీసులు కంగారుగా తాళం తీయడానికి ప్రయత్నిస్తున్నారు. అది రావడం లేదు. అక్కడంతా గందరగోళంగా వుంది. చివరి కెలాగైతేనేం - తాళం తీశారు. అప్పటికే లోపల్నుంచి వాసన వస్తోంది. ఒక పోలీసు సైకిల్ వేసుకుని రాణా ఇంటికి వెళ్ళాడు. రాణా వచ్చేసరికి చారి కొసప్రాణంతో కొట్టుమిట్టులాడుతున్నాడు. డాక్టరు అక్కడికే వచ్చాడు. ఇంకో అయిదూ, పదినిముషాల కన్నా ఎక్కువసేపు బ్రతకడం కష్టం అని చెప్పాడు.

"చూడూ" అన్నాడు రాణా. మోకాళ్ళమీద కూర్చుని, "చేసినంత కాలం పాపాలు చేశావు. చచ్చేముందైనా నిజం చెప్పడం మంచిది నీవల్ల ఈ రాష్ట్రానికి కొందరి పీడ తప్పుతుంది. లాకప్ రూమ్‌లోకి పెట్రోలు పోసింది ఎవరో చూశావా?"

"వీరదాస్."

రాణా వ్రాసుకున్నాడు.

"సంవత్సరం క్రితం వాళ్ళు నగలు దొంగతనం చేశారు. ఆ విషయంలో నువ్వు అప్రూవర్‌గా మారుతున్నావని తెలిసి నిన్ను చంపేశారు. అవునా?"

"అవును."

"సంవత్సరం క్రితం మీరు చేసిన దొంగతనంలో గార్డుల్ని ఎవరు చంపేసేరు?"

"వీరదాసు."

"ఆ నేరం ఎవరిమీద వేశారు?"

"రామస్వామి మీద."

"దీని వెనుక ఇంకెవరయినా వున్నారా?"

"ఎమ్మెల్యే నాయుడుగారు."

"ఇదంతా నువ్వు స్పృహలో వుండే చెపుతున్నావా?"

"నేనిదంతా స్పృహలో వుండే చెపుతున్నాను."

రామాచారి డెత్ స్టేట్‌మెంట్ మీద రాణా సంతకం తీసుకున్నాడు. ఆ తరువాత అరగంటకి చారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

దాదాపు రెండు అవుతూండగా వీరదాసు అడ్డాకి బయల్దేరి వెళ్ళాడు రాణా. అక్కడ అందరూ అప్పుడే నిద్రకి ఉపక్రమిస్తున్నారు. పోలీస్ వ్యాన్ చప్పుడికి కలకలం బయల్దేరింది. వీరదాస్ అనుచరులు అడ్డు చెపుతూంటే పక్కకితోసి లోపలికి వెళ్ళాడు.

కళ్ళు నులుముకుంటూ తలుపుతీసిన వీరదాసు ఎదురుగా రాణాని చూసి ఆశ్చర్యపోయాడు. కానీ క్షణంసేపే అది. విశాలంగా నవ్వుతూ "రండి సార్ ఏమిటి అర్థరాత్రి దాటాక వచ్చారు" అన్నాడు.

"రామాచారి హత్యకేసులో నిన్ను అరెస్ట్ చేస్తున్నాను."

వీరదాసు ఆశ్చర్యం ప్రకటిస్తూ, "రామాచారి చచ్చిపోయాడా? ఎక్కడా? ఎప్పుడు?" అన్నాడు.

రాణా అతడివైపు కన్నార్పకుండా కొంచెంసేపు చూసి, నాటకానికి ఆఖరి తెర వేస్తున్నట్టు "మరణ వాంగ్మూలం ఇచ్చాడు. అన్నీ చెప్పి సంతకం పెట్టాడు" అన్నాడు.

వీరదాసు మొహంలో నవ్వు మాయమైంది.

ఇద్దరిమధ్యా భయంకరమైన నిశ్శబ్దం.

"ఎంతకావాలి? చెప్పు! ఇరవైవేలు ..... "

రాణా అతడినే చూస్తున్నాడు.

"ఆ స్టేట్‌మెంట్ చింపెయ్యి. విషయం ఇప్పుడే సెటిల్ చేస్తాను."

"విషయం సెటిల్ చెయ్యడానికి వచ్చాను. పద!"

వీరదాస్ కదల్లేదు. "చాలా కష్టాల్లో పడతావ్ రాణా. ఇప్పుడే ఉద్యోగంలో చేరావు. స్నేహంగా వుండు."

"నువ్వింకో క్షణంలో నాతో రాకపోతే సంకెళ్ళు వేసి తీసుకువెళ్ళాల్సి వుంటుంది."

మళ్ళీ అదే చూపు. వీరదాసు ఒక నిర్ణయానికి వచ్చినట్టు ఫోన్ దగ్గరికి నడచి డయల్ చేశాడు. రెండు నిముషాల్లో కనెక్షన్ వచ్చింది.

"హల్లో! కామినిగారా -- మినిష్టర్ గారున్నారా? ఏం లేదు. చిన్న ట్రాన్స్‌ఫర్ కావాలి.

ఇప్పుడే క్షణాలమీద. ఆహా -- అలా బెదిరిస్తే చాలు ఎవరో కుర్ర ఇన్‌స్పెక్టర్ ..... అరెస్ట్ చేస్తానని అర్థరాత్రి వచ్చి కూర్చున్నాడు. అనుభవం తక్కువ, మీరు మాట్లాడతారా? సరే"

ఫోన్ అందించాడు వీరదాసు. రాణా అందుకున్నాడు.

"ఏమిటి రాణా - మళ్ళీ ఏదో గొడవ చేస్తున్నట్టున్నావ్?"

"ఈ అర్థరాత్రి పూట నేనేం చేస్తున్నానో మీకు చెప్పనవసరం లేదనుకుంటాను. మీరేదైనా చెప్పదల్చుకుంటే చెప్పొచ్చు."

"నేనిప్పుడు చెప్పినా ఒకటే. ఈ రాజకీయ వలయంలో చిక్కుకోకు. చాలా కష్టాల్లో పడతావు."

"మీరు చెప్పేది ఇంకేమైనా వుందా?"

"రాష్ట్రంలో అధికార పార్టీకి వీరదాసు అవసరం చాలా వుంది."

"ఇంకా ఏమైనా వుందా?"

"తొందరలో ఎలక్షన్ లొస్తున్నాయి."

"తెలుసు. ఇంకా ఏమైనా?"

అవతల ఫోన్ దగ్గరికి ఎవరో వచ్చిన అలికిడి.

కామిని భర్తకి అంతా చెప్పినట్టుంది. హోం మినిస్టర్ లైన్‌లోకి వచ్చాడు.

"నీ పేరు?"

"రాణా సర్. స్టూవర్ట్‌పురం ఇన్‌స్పెక్టర్ని"

"ఆ కేసు చూసీ చూడనట్టు వదిలెయ్యి."

"సార్ ..... చనిపోయిన వ్యక్తి డెత్ స్టేట్‌మెంట్‌లో క్లియర్‌గా చెప్పాడు వీరదాసే తనని కాల్చేసేడని."

"నీ డెత్ స్టేట్‌మెంట్‌ని తగలెట్టు. F.I.R. ఇంకొకటి వ్రాసుకో."

"కానీ సర్!"

"వెంటనే ఫోన్ పెట్టేసి నేను చెప్పినట్టు చేస్తావా? ఇప్పటికిప్పుడు ట్రాన్స్‌ఫర్ చేయమంటావా?"

రాణా ఫోన్ పెట్టేశాడు.

వీరదాసు నవ్వాడు.

రాణా పిడికిలి బిగించి అతడి దవడ మీద బలంగా కొట్టాడు. ఫోన్‌తో సహా వీరదాసు క్రిందపడ్డాడు. అతడు లేచే లోపులో చేతులకి సంకెళ్ళు వేసి భుజం పట్టుకు లేపాడు.

" పోలీస్‌స్టేషన్‌కి పద" అన్నాడు కామ్‌గా.

* * * * *

రాత్రి మూడింటికి---

వీరదాసుని అరెస్ట్ చేసి రాణా పోలీస్‌స్టేషన్‌కి తీసుకొచ్చే సమయానికి- అక్కడంతా సందడిగా వుంది. ఎమ్మెల్యే నాయుడు, డియస్పీ, పోలీసులు, జనం, యస్సై అందరూ వున్నారు. అంతా పొక్కిపోయింది. అర్థరాత్రి పూట అంత హడావుడి ఆ పోలీస్‌స్టేషన్ చరిత్రలో అదే ప్రథమం.

“ఎంత ధైర్యం నీకు? హోం మినిస్టర్ చెప్పాక కూడా అరెస్ట్ చేస్తావా?” అన్నాడు నాయుడు.

“ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ వచ్చేవరకూ నేనిక్కడ ఇన్‌స్పెక్టర్నే” అన్నాడు రాణా.

డియస్పీ సీట్లోంచి లేచాడు. ఎందుకో తెలీదుగానీ అతడి మొహం విచారంగా వుంది.

“ఐయాంసారీ రాణా. నిన్ను వెంటనే ట్రాన్స్‌ఫర్ చెయ్యమని ఆర్డరు ..... వీరదాసుని వదలిపెట్టని పక్షంలో” అన్నాడు. అతని మాటల్లో నిస్సహాయత గోచరిస్తోంది.

రాణా ముగ్గురివైపూ చూశాడు. వీరదాసు తల వంచుకుని కూర్చుని చేతి బేడీల వైపు చూసుకుంటున్నాడు. వంచిన తలక్రింద పెదవులు నవ్వుకుంటున్నాయి.

ఫోన్ ఎత్తి ఎక్స్చేంజికి చెప్పాడు. “ఢిల్లీ కనెక్షన్ ఇవ్వు. 2426921 -- లైటినింగ్ కాల్.”

ముగ్గురూ ఆశ్చర్యంగా చూస్తూ వుండగా రాణా ఫోన్‌లో మాట్లాడాడు. “సారీ అర్థరాత్రి డిస్టర్బ్ చేసినందుకు. మీరు అన్నంతా అయింది. ఇక్కడ రాష్ట్ర హోం మినిస్టరుగారు అడ్డుపడుతున్నారు ..... అవును ..... వీరదాస్ అరెస్ట్ విషయంలోనే --- ఏమిటీ? కేసు సి.బి.ఐ.కి ట్రాన్స్‌ఫర్ చేస్తారా-- ఒక్క నిమిషం -- మా డియస్పీ గారితో మాట్లాడుదురు గానీ” అంటూ డియస్పీకి అందించబోయాడు ఆయనింకా షాక్‌నుంచి తేరుకోలేదు.

“ఎవరు అటువైపు?” అని అడిగాడు.

“ప్రైమ్ మినిస్టర్ ప్రైవేట్ సెక్రటరీ సర్ ..... ” అన్నాడు రాణా.

ఒక్కసారిగా ఆ గదిలో కలకలం రేగింది. రాణా తనే ఫోన్‌లో తిరిగి మాట్లాడుతూ “సరే సార్-- మళ్ళీ ఏదైనా అవసరం వస్తే మాట్లాడతాను” అని ఫోన్ పెట్టేశాడు.

వీరదాసుని లాకప్‌లో వేసి, తాళం చేతులు డియస్పీ ముందు పడేసి “నేను చెయ్యవలసిన పని చేశాను సర్. ఇక మీ ఇష్టం. నన్ను ఎక్కడికి ట్రాన్స్‌ఫర్ చేస్తే అక్కడికి ఈ క్షణమే రిలీవ్ అయిపోతాను” అన్నాడు.

నాయుడు వైపు డియస్పీ ‘ఏం చెయ్యమంటారో చెప్పండి” అన్నట్టు చూశాడు. నాయుడు వీరదాసు వైపు సెల్‌లోకి చూశాడు. అక్కడంతా చీకటిగా వుంది. ఏమీ కనబడలేదు. అంతా అయోమయంగా వుంది నాయుడికి. కథ ఈ విధంగా తిరుగుతుందని అతడు వూహించలేదు. హోమ్ మినిస్టర్‌తోగానీ, కామినితోగాని మాట్లాడాలి.

“రేప్రొద్దున్న కలుద్దాం” అంటూ హడావుడిగా అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు.

పోలీస్‌స్టేషన్ నిండా శ్మశాన నిశ్శబ్దం పరుచుకుంది. ముగ్గురు అధికారులూ

బయటకొచ్చారు. తెల్లవారడానికి ఇంకా రెండు గంటలు టైముంది. చల్లగాలి రివ్వున వీస్తోంది. పెళ్ళో- అంత్యక్రియలో లాటిది జరిగి, అంతా పూర్తి అయిపోయిన తరువాతి రిలీఫ్ .....

"నాకు ఆశ్చర్యంగా వుంది రాణా. నీకు ..... నీకు ప్రధానమంత్రి దగ్గర అంత పలుకుబడి వున్నదా?" డియస్పీ అడిగాడు.

రాణా నవ్వాడు. "వాడు అయిదు నంబర్లు తిప్పి- హైదరాబాద్- హోం మినిష్టరుతో మాట్లాడు అన్నాడు సార్. నేను ఏడు నంబర్లు తిప్పి ఢిల్లీ -- ప్రైం మినిష్టర్ అన్నాను. నేనెవడితో మాట్లాడానో నాకే తెలీదు. ఏదో నోటికొచ్చిన నెంబర్ చెప్పానంతే ..... "

ఇద్దరూ నోరు తెరుచుకు వింటున్నారు.

రాణా అన్నాడు- "ఉపాధ్యాయ కాలనీ వాళ్ళు వచ్చినప్పుడు నేను వాళ్ళకి ఒకటే సలహా ఇచ్చాను సార్. 'మీ తరపు నుంచి మీరేదైనా చెయ్యండి" అని. అసెంబ్లీ వుంది. ప్రతిపక్షం వుంది. అన్నిటికీ మించి ప్రెస్ వుంది."

రాణా కొనసాగించాడు. "రేప్రొద్దున్న వరకూ వీరదాస్‌ని సెల్‌లో వుంచగలిగితే చాలు. ప్రెస్‌లో ఈ వార్త వచ్చేస్తుంది. నాదేముంది సార్. ఇంకో వూరునుంచి ఈ వూరు వచ్చాను. ఈ వూరునుంచి ఇంకో వూరు వెళ్తాను. అందుకే నాయుడుకి ప్రధానమంత్రి పేరు చెప్పి భయపెట్టాను" అంటూ తిరిగి నవ్వాడు. ఇద్దరూ అప్రతిభులై విన్నారు. డియస్పీ అటెన్షన్‌లోకి వచ్చాడు. "ఒకప్పుడు నేనెలా వుండాలనుకునేవాడినో, ఇప్పుడు నువ్వలా వున్నావ్ రాణా ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ మై డిపార్ట్‌మెంట్" అని హాట్ తీసి చేత్తో పట్టుకుని రాణాకి సెల్యూట్ చేశాడు? రాణా నిరుత్తరుడై వారించే లోపులో అతనన్నాడు- " ..... నేను వయసులో వున్నపుడు ఇంత ధైర్యం చెయ్యలేక, తెలివితేటలు లేక తాగుబోతునీ, లంచగొండినీ అయిపోయాను. ఎస్కేపిజాన్ని ఎన్నుకున్నాను. ఇప్పుడు ..... ఇప్పుడు నిన్ను చూసి నేను నిజంగా గర్వపడుతున్నాను" అతడి కళ్ళలో తడి కదలాడింది.

ఆ ముగ్గురు ఆఫీసర్ల మీదా తూర్పునుంచి వెలుగురేఖలు నెమ్మదిగా విచ్చుకుంటున్నాయి.

*  *  *  *  *

వాళ్ళు అనుకున్నట్టు వీరదాసు ఆ మరుసటిరోజు లాకప్‌నుంచి రిలీజు కాలేదు.

రాణాకి ట్రాన్స్‌ఫర్ రాలేదు.

ఈవెనింగ్ ఎడిసన్ పేపరులో మాత్రం ఈ వార్త ప్రముఖంగా వచ్చింది.

దాంతో సంచలనం చెలరేగింది.

అసలు ఆ రోజు ప్రొద్దున్నకే ఈ వార్త ఊరంతా పొక్కిపోయింది. ఎం.పి. పులిరాజుకి, తను కొట్టేసినవి గిల్టు నగలని-- రెండు రోజుల ముందే తెలిసింది. తేలుకుట్టిన దొంగలా వుండిపోయాడు. ఇప్పుడు వీరదాసు అరెస్టుతో అసలు విషయం బయటపడింది. నగలు దొరకలేకదన్న విచారం కన్నా - వీరదాసు అరెస్టు, నాయుడు దొంగతనం బయటపడటం

అతడికి సంతోషం కలగజేశాయి.

అంతలో రాణాని ట్రాన్స్‌ఫర్ చేసి, డెత్ స్టేట్‌మెంట్ మాయం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న వార్త తెలిసింది. ఢిల్లీ ఫోన్ చేశాడు. ప్రధానమంత్రి స్వయంగా ఈ కేసు విన్నాడు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల మీద కేంద్రానికి ఒక ప్రత్యేకమైన ఇంట్రెస్టు వుంది. కేంద్రంలో వున్న పార్టీకి రాష్ట్రంలో వున్న పార్టీ ఒక తలనొప్పిగా తయారైంది.

ఇప్పుడిది ఒక మంచి అవకాశంగా ప్రధానమంత్రి భావించాడు. గుడి దొంగతనంలో ఎమ్మెల్యేకి పాత్ర. ఒక రౌడీని అరెస్టు చేయబోతే హోం మినిస్టర్ ఇన్‌స్పెక్టర్‌ని బదిలీ చేయడం ..... ఈ రెండూ చాలు-- ఎలక్షన్ల ముందు రాష్ట్ర అధికార పార్టీమీద దుమ్ము జల్లడానికి.

క్షణాల్లో సూచనలు వెళ్ళాయి. కేంద్ర అధికార పార్టీ ప్రముఖుడు ఆ వూరు వచ్చాడు.

రాష్ట్ర హోం మినిష్టర్ భార్యకి వ్యతిరేకంగా పోలీస్‌స్టేషన్ ముందు కేంద్రం టెంట్ వేసింది.

ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని సాకుగా పెట్టుకుని సెంటర్ Vs స్టేట్ యుద్ధం ప్రారంభమైంది.

ప్రత్యర్థుల్ని ఫూల్స్‌ని చేయడానికి రాణా ఫోన్‌లో సరదాగా ఏం నాటకం ఆడాడో అదే నిజమైంది.

"నువ్వు దొంగ" అంటే "నువ్వు దొంగ" అని తేల్చుకోవడం కోసం ఇరు పక్షాలు దొంగల వూరయిన స్టూవర్ట్‌పురంలో బలాలు సమీకరించారు.

11

"రేపు మన వూళ్ళో బంద్ నిర్వహించాలి. రెండోజుల తరువాత ఆంధ్రప్రదేశ్ బంద్‌కి మన పార్టీ పిలుపునిస్తుంది. అదీ ప్రస్తుత ప్రోగ్రామ్" అన్నాడు హోమ్ మినిస్టర్.

నాయుడు తలూపాడు.

వీరదాసు గతంలో చేసిన మంచి పనులేమైనా వుంటే వెలికి తీయండి.

నాయుడు కాస్త ఆలోచించి "అతడు ఒక్క మంచి పని చేసినట్టు కూడా గుర్తులేదు" అన్నాడు.

"ఎండాకాలంలో చలివేంద్రాలు పెట్టించడం నుంచి -- వరద బాధితులకి చందాలు వసూలు చేయడం వరకూ ఏదో ఒకటి వుండకపోదు."

నాయుడు ఏదో స్ఫురించినట్టు "గుర్తొచ్చింది. గత సంవత్సరం చీరాలలో జరిగిన అగ్నిప్రమాద సందర్భంలో ఈ జిల్లాలో చందాలు వసూలు చేశాం" అన్నాడు. క్రితం సంవత్సరం వంద పాకలు తగలబడి ఆస్తి నష్టం జరిగింది. ఆ సమయంలో వీరదాసు స్వయంగా "కార్యకర్తల్ని" పంపి ఆ జిల్లాలో చందాలు వసూలు చేయించాడు. కొంచెం పేరున్న వ్యాపారెవరయినా పదివేలకు తక్కువ ఇస్తే ఈ "కార్యకర్తలు" ఆ చందా "స్వీకరించటానికి" వప్పుకోలేదు. మొత్తం పది లక్షలు వసూలైనట్టు భోగట్టా. అయితే అది అగ్నిప్రమాద బాధితులకి చేరనేలేదు. అదంతా వేరే సంగతి.

ఆ సాయంత్రానికి వూరంతా వాల్‌పోస్టర్లు అతికించబడ్డాయి. వేల కొద్దీ పాంపెట్లు పంచారు. "పోలీసు జులుం నశించాలి" బీదలపాలిట పెన్నిధి వీరదాసు అక్రమ నిర్భంధం" వగైరా హెడ్డింగులున్న కరపత్రాలు రాత్రికి రాత్రి ప్రింట్ చేయబడ్డాయి.

ఆ మరుసటోరోజు ప్రొద్దున్నే వూరు బంద్ ప్రారంభమయింది.

అయితే ఈ కురుక్షేత్ర సంగ్రామంలో అవతలి పార్టీకూడా ఖాళీగా లేదు. కేంద్రం నుంచి పర్యవేక్షకుడుగా వచ్చిన కార్యదర్శి పులిరాజును కలుసుకొని వ్యూహం రచించాడు.

-- గుడిలో పవిత్రమైన నగల దొంగతనం జరిగింది. దీనికి కారణం ఎమ్మెల్యే.

-- రామస్వామి అనే అమాయకుడిని వురి తీశారు.

రామాచారి చనిపోతూ తనని కాల్చింది వీరదాసు అని స్వయంగా చెప్తే, ఆ వాంగ్మూలం ఆధారంగా వీరదాసుని అరెస్ట్ చేస్తే, ఇప్పుడు రాష్ట్ర పార్టీ ఆ వీరదాసుని విడిపించుకోవడానికి ప్రయత్నం చేస్తోంది.

"మహా ప్రజలారా! ఇటువంటి పార్టీని రాష్ట్ర అధికారంలో వుంచుతారా? మీరే ఆలోచించండి."

--- ఈవిధంగా సాగింది వారి ప్రోపగాండా.

కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ ఈ పరిణామాల పట్ల చాలా సంతోషంగా వుంది. ఈ కేసు బలంగా ప్రజల్లోకి వెళ్ళేకొద్దీ ముఖ్యమంత్రి మరింత బలహీనమై- సాలెగూడులో చిక్కుకు పోతాడని కేంద్ర పార్టీకి తెలుసు.

రాణాకి మాత్రం ఇదంతా ఆశ్చర్యంగానూ, అసహ్యంగానూ వుంది. అమాయకుడైన తన తండ్రి వురి తీయబడ్డప్పుడు ఏ అలజడీ లేదు ..... గుళ్ళో నగలు పోయినప్పుడు ఏ మిన్నూ విరిగి మీద పడలేదు. వీరదాసు అనే ఒక హంతకుడిని, పూర్తి సాక్ష్యాధారాల్తో అరెస్ట్ చేస్తే, దానికింత ప్రతిస్పందన!

ప్రొద్దున్న ఏడింటికి రాష్ట్ర పార్టీవాళ్ళు రిక్షాల్లోనూ, సైకిళ్ళమీద ప్రచారానికి బయల్దేరారు. కార్యకర్తలు జీపుల్లో మెయిన్ బజార్లో పర్యవేక్షణ జరిపి, దుకాణాలు బంద్ చేయించారు. కానీ అది పది నిమిషాల సేపే అంతలో అవతలి పార్టీవాళ్ళు వచ్చి మళ్ళీ దుకాణాలు తెరిపించారు. వీళ్ళిలా వెళ్ళగానే మళ్ళీ వాళ్ళు వచ్చి మూసేయించారు. 'ఎవడ్రా మిమ్మల్ని ముయ్యమంది?' అని వాళ్ళొచ్చి కొట్టారు. 'ఎవడ్రా తెరవమన్నది' అని వీళ్ళొచ్చి కొట్టారు. ఇలా సాయంత్రం వరకూ సాగింది. ఏ పార్టీ వ్యవహారాల్లోనూ కలుగ జేసుకోవద్దని పోలీసులకి ఇన్‌స్ట్రక్షన్లు వచ్చాయి. వాళ్ళు ప్రేక్షకుల్లా వుండిపోయారు.

సాయంత్రానికి -- రాష్ట్ర ప్రభుత్వం తరపు పేపర్లు 'బంద్ సంపూర్ణం' అని వ్రాశాయి. కేంద్ర పార్టీ తరపున పత్రికలు 'బంద్ విఫలం' అని వ్రాశాయి. మొత్తానికి బంద్ పాక్షికం అనుకున్నారు ప్రజలు. మర్డర్లు జరగనందుకు హాయిగా వూపిరి పీల్చుకున్నారు.

ముఖ్యమంత్రికి ఏం చెయ్యాలో తోచడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో తానుగానీ

వీరదాసుకి సాయపడకపోతే రేపు జైలునుంచి బయటకొచ్చాక తనతో వీరదాస్ ఇంతకు ముందున్నంత 'స్నేహం'గా వుండక పోవచ్చు. అతడిమీద దాదాపు వందమంది ఎమ్మెల్యేలు ఆధారపడి వున్నారు. అతడు ప్లేటు మార్చేస్తే తన పార్టీ బలహీనం అయిపోతుంది. ఆ ఇన్‌స్పెక్టర్ని ఎలా లొంగదీయాలి? వీరదాసుని గౌరవప్రదంగా ఎలా బయటకు తీసుకురావాలి? ఈ పరిస్థితుల్లో రాణా మీద ఏ చర్య తీసుకున్నా, కనీసం ట్రాన్స్‌ఫర్ చేసినా కష్టమే.

ముఖ్యమంత్రి హోం మినిష్టర్‌తో సంప్రదింపులు జరిపాడు. అతడూ ఏ విధమైన సలహా ఇవ్వలేకపోయాడు. హోం మినిష్టర్ ఇంటి కొచ్చేసరికి భార్య ఢిల్లీ వెళ్ళిందని తెలిసింది.

అంత అర్జెంటుగా, తనతోనైనా చెప్పకుండా కామిని ఢిల్లీ ఎందుకు వెళ్ళిందో రెడ్డికి అర్థంకాలేదు.

రాజకీయాల్లో సరయిన నిర్ణయాలు సరయిన టైమ్‌లో తీసుకోవాలి. రాజకీయ చదరంగంలో వెంట వెంటనే ఎత్తులు వేయగలవాడే చివర్లో 'షా' చెప్పగలడు. అటువంటి శక్తి కామినికి వుంది.

తనని ముఖ్యమంత్రిని చేయటానికి కామిని ఢిల్లీ వెళ్ళిందని అతడు కలలో కూడా వూహించలేదు.

*　　*　　*　　*　　*

"ఎందుకంత అర్జెంటుగా ఢిల్లీ వెళ్ళొచ్చావ్?" అరవింద్ చౌరసియా అడిగాడు.

కామిని నవ్వింది. "ఈ టైమ్‌లోనా అటువంటి ప్రశ్నలడిగేది?" అంది నవ్వుతూనే. తెల్లటి దీపపు కాంతి ఆమె నగ్న శరీరం మీద మరింత తెల్లగా మెరుస్తూంది. ఆమె చెయ్యి అతడి వెన్నెముక మీద నుంచి క్రిందికి నెమ్మదిగా జారి ముందు కొస్తూంది. అక్కడ సుతారంగా కదిలి అతడిని వెర్రివాడిని చేయటానికి ప్రయత్నిస్తోంది. ఆ లయ విన్యాసం చాలా కొద్దిమంది ఆడవాళ్ళకి మాత్రమే సాధ్యం.

అయినా చౌరసియా టెంప్ట్ కాలేదు.

"రాష్ట్రంలో ముఖ్యమంత్రిని మార్చటానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లున్నాయి." అన్నాడు. ఆమె కలవరపాటుని అణుచుకుని- "అటు వంటిదేమీ లేదే" అంది.

"నాకు తెలియనిదంటూ ఏమీలేదు కామినీ. తెలియదని అనుకుంటే అది పొరపాటు" అని క్లుప్తంగా ..... "రాణా విషయం కూడా నాకు తెలుసు."

"ఏ విషయం."

"అతడు చాలా మంచి ఇన్‌స్పెక్టర్ అని" --- 'మంచి' అన్న విషయం నొక్కి పలుకుతూ అన్నాడు. ఆమెకి అర్థంకాలేదు.

“అయినా ఆ విషయాలన్నీ నాకు సంబంధించినవి కావులే. నీ భర్తని నువ్వు చీఫ్ మినిష్టర్‌ని చేసుకుంటే నాకేం? -- ప్రైం మినిస్టర్‌ని చేసుకుంటే నాకేం?” ఆమెని ఆక్రమించుకుంటూ అన్నాడు.

అతడు లయబద్ధంగా కదులుతున్నాడు. ఆమె ఆలోచన్లు మాత్రం వేరేచోట కదుల్తున్నాయి.

వీరదాసు అరెస్టు సాకుతో తన భర్త పార్టీ మార్చబోతున్నాడని చౌరసియాకి ఎలా తెలిసింది?

* * * * *

“ఏం కావాలి?” రాణా అడిగాడు.

“వీరదాస్ గారి కోసం బెయిల్ తెచ్చాను” అన్నాడు కుర్రలాయరు.

“నేరస్తుడిని ఇరవై నాలుగ్గంటల్లోగా మేజిస్ట్రేటు ముందు హాజరుపరచాలి. ఆ విషయమై మీ పై అధికార్లకి కంప్లయింట్ కూడా చెయ్యబోతున్నాను” అంటూ బెయిల్ పేపర్లు అందించాడు.

రాణా వాడివైపు నిస్సహాయంగా చూశాడు.

ఒక్కసారి వీరదాసు బయటకొచ్చాడంటే ఇక ఈ కేసులో అతడికి శిక్ష పడటం కల్లోమాట. కేసు కోర్టువరకూ కూడా వెళ్ళదు.

ఏం చెయ్యాలి?

అతడు బెయిల్ పేపర్ల వైపు చూశాడు. “ఇవి రామాచారి హత్య కేసుకి సంబంధించినవి. నేను వీరదాసుని అరెస్ట్ చేసింది సంవత్సరం క్రితం జరిగిన గుడి దొంగతనం కేసులో” అన్నాడు. రాణాకి లీగల్ పాయింట్స్ తెలీదు. చిత్రమేమిటంటే ఆ లాయర్‌కీ అవి సరీగ్గా తెలీదు.

“దానిక్కూడా ఓ గంటలో బెయిల్ తీసుకొస్తా” అంటూ కుర్చీలోంచి లేచాడు.

సరిగ్గా అదే సమయానికి నాయుడు లోపలకు ప్రవేశించాడు. “ఏం జరుగుతుంది?” అని ప్రశ్నించాడు.

రాణా కసిగా “ముందు బంద్ చేశారు. అది ఫెయిల్ అయ్యేసరికి ఇప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు” అన్నాడు.

నాయుడు నవ్వేడు. “ఇక బందూ లేదు. న్యాయస్థానమూ లేదు. మొత్తం కేసే క్లోజయి పోతూంటే-”

“కేసెలా క్లోజవుతుంది?” రాణా అడిగేడు.

“చచ్చిపోతూ చచ్చిపోతూ ఆ రామాచారి ఇచ్చిన డెత్ స్టేట్‌మెంట్ అదే - ఆ మరణా వాఙ్మూలం నువ్వు చింపేస్తే.”

“నేను చింపుతానని మీరెలా అనుకున్నారు?”

నాయుడు నవ్వుతూనే వున్నాడు. రాణా మనసు కీడు శంకించింది.

నాయుడు వైపు అయోమయంగా చూశాడు.

నాయుడు నవ్వేడు. 'అంత పెద్ద సమస్యకి ఎంత చిన్న పరిష్కారమో చూశావా?' అన్నట్టుంది ఆ నవ్వు. నవ్వుతూనే అన్నాడు " ..... మీ పోలీసులు ఇంటరాగేషన్ పేరు చెప్పి సంవత్సరాలజ తరబడి నేరస్తుల్ని లాకప్పులో వుంచుతారు. వాళ్ళని బయటకు తెచ్చుకోవటం కోసం ఆ నేరస్థుల తరపు వాళ్ళు ఒక ప్రభుత్వాధికారిని కిడ్నాప్ చేస్తారు.

దాంతో మీరు లాకప్‌లో వున్నవాడిని వదిలిపెడతారు. ఇదంతా సహజమేగా. పోతే ఇప్పుడిక్కడ జరిగిన మార్పేమిటంటే, ప్రభుత్వాధికారుల్ని బదులు మీ అలక్‌నందాని మా దగ్గిర వుంచుకున్నాం. అంతే తేడా!"

రాణా నిరుత్తరుడై చూశాడు. నాయుడు మొహంలో నవ్వు మాయమైంది.

"చచ్చిపోతూ రామాచారి ఇచ్చిన స్టేట్‌మెంట్ మా కిస్తే ఆ అమ్మాయిని వదిలిపెడతాం" అన్నాడు.

రాణా ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు. ఈ కోర్టులూ, ఈ సాక్ష్యాలూ -- వీటన్నింటికీ అతీతమైనది 'దాదాగిరి' అని అతడికి తెలుసు. కానీ దాని విష ఫలితాన్ని ఇన్నేళ్ళ సర్వీసులో ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాడు. ఒక నేరస్తుడిని అరెస్ట్ చేస్తే, ఇరవైనాలుగు గంటలు తిరిగేలోగా బెయిల్ ఒకరు, బెదిరింపు ఒకరు తెచ్చారన్నమాట. ఇక న్యాయం ఏం నిలబడుతుంది?

అప్పటికీ అతడు జాగ్రత్తగానే వున్నాడు. వీరదాస్‌ని అరెస్ట్ చేసిన ఇరవైనాలుగ్గంటలలోపే మేజిస్ట్రేటు ముందు హాజరుపరచి, పధ్నాలుగు రోజులపాటు పోలీస్‌స్టేషన్‌లో వుంచటానికి అనుమతి తీసుకున్నాడు. చట్టరీత్యా అంతకన్నా ఎక్కువ రోజులు సాధ్యంకాదు. వీరదాస్‌ని వీలైనంత ఎక్కువకాలం రిమాండ్‌లో వుంచాలని రాణా ప్రయత్నం అయితే దానికి ఇన్ని వైపుల్నుంచి ప్రతిఘటన ఎదుర్కోవలసి వస్తుందని అతడు వూహించలేదు.

నాయుడు అన్నాడు-- "నాకు నీ నిర్ణయం ఏమిటన్నది వెంటనే తెలియాలి."

"లేకపోతే?"

"చెప్పానుగా. అలక్‌నందా సంగతి మరో అయిదు నిమిషాల్లో అక్కడ ప్రాణం పోతుంది."

"నమ్మమంటారా?"

"నమ్మకపోతే మరో గంట ఆగు. పోస్ట్‌మార్టమ్ చేద్దూగాని."

"మైగాడ్ ....." అంటూ కుర్చీలోంచి లేచి, రాణాప్రతాప్- రాణా ప్రతాప్" అని అరిచాడు బిగ్గరగా.

"అదేమిటి నీ పేరు నువ్వే పిల్చుకుంటున్నావ్."

"ఓ ..... అది నా పేరే కదూ. కంగార్లో మర్చిపోయాను. తాళాలు ఎక్కడ? యస్సై ఏడీ?సెల్ తాళాలు తీసి వీరదాసుని వదలమని చెప్పు వెంటనే ..... !! ఎక్కువ టైమ్ లేదు" కంగారుగా అరవసాగాడు.

కుర్రలాయరు ఉత్సాహంగా నాయుడివైపు చూశాడు. 'అనవసరంగా 'లా' చదివాను. ఏ దాదానో, ఎమ్మెల్యేనో అయివుంటే బావుండేది కదా' అనుకుంటున్నట్టున్నాడు కాబోలు.

నాయుడు ఇచ్చిన గడువుకి ఇంకా నాలుగు నిముషాలు టైముంది.

"ఆ డెత్ స్టేట్‌మెంట్ ఇవ్వు" నాయుడు అన్నాడు.

"మీ చేతికివ్వను అలక్‌నందా క్షేమంగా వుందని కళ్ళారా చూశాకే ఇస్తాను" ఖశ్చితంగా అన్నాడు.

"వీరదాసుని విడుదల కాకుండా ఆ అమ్మాయిని మా వాళ్ళు వదలరు."

"వీరదాసు వెంటనే వదులుతున్నాను" విసుగ్గా అన్నాడు రాణా. యస్సై వైపు తిరిగి, "ఏం? తాళాలు దొరికాయా?" అని అరిచాడు. కర్రా భయపడుతూ, "వెతుకుతున్నాం సార్" అన్నాడు.

"నాన్సెన్స్. ఏం పోలీస్‌స్టేషన్ ఇది? సెల్‌లో మనిషిని విడుదల చెయ్యాలంటే తాళాలు కనబడవు. అయ్యో- ఇంకా రెండు నిముషాలే టైముందే ఏలా?" అంటూ నాయుడివైపు తిరిగి, "వెంటనే మీ వాళ్ళకు ఫోన్ చెయ్యండి-- ఆ అమ్మాయిని ఏం చెయ్యొద్దని" అన్నాడు.

"వీరదాసు బయటికొస్తే ఏం చెయ్యరు."

ఈ లోపులో బ్రహ్మానందం బాలకిషన్ పోలీస్‌స్టేషన్ పెరట్లోంచి ఒక గడ్డపార తెచ్చాడు. రాణా నాయుడితో "మీరేమీ కంగారు పడకండి. మా జైలు తాళాలు రానప్పుడల్లా గడ్డపలుగుతో ఇలా పగులకొట్టడం అలవాటే, ఆడిట్ అబ్జెక్షన్ లేదు" అంటూ డ్రాయర్ తెరచి అందులోంచి కవర్ జేబులో పెట్టుకున్నాడు. ఈ కవర్ మీ వాళ్ళకు అందజేసి అలక్‌నందాని తెచ్చుకుంటాను, ఆవిధంగా మీ వాళ్ళకి చెప్పండి. మళ్ళీ అక్కడ వాళ్ళని గొడవేమీ చెయ్యొద్దని కూడా చెప్పండి. అరె - బాలకిషన్! అలా చూస్తావేమిట్రా తొందరగా ఆ వీరదాసుని బయటికి తియ్యి. అక్కడ ఒక మనిషి ప్రాణాలు పోతున్నాయి. నాయుడుగారూ- ఇంకా అలా నిలబడ్డారేమిటండీ, మీ వాళ్ళకు చెప్పండీ."

అతని కంగారు చూస్తుంటే నాయుడికి నవ్వొస్తుంది.

'ప్రేమ గుడ్డిది' అని నవ్వుకున్నాడు. బయట కార్లో వున్న తన మనుష్యులకు సైగ చేసి, "వెళ్ళు" అన్నాడు రాణాతో.

రాణా వెళ్ళిపోగానే నాయుడు పలుగుతో సెల్ తాళం మీది బలంగా ఒక దెబ్బ వేశాడు. అది వూడింది. లోపల వీరదాసుకి బయట ఏం జరిగిందో తెలీదు. అతడు బయటికొచ్చాడు. "ఏమైంది" అని అడిగాడు.

"వెళ్ళాక చెప్తాను" నాయుడి మొహంలో విజయగర్వంతో కూడిన చిరునవ్వు కదలాడుతోంది. ఇద్దరూ మరో కార్లో ఎమ్మెల్యే ఇంటివైపు బయల్దేరారు.

రాణా, నాయుడి మనుషుల్తో కలిసి అతడి రైస్‌మిల్ వద్దకు చేరుకున్నాడు. అక్కడ మస్తాన్ వున్నాడు. "ఏదీ కాగితం తెచ్చావా?" అని అడిగాడు. రాణా మారు మాట్లాడకుండా జేబులోంచి

కవర్ తీసి ఇచ్చాడు. మస్తాన్ దాన్లోంచి కాగితం బయటికి తీశాడు. టైప్ చేయబడి వున్న ఆ కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపేసి, రాణాతో "సరె నువ్వెళ్ళు" అన్నాడు.

"మరి అలక్‌నందా?"

"అలక్‌నంద మా దగ్గి ర్లేదు. అసలావిడని మేం చూడనేలేదు."

రాణా "ఇది అన్యాయం" అన్నాడు.

మస్తాన్ నవ్వేడు. "నువ్వు మరింత తెలివితేటల్తో ఉద్యోగం చెయ్యాలి భాయ్. అయినా మేం ఆ అమ్మాయిని బంధించామనుకో. ఇప్పుడు మళ్ళీ విడుదల చేసేవనుకో. చివరికి అదే అయింది కదా. ఇంటికెళ్ళు. ఆ అమ్మాయి అక్కడే క్షేమంగా వుంటుంది" అన్నాడు.

రాణా ఇంటికి వెళ్ళలేదు. అలక్‌నందా గురించి అతడికి బెంగలేదు. ఆమెకు ఏదో అవుతుందన్న భయం సంగతి అలావుంచితే వీరదాస్‌లాటి క్రిమినల్‌ని జైల్లో వుంచడం కోసం, అలక్‌నందాని వదులుకోవడానికయినా అతడు సిద్ధంగా వున్నాడు.

రాణా ఎమ్మెల్యే ఇంటికి చేరుకునేసరికి ఎమ్మెల్యే, కుర్ర లాయరు పేకాడుతున్నారు. అప్పుడే వీరదాసు విడుదల అయినట్టు తెలిసి, అక్కడ గుంపు పోగవుతోంది. ఎమ్మెల్యే ఆనందంతో తలమునకలవుతూ ఏదో జోకులు వేస్తున్నాడు.

రాణా రావటం చూసి విశాలమైన నవ్వుతో "రా ..... రాణా? నీ లవ్వర్ క్షేమంగానే వుందనుకుంటా. మేమేదో సరదాగా ట్రిక్ చేశాం. అంతా సుఖాంతమే కదా" అన్నాడు.

"నాకు సుఖాంతమే---"

స్ట్రయికర్‌తో కొట్టబోతూన్న వీరదాసు తలెత్తాడు.

"అంటే--- " నాయుడు అనుమానంగా అడిగేడు.

"జైలు గోడలు బ్రద్ధలుకొట్టి బయటికొచ్చినందుకు వీరదాసుకోసం నాన్ బెయిలబుల్ వారంట్ తీసుకొచ్చాను."

ఒక్కసారిగా అక్కడ సూదిపడితే వినపడేటంత నిశ్శబ్దం వ్యాపించింది. కుర్ర లాయర్ లేచి, "అండర్ సెక్షన్ ..... " అంటూ ఏదో చెప్పబోయి, రాణా తీక్షణంగా చూడటంతో ఆగిపోయాడు.

"ఇది అన్యాయం" అరిచాడు నాయుడు. "తాళాలు పారేసింది నువ్వు. సెల్ బ్రద్ధలుకొట్టి ....."

అతడి మాటలు మధ్యలో ఆపుచేస్తూ "సెల్ బ్రద్ధలు కొట్టేటప్పుడు నేను అక్కడ లేను" అన్నాడు రాణా. " ..... మా పోలీసులేమో గడ్డపార మీద మీ వేలిముద్ర లున్నాయంటున్నారు. అదే నిజమైతే వీరదాసుతో పాటు మిమ్మల్నీ అరెస్ట్ చెయ్యాలి. చెప్పండి. అతడికి సాయంగా వుండటం కోసం మీరూ వస్తారా-- వాడిని తీసుకెళ్ళమంటారా?" కావాలనే 'వాడు' అని వాడాడు. వీరదాసు మొహం ఎర్రబడింది. ఎమ్మెల్యే చెంప పగలగొడ్తాడేమో అన్నంత విసురుగా దగ్గిరకొచ్చి అతడి కాలర్ పట్టుకొని ఒక బూతుమాటతో తిట్టాడు. "సెల్ తాళాలు

పోయాయనగానే, తాళం బ్రద్ధలుకొట్టటమేనా?''

ఎమ్మెల్యే మాట్లాడలేదు. ''నేను బ్రద్ధలు కొట్టడం నువ్వూ చూశావు కదా'' అనొచ్చు --అంత ధైర్యం లేదు! ఒక బజారు గూండా, ఎమ్మెల్యేని అత్యంత చౌకబారు బూతు మాటతో అందరిముందూ తిట్టినా పడివుండవలసిన ప్రజాస్వామ్యం ఇది. తిరిగి మాట అనగలడా?

అప్పటివరకూ ప్రేక్షకుడిలా వున్న రాణా, ''పద'' అన్నాడు.

''డెత్ స్టేట్‌మెంట్ మాకు ఇచ్చేసేవుగా. ఇక కేసేమిటి?'' వీరదాసు అడిగాడు.

'' పోలీస్‌స్టేషన్ నించి కవరు జేబులో పెట్టుకుని నేను బయల్దేరిన మాట నిజమే. అది తీసుకుని మస్తాన్ 'అలక్‌నందా అపహరణ కేవలం నాటకం', 'నువ్వు మరింత తేటల్తో పనిచెయ్యాలి భాయ్' అని అన్నాడు. అయితే ఆ సంబరంలో నేను ఏ కాగితం ఇచ్చానో కూడా వాడు చూసుకోలేదు. ' పోలీస్‌స్టేషన్ -- పరిసరాల పరిశుభ్రత' అన్న విషయం మీద మాకు అందిన సర్క్యులర్ కాపీ అది. రామాచారి మరణ వాంగ్మూలం 'చేతి వ్రాత'లో వుంటుంది. అని కూడా చూసుకోనంత మూర్ఖుడు నీ అసిస్టెంట్ మస్తాన్. పోలీస్‌స్టేషన్‌లోనే దాన్ని పరిశీలించాలీ అన్నంత తెలివితేటలు కూడా లేనివాడు నీ మరో అనుచరుడు ఎమ్మెల్యే నాయుడు. పద వీరదాసూ! మర్డర్ కేసులో నీకు బెయిల్ దొరకొచ్చేమో కానీ, లాకప్ రూమ్ బ్రద్ధలు కేసులో మాత్రం దొరకదు. దేశమంతా ఎదురు నిల్చినా సరే-- నీతో పోరాడతాను నేను.''

రాణా మాటలు పూర్తిగా వినలేదు వీరదాసు. తన చుట్టూ వల ఎలా బిగుసుకుందో అర్థమైంది. చూడటానికీ, వినటానికీ చాలా సిల్లీగా వుండే పాయింటు అది. కానీ జాగ్రత్తగా అల్లబడిన వల అది. ఈ నాయుడేగానీ తన అపూర్వమైన తెలివితేటల్తో ఇంత వెధవ ప్లాను చేయకపోయి వుంటే తానీపాటికి బెయిల్‌మీద బయటికి వచ్చేసి వుండేవాడు.

జరిగిందంతా తల్చుకొని వీరదాసు పట్టలేని కోపంతో నాయుడి చెంపమీద లాగిపెట్టి కొట్టి రాణాతో కలిసి బయల్దేరాడు.

ఇక్కడ ఈ వ్యవహారం జరుగుతున్న సమయానికి ఢిల్లీలో పులిరాజు ప్రధానమంత్రితో మాట్లాడుతున్నాడు.

వీరదాసు వ్యవహారం ఆధారంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికార పార్టీని ఎలా కూలగొట్టాలా అల వాళ్ళు ఆలోచిస్తున్నారు.

ఇటువంటి విషయాల్లో తను స్వయంగా పాల్గొనటం ఇష్టంలేనట్టు ప్రధానమంత్రి కొద్దిసేపు మాట్లాడి అక్కడనుండి తప్పుకున్నారు. మిగతా సంభాషణని, కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ చీఫ్ కొనసాగించారు.

పులిరాజు ఆనందంతో తలమునకలవుతున్నాడు. వీరదాసు అరెస్టు రాష్ట్ర పార్టీకి పెద్ద దెబ్బ అని తెలుసు. ఎమ్మెల్యే నాయుడి మీద అది తన వ్యక్తిగత విజయం! ఆ ఆనందంలో ఒకటికి రెండు జోడించి, తన గొప్పతనం గురించి చెప్పాడు. ఆ పార్టీవాళ్ళు వీరదాస్ అరెస్టు సందర్భంగా ఏ విధంగా బంద్ నిర్వహించబోయిందీ, తమ కార్యకర్తల సాయంతో దాన్నెలా విధ్వంసపరిచిందీ వివరించి చెప్పాడు.

నగల చోరీ విషయంలో పేపర్లలో మొదటి పేజీలో ఆ విషయం ప్రచురించబడేలా తనెలా చేసిందీ. ప్రజల్లో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పార్టీపట్ల అసహ్యం పెంపొందటానికి ఎలా స్కీమ్ వేసిందీ చెప్పి, ఇక ఆ పార్టీకి రాష్ట్రంలో పుట్టగతులుండవు అన్నట్టు వర్ణించాడు. అసలు పులిరాజు ఆ గదిలోకి రాగానే, ఆనందోత్సాహాలు నిండిన కంఠంతో "సబ్ హోగయా సాబ్. హమారీ స్టేట్ మే సక్సెస్" అన్నాడు.

"హిందీ ఖూనీ చెయ్యకు. ఇంగ్లీషులో మాట్లాడు" అన్నాడు పార్టీ చీఫ్. పులిరాజు బిక్కమొహంతో "ఐ నో - నో గుడ్ ఇంగ్లీష్. ట్రై అండర్‌స్టాండ్" అన్నాడు. పార్టీ చీఫ్‌కి పొలమారింది.

"నీ స్వంత భాషలో మాట్లాడు నాయనా" అన్నాడు.

ఢిల్లీలో ఇది చాలా సాధారణ విషయమయినట్టు- హిందీ ఇంగ్లీషురాని రాజకీయ నాయకుల కోసం వుండే తర్జుమాదారు, పై విషయాలన్నీ పార్టీ చీఫ్‌కి అనువదించి చెప్పాడు. అంతావిని, "వీరదాస్ అంత పవర్ ఫుల్ మనిషన్న మాట" అన్నాడు పార్టీ చీఫ్ ఏమీ తెలియనట్టుగా.

"అవునుసార్. చాలామంది ఎమ్మెల్యేలు అతనివల్లనే నెగ్గారు. వాడు గానీ బరిలో నిలబడితే ఇక ఎదురులేదు. రిగ్గింగ్ నుంచి, అభ్యర్థుల్ని చంపటం వరకు అన్నిటికి వాడే ముందుంటాడు."

"అలాంటివాడు ఎదుటి పార్టీలో వున్నాడు. ప్రస్తుతం జైల్లో వున్నాడు."

"అవును. ఇక తప్పించుకోలేడు మన పార్టీ ఆ విషయంలో చివరి వరకూ పోరాడుతుంది."

"అతను జైల్లోంచి బయటకు రావాలంటే తప్పనిసరిగా మన పార్టీ సానుభూతి అతనిమీద వుండాలి."

"అవును సార్. మన సహాయ సహకారాలు లేకుండా అతనేమీ చేయలేడు. చచ్చినా బయటకు రాలేడు. ఆ విధంగా అన్నీ పకడ్బందీగా నేను ఏర్పాటు చేశాను" గర్వంగా అన్నాడు పులిరాజు.

"అంత బలమైనవాడు మన ప్రత్యర్థి గ్రూపులో వుంటే అతడికి సహాయ సహకారాలు అందించటం పోయి ఇక్కడికొచ్చి అదేదో గొప్ప ఘనకార్యంలా చెపుతావా? అసలు నువ్వు రాజకీయ నాయకుడివి ఎలా అయ్యావు పులిరాజూ?"

పులిరాజు అదిరిపడ్డాడు. ప్రెసిడెంటు నవ్వేడు.

"రాజకీయాల్లో చచ్చిన పాముని మరింత చంపకూడదు. మన వర్గం లోకి లాక్కొని కొంచెం పాలుపోసి పెంచి, బలం పుంజుకున్నాక ప్రత్యర్థి మీదకే వదలాలి. అది మొదటి పాఠం."

పులిరాజుకి పార్టీ ప్రెసిడెంటు చెప్పేది పూర్తిగా ఆచరణ సాధ్యమేనా అన్న అనుమానం కలుగుతూంది. అసలిదంతా ఎలా సాధ్యం? వీరదాసుని తమ వైపు తిప్పుకునే ప్రయత్నం సులభం కావొచ్చు. కాకపోవచ్చు. కానీ నాయుడు విషయం ఏమిటి? అతడెలా వూరుకుంటాడు? ఎందుకు వూరుకుంటాడు? ఎమ్మెల్యే నాయుడికి తెలియకుండా వీరదాసుని తమవైపుకి తిప్పుకుని, అతడిని విడిపించటం ఎలా కుదురుతుంది? లోకల్‌గా తమ ఊళ్ళో వున్న ఎమ్మెల్యేకి అనుమానం రాకుండా, వీరదాసుకి ఎలా సాయం చేయట? ఆ విషయమే పార్టీ ప్రెసిడెంట్ దగ్గర చెప్పాడు.

అతడు నవ్వి "వీరదాసుని ఒక్కడినే మనలో కలుపుకుంటున్నామని ఎందుకు అనుకుంటున్నావ్ పులిరాజూ ..... ఎమ్మెల్యేని, హోంమినిస్టర్‌ని కూడా మనవైపు తిప్పుకుందాం" అన్నాడు.

పులిరాజుకి తల తిరుగుతున్నట్టు అనిపించింది. ఇది తన విజయమో, ఎమ్మెల్యే విజయమో అర్థంకాలేదు. అసలు పార్టీలో తన స్థానమేమిటో అర్థంకాలేదు ముందు. అప్పుడు ప్రవేశించింది ఆమె. ఆమెపట్ల వున్న గౌరవమో అభిమానమో తెలియదుగానీ, పార్టీ ప్రెసిడెంట్ లేచి నిలబడ్డాడు. తనతో మాట్లాడేటప్పుడున్న తేలికతనం ఇప్పుడు లేకపోవటం పులిరాజు గమనించాడు. ఆమెని చూస్తుంటే అతడి కళ్ళు చెదిరిపోయాయి. ఆమె అందంవల్ల కాదు, హుందాతనం వల్ల ఆ గ్రేస్ వచ్చింది.

ఆమె కామిని!

రాష్ట్ర హోమ్ మినిస్టర్ భార్యని తమ పార్టీ కార్యాలయంలో చూడటం పులిరాజుకి అంతులేని అయోమయాన్ని కలుగజేసింది. కామిని తన సహజసిద్ధమైన చిరునవ్వుతో నమస్కారం చేసి "బావున్నారా" అని అడిగింది. బావున్నట్టో-లేదో కానీ పులిరాజు తల వూపాడు.

"ఈ పార్టీ ప్రతినిధిగా మీరు నాతో వస్తే, మిగతా విషయాలు నేను చూసుకుంటాను" అన్నదామె.

"ఎక్కడికి రావాలి?" అన్నాడు పులిరాజు.

"ఎమ్మెల్యే నాయుడి దగ్గరికి."

"చచ్చినా రాను. ఇదిగో చూడమ్మాయ్, మా ఇద్దరిమధ్యా వైరం నీ వయసుకన్నా ఎక్కువ కాలంనుంచీ వుంది. నా పక్కనున్న ఈ ముసలోడికి తెలుగు రాదు కాబట్టి సరిపోయింది. కానీ లేకపోతే నేనన్న ఈ మాటలకి వెంటనే కల్పించుకుని 'రాజకీయాల్లో పెర్మనెంట్‌గా శత్రుత్వమూ

మిత్రత్వమూ అంటూ ఏదీ వుండదు. అది మూడో పాఠం' అని వుండేవాడు. నా ఇన్నేళ్ళ అనుభవంతో చెపుతున్నాను. పార్టీ(హై) కమాండ్ ఆజ్ఞ ననుసరించి నేను నాయుడి దగ్గరకెళ్ళి ఆత్మని చంపుకుని బ్రతిమాలినా అతడు చెట్టెక్కి కూర్చుంటాడు.

"అతడికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పిస్తామన్నా అలాగే బింకంగా వుంటాడా?"

పులిరాజు వులిక్కిపడి "నాయుడికి మంత్రి పదవా?" అన్నాడు.

కామిని నవ్వింది. "ఇదంతా చేసినందుకు మీకు అమెరికన్ రాయబారి పదవి లభించబోతూంది. ఒకే ఊళ్ళో వుంటూ నాయుడి మొహం రోజూ చూసే అవసరం మీకు వుండదు. పార్టీ మార్చి మంత్రి అయిన నాయుడి కన్నా, పార్టీలో వుంటూ అమెరికా రాయబారి అయిన మీకే మీ ఊళ్ళో ఎక్కువ పరపతి వుంటుంది. ఆలోచించండి."

ఆలోచించటానికేమీ లేదని పులిరాజుకి తెలుసు. ఈ కామినికి తన అనుభవమంత వయసులేదని అన్నాడు. కానీ ఆమె ఆలోచించే వేగంలో సగం తనకి లేదు. ఎక్కడో ఆంధ్ర రాష్ట్రంలో ఒక రౌడీ జైలుకి వెళ్తే, వాడిని విడిపించటం కోసం పడే పోటీలో రాష్ట్ర అధికార పార్టీని కుర్చీ దింపవచ్చు అన్న ఆలోచన కలిగినందుకే ఈమె అభినందనీయురాలు.

"నువ్వేమీ అనుకోకపోతే ఒక చిన్న అనుమానం"

"అడగండి"

"మారబోతూన్న రాజకీయాల కొత్త సెటప్‌లో మీ ఆయన ముఖ్యమంత్రి కాబోతున్నాడా?"

ఆ ప్రశ్నకి ఆమె మొహంలో ఒక మనోహరమైన రిలాక్సేషన్ కనిపించింది. "ఆ కోరిక మీకే వుంటే, ఆ పదవి మీకే వదిలి మేము అమెరికా వెళ్ళి సెటిలవ్వటానికి అభ్యంతరం ఏమీలేదు" అంటూ ఆమె నవ్వింది.

ఆ నవ్వుతో అతనికి నాలుగో పాఠం అర్థమైంది. "రాజకీయాల్లో నాకు ఏం వస్తుందని ఆలోచించకు. నీకు వచ్చేది సరిపోతుందో లేదో ఆలోచించుకో."

*        *        *        *        *

"నా భార్య చెప్పింది నాకు బాగానే వున్నట్టు అనిపిస్తోంది. మా పార్టీలో ఎంతకాలమున్నా నాకు భవిష్యత్తు లేదు పోతే నాకు కేంద్రం నుంచి ఒక వాగ్దానం కావాలి. వీలైనంత త్వరలో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని రద్దు చేయాలి. నేను ఈ పార్టీకి రాజీనామా చేసి, మీ పార్టీలో చేరతాను. అంత లోపులో మొత్తం అందర్నీ మీ పార్టీ వైపుకి తిప్పేస్తానని వాగ్దానం చేస్తున్నాను. మధ్యంతర ఎన్నికల్లో మనదే గెలుపు" హోం మినిస్టర్ అన్నాడు. ఎమ్మెల్యే నాయుడు అతడివైపు అదోలా చూశాడు. ఈ రెడ్డి హోమ్ మినిస్టర్ ఎలా అయ్యాడా అన్నది నాయుడికి ఎప్పుడూ అనుమానమే కేవలం కామినిలాంటి స్త్రీ భార్య అవటమే దానికి కారణం అని అతడి ప్రగాఢ విశ్వాసం. "నా భార్య చెప్పింది నాకు బాగానే వున్నట్టుంది" అనేవాడు ఈ రాష్ట్రానికి హోం మినిస్టర్!! పులిరాజు, నాయుడు, రెడ్డి, వీరదాసు టేబుల్ చుట్టూ కూర్చుని

వున్నారు.

నాయుడన్నాడు- "ఇంతకాలం ఈ ఊళ్ళో మా రెండు పార్టీల మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది అటువంటిది ఇప్పుడు నేను మా పార్టీని వదిలేసి కేంద్రంలో వున్న పార్టీలో చేరితే మా వాళ్ళు మొహాన ఉమ్మెయ్యరూ?"

"రాజకీయాల్లో అవన్నీ మామూలు కదా! అన్నీ తెలిసిన వాడివి నీకు చెప్పేది ఏముంది?" అన్నాడు ఎం.పి. పులిరాజు. ఎలాగైనా వాళ్ళిద్దర్నీ తన పార్టీలోకి చేర్చి రాష్ట్ర ప్రభుత్వాన్ని కూలగొట్టగలిగితే, తనకు అమెరికన్ రాయబారి పదవి వస్తుందని ఆ ఇంగ్లీషూ హిందీ రాని రాజకీయ నాయకుడి ఆశ!

నాయుడు అన్నాడు. "పార్టీ మారితే మా హోం మినిస్టర్‌గారు చీఫ్ మినిస్టర్ అవుతారేమోగానీ, నేనేమవుతానూ?" అని. అతడి మాటలు ఇంకా పూర్తికాకుండానే- "నేను సి.యం. నవ్వాలేగాని నువ్వు నా హోమ్ మినిస్టర్‌వి. దానికి తిరుగులేదు" అన్నాడు రెడ్డి.

బల్ల చుట్టూ నలుగురూ కూర్చుని వున్నారు. మధ్యలో పళ్ళేలనిండా స్వీట్లూ, పూల బొకేలూ వున్నాయి. సఫారీ సూట్ల వాళ్ళు బయట హడావుడిగా తిరుగుతున్నారు.

హోం మినిస్టర్ సమావేశంలో అవన్నీ మామూలేగానీ, ఆ సమావేశం పోలీస్‌స్టేషన్‌లో జరగటం ఒక విశేషమైతే, అందులో నాలుగో మెంబర్ ఆ పట్టణపు లోకల్ గూండా వీరదాసు అవటం మరొక విషయం.

రాణా మోటార్ సైకిల్‌మీద స్టేషన్ కొచ్చేసరికి బయట అరుగు మీద టేబిల్ వేసుకుని కూర్చుని వేరుశనక్కాయలు తింటూన్న డియస్పీ కనపడ్డాడు. దూరంగా ప్రభుత్వ జీపులూ, కార్లూ కనిపించాయి. అతడికో క్షణం పరిస్థితి అర్థంకాలేదు.

"లోపల హోం మినిస్టర్‌గారు వీరదాసుతో మాట్లాడుతున్నారు. ఎవర్నీ రానివ్వద్దన్నారు. ఎం.పీ. ఎమ్మెల్యేలు కూడా లోపలే వున్నారు" అన్నాడు డియస్పీ.

" పోలీస్‌స్టేషన్‌ని రాజకీయ వ్యభిచార శాలగా మార్చారన్నమాట" కసిగా అన్నాడు రాణా.

"అలా ఎందుకు అనాలి? 'కురుక్షేత్రంలో సంధి ప్రయత్నం' అనుకో. ఇద్దరూ వేర్వేరు పార్టీలవాళ్ళు కదా" అన్నాడు డియస్పీ.

ఇద్దరిమధ్యా ఈ సంభాషణ ఇలా జరుగుతూ వుంటే, లోపల మరొక రకంగా చర్చలు జరుగుతున్నాయి.

"వీలైనంత తొందరగా మధ్యంతర ఎన్నికలు జరిపించమని మీ హైకమాండ్‌కి చెప్పండి. ఈ లోపులో వీలైనంత మందిని కూడగట్టుకుని నేను పార్టీ మార్చేస్తాను. ఇక ఈ రాష్ట్రపార్టీకి మంచినీళ్లు కూడా పుట్టవు" అన్నాడు హోం మినిస్టర్.

"ఏ పార్టీ ఎన్నికల్లో నెగ్గాలన్నా మన వీరదాసు జైలునుంచి బయటకు రావటం ముఖ్యం. అతడి ద్వారా అరవింద్ చౌరసియాను మన వైపుకు తిప్పుకోవచ్చు. రాష్ట్రంలో మన పార్టీ

అధికారంలోకి రావాలంటే కనీసం అయిదారు వేలమంది గూండాలు రిగ్గింగ్ చేయవలసి వుంటుంది. కోటిరూపాయలు ఖర్చయినా అంతమందిని సప్లై చేయగలిగేది కేవలం అరవింద్ చౌరసియా ఒక్కడే. ఏం వీరదాసూ ..... నేను చెపుతున్న దాన్లో తప్పేమీ లేదుకదా?''

తప్పేమీ లేదన్నట్టు వీరదాసు తల అడ్డంగా వూపేడు.

ఎమ్మెల్యే కొనసాగించాడు. ''ఇదంతా మనమొక ప్రిస్టేజిగా తీసుకుని రెండు మూడు రోజుల్లో వీరదాసుని విడిపించాలి. మనం కలిసిపోయినట్టు ముఖ్యమంత్రికి అనుమానం రాకూడదు. వీరదాసు బయటకు రాగానే అతను రాష్ట్రంలో గొడవలు సృష్టించాలి. పరిస్థితులు భయంకరంగా మారాలి. అప్పుడు కేంద్రం రాష్ట్రంలో గవర్నర్ పాలన విధించటం, మనమంతా పార్టీకి రాజీనామాలు సమర్పించటం ఒకేసారి జరగాలి. అరవింద్ చౌరసియా అప్పుడు మనకి సాయంచేసి, ఎన్నికల్లో గెలిచేలా చెయ్యాలి.''

''ఈ కాంట్రాక్టు వీరదాసు ఒక కోటి రెండు కోట్లకు చౌరసియాతో సెటిల్ చెయ్యాలి. కొత్త పార్టీ అధికారంలోకి రాగానే మన రెడ్డిగారు చీఫ్ మినిష్టర్ అయ్యేట్టు చూసే బాధ్యత కేంద్రానిది. ఇదీ మన ప్లాను'' అన్నాడు నాయుడు.

''కరెక్టుగా చెప్పావ్'' అన్నట్టు చూశాడు రెడ్డి.

''దీనికి నేను శాయశక్తులా సాయపడతాను'' అన్నాడు రాజు.

''అన్నిటికన్నా ముందు చేయాల్సింది వీరదాసుని విడిపించటం''

''ఆ విషయం నాకు వదిలిపెట్టండి'' లేచాడు పులిరాజు.

హోమ్ మినిష్టర్ బయటికి రాగానే మెట్ల దగ్గర నిలబడిన రాణా, డియస్పీలు సెల్యూట్ చేశారు. హోం మినిష్టర్ వాళ్ళని ఆశీర్వదిస్తున్నట్టు చెయ్యెత్తి వెళ్ళిపోయాడు. ప్రభుత్వ కారులు పెద్ద శబ్దం చేసుకుంటూ కదిలాయి. ఎం.పీ, ఎమ్మెల్యేలు చూడనట్టే నటించారు.

''ఇక నేను లోపలికి వెళ్ళొచ్చా సార్?'' రాణా అడిగాడు. అతడి గొంతులో వెటకారం లేదు. ఓటమి వుంది.

''వెళ్ళి వీరదాసుని సెల్‌లో పెట్టు'' అన్నాడు డియస్పీ. రాణా తలెత్తి చూశాడు. డియస్పీ తల దించుకున్నాడు. సెల్‌లో పెట్టటం ఒక్కటే తాత్కాలిక విజయం- అన్నట్టు రాణా కదిలాడు.

లోపల వీరదాసు టేబిల్ ముందు కూర్చుని కేక్ తింటున్నాడు. ఇంకా పువ్వులు అలాగే పడివున్నాయి. నౌఖర్లు దండలు తీస్తున్నారు. రాణాని చూసి తినటం ఆపి లేచాడు. ''చూశారా సార్. మీ స్టేషన్నే పబ్లిక్ ప్లేస్ చేసి మీటింగ్ పెట్టుకున్నాం క్షమించండి''

''సెల్‌లోకి వెళ్ళు'' మొహం అభావంగా పెట్టి అన్నాడు రాణా.

వీరదాసు వినయపూర్వకమైన అవహేళనగా నవ్వేడు. "వెళ్తాను సాబ్. హోమ్ మినిష్టర్‌గారే పిల్చి కూర్చోబెట్టారు. అప్పటికీ నేను చెప్పాను సాబ్, నా అడ్డాలో తప్ప ఇలాంటి చర్యలు బయట చెయ్యనని. పోలీస్‌స్టేషనే నీ అడ్డా అనుకో - అన్నారు. అప్పటికీ నేనన్నా సార్ 'ఇది రాణా ఆఫీసు. అతడికి తెలియకుండా అతని స్టేషన్ని మనం వాడుకోవటం బావోదు' అని. మా హోమ్ మినిష్టర్‌కి అసలు బుద్ధిలేదు సాబ్. మర్యాద తెలీదు. ' రాణా అంటే ఎవడు? మా యంత్రాంగంలో బోల్టు లాటివాడు. కాసిని వేరుశనక్కాయలిచ్చి బయట అరుగుమీద కూర్చోమంటే కూర్చుంటాడు' అన్నాడు. సారీసార్ ఇంతసేపూ మీ కుర్చీలో కూర్చుని వాళ్ళిద్దర్నీ కలపటానికి సంప్రదింపులు జరిపాను" అంటూ కుర్చీని కాలితో రాణావైపుకి తోశాడు.

రాణా అతని భుజం పట్టుకున్నాడు. ..... "చూడూ! నీ వెటకారం నా కర్థమైంది. రెండు పార్టీలేకాదు. దేశంలో వున్న పార్టీలన్నీ ఏకమైనా సరే నిన్ను ఉరికంబం ఎక్కించబోతున్నాను. నా తండ్రి ఎలా వురి తీయబడ్డాడో ..... సరిగ్గా అలాగే ..... "

వీరదాస్ మొహంలో నవ్వు మాయమైంది. "నిజమా? చూద్దాం. నీ కళ్ళముందే నేనెలా బయటికి వెళ్తానో చూద్దూగాని, అసలు ఈ కేసు కోర్టు వరకూ కూడా వెళ్ళదు. ఛాలెంజి"

రాణా ఏదో అనబోతూ వుంటే ఒక స్త్రీ లోపలికి ప్రవేశించింది. అందరూ విస్మయంగా అటు చూశారు.

ఒక పోలీసుని కాలరు పట్టుకుని లాక్కుని రావటమే దానిక్కారణం!

"ఏమైంది బాలకిషన్?" రాణా అడిగాడు. ఆమె ముందుకుతోస్తే బ్రహ్మానందం బాలకిషన్ వచ్చి రాణా దగ్గర తూలిపడ్డాడు.

"ఏమైంది?" రాణా మళ్ళీ అడిగాడు. లేచి నిలబడుతూ.

"కోర్టు చెట్టుక్రింద ఎవడితోనో వుంటే లాక్కొచ్చాను సార్" బాలకిషన్ చెప్పాడు పడిపోతున్న టోపీ పైకి లాక్కుంటూ.

"పడుకున్న మాట నిజమే సార్" అన్నదావిడ రొప్పుతూ, ఆమెకి ముప్పై అయిదేళ్ళుంటాయి. వయసుని కాలం అవసరంకన్నా ముందే అధిగమించింది.

" ..... కానీ ఎందుకు పడుకున్నావని అడగరేం?" అందరివైపు చూస్తూ అంది.

ఎవరూ మాట్లాడలేదు. ఎవరూ ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు. అసలా దృశ్యమే వింతగా వుంది. ఆశ్చర్యంగా వుంది. అనూహ్యంగా వుంది. దానికామె ఇచ్చిన వివరణ హృదయ విదారకంగా వుంది. ఎర్రటోపీని ప్రశ్నిస్తూ- శ్వేతపత్రం మీద గీసిన ప్రశ్నార్థకంగా వుంది.

"మా ఆయన్ని లాకప్‌లో పెట్టారు బాబూ. ఎక్కడో గుళ్ళో నగలు పోయాయని లాకప్‌లో పెట్టారు. ఎన్నాళ్ళు వుంచుతారో, ఎక్కడ వుంచుతారో తెలీదు. ఈ రోజు ఆగష్టు పదిహేను. మనకి స్వాతంత్రం వచ్చినరోజు. స్వాతంత్రం రోజునైన అన్నం పెట్టవా అమ్మా అని అడిగేనా బిడ్డల ఆకలి చూడలేక కోర్టూ మూసేసాక ఆ బయట సీకట్లో చెట్టుక్రింద ఎవడితోనో ఎంగిలిపడ్డ

మాట నిజమే. వ్యభిచారం చెయ్యడం తప్పో, అక్కడ ఆ పని చెయ్యడం తప్పో నాకు తెలీదు కానీ, అడిచ్చిన అయిదు రూపాయల్తో నా పిల్లలకి అరగుప్పెడు అన్నం వండి పెడతామనుకుంటే ఇదిగో ఈ పోలీసాయన నా చేతిలో నోటుకాస్తా లాక్కున్నాడు. చీకట్లో దొంగేమో అనుకున్నా. కాలరుపట్టుకుని వెల్తుర్లోకి తీసుకొస్తే పోలీసోడు! న్యాయం ఇక్కడే తేలాలని ఇట్టగే లాక్కొచ్చాను. నేరం చేసినందుకు నన్ను జైల్లో పెట్టండి బాబూ. కానీ డబ్బు మాత్రం మా పిల్లలకి పంపించండి. సొతంత్రం రోజునన్నా కడుపారా తినమని సెప్పండి. ఈ దొంగ నాయల్తో మాత్రం పంపకండి సావీ. మధ్యలోనే మందుకొట్టి ..... "

బాలకిషన్ ఆవిడ మీదకు లంఘిస్తూ "ఏమిటీ ఊరుకున్న కొద్దీ ---" అనబోయాడు.

"బ్రహ్మానందం ..... " గద్దించాడు రాణా. "ఆవిడ దగ్గిర డబ్బు తీసుకున్నావా లేదా?"

"రాత్రి కోర్టు బయట చెట్ల కింద ..... "

"నా ప్రశ్నకి సమాధానం అదికాదు" రాణా ఎర్రబడ్డ మొహంతో అడిగాడు.

"తీ ..... తీసుకున్నాను."

"అదిచ్చి వెంటనే పంపించు. వెం ..... ట ..... నే " అరిచాడు రాణా. ఆ అరుపుకు పోలీస్‌స్టేషన్ అదిరినట్టు అనిపించింది. బ్రహ్మానందం బెల్టులోంచి నోటు తీసి ఆవిడ చేతిలో పెట్టాడు. ఆవిడ దాని చూసింది.

మళ్ళీ పరీక్షగా చూసింది.

ఆ తరువాత వదిలేసింది.

గాలిలో తేలుతూ బల్లమీదకు వచ్చి చేరిన ఆ కాగితంవైపు చూశాడు రాణా.

ఆగష్టు పదిహేనున గోడలకి కట్టే కాగితం జెండా అది.

కాషాయరంగు తుపాకీలో ఆకుపచ్చటి మందు దట్టించి కొడ్తే నేలరాలిన తెల్లపావురంలా పడివుంది ఆ కాగితం.

ఆవిడ నవ్వింది. ధర్మచక్రాన్ని కదిపేసే నవ్వు అది. మానవత్వాన్ని కుదిపేసే నవ్వు అది.

"అయిదు నిమిషాల యవ్వారానికి అయిదు రూపాయలకన్నా ఎక్కువ ఇవ్వనని ఆడన్నప్పుడు ఏడ్చినా బాబూ. ఇచ్చిన కాగితాన్ని సీకట్లో అయిదురూపాయల నోటనుకొని ఈడు లాక్కున్నప్పుడూ ఏడ్చినా బాబూ. కానీ ఇప్పుడు ఈ వెలుతురులో మన దేశం జెండా ఖరీదే అయిదు రూపాయలని తెలిసినప్పుడు ..... నవ్వొస్తోంది. నాకు నవ్వొస్తోంది. నాకు నవ్వొస్తూంది" అంటూ వేగంగా అక్కడనుంచి వెళ్ళిపోయింది.

కాలం పతేలున పగుల్తే అందులోంచి వ్యాపించిన నిశ్శబ్దం గుండె శూన్యతని వెక్కిరిస్తుంది. విరిగిపడే కెరటం అక్కడే నిశ్చలమైపోతే, విషాదార్ణవపు ఉప్పెనకి విముక్తేది?

అందరూ శిలా ప్రతిమల్లా నిలబడి వున్నారు. ఆ శూన్యతలోంచి, ఆ పోలీస్‌స్టేషన్ గుహాంతర్భాగ చీకట్లోంచి ఒక వ్యక్తి రోదన వినిపించింది.

"ఊరుకో రాంబాబూ ఊరుకో ..... " సెల్‌లో తోటి ఖైదీ అనునయిస్తున్నాడు. రాంబాబు

ఏడో తరగతి చదివి వండ్రంగి పని చేసుకుంటున్నాడు.

"ఎలా వూరుకోన్రా? ..... అది నా పెళ్ళాం" రాంబాబు వణికిపోతూ అన్నాడు.

ఆపైన పూనకం వచ్చినట్టు ఒక్కసారి జైలు ఊచలు పట్టుకుని ఊపేస్తూ అరిచాడు. "మేమేం తప్పు చేశామని మమ్మల్ని జైల్లో పెట్టావు ఇన్‌స్పెక్టర్? రోజుల తరబడి, నెలల తరబడి మమ్మల్ని ఈ చీకటికొట్లో పెట్టి కొడుతున్నారు. నేరం వప్పుకొమ్మని బలవంతం చేస్తున్నారు. మా ఆడాళ్ళు వ్యభిచారం చేస్తున్నారు. మా పిల్లలు తిండిలేక ఛస్తున్నారు. మేము ఒకప్పటి దొంగలమైనందుకా ఈ శిక్ష? బావుంది ఇన్‌స్పెక్టర్. చాలా బావుంది" అతడి రోదన నవ్వులోకి దిగింది.

బిగ్గరగా నవ్వుతూ అన్నాడు. "చేయని నేరం వప్పుకోనందుకు మేమేమో తన్నులు తింటున్నాం. చేసిన నేరానికి ఎన్నో సాక్ష్యాలున్న ఆ వీరదాసు మంత్రులతో కలిసి కేకులు తింటున్నాడు. సెల్యూట్ ఇన్‌స్పెక్టర్ ..... స్టూవర్ట్‌పురం పోలీస్‌కి సెల్యూట్ ..... " తెరలు తెరలుగా వచ్చే నవ్వు! అతడి నవ్వు అకస్మాత్తుగా ఆగిపోయింది. ఆ నీరవం రాణాని సవాలు చేస్తున్నట్టు నిలచింది. వీరదాసు అటు తిరిగి వున్నాడు. అతడి పెదవుల మీద నవ్వు కదలాడుతూ వుండి వుంటుందని రాణాకి తెలుసు. ఎదురుగా నిలచిన ప్రశ్న- రెండు మొహాలలో ఒకటి ఏడుపు- ఒకటి నవ్వుగా అతడిని సమాధానం చెప్పమన్నట్టు చూస్తుంది.

అతడికి సమాధానం దొరికింది. డ్రాయర్‌లోంచి తాళాలు తీసుకుని లాకప్ సెల్ తీశాడు. దొంగల్ని "బయటికి రండి" అని పిలిచాడు.

తన సెల్‌లోంచి వీరదాసు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. రాణా అతడి దగ్గరికి వచ్చాడు. "చూడు వీరదాసూ - అంతా విని నవ్వుకున్నావుగా. ఇప్పుడు నీ మొహంలో నవ్వు మాయమైందనుకుంటాను. నగలు దొరక్కుండానే దొంగల్ని ఎలా వదిలేశానని కదూ నీ అనుమానం? రేపు రికార్డుల్లో ఏం చూపిస్తానని కదూ నీ సంశయం? ఈ అనుమానాలన్నిటికీ సమాధానం దొరకాలంటే రాత్రంతా నిద్ర మేల్కొని ఆలోచించు" అని దొంగల్తో కలిసి బయటకు నడిచాడు.

## 12

ఆ ప్రదేశమంతా చీకటిగా వుంది. దూరంగా ఎక్కణ్ణుంచో కీచురాళ్ళ చప్పుడు రాత్రి ఒంటిగంట కావొస్తుంది.

వాళ్ళతో కలిసి రాణా అక్కడికి చేరుకున్నాడు. వాళ్ళు మొత్తం నలుగురు. నలుగురూ నాలుగు రంగాల్లో ప్రసిద్ధులు. ఒకప్పుడు వాళ్ళు స్టూవర్ట్‌పురంలో పేరుమోసిన దొంగలు. తరువాత సంస్కరింపబడిన వాళ్ళు. ఆ తరువాత రౌడీలచేత, వీరదాసు చేత చిక్కిన వాళ్ళు.

గుడి దొంగతనం నేరం మీద ప్రస్తుతం జైల్లో వున్నవాళ్ళు.

వాళ్ళనే రాణా పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు తీసుకొచ్చింది.

అందరూ ఎమ్మెల్యే నాయుడి ఇంటి దగ్గరకు చేరుకున్నారు. రాణా వాళ్ళతో అన్నాడు.

"నన్ను క్షమించండి. నేనీ విధంగా కోరకూడదు మిమ్మల్ని! కానీ, నేను నిస్సహాయుడివి. అధికార యంత్రాంగంలో చిట్టచివరి మెట్టుమీద వున్న అతి చిన్న బోల్టులాటి వాడివి. పైన ఎక్కడో ..... పై అంతస్థు మీద వున్న రాజకీయ నాయకులు  నా ప్రత్యర్థులు. వాళ్ళు నా పోలీస్‌స్టేషన్‌లోనే మీటింగ్‌లు పెట్టుకోగల సమర్థులు. చీకట్లో మీ భార్యల చేతుల్లో జెండాలు పెట్టగల నీచులు. వారితో పోరాడటానికి అధికారం, న్యాయం, ధర్మం లాటివి పనికిరావు. ముల్లుని ముల్లుతోనే తీయాలి.

"నేరాలు మానేసినవారు మీరు. మీతో తిరిగి నేరం చేయించడం నా ధర్మం కాదు. కానీ మిమ్మల్ని శాశ్వతంగా లాకప్‌నుంచి బయటకు తీసుకురావాలంటే మీరీ పని చేయక తప్పదు" అంటూ చేయవలసింది చెప్పాడు. అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత ప్రారంభమైంది అసలు పని.

వారు పైపు లైను పట్టుకుని ఎక్కారు. ఆ నిశ్శబ్దంలో వాళ్ళు అలా పైకి పాకుతూంటే చెట్ల కొమ్మల మీద అలికిడి లేకుండా పరుగుదీసే ఉడుత గుర్తొస్తుంది.

నలుగురిలో మొదటివాడు మేడపై బాల్కనీలోకి వెళ్ళాడు. వేసివున్న తలుపు తీయడం పెద్ద కష్టం కాలేదు. ముఖద్వారాలు తెరవడంలో అతడు ఘటికుడు. అతడిని అనుసరించి ముగ్గురూ లోపలికి వెళ్ళారు ..... రెండోవాడు బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు. నాయుడు నల్ల తుమ్మమొద్దులా పడుకుని వున్నాడు. అతడు భార్య సన్నగా గురక తీస్తోంది.

రెండోవాడు ఆమె దగ్గరకు చేరి కాలిమీద అరచేత్తో రాశాడు. చిన్ని చక్కిలిగిలి లాటిది. ఎంతో ప్రొఫెషనలిజమ్‌తో కూడుకున్నది. అది నిద్రాభంగం కలిగించదు. కానీ పక్కకి తిరిగేలా చేస్తుంది.

ఆవిడ పక్కకు వత్తిగిల్లగానే దిండు క్రింద చెయ్యి పెట్టి  తాళాల గుత్తి తీశాడు. ఇనప్పెట్టె తెరిచి అందులోని డబ్బు తీసుకున్నాడు.

మూడోవాడు గుండెల్నిండా గాలిపీలుస్తూ ముందుకు సాగిపోయాడు. చివరికి బాత్‌రూమ్‌లో చేరాడు. అక్కడే నిలబడి గాఢంగా మరొకసారి శ్వాస పీల్చి -- క్రిందకి వంగి రాయి మీద తడిమి చూశాడు. తరువాత నాలుగో వాడివైపు చూశాడు. నాలుగోవాడు ఈ లోపులో వంటింట్లోంచి అట్లకాడ తెచ్చాడు. శబ్దం కాకుండా, ఎవరికీ నిద్రాభంగం కాకుండా - పని క్షణాల్లో జరిగింది.

రాయి పైకి లేపారు.

క్రింద వుంది "బ్లాక్‌మనీ". దానితోపాటు బంగారం మొత్తం అరవై -- డెబ్భై లక్షల దాకా వుంటుంది. నలుగురు దాన్ని మూట కట్టారు. ఈ మొత్తం ఆపరేషన్ అంతా అయిదు నిముషాల్లో జరిగిపోయింది. అయిదు నిముషాల్లో అరవై లక్షలు ..... నిజంగా స్టూవర్ట్‌పురం దొంగలే తల్చుకుంటే ఎంత సులభంగా దొంగతనం చేయగలరో చెప్పడానికి అది ఉదాహరణ "మేమిది చేయకపోవడానికి కారణం చేతికాకకాదు. మామూలు మనుష్యుల్లా బ్రతుకుదామన్న ఆశతో! మా

జీవితాలు లాకప్ రూమ్‌లకీ, మా కుటుంబసభ్యుల జీవితాలు జైళ్ళ చుట్టూ తిరగడానికి పరిమితం చేయకుండా వుండటం కోసం- మేము మారదామనుకున్నాం. మేమే మారకపోతే - ఒక రాజకీయ నాయకుడు అయిదు సంవత్సరాల్లో సంపాదించింది మేమొక సంవత్సరంలో సంపాదించగలం. కానీ ఒకందుకు మేము సంతోషిస్తున్నాం. ఇన్నాళ్ళూ రౌడీలకీ, రాజకీయ నాయకులకీ భయపడి నేరాల్ని వప్పుకున్నాం. ఇప్పుడొక నిజాయితీ గల ఇన్‌స్పెక్టర్ కోసం సంతోషంగా ఈ దొంగతనం చేస్తున్నాం ..... '' అన్న సంతృప్తి వున్నది వాళ్ళల్లో.

బంగారం, డబ్బు మూట కట్టుకుని, వాళ్ళు బయల్దేరటానికి సిద్ధమయ్యారు.

అప్పుడే బయట్నుంచి కాలింగ్‌బెల్ మోగింది.

నాయుడు నిద్రలేచాడు.

లైటు వేస్తూ ''ఎవరదీ?'' అన్నాడు.

నాయుడు లేచాడు. పక్కనే వున్న భార్య కూడా కళ్ళు తెరిచి, ''ఇంత అర్థరాత్రి పూట ఎవరండీ?'' అంది.

''చూసొస్తానుండు'' అని మెట్లు దిగి క్రిందికి వచ్చాడు. తలుపు తీయగానే ఎదురుగా రాణా వున్నాడు.

''ఏమిటింత అర్థరాత్రి ఇలా వచ్చావ్?''

''మీ ఇంట్లో దొంగతనం చేయబోతున్నాం అని ఎవరో ఫోన్ చేశారు. అది చెప్పటానికి వచ్చాను.''

నాయుడు నవ్వేడు. ''ఇలా నన్ను మంచి చేసుకుందామని చూస్తున్నావన్నమాట. చూడు రాణా, నీ పని పూర్తయింది. ఇంక నన్ను ఎంత కాలం కాకాపట్టినా లాభం లేదు''

''ఒక్కసారి మీ బెడ్‌రూమ్‌లో ఇనప్పెట్టె చూడనివ్వండి.''

''ఇంకానయం బాత్‌రూమ్ చూస్తానన్నావ్ కాదు.''

''ఏం? బాత్‌రూమ్‌లో కూడా ఏమైనా దాచారా?''

నాయుడు మొహంలో నవ్వు మాయమైంది. ''నేను ఎక్కడెక్కడ ఏవేం దాచానో నీ కనవసరం. అర్థరాత్రి తీరిగ్గా నీతో మాట్లాడే ఓపిక నాకు లేదు.''

''ఎవరయినా ప్రయత్నిస్తున్నారేమో ఒక్కసారి నన్ను చూడనివ్వండి. వాళ్ళు ఎంతో పెద్ద దొంగలై వుంటారు. లేకపోతే అలా ముందే ఫోన్ చేసి చెప్పరు.''

''ఎవడో ఆకతాయి వెధవ ఫోన్‌చేసి చెప్పగానే నువ్వు ఇలా హడావుడిగా రావటం చూస్తూంటే అసలు మీ డిపార్టుమెంట్‌లో వాళ్ళ తెలివి తేటలమీదే నాకు అపనమ్మకం ఏర్పడుతుంది. మీ టైమ్ అంతా వృథా చేసుకుంటూ ఇలా తిరుగుతూనే వుంటారా?''

''అసలు మీ ఇంట్లో ఎంత డబ్బుంది సార్? బాగా ఎక్కువవుంటే ఈ రాత్రికి ఒకరిద్దరు కానిస్టేబుల్స్‌ని ఏర్పాటు చేస్తాను.''

"అధిక ప్రసంగం. అసలు నా దగ్గర ఎంత వుందో తెలుసుకోవటం కోసమే ఇలా అర్థరాత్రి ఇంత చౌకబారు ప్లాన్‌మీద వచ్చావా? ఇక నీతో మాట్లాడే ఓపిక నాకు లేదు."

"సరే వెళ్తున్నాను. ఏదైనా పోతే మాత్రం ఫోన్ చెయ్యండి. స్టేషన్‌లోనే వుంటాను. అర్థరాత్రి నిద్ర లేపటం దేనికి అనుకోకండి." అని రాణా వెనుదిరిగాడు.

అయితే అతడు స్టేషన్‌కు వెళ్ళలేదు. పది నిముషాలుండి మళ్ళీ వెళ్ళి నాయుడి ఇంటి బెల్ కొట్టాడు. రెండు నిముషాల తరువాత కళ్ళు నులుముకుంటూ వచ్చి తలుపు తీశాడు నాయుడు. ఎదురుగా రాణాని చూడగానే పెట్రేగిన కోపంతో "మళ్ళీ ఎందుకొచ్చావ్? ఈ రాత్రి నన్ను వదలవా ఏమిటి?" అన్నాడు.

"అదేమిటి? మీరేగా ఇప్పుడు ఫోన్‌చేసి- 'వెంటనే రా. ఇంట్లో దొంగతనం జరిగింది' అన్నారు. ఫోన్ పెట్టేసి ఆఘమేఘాలమీద వచ్చాను" అన్నాడు.

"నేన్నీకు ఫోన్ చేశానా? కలగని వుంటావ్."

"లేద్సార్ మీ గొంతే! బాగా గుర్తుపట్టాను. 'యాభైలక్షల విలువగల బంగారం, ఇరవైలక్షల నగదూ పోయిం'దన్నారు. 'అంత బంగారం ఎందుకు ఇంట్లో పెట్టుకున్నా'రని అడిగాను. 'ఆ ప్రశ్నలన్నీ ఆపి వెంటనే రా దొంగలింకా ఎంతోదూరం వెళ్ళి వుండరు' అని కంగారుపెట్టారు."

"నీకు నిజంగా పిచ్చెక్కింది రాణా! ఎవడో ఆకాశరాముడు ఫోన్ చేస్తే దొంగేమో అనుకుని ఒకసారి వచ్చావ్. మళ్ళీ వాడే గొంతు మార్చి నాలా ఫోన్ చేస్తే అదికూడా నమ్మేసి రెండోసారి వచ్చావ్. అసలు నీలాంటి అన్నప్పింండి మెదడువాడు పోలీస్ డిపార్టుమెంటులోకి ఎలా వచ్చాడా అని ఇప్పుడు ఆశ్చర్యపడుతున్నాను. ఒక ఎమ్మెల్యే గొంతుకీ ఒక ఆకాశరామన్న గొంతుకీ తేడా పట్టుకోలేవా?"

"కొంచెం తేడా అనిపించిందండీ! అదికూడా ఫోన్‌లో అడిగాను. ఇప్పుడేగా మీ ఇంటినుంచి వెళ్ళాను. గొంతులో తేడా ఏమిటని- దానికి సమాధానంగా 'డెబ్భయి లక్షల ఆస్థి పోయిందని కంప్లెయింట్ ఇస్తే గొంతులో తేడాల గురించి అడుగుతున్నావా' అని కసురుకున్నాడు.

నాయుడు బిగ్గరగా నవ్వాడు. "ఆ ఆకాశ రాముడు ఎవడో నీకు భలే టోపీ వేశాడు. వాడికి సన్మానం చేయాలని వుంది. మీ పోలీసులు ఎంత మూర్ఖులంటే, రేపు వాడే నాలా వేషం వేసుకుని వచ్చినా నేనే అని నమ్మేస్తారు కూడా. మీరింత మూర్ఖుల్లా వుండబట్టే ఆ దొంగల ఆటలు అలా సాగుతున్నాయి.

వాడిని ఎలాగయినా పట్టుకుని జైల్లోపెట్టు. నేనొచ్చి వాడి అంతుతేలుసస్తాను. మళ్ళీ ఫోన్‌కాల్ వచ్చిందని నా దగ్గరకి వస్తే నీమీద న్యూసెన్స్ కేసు పెడతాను. అసలు గుళ్ళో జరిగిన అంత పెద్ద దొంగతనం వదిలేసి ఇలా చిన్న కేసులు పట్టుకుని తిరుగుతున్నావేమిటి?"

"ఇంకా గుళ్ళో దొంగతనం ఏమిటి సార్? ఆ నగలు రాత్రే దొరికాయి గదా?"

"అవి గిల్ట్‌వని విన్నాను."

"అవీ దొరికాయి. ఒరిజినల్, అంటే రెండేళ్ళక్రితం పోయినవి- అవికూడా దొరికాయి."

నాయుడి మొహంలో నవ్వు మాయమైంది. "ఒరిజినల్ నగలు దొరికాయా?" అన్నాడు.

"ఒరిజినల్ కన్నా బావున్నాయండి. ఫ్రెష్‌గా ఇప్పుడే బంగారం కరగబెట్టి చేసినట్టు తాజాగా వున్నాయి."

"ఎలా దొరికాయి? ఎవరి దగ్గర దొరికాయి?" ఎంత అణుచుకుందామన్నా నాయుడు కంఠంలో ఆతృత కనపడుతోంది.

"గంట క్రితమే దొరికాయి?"

"ఎక్కడ?"

"చెట్టుమీదనుంచి పడ్డాయి. నేను భగవంతుడిని ప్రార్థించాను. 'మూర్ఖ జనంతో నిండివున్న మా డిపార్టుమెంట్‌ని నువ్వే రక్షించాలి తండ్రీ. సాయం చెయ్యి' అని వేడుకున్నాను. ఆనాడు సుగ్రీవుడు రాముడికి హెల్ప్ చేసినట్టు ఒక కోతి నగలమూటని చెట్టుమీదనుంచి పడేసింది. నేనూ మొదట్లో నమ్మలేదు. పోలీస్‌స్టేషన్‌కి కంసాలిని పిలిపించి పరీక్ష చేయించాను. అన్నీ శ్రేష్టమైన బంగారానివే అని ధృవీకరించాడు. మొత్తం యాభైలక్షల విలువచేసే నగలు....."

నాయుడు నమ్మనట్టు చూశాడు. నమ్మలేనట్టు గొణుక్కున్నాడు. రాణా అన్నాడు. "పాపం ఇంతకాలం ఆ స్టూవర్ట్‌పురం దొంగల్ని పట్టుకొని కొట్టాం. ఈ నగలు ఏ కోతో తీసి వుంటుందన్న అనుమానం మాకు అప్పుడు రాలేదు. గంటక్రితమే వాళ్ళని వదిలేశాం."

నాయుడు సమాధానం చెప్పలేదు. ఇంకా దిగ్భ్రమనుంచి అతడు కోలుకోలేదు.

"వెళ్ళొస్తాను సార్. అనవసరంగా అర్థరాత్రి రెండుసార్లు మిమ్మల్ని డిస్టర్బ్ చేశాను. ఆ ఆకాశరాముడు ఈసారి ఫోన్ చేసినా, కంప్లెయింట్ ఇవ్వటానికి వచ్చినా వాడిని కటకటాల వెనుక కూర్చో పెట్టకపోతే నా పేరు రాణాయే కాదు. మీరిక నిశ్చింతగా పడుకోండి" అని అక్కడనుంచి కదిలాడు.

నాయుడు తలుపు వేసుకొని లోపలికి వెళ్ళాడు. "ఎందుకొచ్చాడా ఇన్‌స్పెక్టర్?" అని అడిగింది భర్తని.

"నా గొంతుతో ఎవడో ఫోన్ చేశాడట. 'దొంగతనం జరిగింది వెంటనే రమ్మని'. ఆ మాత్రం గొంతులు కూడా గుర్తుపట్టలేరు- వీళ్ళు ఇన్‌స్పెక్టర్‌లు ఎలా అయ్యారో? దానికేంగానీ, గుళ్ళో నగలు దొరికాయట."

"ఏవీ? ఆ గిల్టువా?"

"పిచ్చిమొహవా! గిల్టువి కాదు. ఒరిజినల్లే."

"అదేమిటండీ? వాటిని అప్పుడెప్పుడో- మీరూమీరూ పంచేసుకున్నారుగా."

"ష్! గట్టిగా అనకు! అదే నాకూ అర్థం కాకుండా వుంది. ఈ పోలీసులు కేసు మాఫీ చేయటానికి రకరకాల వేషాలు వేస్తూ వుంటారు. అచ్చం ఆ నగల్లాంటి నగలు చేయించి,

ఎక్కణ్ణుంచో కాస్త బంగారం సంపాదించి వాటికి కోటింగ్ ఇచ్చి వుంటారు. ప్రమోషన్ కొట్టెయ్యటం కోసం ఇలాటి పనులు చాలా చేస్తార్లే."

"అవున్లెండి. కాకపోతే యాభై అరవైలక్షలు ఎక్కడనుంచి తేగలరు ఆ పోలీసులు మాత్రం? అన్నట్టు ఎన్నిసార్లు చెప్పానండీ మీకు ఆ బాత్‌రూమ్‌కి వెళ్ళొచ్చినపుడల్లా తలుపువేసి రమ్మని-"

"నేను వెళ్ళందే. నువ్వు చూస్తూనే వున్నావ్‌గా- నే వెళ్ళి ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి ఇలాగే పక్కమీద కొచ్చాను."

"మరి నేను తీశానంటారా?" అంటూ ఆవిడ వెళ్ళి బాత్‌రూమ్ తలుపు వేయబోయి, కెవ్వున కేక వేసింది. ఒక నిపుణుడయిన తాపీవాడు చేసినట్టు ఇటుకలు పెల్లగింపబడి, ఒక పెద్ద పెట్టెని వెలికి తీసినట్టుంది ఆ స్థానం అంతా కొల్లగొట్టబడినట్టుంది.

"ఏవండీ! మన బంగారం ..... "

నాయుడు ఒక్క దూకులో పక్కమీద నుంచి బాత్‌రూమ్ దగ్గరికి చేరుకున్నాడు. అక్కడ పరిస్థితి చూడగానే క్షణాల్లో జరిగిందేమిటో అర్థమైంది. పక్క రూమ్‌లోకి పరుగెత్తాడు.

ఇనప్పెట్టె తెరిచి వుంది.

బాత్‌రూమ్ దగ్గర కూలబడి భార్య రాగాలు తీస్తోంది. మొత్తం నగలు, బంగారం, క్యాషు- అంతా పోయింది. ఎక్కడో దాచుకున్నదంతా దోచేశారు.

ముందు హాల్లోకి వచ్చి ఫోన్ చేశాడు పోలీసులకి.

"హల్లో ..... రాణా హియర్" అని అట్నుంచి వినపడింది.

"నువ్వు అన్నంతా అయింది రాణా. వెంటనే రావాలి" అన్నాడు కంగారుగా.

"చూడు ఆకాశరాముడూ నువ్వెంత అనుకరించి మాట్లాడినా, ఎమ్మెల్యే నాయుడిగారి కంఠానికీ, నీ కంఠానికీ తేడా తెలుసుకోలేనంత మూర్ఖులు కాదు పోలీసులు."

"ఆకాశరాముడు కాదు. ఇక్కడంతా వినాశనం జరిగిపోయింది. డెభ్భై లక్షల ఆస్థి పోయిందని కంప్లెయింట్ ఇస్తుంటే గొంతులో తేడాల గురించి అడుగుతున్నావా?"

"సరీగ్గా క్రితంసారి కూడా ఈ మాటే అన్నావ్. వెళ్ళి అక్కడ చెప్తే ఆ నాయుడుగారేమో నాది అన్నప్పింది మెదడు అన్నారు."

"అయ్యో! నీకెలా చెప్పను? నేనే నాయుడి నయ్యా! వెంటనే బయల్దేరి రా ---"

"ఇంకోసారి వెళ్ళి ఆయన్ని నిద్రలేపితే ఈసారి చెప్పుతో కొడతారు. ఆ నాయుడుగారు మంచాయన కాబట్టి రెండుసార్లు వూరుకున్నారు. నీ గురించి చెప్తే 'ఆ ఆకాశరాముడికి సన్మానం చెయ్యాలని వుందయ్యా!' అన్నారు. ఇలా అర్థరాత్రి నా మీద ప్రాక్టికల్ జోకులు వెయ్యకపోతే ఆయన దగ్గరికి వెళ్ళకూడదు? మా పోలీసుల్ని ఇలా ఫూల్స్ చేస్తున్న సందర్భంలో నీకు సన్మానం చేస్తారు."

"రాణా" అట్నుంచి కోపంగా అరిచాడు నాయుడు. "నువ్వు వస్తావా-- నన్ను

రమ్మంటావా?"

"నువ్వే రా---"

చప్పున అట్నుంచి ఫోన్ పెట్టేసిన చప్పుడు.

అయిదు నిముషాల్లో నాయుడు పోలీస్‌స్టేషన్ చేరుకున్నాడు. తెల్లవారు ఝామున నాలుగవుతోంది. నాయుడి మొహమంతా ఎర్రగా కందిపోయి వుంది.

లోపలికి వస్తూనే కోపంతో "పిల్లికి చెలగాటంలా వుంది రాణా నీ బిహేవియరు. డెబ్భై లక్షలు పోయాయని ఫోన్‌చేస్తే వెంటనే వేలిముద్రల వాళ్ళనీ, పోలీసు కుక్కల్ని రంగంలోకి దింపకుండా జోకులు వేస్తావా" అని అరిచాడు.

రాణా నవ్వి "నాయుడు గారు గొప్ప దూరదృష్టితో ఈ విషయం కూడా ముందే చెప్పారు. "మీ పోలీసులు మూర్ఖులు వాడు నాలా వేషం వేసుకుని వచ్చినా మీరు నమ్మేస్తారు. జాగ్రత్తగా వుండు" అన్నారు. ఆకాశరాముడూ! కేవలం నిన్ను మా పోలీస్‌స్టేషన్‌కి రప్పించడానికే స్వయంగా వచ్చి కంప్లెయింట్ ఇవ్వు అన్నాను. సెల్‌లోకి పద మా నాయుడుగారు వచ్చి నిన్నేం చేయాలో నిర్ణయించేవరకూ లాకప్‌లో వుండు" అన్నాడు.

ఇద్దరు పోలీసులు వచ్చి నాయుడిని చెరోవైపూ పట్టుకున్నారు.

"నేనే నాయుడిని!" అని అతడు అరుస్తూ వుండగా తీసుకెళ్ళి లాకప్‌లో తోశారు.

వీరదాసు అంతా చూస్తూనే వున్నాడు. నాయుడొచ్చి అతని పక్కన పడ్డాడు.

## 13

స్టూవర్ట్‌పురంలో ఈ విధమైన కథ నాటకీయంగా జరుగుతున్న సమయానికి మరోచోట అరవింద్ చౌరసియా, అబ్దుల్ సత్తార్‌ల మధ్య చారిత్రాత్మకమైన సమావేశం ప్రారంభమైంది.

సత్తార్ అన్నాడు. "దేశమంటే పలు సాంస్కృతిక, సంప్రదాయాల మేళవింపు వివిధ జాతుల, మతాల కలయిక. ముఖ్యంగా భారతదేశం లాంటి విస్తీర్ణత, సెక్యులరిజం ఎక్కువగా వున్న దేశంలో ఇది కొట్టొచ్చినట్టు కనపడుతుంది. ఒక పెద్ద దేశం పక్కనే వున్న చిన్న దేశం తన అస్థిత్వాన్ని నిలబెట్టుకోవటానికి ఎప్పుడూ ప్రయత్నిస్తూ వుంటుంది. మీకిదంతా తెలియదని నేను చెప్పటం లేదు చౌరసియా సాబ్! మీకు శత్రువైన మా దేశం పవిత్రమైన ఆశయాలకోసం, ఒక సదుద్దేశమైన లక్ష్యంకోసం పాటుపడుతుందని కూడా చెప్పటంలేదు. కేవలం స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్. అయితే ఈ ఎగ్జిస్టెన్స్ అనేది కేవలం బ్రతకడం కోసం కాదు. అంతర్జాతీయంగా మేము బలం చేకూర్చుకోవటానికీ, మా దేశంలో ప్రజల్ని ఆకట్టుకోవటానికీ మా వాళ్ళు చేసే ప్రయత్నం అది. పక్కనున్న దేశం ఎంత చిన్న చిన్న భాగాలుగా చీలిపోతే అంత అభద్రతా భావం మాలో తొలగిపోతుంది."

సత్తార్ వైన్ తాగుతూ కొనసాగించాడు.

" ..... మధ్యప్రదేశ్, రాజస్తాన్ లాటి రాష్ట్రాల ప్రకృతి పరంగా బీదవి. పంజాబ్, అస్సాం, కాశ్మీర్ లాటి సరిహద్దు రాష్ట్రాలు సహజ సిద్ధమైన వనరుల్లో ధనవంతమైనవి. ఇక్కడి ధనాన్ని

కేంద్రం అక్కడికి ప్రవహింపచేయడం ద్వారా దేశాన్ని సమతుల్యం చేస్తుంది. అది నాణేనికి ఒకవైపు అనవసరంగా మన ఐశ్వర్యాన్ని, బీద రాష్ట్రాలకి పంచి ఇచ్చే హక్కు ఎవరికుంది? అన్న భావాన్ని ఈ రాష్ట్ర ప్రజల్లో కలిగిస్తే అది నిప్పు రాజుకుంటున్నట్టు మండుతుంది. ఇదొక పద్ధతి. మత పూర్వకంగా రెచ్చగొట్టటం మరింత సులభ పద్ధతి. రోజు రోజుకీ దిగజారిపోతున్న రక్షణ వ్యవస్థలో, మైనారిటీ మతస్తుల్లో ఈ విధమైన అభద్రతా భావాన్ని పెంపొందించటం చాలా సులభం. లేని పులిని 'చూపించి' భయపెట్టడం, వున్న పులిని చూపించటం కన్నా సులభం. ఇలాటి మరో రాష్ట్రం ఏమిటా అని మేము ఆలోచిస్తే -- మాకు వెంటనే తోచింది మీ రాష్ట్రం"
----

అరవింద్ చౌరసియా తలూపాడు. సత్తార చెప్పబోతూన్నది అతడికి తెలుస్తూనే వుంది. అతడు తన ఆనందాన్ని దాచుకుని వింటున్నాడు.

"రాష్ట్రంలో జరగబోయే పరిణామాలు మీకు తెలుసు కదా. మా ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంటు చాలా సూక్ష్మంగా పరిశీలించి మా ప్రభుత్వానికి పంపిన రిపోర్ట్ తాలూకు కాపీ ఇది" బ్రీఫ్‌కేసులోంచి కాగితాలకట్ట తీసి చూస్తూ అన్నాడు. దాదాపు యాభై పేజీల రిపోర్టు అది.

"ప్రస్తుతపు హోం మినిష్టర్ తన పార్టీకి రాజీనామా చేసి, కేంద్రంలో అధికారంలో వున్న పార్టీతో చేతులు కలుపుతాడు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో వున్న పార్టీని బర్తరఫ్ చేసి, ఏదో ఒక కారణం చూపించి, మళ్ళీ ఎన్నికలు జరిగేలా చేస్తుంది కేంద్రం. అప్పుడు హోం మంత్రి చీఫ్ మినిష్టర్ అవుతాడు. ఢిల్లీలో మొన్న జరిగిన ఒక రహస్య సమావేశంలో ఈ ప్రణాళికకి శంకుస్థాపన జరిగింది. ఎం.పి. పులిరాజుని దీనికి సాయపడవలసిందిగా హైకమాండ్ ఆదేశించింది. అమెరికా రాయబారి పదవి ఆశ చూపింది."

అరవింద్ చౌరసియా ఆశ్చర్యాని అణచుకున్నాడు. ఎంతో రహస్యంగా జరిగిన ఈ సమావేశాన్ని కెమెరాలో ఫిల్మ్ తీసినట్టు చెపుతున్నాడు ఈ విదేశీ ఏజెంటు. ఐకమత్యమే మహాభాగ్యము అని చిన్నప్పుడు చెప్పారు. అనైకమత్యం ఇంత వినాశం అని కళ్ళారా చూస్తున్నాడు. "పాలిటిక్స్-- బ్లడీ పాలిడిక్స్" అనుకోలేదు. ఆ నీచ రాజకీయాలే తనకి కోట్లు సంపాదించి పెట్టబోతున్నాయని అతడికి తెలుసు.

సత్తార్ అన్నాడు-- "త్వరలోనే హోం మినిష్టర్ పార్టీ మారి చీఫ్ మినిష్టర్ అవబోతున్నాడు. అది జరిగి తీరుతుంది. ప్రస్తుతం స్టూవర్ట్‌పురం జైల్లో వున్న వీరదాస్ అనే వ్యక్తి బయటికొస్తే-- ఆ పార్టీ తొంభై శాతం సీట్లు ఎన్నికల్లో సంపాదిస్తుంది. అతడు బయటకు రాకుండా "రాణా" అనే ఇన్‌స్పెక్టర్ ఆపుతున్నాడు. ఇప్పుడు రెండు పార్టీలూ కలిసినవి కాబట్టి రానా ఏమీ చెయ్యలేడు. వీరదాసు బయటకి రాక తప్పదు. ప్రభుత్వం మారకా తప్పదు. దానికి మీ ఆశీస్సులు వున్నాయని మాకు తెలుసు."

చౌరాసియా తలూపాడు.

"బయట నుంచి మేము ప్రయత్నించటం వేరు. లోపలి వారు మాకు సాయపడడం వేరు. రెండోదే జరిగిన పక్షంలో మా పని మరింత సులువు అవుతుంది. ఈ విషయం ముందే మీతో ప్రస్తావించటం, మీరు దానికి వప్పుకోవటం జరిగింది. మిస్టర్ చౌరసియా! ఇప్పుడా సమయం ఆసన్న మైనదని మా దేశం భావిస్తున్నది."

"ఏ విధంగా?"

"రాబోయే ప్రభుత్వంలో కాబోయే ముఖ్యమంత్రిని మనవైపుకు తిప్పుకోవటం ద్వారా!! మీ దగ్గర సుశిక్షితులయిన యువకులు రెండు వందలమంది దాకా వున్నారు. వారిని టెర్రరిస్టులుగా, ఏరియా కమాండర్లుగా, కమాండర్ ఇన్ -- చీఫ్‌లుగా మార్చి, రాష్ట్రంలో మత కల్లోలాలు పెంచి, రాష్ట్రాన్ని దేశంనుంచి విడగొట్టే ప్రయత్నం నుంచి మీకు మేము సహాయ సహకారాలు అందజేయగలం. అందుకే రాష్ట్ర ప్రభుత్వపు సహాయ సహకారాలు కావాలని నేను నొక్కి చెప్పుతున్నది. కేవలం ఆర్నెల్లపాటు మీ ముఖ్యమంత్రి దీన్ని చూసీ చూడనట్టు వూరుకుంటే ఈ నిప్పు కార్చిచ్చు అవుతుంది. అప్పటికి కేంద్రం మేల్కొని ఒకవేళ పంజాబ్‌లోలా ప్రభుత్వాన్ని రద్దు చేసినా, ఆ తరువాత ఆ కాష్టం తగలబడుతూ వుంటుంది. దీనికి మీరు టి.కె.రెడ్డిని వప్పించాలి."

"కష్టం" అన్నాడు చౌరసియా. "రాష్ట్ర వినాశనం కోసం, with in the conatry- దేశాన్ని అల్లకల్లోలం చేయటం కోసం రాజకీయ నాయకులు ఎన్ని వెధవ్వేషాలు వేసినా మా ప్రజలు క్షమిస్తారు. అది వారి దినచర్యలో భాగంగా భావిస్తారు. కాని టెర్రరిస్టులతో చేతులు కలపడం, శత్రుదేశంతో సంబంధం పెట్టుకోవటం లాంటివి క్షమించరు. ఇంకా అంత ఓర్పు అలవర్చుకోలేదు. దానికింకో అయిదు పదేళ్ళు పడుతుంది. ఏదో పార్టీలు మార్చి ప్రభుత్వాలని పడగొట్టడం లాంటివి చేయగలడమో గానీ, ఇంత పెద్ద ఎత్తున పరాయి దేశంతో చేతులు కలిపి టెర్రరిస్టు కార్యకలాపాల్ని చేయించగలిగేటంత సమర్థుడు అతడని నేను అనుకోను."

"చెట్టు లోపలుండి కాండాన్ని తినేసే పురుగు, బైట వుండి కూలదోసే గొడ్డలి-- రెండూ ఒకటేగా మిస్టర్ చౌరసియా?"

"మూర్ఖులైన మా ప్రజలకి ఆ విషయం తెలియకపోవటం మా రాజకీయ నాయకులు చేసుకున్న అదృష్టం. దేశంలో ఒక పార్టీ బంద్ నిర్వహించి రైళ్ళు తగలబెట్టి రెండు కోట్లు నష్టపరిచినా క్షమిస్తారు. కాస్త పొరుగుదేశం వాడి విమానం చొచ్చుకువస్తే గోల పెడ్తారు!"

సత్తార్ కొద్దిసేపు మౌనంగా వుండిపోయాడు. 'టప్' మని చప్పుడయింది. సత్తార్ అన్నాడు,

"సరిఅయిన సమయం ఆసన్నమైందని మా దేశం భావిస్తుంది. మన వర్కర్లని రంగంలోకి దింపాలి. రేపు వినాయకచవితి నుంచి ఈ కొట్లాటలు ప్రారంభం కావాలి మంత్రి మద్ధతు మీరు సంపాదించాలి."

"నా మనుష్యుల్ని దింపటం వరకూ నేను చేయగలను. ఇక హోం మినిష్టర్ సంగతంటారా-- ప్రయత్నించాలి. దేశద్రోహానికి మా దేశంలో ఉరిశిక్ష అమలు జరుపుతారు. మరి
అతడు ఎంత ఆశపెట్టినా దీనికి లొంగుతాడో లేదో-- అసలే భయస్థుడు."

"అతడి మీద రిపోర్టు కూడా మా ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంటు సంపాదించింది మిస్టర్ చౌరసియా ..... " అంటూ ఫైలు తీశాడు సత్తార్.

"నిజానికి అతడిని కాదు మీరు వప్పించాల్సింది. మీ ప్రియురాలు- ఉరఫ్ - అతడి భార్య కామినిని ..... "

పక్కలో బాంబుపడ్డట్టు అదిరిపడ్డాడు చౌరసియా.

మీ ..... ప్రి ..... యు ..... రా ..... లు

కా ..... మి ..... ని

ఫ్యాను రెక్కలు తిరిగినట్టు ఆ రెండు పదాలు గిర్రున అతడిని వూపేశాయి. అయితే ఎంతో అనుభజ్ఞుడు కాబట్టి వెంటనే సర్దుకున్నాడు.

"కామిని దానికి వప్పుకోకపోవచ్చు."

"ఆమె వెనుక వుండి తన భర్తని ఆదిస్తూంది మిస్టర్ చౌరసియా. నిజానికి ఆమె ఇదంతా చెయ్యవలసింది. ఆమెమీది రిపోర్టు కూడా మా వద్ద వుంది. ఆమె పాము లాటిది. ఆశకు అంతులేదు. ఆమె తప్పక వప్పుకుంటుందని మా అభిప్రాయం."

"పదవి-డబ్బు-హోదా-ఆశ-కసి-అన్నీ ఆమె అభిరుచులు. కానీ దేశద్రోహం ..... మ్చ్ ..... వప్పుకోకపోవచ్చు."

సత్తార్ నవ్వేడు. "ఏ దేశ చరిత్రలోనైనా ప్రస్తుత దేశద్రోహం, ఫలితం సాధించాక స్వాతంత్ర్య పోరాటం అవుతుంది అరవింద్‌జీ! పదాల మార్పే ఇది. ఎన్నో రాత్రులు ఆమెతో గడిపి వుంటారు. ఆమె మనస్తత్వం మా యీ రిపోర్టులు చెప్పిన దానికన్నా మీకే ఎక్కువ తెలుస్తుంది."

అరవింద్ చిరాకు అణుచుకుని "తెలుసు కాబట్టే చెపుతున్నాను" అన్నాడు.

సత్తార్ బ్యాగులోంచి మరో కవరు తీశాడు. "ఆమెకు కోహినూర్ వజ్రాన్ని బహికరిస్తామని చెప్పండి. ఆమె భర్తని కొత్త దేశపు ప్రెసిడెంట్‌ని చేస్తామని ఆశ పెట్టండి. వాగ్దానాలేగా. ఎన్నైనా చెయ్యోచ్చు."

"అలాంటి సామ దానాలకు ఆమె పడదు."

"అయితే చివరి ఉపాయమే ప్రయోగించండి" అంటూ కవరు విప్పి ముందు పెట్టాడు. వివిధ భంగిమల్లో ఫోటోలు. చౌరసియా -- కామిని .....

అతడి మొహంలో రక్తం ఇంకిపోయింది.

"ఏమిటిది?" అని అరిచాడు.

“క్షమించండి. మా ఇంటెలిజెన్సీ డిపార్ట్‌మెంట్‌వారు ఎంతో కష్టపడి సంపాదించిన ఫోటోలు-”

“చౌరసియా ఇంకా షాక్‌నుంచి తేరుకోలేదు. సత్తార్ కొనసాగించాడు.

“ఏ స్త్రీ అయినా తన జీవిత రహస్యాలను గుప్తంగా వుంచాలనుకుంటుంది. కామినిలాటి స్త్రీ మరీ ..... ఈ ఫోటోల ఆధారంగా మీరు అనుకున్నది సాధించగలరు మీరామెని బ్లాక్‌మెయిల్ చేయనవసరం లేదు. రెండువందల కోట్ల విలువైన బంగారం బేరం పెట్టడంద్వారా ఆమెనీ, ఆమె భర్తనీ మీతో మాట్లాడే అవసరం లేదు. ఇంత ఖరీదుకి వాళ్ళతోనే డైరెక్టుగా బేరం పెట్టవచ్చు. కానీ కామిని దగ్గరికి ఆమె భర్త ద్వారా వెళ్ళటంకన్నా మీ ద్వారా వెళితేనే మంచిదని మా ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ అభిప్రాయపడింది. ఆ ఫోటోలు మీరు వాడుకుంటే వాడుకోండి. లేకపోతే లేదు. అది మీ ఇష్టం.”

అరవింద్ చౌరసియాకి- తను సరిగ్గా ఎక్కడ ఇరుక్కుపోయాడో అర్థమైంది.

చేస్తే -

పని చాలా సులభం.

రెండువందల కోట్లు లాభం.

చెయ్యకపోతే-

ఫలితం

పరువు సమూల నష్టం.

అతడు లేచి, సత్తార్‌కు షేక్‌హాండిస్తూ “ఫోటోలు అవసరం లేదు. మీ డిపార్ట్‌మెంట్ దగ్గరే వుంచండి. కామినిని మనవైపు మార్చటానికి నేను ప్రయత్నిస్తాను” అన్నాడు.

“థాంక్స్. చాలా సంతోషం. వీలైనంత తొందరగా కావాలి ఇది.”

“తొందరేముంది? రాష్ట్రంలో ప్రభుత్వం మారాలి కదా.”

“అవును మారాలి. మారాలంటే వీరదాసు విడుదల కావాలి.”

“అదంత సులభం అని అనుకోను. ప్రతిపక్షం చాలా స్ట్రాంగ్‌గా వుంది. కనీసం రాణాని ట్రాన్స్‌ఫర్ చేసే పరిస్థితుల్లో కూడా లేదు ప్రభుత్వం.”

వెళ్ళబోతున్న సత్తార్ ఆగి నవ్వేడు. “వాళ్ళు చెయ్యలేకపోతే మేమే చేస్తాం చౌరసియా సాబ్. ఈ లోకం నుంచి పైలోకానికి- ట్రా ..... న్స్ ..... ఫ ..... ర్”

గెస్ట్‌హవుస్ నుంచి ఇద్దరూ చెరోవైపుకి వెళ్ళిపోయారు. అర్థరాత్రి సమావేశం ముగిసింది.

ఆవిధంగా-

ఒక చిన్న పోలీస్‌స్టేషన్‌లో, ఒక చిన్న ఇన్‌స్పెక్టర్, ఒక రౌడీని అరెస్ట్ చేయడం అనేది రాష్ట్రందాటి, దేశపు పార్టీలను కుదిపి అంతర్జాతీయ ప్రాముఖ్యతని సంతరించుకుంది.

అయితే ఈ విషయమంతా అరవింద్ చౌరసియా చెప్పకుండానే కామినికి తెలిసింది. చౌరసియా, సత్తార్‌లు మాట్లాడుకుంటూ వుండగా వచ్చిన ‘టప్’ మన్న శబ్దం- ఆమె అమర్చిన

ఎలక్ట్రానిక్ ఆటోమేటిక్ టేప్‌రికార్డర్ ద్వారా వచ్చిందే.

ఆమె ఎవర్నీ నమ్మదు భర్తనే కాదు.

ప్రియుడ్ని కూడా!

## 14

అంతా చాలా ప్లాన్డ్‌గా జరిగింది.

త్రిపుర బంకులో పెట్రోలు పోయించుకుని బయల్దేరబోతూంటే, నలుగురు వ్యక్తులు ఆ అమ్మాయిని చుట్టుముట్టి, ఆమెని కారుతోసహా ఎత్తుకుపోయారు. తరువాత ఫోనచేసి, వీరదాస్‌ని అరవైనాలుగ్గంటల్లోగా వదిలెయ్యకపోతే, ఆ అమ్మాయి శవాన్ని చూడవలసి వస్తుందని చెప్పారు.

మరుసటి రోజు "ఎం.పి. కూతురు కిడ్నాప్" అన్న వార్త అన్ని పత్రికల్లో ప్రముఖంగా వచ్చింది.

పట్టణంలో ఒక ఎం.పి. కూతురికే భద్రత కల్పించలేని రాష్ట్ర పోలీస్ వ్యవస్థని నిరసిస్తూ, కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ బంద్‌కి పిలుపు నిచ్చింది.

ఆ మరుసటిరోజు బంద్ విజయవంతంగా జరిగింది. విజయవంతంగా అంటే గృహదహనాలు, లూటీలు, బస్సుల అద్దాలు పగలగొట్టడాలూ వగైరా .....

రాణా చాలా ఇరుకునపడ్డాడు లా అండ్ ఆర్డర్ పరిస్థితి దారుణంగా వుంది. తనే దానికి సెంట్రల్ పాయింట్ అవడంతో ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో పడ్డాడు.

టెర్రరిస్టులు పెట్టిన గడువుకి కేవలం నలభై గంటలే టైముంది.

ఆ రోజు సాయంత్రం స్కూల్ ప్లే గ్రౌండ్‌లో బ్రహ్మాండమైన మీటింగ్‌ని "ప్రజా చైతన్యపరిషత్" అనే సంస్థ నిర్వహించింది. అది కొత్త సంస్థే అయినా ఎమ్మెల్యేలు, ఎం.పి.లు హాజరవడంతో దానికి విశిష్టత సమకూరింది. రెండు వేర్వేరు పార్టీలకు చెందిన నాయకులు ఒకే వేదిక ఎక్కడం అంటే ప్రజలకి అంతకన్నా సంభ్రమం ఏముంటుంది? రోజంతా ఊరంతా అదే టాపిక్.

ముందు నాయుడు మాట్లాడాడు. "వీరదాసుగారిని జైల్లో పెట్టారు. వీరదాసు ఎలాటి ప్రజాసేవకుడో అందరికీ తెలుసు. ఏదో హత్యానేరం ఆయన మీద మోపి ఆయన్ని జైల్లోకి తోశారు. ఆయన బయటకు బెయిల్ మీద రావాలనుకుంటే క్షణాల్లో రాగలరు. ఆయన రాదల్చుకోలేదు. పోలీస్ వ్యవస్థ సామాన్యులని ఎలా బాధపెడుతుందో చెప్పడం కోసం-- చూపించడం కోసమే వీరదాసు గారు లాకప్‌లో వుండిపోయారు. ఆయన్ని అప్రతిష్టపాలు చేయడంకోసం పోలీసులే ఎం.పి. గారి కూతుర్ని కిడ్నాప్ చేసి, ప్రజల్లో వీరదాస్‌గారి పలుకుబడి తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. వాళ్ళు విధించిన గడువు దాటిన తరువాత ఎం.పి. పులిరాజుగారి అమ్మాయికి ఏదో హాని చేసి, ఇదంతా వీరదాసే చేయించాడని కూడా ఈ పోలీసులు అనగలరు. ఇంతకన్నా వేరే కారణం నాకేమీ తోచడం లేదు."

తరువాత ఎం.పి. పులిరాజు మాట్లాడాడు. మైకు ముందు నిలబడి కళ్ళు తుడుచుకున్నాడు ముందు. తరువాత కంఠం సవరించుకున్నాడు. "నా కూతురి ప్రాణాలకి టెర్రరిస్టులు పెట్టిన గడువు కేవలం నలభై గంటలే వుంది. స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలు అడ్డుగా పెట్టిన దేశ భక్తుల వంశం మాది. నా కూతురి జీవితం ఒక 'లక్ష్యం' కోసం నాశనమైనా నేను బాధపడను. ఒక తండ్రిగా నా గుండెల్లో అగ్ని పర్వతాలు బ్రద్ధలవుతున్నా, ఒక రాజకీయ నాయకుడిగా, ఎం.పీగా ఇలాంటి బెదిరింపులకు తలవంచను. నిజానికి వీరదాసు మా పార్టీ మనిషి కాడు. కానీ ఒక మనిషిని అన్యాయంగా పోలీసులు అరెస్ట్ చేస్తే- అక్కడ పార్టీలూ, కులతత్వాలు, మతాలు కాదు. మానవత్వం కావాలి. నా కూతుర్ని పోలీసులే కిడ్నాప్ చేయించారంటే నేను ముందు నమ్మలేదు. కానీ ఎమ్మెల్యే నాయుడి గారి ఉపన్యాసం వింటూంటే అది నిజమే అనిపిస్తోంది. వీరదాసుగారు ఏ క్షణమైనా లాకప్‌లోంచి బయటకు రాగలరు. కానీ ఆయన రాదల్చుకోలేదు అనేది తెలుస్తూనే వుంది. మరి ఈ కిడ్నాప్ ఎందుకు? అయన మనుష్యులకి ఈ కిడ్నాప్ చేసి బెదిరించే అవసరంలేదు.

పోలీసు దౌర్జన్యాల్ని ప్రజలకి తెలియజెప్పటం కోసం జైల్‌నే సత్యాగ్రహశాలగా మార్చుకున్న మహనీయుడాయన. అందువల్లే, మా పార్టీ మనిషి కాకపోయినా ఆయనకి సభాముఖంగా చేతులెత్తి నమస్కరిస్తున్నాను."

సభలో చప్పట్లు.

పులిరాజు కాస్త ఆగి అన్నాడు--

"రేపు నా కూతురు శవంగా మారి బయటపడవచ్చు. ఆమె శరీరం ముక్కలు ముక్కలుగా ఛిద్రమై ఏ కాలువ ఒడ్డునో కనిపించవచ్చు. నేను బాధపడేది అందుకే. పోలీసులకీ, పొలిటిక్స్‌కీ మధ్య ఒక అమాయక ఆడపిల్ల అన్యాయంగా బలి అయిపోతుందే- అని. అది నా కూతురని కాదు రేపు మీ కూతురవ్వొచ్చు- మీ భార్య అవ్వొచ్చు. మరి దీన్ని చూస్తూ వూరుకోవడమేనా? ప్రజల్లో చైతన్యం రాదా? కేవలం ప్రేక్షకుల్లా వుండిపోతారా? మీరుండరని నాకు తెలుసు. మీరు విప్లవం తీసుకొస్తారు. మనకి వున్నది కేవలం నలభైగంటలే ప్రతీ క్షణమూ విలువైనది. ఉద్యమించండి. పార్టీలకి దూరంగా, రాజకీయాలకి అతీతంగా ఉద్యమించండి--"

ప్రజలు ఉద్యమంగా కదల్లేదు. ఛోటా నాయకులు, రెండు పార్టీల కార్యకర్తలు వారిని నడిపించారు. రౌడీలు వాళ్ళల్లో కలిసిపోయారు. అరగంటలో అరవైలక్షల ఆస్థి నష్టం జరిగింది. దొమ్మీలు- గృహదహనాలు మొదలయ్యాయి. కేంద్ర దురదర్శన్ బృందాని పంపింది. ఆ రాత్రి వార్తల్లో చాలాసేపు ఆ దృశ్యాలనే చూపించారు. టెర్రరిస్టులు కిడ్నాప్ చేసిన ఎం.పి. కూతురి (అమాయకమైన) మొహాన్ని చాలాసార్లు చూపించారు. రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రతల విషయంలో ఎలా విఫలమయింది చెప్పడంలో కేంద్రం సక్సెస్ అయింది.

ముఖ్యమంత్రికి ఏం చెయ్యాలో అర్థంకాలేదు. హోం మినిష్టర్‌ని సలహా అడిగాడు. "ఆ ఇన్‌స్పెక్టర్‌ని ట్రాన్స్‌ఫర్ చేసి- వీరదాసుకి క్షమాపణ చెప్పుకుంటే ఈ గండంలోంచి బయటపడగల మంటావా?"

"అక్కడ జరుగుతున్న గొడవలో ప్రజలు అందరూ రాజకీయాల్నే నమ్మడంలేదు. ఆ ఇన్‌స్పెక్టర్ చేసింది కూడా కరక్టే అని నమ్మే జనం వున్నారు. వాళ్ళని కూడా నమ్మించకపోతే కష్టం" అన్నాడు హోం మినిష్టర్.

"మరేం చేద్దాం?"

"ఏకసభ్య కమిషన్ వేద్దాం" సలహా ఇచ్చాడు రెడ్డి. " ..... నేనే ఆ కమిషన్ మెంబర్‌గా వెళ్తాను" అని కూడా అన్నాడు.

వెంటనే ఆ ప్రకటన వచ్చింది ---

"వీరదాసుని లాకప్‌లో పెట్టిన సందర్భంలో ప్రభుత్వం కమీషనర్‌ని నియమించింది" అని.

రాణా జరుగుతున్న విషయాలన్నీ గమనిస్తూనే వున్నాడు. దెబ్బ మీద దెబ్బ- అన్ని వైపుల్నుంచీ వత్తిడులు. లోకల్‌గా రెండు పార్టీలూ ఏకమైపోవడంతో - రౌడీ ఎలిమెంట్స్ నుంచి చాలా తీవ్రమైన పరిస్థితి ఎదుర్కోవలసి వస్తోంది. పైన డి.యస్పీ - ఏమీ తెలియనట్టు నాటకం ఆడుతున్నాడు. ప్రజల్లో సానుభూతి వుంది. కానీ దానివల్ల లాభంలేదు. నోరున్నవాడిదే రాజ్యం. ఒక పద్ధతి ప్రకారం తనకి వ్యతిరేకంగా కాన్వాసింగ్ జరుగుతూ వుందని తెలుసు. వీరదాసు రిమాండ్‌కి పంపవలసిన గడువు ఇంకెంతో లేదు. తొందరగా వదిలించుకుని చేతులు కడుక్కోవడం ఒక పద్ధతి. అటో ఇటో తేల్చుకోవడం మరో పద్ధతి.

ప్రతి మనిషీ పోరాడగలడు. కానీ ఎంతసేపు పోరాటం కొనసాగించగలడు అన్నది అతడి మానసిక స్థైర్యం మీద ఆధారపడి వుంటుంది. ఆ పోరాటం వ్యక్తులతోనే అయి వుండనవసరం లేదు. పరిస్థితుల్తో పోరాడటం వ్యక్తుల్తో పోరాటం కన్నా భయంకరమైనది. మనసు జారిపోకుండా నిలదొక్కుకోవడానికి చాలా ఆత్మస్థయిర్యం కావాలి.

హోం మినిష్టర్ వెంటనే బయల్దేరి వచ్చాడు. ఎం.పి. కూతుర్ని ఏ విధంగానూ బాధపెట్టవద్దని టెర్రరిస్టులను కోరుతూ ప్రకటన ఇచ్చాడు. మరో గంటలో కమీషన్ మొదలవుతుందని ప్రెస్‌కి చెప్పాడు.

***పోలీస్‌స్టేషన్ మధ్య హాల్లో ఎమ్మెల్యే - ఎం.పి. , హోం మినిష్టర్ - డి.యస్పీ. కూర్చుని వున్నారు. వీరదాస్‌ని కూడా ఒకవైపు కూర్చోపెట్టారు.***

రాణా నిలబడి వున్నాడు.

"వీలైనంత త్వరగా మనం ఈ ఎంక్వయిరీ పూర్తిచేసి, ఎం.పి. గారి కూతుర్ని కాపాడుకోవాలి" అన్నాడు హోం మినిష్టర్.

రాణా నవ్వేడు.

"ఎందుకు నవ్వుతున్నావ్?"

"పులిరాజుగారి కూతురి నెవరూ కిడ్నాప్ చెయ్యలేదనీ, ఎం.పీ గారే కూతుర్నీ దాచేసి ఈ విధంగా నాటకం ఆడుతున్నారనీ, ఇక్కడున్న మన అయిదుగురికీ తెలుసు. మనమధ్య ఈ హిపోక్రసీలు ఎందుకు సార్ విషయానికి రండి" అన్నాడు.

"నువ్వు చాలా తెలివైనవాడివి" అన్నాడు హోం మినిష్టర్.

'నా తెలివితేటలన్నీ ప్రజల్ని రక్షించటానికన్నా ప్రజాప్రతినిధుల్ని ఎదుర్కోవడానికే సరిపోతున్నాయి' మనసులో అనుకున్నాడు రాణా.

"ఇంక ఎంక్వయిరీ ప్రారంభిద్దామా?"

రాణాకి మనసు కుతకుత ఉడికిపోతున్నది. అది తన పోలీస్‌స్టేషన్. తన సీట్లో హోమ్ మినిష్టర్ కూర్చుని వున్నాడు. అతని ఎదురుగా ఎం.పి. ఎమ్మెల్యేలు కూర్చుని వున్నారు. పక్కగా వీరదాసు కూర్చుని వున్నాడు.

తాను నిలబడి వున్నాడు !!!

ఆ దృశ్యం చిత్రకారుడు గీసిన బొమ్మలా వుంది. సామాజిక అసంబద్ధం ఆ చిత్రం.

"నీ తండ్రి పేరు?"

"రామస్వామి సర్!"

"ఏం పనిచేస్తూ వుండేవాడు?"

" స్టూవర్ట్‌పురం సెటిల్‌మెంట్ గ్యాంగ్‌లో మనిషి. ప్రభుత్వం ఇచ్చిన పొలం దున్నుకుంటూ జీవిత పంథా మార్చుకున్నాడు."

"ఓహో! అయితే నువ్వు దొంగ కొడుకు వన్నమాట"

"నేను పోలీస్ ఆఫీసర్ని సర్"

"రామస్వామిని ఉరి తీసినట్టు రికార్డుల్లో వుంది?"

"అవును సార్."

"టెంపుల్ గార్డులని చంపిన నేరానికి?"

"అవును సార్! రికార్డుల్లో అలాగే వుంది."

"ప్రభుత్వం దగ్గిర పొలం తీసుకుని తిరిగి మర్డర్లు చేయించడం ప్రారంభించాడా?" వీరదాసు అడిగాడు. అతడి మొహంలో నవ్వు కొట్టొచ్చినట్టు కనబడుతూంది. రాణా ఆవేశాన్ని అణచుకున్నాడు.

"నా తండ్రి మర్డర్ చేయలేదు సార్. గుళ్ళో దొంగతనం చేసిన వ్యక్తులు, సాక్షి అయిన నా తండ్రిని కొట్టి, బెదిరించి హత్యానేరం వప్పుకునేలా చేశారు. స్టూవర్ట్‌పురం దొంగలకు ఇలాంటి శిక్షలు మామూలే."

"ఇదంతా మీ కెవరు చెప్పారు?" ఎమ్మెల్యే అడిగాడు

"రామాచారి చెప్పాడు. మరణ వాంగ్మూలంలో అదంతా వ్రాస్తే సంతకం పెట్టాడు."

"అసలు విషయం అదికాదు రాణా. జరిగింది నేను చెబుతాను విను. నీ తండ్రి టెంపుల్ గార్డుని చంపింది నిజమే. అయితే నగల దొంగతనానికి వెళ్ళి కాదు. గార్డునే చంపడానికి వెళ్ళాడు. గార్డుకి ఒక స్త్రీతో సంబంధం వుంది. ఆ కక్షతో చంపడానికి వెళ్ళాడు. అందుకే నగల దొంగతనం ఆ రోజు జరగలేదు ..... "

"సగం దొంగతనం జరిగింది. ఒరిజినల్ నగలు తీసేసి డుప్లికేట్‌వి పెట్టారు. అందువల్లే ఎవరికీ అనుమానం రాలేదు."

"అలాగే అయితే, మొన్న పోలీస్‌స్టేషన్‌లో నువ్వు తెచ్చిన నగలు డూప్లికేట్‌వా?"

"కాదు ఒరిజినలే ..... "

"ఎక్కడ దొరికాయి?"

"ఎమ్మెల్యే నాయుడు ఇంట్లో ..... "

"మరి ఎమ్మెల్యేని అరెస్టు చేయలేదేం?"

"అమాయకులయిన స్టూవర్ట్‌పురం దొంగల్ని రిలీజ్ చేయడం నా ఉద్దేశ్యం కానీ, నాయుడిని అరెస్టు చేయడం కాదు."

"ఇదంతా మే మెందుకు నమ్మాలి?"

"రామాచారి మరణ వాంగ్మూలంలో ఇదంతా వుంది."

"రామాచారి మరణ వాంగ్మూలం ఇచ్చేటప్పుడు పక్కన మేజిస్ట్రేట్‌ని వుంచుకోవాలని నీకు తెలీదా?"

"మేజిస్ట్రేట్ దగ్గరికి నేను వెళ్ళాను. కారు వుంటే కాని రాను అన్నాడు. (మేజిస్ట్రేట్ రాననడం యథార్థ సంఘటన) ఈ లోపులో రామాచారి పరిస్థితి విషమించింది. అక్కడికి వెళ్ళవలసి వచ్చింది."

"రామాచారి సంతకం ఇదేనని నమ్మకం ఏమిటి?"

గాఢమైన నిశ్శబ్దంలో ఒక్కసారి పెద్ద విస్ఫోటనం జరిగినట్టు ఆ ప్రశ్న. ఇటుక మీద ఇటుక పేర్చి కట్టిన భవంతి అకస్మాత్తుగా కూలిపోయినట్టు- శ్మశాన నిశ్శబ్దం ప్రయోగించిన బ్రహ్మాస్త్రం. ప్రత్యర్థిని కూల్చేస్తుందన్న విషయం ముందే తెలుసు నన్నట్టు వీరదాసు పెదవుల మీద చిరునవ్వు. కొంచెంసేపు అందరిమధ్యా నిశ్శబ్దం. తరువాత హోం మినిష్టర్ అన్నాడు. "నువ్వు చెప్పేవేమీ నమ్మశక్యంగా లేవు మిష్టర్ రాణా. గుళ్ళో నగలు డూప్లికేట్ అన్నావ్. ఒరిజినల్ నగలు ఎమ్మెల్యే దగ్గిర దొరికిన వన్నావు. కానీ ఎమ్మెల్యేని అరెస్టు చేయలేదన్నావు. రామాచారి వాంగ్మూలం మీద సంతకం ధృవీకరింపబడలేదు. పైగా నువ్వు మీ స్టూవర్ట్‌పురం బంధువుల్ని రిలీజ్ చేసిన విధానంకూడా సహేతుకంగా లేదు. వారిని ఒక నేరం మీద అరెస్టు చేసినప్పుడు వస్తువులు దొరికిన కారణంగా వారిని రిలీజ్ చెయ్యడం అనేది ఒక పోలీసాఫీసర్

వుంచావు. కేవలం అతనిని లాకప్‌లో హింసించడం కోసమే వారంకన్నా ఎక్కువరోజులు నీ ఆధీనంలో వుంచుకోవడానికి అనుమతి తీసుకున్నావు."

"అబద్ధం" అన్నాడు రాణా. "వీరదాసు ఈ ఊరికీ, ఈరాష్ట్రానికీ పేరుమోసిన గూండా. అతడిని వదిలేస్తే సాక్ష్యాలని తారుమారు చెయ్యగల సమర్థుడు. అదే కారణం. అంతేకానీ అతడిమీద నాకు వ్యక్తిగత కక్ష ఎందుకు?"

తనని గూండా అన్నందుకు వీరదాసు ఫీలయినట్టు కనిపించలేదు. సన్నగా నవ్వుతూ "నీ తండ్రి టెంపుల్ గార్డుని ఎందుకు చంపాడో నాకు తెలుసు కాబట్టి" మధ్యలో ఆపి "నీ తండ్రి ఉరికంబం ఎక్కించడానికి కారణం నేను కాబట్టి" అన్నాడు.

"టెంపుల్ గార్డుని చంపింది నువ్వు- నా తండ్రి కాదు."

"అసలు కారణం నీకు తెలీదు."

పత్రికా విలేకరులు వ్రాసుకుంటున్నారు.

"ఏమిటి మరి అసలు కారణం?" రాణా అడిగాడు.

వీరదాసు ఓరగా విలేకరులవైపు చూశాడు. అమాయకమైన కుందేలు వేటగాడికి సరీగ్గా గురి కుదిరినప్పుడు బాణం వదిలేముందు వచ్చే విషపు చిరునవ్వు అతడి పెదవులమీద కదలాడుతూండగా, మరోమారు విలేకరులవైపు చూసి "నీ తల్లికీ టెంపుల్ గార్డుకీ సంబంధం వుంది కాబట్టి" అన్నాడు.

భూమి అంచులకు వింటి తాడు కట్టి, ఆకాశం వరకూ సంధించిలాగి వదిలితే, శోకాను భూత్య నిరిశ తటిచ్ఛకిత ఉద్రిక్త క్షణంలో పగిలిన గుండె- చరన్మోఢ్య క్రూరమృగాల సంకులారణ్యంలో దిక్కు తోచని స్థితి.

"అబద్ధం" భూమి అరుపుకి కంపించింది. చలనం ఆపి సముద్రం శోకించింది.

వీరదాసు తాపీగా అన్నాడు. "అబద్ధం అని నువ్వంటావు. నిజమని నేనంటాను. రామాచారి మరణ వాంగ్మూలం నిజమని నువ్వంటావు. అబద్ధమని నేనంటాను" -- నవ్వేడు ..... "కానీ నా మాటలు నిజమని ప్రజలు నమ్ముతారు. ఎందుకంటే ..... ఎందుకంటే దొంగల భార్యలకి తమ భర్తలు జైల్లో వున్నప్పుడు వ్యభిచరించడం, అక్రమ సంబంధం పెట్టుకోవడం అలవాటే గనుక ..... "

రాణా పరుగెత్తాడు వారిద్దరి మధ్యా దూరం కేవలం నాలుగు గజాలే. అయినా సరే, లేచి బుల్లెట్‌లా పరుగెత్తాడు ఒక ఝంఝామారుతంలా వెళ్ళి అదే వూపులో వీరదాసుని కుర్చీలోంచి పైకెత్తి విసిరికొట్టాడు లాకప్ చువ్వలకు తగిలి అతడి తల టప్‌మని చప్పుడైంది ఇంకొకరైతే ఆ క్షణమే మరణించేవారే వీరదాసు కాబట్టి నిలదొక్కుకున్నాడు. అయితే అతడు లేచే ప్రయత్నం చేయలేదు. సాధించవలసింది సాధించినట్టు అలాగే వుండిపోయాడు. పెదవులమీద చిరునవ్వు కూడా అలాగే వుంది. హోం మినిస్టర్ బాడీగార్డులు వెళ్ళి రాణాని వెనక్కి లాగి పట్టుకున్నారు. రాణా రొప్పుతున్నాడు. అతడి మొహం జేగురు రంగుకి మారి వుంది. అతడి మనసు మీద

ఎక్కడ దెబ్బ కొట్టాలో అక్కడ కొట్టాడు వీరదాసు. సరీగ్గా ఈ సమయం కోసమే, ఈ అవకాశం కోసమే ఇన్నాళ్ళూ లాకప్ చీకటి గదిలో తన నేరాన్ని వప్పుకుని వున్నట్టు నవ్వుతున్నాడు.

"పత్రికా విలేకరులు చూస్తూ వుండగా, ఒక హోమ్ మినిష్టర్ ముందు లాకప్‌లో వ్యక్తిని కొట్టడం క్షమించరాని నేరం. నీ తలబిరుసుతనాన్ని, ఖైదీలపట్ల నీకున్న చులకన భావాన్ని అది సూచిస్తుంది." అన్నాడు హోమ్ మినిష్టర్. " ..... నీ తండ్రి ఒక స్టూవర్ట్‌పురం దొంగ. నీ సహచరులందరూ దొంగలు. వాళ్ళు దేవాలయంలో నగలు దొంగతనం చేశారు. ఆ నేరం విషయంలో వారు అరెస్టు అయ్యారు. ఇక నీకు దారి లేక, నగలు తిరిగి దొరికినట్టు నటించి మీ వాళ్ళని వదిలిపెట్టావ్."

ఆగి, తిరిగి అన్నాడు. "రామాచారి మరణ వాంగ్మూలానికి సాక్షులెవరూ లేరు. మేజిస్ట్రేట్ రానన్నాడని నీవంటున్నావు. దానిమీద ఆయన నీపై పరువునష్టం దావా వెయ్యొచ్చు. కేవలం అన్‌పాపులర్ చెయ్యడానికే నువ్వు వీరదాసుని అరెస్టు చేశావని ఈ విధంగా తేటతెల్లమవుతూంది. ఆయన్ని మరింత ఇరుకులో పెట్టడానికే ఎం.పి. గారి కూతుర్ని కిడ్నాప్ చేసి, వీరదాస్‌కీ టెర్రరిస్టుకీ సంబంధం వుందన్నట్టు అపోహ కల్గించావు. ఈ కారణాలవల్ల నిన్ను సస్పెండ్ చేస్తున్నాము. నీ మీద మేజిస్ట్రేట్ పరువునష్టం దావా వేస్తున్నారు. మా అందరిముందూ చెయ్యి చేసుకున్నందుకు వీరదాసు నీమీద క్రిమినల్ కంప్లయింట్ ఇవ్వడానికి మాకు అభ్యంతరం లేదు. యూ ఆర్ సస్పెండెడ్ హియర్ అండ్ నౌ ఇట్ సెల్ఫ్. క్షమాపణలతో వీరదాసుని రిలీజ్ చెయ్యడానికి ఉత్తర్వులు ఇస్తున్నాను."

ఒక చేత్తో రాణాకీ, మరోచేత్తో వీరదాసుకీ ఆర్డర్లు ఇచ్చాడు హోం మినిష్టరు.

బయటికీ విషయం తెలిసినట్టుంది. "వీరదాస్‌కీ జై" అని ఎవరో అరిచారు. లోపలికి ఒక రౌడీ నిలువెత్తు దండ తీసుకొచ్చి వేశాడు వీరదాసుకి. నలుగురూ అతన్ని చేతులమీద బయటకు తీసుకెళ్ళారు. లారీల మీద ఊరేగింపు ప్రారంభమైంది.

బయట చీకటి పడుతోంది.

పోలీస్‌స్టేషన్‌లో మరీ చీకటిగా వుంది.

దూరం నుంచి ఎవరో బాగా తాగేసి పాడుతున్నారు.

***"జోరుసే బార్‌సే - కోణంగి రేవుసే-***
***తాగేసి తోస్తే - నావ మునకేసే-***
***జోరుసే బార్‌సే - కోణంగి రేవుసే-***
***తాగేసి తోస్తే - నావ మునకేసే-"***

## 15

***ఆమె*** అలానే చాలాసేపు కూర్చుండిపోయింది. ఆమె ముందు టేప్‌రికార్డర్ వుంది.

కామిని పెద్ద దేశభక్తురాలేమీ కాదు. దేశంకోసం ప్రాణాలు అర్పించాలన్నంత త్యాగగుణం
కూడా ఆమెకి లేదు. కానీ టేప్‌రికార్డర్‌లో విషయాలు ఆమెని కదిలించి వేశాయి.

మనుషుల్లో స్వార్థం గురించి ఆమెకు తెలిసినంతగా మరెవరికీ తెలియకపోయి వుండవచ్చు. అనడంలో అతిశయోక్తి ఏమీలేదు. సాధారణంగా స్వార్థం గురించి పురుషుడికన్నా స్త్రీకి ఎక్కువ బాగా తెలుస్తుంది. అందమైన స్త్రీకైతే మరింత. పబ్లిక్ ఫగర్‌కైతే ఇక చెప్పనవసరంలేదు.

స్త్రీలు పబ్లిక్ ఫగర్స్‌గా వెలిగేది ముఖ్యంగా రెండు రంగాల్లోనే, సినిమాల్లోనూ, రాజకీయాల్లోనూ ..... సినిమాల్లో స్త్రీమీద 'వత్తిడి' ఎక్కువగా వుంటుందని చాలామంది భ్రమిస్తారు. మొదట్లో కొంతకాలం వరకూ అది వుంటే వుండవచ్చునేమో కానీ, ఒకసారి ఆమె తన టాలెంట్ నిరూపించుకున్నాక ఎవరికీ లొంగి వుండనవసరం లేదు. అప్పటికే ఆమె ఆ అవసరానికి అలవాటుపడితే అది వేరు సంగతి.

రాజకీయాలు అలాకాదు. పైకి తెలియని పెద్దవూబి అది. అందులో పైకి రావాలంటే టాలెంటు, తెలివితేటలు, చదువు అవసరం లేదు. పబ్లిక్ రిలేషన్స్, లౌక్యం తెలిసుంటే చాలు. వీటన్నిటికన్నా ముఖ్యంగా అధిష్టానవర్గం నుంచి ఆశీస్సులు, పలుకుబడి కావాలి. స్త్రీకి ఇవన్నీ ఎలా వస్తాయి?

కామినికి రాజకీయాలు, సినిమారంగం- రెండింటిలోనూ ప్రవేశం వుంది. అందుకే మనిషి స్వార్థం గురించి ఆమెకు తెలిసినంతగా మరెవరికీ తెలియదేమో. ఆమె సినిమా రంగంకన్నా రాజకీయాల్నే ఎక్కువ ద్వేషించింది. అందం వున్న స్త్రీలు సినిమాల్లో చేరి చెడిపోతే చెడిపోవచ్చు గాక, కానీ రాజకీయాల్లో అందం వడిలిపోయిన ఎందరో స్త్రీలు తమ పైవాళ్ళ ప్రాపకం కోసం మరెందరో స్త్రీలని 'తార్చటం' ఆమె కళ్ళారా చూసింది. ఉద్యోగాలకోసం వచ్చేవాళ్ళు బదిలీలు కావల్సినవాళ్ళు, అప్పుడే రాజకీయాల్లో చేరని వాళ్ళు, ఉబుసుపోని హై సొసైటీ లేడీసూ వీళ్ళనుంచి వాళ్ళకి పరిచయాలు, కొత్త గుర్తింపులు ..... వ్యభిచార గృహపు వ్యవహారకర్తల్లా కొందరు స్త్రీలు రాజకీయాల్లో తయారవడం చూసింది. ఎంతోమంది మంత్రులు, ఊహించిన దానికన్నా ఎక్కువ 'లేకి' గా ప్రవర్తించడం ఆమెకు తెలుసు. ఆమె కోసం ఎందరో రాయబారాలు తీసుకొచ్చారు. ఈ రాయబారాలు తెచ్చేదీ మళ్ళీ స్త్రీలే కావడం విశేషం. అలా అని ఈ స్త్రీలు బ్రోకర్లు కారు. ఉన్నత పదవుల్లో వున్న వారు పార్టీ టికెట్టు కోసం ఆశిస్తున్నవాళ్ళు, పార్టీ నియమించే పదవుల కోసం ఆశపడుతున్న వాళ్ళు.

సినిమాలకి ఎల్లో జర్నలిజం వున్నట్టు రాజకీయాలకీ వుండి వుంటే ఎంతమంది హీన

జీవిత సత్యాలు బయటపడి వుండేవో.

అలాంటి కామిని- ఇప్పుడు తన జీవితపు అత్యంత దుర్భరమైన షాక్‌ని అనుభవిస్తున్న స్టేజీలో వుంది. కొన్నిగంటల క్రితమే అరవింద్ చౌరసియా ఆమెని ఈ విషయం అడిగాడు. ఆమెకు మొదట్లో అర్థం కాలేదు. తన భర్త చీఫ్ మినిష్టర్ అవబోతున్నాడన్నది ఆమెకు తెలిసిన విషయమే. ఆ ప్రయత్నం ఆమె చేసింది కూడా. ఇప్పుడు చౌరసియా ఆమె ముందు ఈ ప్రపోజల్ పెట్టాడు. అప్పటికామె టేప్‌రికార్డర్ వినలేదు. ఆమె కతడు చెపుతున్నది అర్థంకాలేదు.

"నీ భర్త ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తరువాత నువ్వేం చేయబోతున్నావ్?" అని అడిగాడు.

ఆమె నవ్వి "ఏం చేస్తారు? ముఖ్యమంత్రి భార్య నవుతాను" అంది.

"సినిమాల్లో నటించవా?"

"హోం మినిష్టర్ భార్యగా నటించలేదా? అలాగే కొనసాగిస్తాను."

"నీ భర్తవల్ల రాష్ట్రం బాగుపడుతుందా?"

ఆమె నవ్వుతూనే "ఏ ముఖ్యమంత్రి వల్ల అది బాగుపడుతుంది కనుక?" అంది.

"నువ్వు తల్చుకుంటే కొన్ని విప్లవాత్మక మార్పులు తీసుకురావొచ్చు. అది నీ వల్లే సాధ్యమవుతుంది."

"ఏ రకమైన మార్పులు?"

"ఉదాహరణకి- దేశం నుంచి రాష్ట్రాన్ని విడగొట్టడం--- "

ఆమె అదిరిపడింది. ముందసలు అతడు జోక్ చేస్తున్నాడేమో అనుకుంది. కానీ కొంతసేపటికి అతడు నిజంగా ఇదంతా చెపుతున్నాడని అర్థమైంది. ఆమె తన మనసులో కల్లోలాన్ని బయటపడనివ్వకుండా సంభాషణ కొనసాగించింది. వినాయక నిమజ్జనంలో మత వైషమ్యాల్ని ఎలా రెచ్చగొట్టాలో - అక్కడనుంచి అంచెలంచెలుగా ఎలా గొడవలు పెద్దవి చెయ్యవచ్చో. దీనికి ముఖ్యమంత్రే తెరచాటున వుండి నాటకం నడిపిస్తే, రాష్ట్రం విడిపోయాక వచ్చే లాభాలేమిటో వివరించాడు. అతడు మాట్లాడుతున్నంత సేపూ ఆమె ఆలోచిస్తూనే వుంది. అతడికి ఈ పథకం యోచన అకస్మాత్తుగా వచ్చినదా లేక ఎప్పట్నుంచో వున్నదా అని ఆమె ఆలోచన. ఎప్పట్నుంచో వున్నదయితే తనతో ఒక్కసారయినా చర్చించే వాడే. ఇంత భయంకరమైన ఆలోచన అతడికి ఎలా వచ్చిందో అని ఆమె మథనపడుతూనే వుంది.

టేప్‌లో మాటలు విన్నాక ఆమె అనుమానం నివృత్తి అయింది. అయితే దీనివల్ల ఆమె మానసిక వ్యథ మరింత ఎక్కువైంది. ఇంత వరకూ చౌరసియాకీ తనకీ మధ్య మామూలు ఆకర్షణలకి అతీతమైన సంబంధం ఏదో వుందనుకుంటూ వచ్చింది కానీ ఎవరో వచ్చి ఏవో ఫోటోలు బయట పెడతామనేసరికి అతడు దానికి భయపడి తనకు అసలు విషయం చెప్పకుండా ఈ విధంగా ప్రలోభపెట్టే ప్రయత్నం చేయడం ఆమె మనసుని కమ్చీతో కొట్టినట్టయింది. అతడు తనతో అన్ని విషయాలూ చర్చించి, 'ఈ ఫోటోలు బయటపడితే ఎలా'

అని అడిగి వుంటే అది వేరే సంగతి. నిజానికి ఆ ఫోటోలు బయటపడితే పోయే అతడి పరువు కన్నా తనది ఎక్కువ. అతడు కోటీశ్వరుడూ, పెద్ద మాఫీయా లీడరూ అయివుండవచ్చు. కానీ తాను రాజకీయాల్లోనూ, వెండితెరమీదా పబ్లిక్ ఫిగర్. ఆమెకు అకస్మాత్తుగా పెద్ద పెట్టున దు:ఖం వచ్చింది. ఒక్కసారి వెను తిరిగి చూసుకుంటే తానెంత ఒంటరినో అని మనిషికి అనిపించినప్పుడు కలిగే దు:ఖం అది. తనని ప్రేమించేవాళ్ళు లేక, తాను కష్టంలో వున్నప్పుడు మాట సాయం చేసేవాళ్ళు ఒక్కరన్నా లేరని తెలుసు కున్నప్పుడు కలిగే దు:ఖం అది. మనిషికి డబ్బూ, పదవి, హోదా - ఏదీ ఇవ్వలేనిది అది.

టేప్‌రికార్డర్‌లో సత్తార్ అన్న మాటలు ఆమెకు వాస్తవంగా అనిపించాయి. భర్తని బెదిరించడం కోసం మర్డర్ చేయించింది. మర్డర్ మాఫీ కోసం అరవింద్ చౌరసియాకి అర్పించుకుంది. అతని సాయంతో రాజకీయపుటెత్తులు వేసింది. ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీతో పరిచయం పెంచుకుంది. దాన్ని చూపించి ముఖ్యమంత్రిని బెదిరించింది. ముఖ్యమంత్రిని తొలగించడం కోసం అలజడులు సృష్టించాలనుకుంటూంది. మరో మెట్టు పైకి ఎదగాలనుకుంటూంది. తన పతనానికి మనసు ఇక్కడివరకూ అంగీకరిస్తోంది. సత్తార్ మరో మెట్టు క్రిందికి జారమంటున్నాడు. బస్సుని తగలబెట్టే ఆందోళనకారుడికీ, సరిహద్దు దాటి ఇవతలకొచ్చే టెర్రరిస్టుకి తేడా లేదనుకుంటున్నాడు. నిజమే అయివుండవచ్చు.

ఎక్కడ ప్రారంభమైంది? ఎక్కడకు వెళ్తోంది?

మనిషికి మనసుతో సత్సంబంధాలు లేవు. మనిషికి మరో మనిషితో, ప్రభుత్వంతో, దేశంతో సత్సంబంధాలు లేవు ఇదంతా ఎందువల్ల జరుగుతోంది? కేవలం నిజాయితీ లోపించడం వల్లేనా? తన జీవితానికి అనువుగా వుండేట్టు మొదట సిద్ధాంతాలు నిర్మించుకుని, ఆ తరువాత ఆ సిద్ధాంతాలే తమని మానసికంగా అనుక్షణం బాధపెడుతూ వుంటే నిరంతరం కుమిలిపోయే మనుష్యులకి దారేది? తన ప్రియుడి గదిలోనే టేప్‌రికార్డర్ పెట్టగలిగిన అవినీతిపరురాలు తను. ప్రియుడు ఇలా చేస్తాడని బాధపడటం దేనికి? మానవ సంబంధాలు పాడయిపోతున్నాయని వాపోవడం దేనికి??

ఈ వలయం నుంచి బయటపడటం ఎలాగో ఆమెకి అర్థంకాలేదు. చౌరసియా ఎలాగైనా వత్తిడి తెస్తాడు. తన భర్త దానికి వప్పుకోకపోవచ్చు. దేశంమీద ప్రేమ వుండికాదు. ప్రభుత్వం ఉరివేస్తుందేమో అన్న భయంతో టెర్రరిస్టులతో చేతులు కలిపేటంత ధైర్యం లేదు.

ఆమె తప్పంతా భర్త మీదకు తోసెయ్యడానికి నిర్ణయించుకుంది. తను అడుగుతంది. భర్త కాదంటాడు. ఆ విషయం వెళ్ళి చౌరసియాకు చెపుతుంది. మిగతా విషయాలు వాళ్ళు చూసుకుంటారు. తను మాత్రం ఈ సమస్య నుంచి బయటపడుతుంది.

ఇలా ఆలోచించి ఆమె బయల్దేరింది. భర్త దగ్గరకు వెళ్తూ వుండగా ఆమె మనసంతా అదోలా అయిపోయింది. ప్రియుడి సందేశాన్ని భర్తకి అందించడం ..... బహుశ ఏ స్త్రీకి ఇప్పటివరకూ ఈ స్థితి సంభవించి వుండదు.

ఆమె రెడ్డి దగ్గిర ఈ విషయాన్ని జాగ్రత్తగా కదిపింది. అరవింద్ చౌరసియా ప్రసక్తి రాలేదు. 'బయట శక్తులు కొన్ని సాయం చేయడానికి సిద్ధంగా వున్నాయి. రాష్ట్రాన్ని కల్లోలం చేసి విడగొట్టగల్గితే కొన్ని కోట్లు లాభం ..... ' అన్నట్టు చెప్పింది.

రెడ్డి మొహం ఉద్వేగంతోనూ, ఆనందంతోనూ నిండిపోయింది. "నిజమా?" అన్నాడు ఎగ్జైయిటెడ్‌గా. అతడు అప్పుడే ఆంధ్రదేశాధినేత అయినట్టు వూహించుకున్నట్టు మొహం చూస్తుంటేనే తెలుస్తూంది.

కామిని మొహం రక్తం చుక్కలేనట్టు పాలిపోయింది.

ఆమె దీన్ని వూహించలేదు. తన భర్త భయాని స్వార్థం డామినేట్ చేసిన క్షణాలివి. రెండుచోట్లా తను ఓడిపోయినట్టు ఆమె గ్రహించింది. ఆమెలో ఒక కసి బయల్దేరింది. ఆ రకమైన సాడిజంతోనే, "ఇదంతా నీకు ఎవరు సాయపడతారని అడగవేం?" అంది.

"అవును అడగడం మర్చిపోయాను. ఎవరు?"

"అరవింద్ చౌరసియా?"

అతడి మొహం ఒక్కసారిగా వెలిగిపోయింది. "చౌరసియా మనకి సాయపడతాడా?" అని అరిచాడు ఉద్వేగంగా.

ఆమెలో కసి తారాస్థాయికి చేరుకుంది ఈ ప్రజలమీద, నిర్లిప్తత మీద, మానవ సంబంధాలమీదా, నిజాయితీ ముసుగులో ఆడే నాటకాల మీదా - అన్నీ కలిపి - ఎదురుగా వున్న అతడి మీద.

"అవును. నీకు ఎందుకు సాయపడడు? నువ్వు తన ప్రియురాలి భర్తవి కదా" అంది. ఆఖరి అణ్వాస్త్రం వదులుతున్నట్టు! ఆమె ఆ క్షణం అంతా చెప్పెయ్యటానికే నిశ్చయించుకుంది.

యుద్ధం అయిన తరువాత కన్నా, ముందే ఎవరు శత్రువులో, మిత్రులో తెలుసుకోవటం మంచిది కదా!

అతడు ఆ మాటలకి తలెత్తి చూశాడు. అతడి మొహంలో రకరకాల భావాలు చోటుచేసుకున్నాయి. కామిని అతడివైపే చూస్తోంది. ఆనకట్టు తెగితే, ఒక్కసారిగా నదీజలం ప్రవహించినట్టు అతడిలో ఆవేశం కట్టలు తెంచుకుని, తనని అక్కడి కక్కడే మర్డర్ చేస్తాడని ఆమె భావించింది. అయితే అతడి మొహంలో వస్తూన్న మార్పులు 'ఆవేశం' తాలూకువి కావు 'సంభ్రమం' తాలూకువి.

"నిజమా? నీకూ చౌరసియాకు అంత దగ్గిర సంబంధం వున్నదా?" అన్నాడు సంభ్రమంగా.

ఒక గ్రీష్మ పవనం వంటిని మండించినట్టు ఆమె కదిలిపోయింది. అతడు ఆవేశంలో తనని తగలబెట్టినా ఆమె అంత ఆశ్చర్యపోయేది కాదేమో. తనని నిలువునా సమాధి చేస్తానని రెచ్చిపోయినా అంత బాధ పడేది కాదేమో ఈ విషయం తాను చెప్పగానే అతడు

"ఆనందించటం" ఆమెకు గొడ్డలిపెట్టులా తగిలింది.

జేవురించిన మొహంతో, "మీ భార్యకు ఇంకొక వ్యక్తితో సంబంధం ఉందని చెపుతున్నాను. అయినా మీకు ఆవేశం కలగటం లేదా?" అంది.

అతడు సింపుల్‌గా "నేను రాజకీయ నాయకుడిని కదా" అన్నాడు - "రాజకీయ నాయకుడు ఎవరూ అనవసరమయిన విషయాలకు ఆవేశం తెచ్చుకోడు."

ఆ మాటలకు ఆమె మరింత ఇరిటేట్ అయి, "నువ్వసలు మగాడివేనా? నీలో నెత్తురు ప్రవహిస్తూందా? నీ భార్యకు ఇంకొక వ్యక్తితో సంబంధం ఉందంటే- అది అనవసరమయిన విషయమా?" అని అరిచింది.

"ఆవేశపడకు కామినీ అసలు విషయం చెప్పు. చౌరసియా నీతో ఏం చెప్పాడు? నా ప్రసక్తి ఎందుకొచ్చింది? ఈ రాష్ట్రపు కాబోయే ముఖ్యమంత్రితో చౌరసియాకు ఏం పని?" అన్నాడు ఆత్రంగా.

"అతడితో కలిసి ఈ రాష్ట్రాన్ని విడగొట్టెయ్యాలని ఫీలర్స్ పంపాడు ..... నాతో!"

"అతడిని నమ్మవచ్చంటావా? లేక నన్ను ట్రాప్ చేసి కటకటాల వెనక్కి తొయ్యటానికి ముఖ్యమంత్రితో కలిసి అతను వేసిన ట్రిక్కా అది?"

"అతడితో కలిసి ఒకే పక్క మీద గడిపిన ఎన్నో రాత్రుల సాక్షిగా అతడిని నమ్మవచ్చు" అంది.

"నువ్వు చెపుతే ఇక అందులో డౌటు లేదులే. నువ్వు కలుపుతావా మా ఇద్దర్నీ- లేక - నువ్వు చెప్పావని నేన అతడిని కలుసుకుని ఈ ప్రపోజల్ పెట్టనా?" అన్నాడు.

"అంటే ..... అంటే ..... అతడితో కలిసి రాష్ట్రంలో టెర్రరిజాన్ని వ్యాపింపజెయ్యటం నీ కిష్టమే నన్నమాట."

"అందులో తప్పేం వుంది? స్వతంత్ర ఆంధ్రదేశానికి నేను రాజునవుతాను."

ఆమె ఇంక ఆగలేకపోయింది. చివాలున లేచి అతడి కాలర్ పట్టుకుని దగ్గరకి లాగుతూ, "నీ మొహం మీద ఉమ్మెయ్యాలనిపిస్తూంది నాకు. ఎంత దిగజారిపోయావు నువ్వు? నా భర్త ఒక చేతకాని దద్దమ్మ అనుకున్నప్పుడు బాధ కలగలేదు. అటువంటి వాడిని హోమ్ మినిస్టర్‌ని చేయటం కోసం ఢిల్లీలో అడ్డమైన వాళ్ళ కాళ్ళుపట్టుకున్నప్పుడు బాధ కలగలేదు. 'నీలో వయసు బాగా తెలుస్తూంది. నీకు మేకప్ చేసే అమ్మాయిని నాకు పరిచయం చెయ్యి' అని చౌరసియా అన్నప్పుడూ బాధ కలగలేదు. కాని ఇప్పుడు ..... ఇప్పుడు ఒక చిన్న దేశానికి రాజు కావాలన్న ఆశతో దేశంనుంచి రాష్ట్రాన్ని విడగొట్టటం కోసం తన భార్య ప్రియుడితో చేతులు కలిపేవాడు. నా భర్త అనుకుంటే నాకు బాధ కలుగుతోంది-" అంది.

అతడు తాపీగా, "ఇంతేనా? నువ్వు చెప్పవలసింది ఇంకేమయినా వున్నదా?" అని అడిగాడు. తరువాత లేచి ఆమెవైపు చూస్తూ అన్నాడు. "నువ్వు చాలా గొప్పదానివని నీ అభిప్రాయం. నువ్వే కాదు నీలాటి స్త్రీలు చాలామంది అలానే అనుకుంటూ వుంటారు. తాము ప్రపంచాన్నీ, అందులోని చాలామంది మొగవాళ్ళనీ చూశామని అనుకుంటారు. నీలాటి స్త్రీలు రాజకీయాల్లో ఎక్కువగా వున్నా, బయట ప్రపంచంలో కూడా చాలామంది వుంటారు. వీళ్ళు ఎక్కడా ఇమడలేరు. ఒక్క స్నేహితుడితో ప్రారంభమైన మీలాటి జీవితం ఎన్నో మజిలీల్లో ఆగుతుంది. ఒక్కొక్క మజిలీ మీరు ఒక్కొక్క అనుభవంగా భావించి ఎదిగిపోయామని అనుకుంటారు. ఒక మొగవాడు తనకి ఒక స్త్రీ దొరకటం గొప్ప వరంగా భావిస్తాడు. అలాటి తొట్టిగ్యాంగు, నీచమైన గ్యాంగు అంతా మీ చుట్టూ చేరి మీకు లేని గొప్పదనాన్ని కలిగిస్తారు. వీళ్ళంతా మీ శరీరం మీది వ్యామోహంతో మీ చుట్టూ చేరతారు. కొంతమంది మిమ్మల్ని ప్రేమిస్తారు కూడా కానీ ఆ ప్రేమంతా వాళ్ళు తమ బాధలు మీతో చెప్పుకోవటానికి మాత్రమే ఉపయోగపడుతుంది. అలాటి మొగవాళ్ళు మీకు నచ్చరు. అప్పటికే మీ గురించి నలుగురికి తెలుస్తుంది. నలుగురికీ తెలిసిందని మీకూ తెలుస్తుంది. మీ మనసుతో మీకు మంచి సంబంధాలు వుండవు. విసుగూ, చిరాకూ ఎక్కువ అవుతుంది. మొగవాడికి ఒక అనుభవం అతడి అకౌంట్‌లో ఒక నెంబర్‌గా చేరుతుంది. ఆడదానికి ఒక అనుభవం మొహం మీద ఒక ముడతను ఎక్కువ చేస్తుంది. ఇంత చిన్న విషయం తెలుసుకునేసరికి మీ చుట్టూ వున్న వాళ్ళ సంఖ్య తగ్గిపోతుంది. మనసుతో ఇక నాటకాలు ఆడలేక, 'నన్ను నన్నుగా ప్రేమించే ..... ' అన్న కొత్త స్లోగను మొదలుపెడతారు. మిమ్మల్ని మీరుగా ప్రేమించటానికి మీలో ఏమీ లేదని మిగిలింది వట్టి చెరుకుపిప్పి అనీ గ్రహించరు. అప్పటికి మీక్కాస్త హోదా వస్తుంది. దాన్ని మీ ఫ్రస్టేషన్ కోసం ఉపయోగించుకుంటారు. మీరు ఉద్యోగనులైతే క్రింది ఉద్యోగస్తులను చంపుతారు. రచయిత్రులైతే రచనల్లో చూపిస్తారు. రాజకీయాల్లో అయితే మంత్రుల మధ్య తెంపులు పెట్టడానికి ప్రయత్నిస్తారు. రోజుకి పది గంటలు ఫోన్ దగ్గరే గడపటం మీ జబ్బుకి మొదటి లక్షణం మీ మొహంమీద ఆనందకరమైన, శుభప్రదమైన నవ్వు వచ్చి చాలా కాలమవటం రెండో లక్షణం. ఈ రెండు లక్షణాలూ నీకున్నాయని నీకూ నాకూ తెలుసు. ఇప్పుడు చెప్పు. ఇదంతా విన్నాక కూడా నీ కింకా కడుపులో తిప్పుతున్నట్టు వుందా?"

ఈజిప్షియన్ పిరమిడ్ సమాధుల్లో నిర్జీవమైన మమ్మీలా ఆమె అచేతనంగా వుండిపోయింది. ఆమె కళ్ళు తెల్లగా పాలిపోయి, అస్థిత్వాన్ని కోల్పోయినట్టు అయిపోయాయి. తనతో ఇప్పటివరకూ మాట్లాడింది తన భర్తేనా అన్నంత అనుమానంతో చూస్తూ వుండిపోయింది. ఆమె అభిప్రాయం గ్రహించినట్టు అతడు దగ్గిరగా వచ్చాడు.

"ఎన్నో సంవత్సరాల క్రితం నేను ఒక లాయరు స్నేహితుడితో కలిసి నీ దగ్గిరకు వచ్చాను. అతడిని చంపి నన్ను నీ గుప్పెట్లో పెట్టుకున్నావు. అప్పటినూంచీ నువ్వు నన్ను ఒక మనిషిగానే చూడలేదు. అందుకని, 'వీడేమిటీ - ఇంత తెలివితేటల్తో మాట్లాడటవేమిటీ' అని

నువ్వు అనుకోవటంలో తప్పులేదు. ఒక రైటరు ఒక పాత్ర గురించి వ్రాస్తున్నప్పుడు మిగతా పాత్రలని తొక్కిపట్టి వుంచినట్టే. మనకి అవతలివారి మీద ఒక అభిప్రాయం వున్నప్పుడు అదే అభిప్రాయం కొనసాగుతూ వుంటుంది. నామీద అదే తేలికైన అభిప్రాయాన్నే మొదటినుంచీ వుంచుకున్నావు తప్ప నేనెంత లోతుగా ఆలోచించగలనో వూహించలేదు నువ్వు. ఎన్ని తెలివి తేటలు లేకపోతే ఈ రాష్ట్రపు హోమ్ మినిష్టర్‌గా నేను ఇంతకాలం కొనసాగగలను? ఇప్పుడు అవసరం వచ్చింది కనుక అడుగుతున్నాను విను. నిన్ను నా అవసరాల కోసం ఉపయోగించుకోవాలంటే నీ దగ్గిర చేతకానివాడిలా నటించి నీ ఆహాన్ని సంతృప్తిపరచాలి. ఇంతకాలం అలాగే నటిస్తూ వచ్చాను. నేను చాలాకాలం క్రితమే ఒకామెని రహస్యంగా వివాహం చేసుకున్నాను. పబ్లిసిటీకి భయపడి బయటపెట్టలేదు. అందువల్లే నీ చౌరసియా వ్యవహారం నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. ఇప్పుడిక నీ అవసరం నాకేమీ లేదు. నాక్కావలిసింది చౌరసియాతో కలిసి సాధించుకోగలను. దానికన్నా ముఖ్యంగా-" అతడు ఆగి, నెమ్మదిగా అన్నాడు " ..... నీ అందంతో పనులు జరిపించుకోగల స్టేజీ నువ్వు దాటిపోయావని నా వుద్దేశ్యం"

ఆమె మొహం జేవురించింది. కళ్ళు విస్ఫులింగాలయ్యాయి. "ఇంత కుళ్ళు మనసులో పెట్టుకుని నాతో కలిసి వున్నావా?" అంది.

నువ్వుండ లేదూ? అలాగే" అన్నాడు. ఛెళ్ళున కొట్టినట్టయింది.

"నిన్ను నాతో పోల్చుకుంటావా? సిగ్గులేదూ?"

"కామినీ, ఈ ప్రపంచంలో మనుష్యులు మూడు రకాలు. మంచి వాళ్ళు, చెడ్డవాళ్ళు, తాము మంచివాళ్ళమనుకునే చెడ్డవాళ్ళు. ఈ మూడో రకమే తొంభైశాతం వుంటారు. నేను రెండో రకానికి చెందినవాడిని. నేను మంచివాడినని నేనెప్పుడూ చెప్పుకోలేదు. నువ్వు మూడో రకానికి చెందినదానివి. చేసే పనులన్నీ చేస్తూ కూడా వాటినెలా సమర్థించుకోవాలా అని ఆలోచిస్తూ వుంటావు. నేను రాష్ట్రాన్ని విదేశాలకి అమ్మెయ్యటం నీకు దారుణంగా తోచింది. చౌరసియాతో అక్రమ సంబంధం నీకు దారుణంగా తోచలేదు. దానికోసం నువ్వెన్ని కారణాలు చూపగలవో, నా చర్యని సమర్థించుకుంటూ నేనూ ఇన్ని కారణాలు చెప్పగలను. స్వాతంత్ర్య యోధుడి ఫించను శాంక్షనుకు లంచం తీసుకునేవాడు కూడా దేశం గురించి మాట్లాడతాడు. అదే నవ్వొస్తుంది. మనని మనం సంస్కరించుకోలేని మనం - పక్కవాడి గురించి మాట్లాడుతాం. దేశభక్తి గురించి మాట్లాడతాం. మనందరం చెడ్డవాళ్ళమే కామినీ ఆ విషయం వప్పుకో!"

ఆమె అరిచింది. "నో ..... నేనొప్పుకోను. ఈ దేశం నాశనమవటానికి నేనొప్పుకోను."

అతడు నవ్వేడు. "నువ్వేమీ చెయ్యలేవు కామినీ గణేష్ నిమజ్జనం కాకుండా ఆపలేవు. అందులో గొడవలు జరక్కుండా ఆపలేవు. ఆ కారణంగా నేను రాజీనామా చేస్తాను. కేంద్రపు పార్టీతో కలిసి రాష్ట్రంలో అధికారాన్ని సంపాదిస్తాను. దేన్ని ఆపగలవు నువ్వు?"

"నువ్వూ, చౌరసియా కలవటాన్ని, రాష్ట్రంలోకి టెర్రరిస్టులు ప్రవేశించటాన్ని, మన రాష్ట్ర

మరో కాశ్మీరూ, పంజాబూ కాకుండా వుండటాన్ని ..... మీ గురించి అందరికీ చెపుతాను.''

"నీకు పిచ్చెక్కిందనుకుంటారు. పంజాబులో చాలా చిన్న గొడవ అతి పెద్ద దారుణంగా మారబోతుందని అధికారంలో వున్న రాజకీయ నాయకులకి పాతిక సంవత్సరాల క్రితమే తెలుసు. కాశ్మీరు కాష్టాని ఆరనివ్వకుండా వుంచితే మంచిదని ఇప్పటికీ కొందరు పొలిటీషియన్ల భావం. ఇవన్నీ రాజకీయాలు కామినీ. ఈ విషసర్పాల ముందు అమాయకులైన ప్రజలు చీమలు లాంటివాళ్ళు. పూర్తిగా నష్టపోయే వరకూ తామేం నష్టపోతున్నామో తెలుసుకోలేని అజ్ఞానులు. అమాయకత్వం మీద తెలివైనవాడు ఆడుకునే ఆటే రాజకీయం'' అని నవ్వి అతడు అక్కడినించి వెళ్ళిపోయాడు.

ఆమె ఎటూ కదలకుండా కూర్చుని వుంది.

అతడు చెప్పినదానిలో అబద్ధమేమీలేదని ఆమెకు తెలుసు.

ఆమెకు పూర్వపు రోజులు గుర్తు వచ్చాయి. రెడ్డిని తనెంత తక్కువగా అంచనా వేసిందో అర్థమవుతోంది. అతని స్నేహితుడిని తను చంపించినప్పటి నుంచీ అతడు మనసులో పెట్టుకుని వుంటాడు. పైకి తేలలేదు. తనని మెట్టుగా వాడుకుని పైకొచ్చాడు. తెలివితేటల్ని ఎక్కడా ప్రదర్శించలేదు. కావల్సినదంతా సాధించుకున్నాడు. అవసరం తీరాక దెబ్బకొట్టాడు. చాలా దారుణమైన దెబ్బ.

ఆమెకు బిగ్గరగా నవ్వాలనిపించింది. అతడు చెప్పింది నిజమే. ఇంతకాలం తనవైపునించే ఆలోచించింది. అవతలివాళ్ళు కూడా తెలివైనవాళ్ళే అని గుర్తించలేకపోయింది. తను, చౌరసియా, రెడ్డి, నాయుడు ఒక్కొక్కరు ఒక్కొక్క లెవల్లో తమ స్వార్థం కోసం సాటి మనిషినీ, దేశాన్నీ, రాష్ట్రాన్నీ దోచుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. నిజాయితీగా 'మంచి' కోసం యుద్ధం చేసేవాళ్ళు ఒక్కరూ లేరా?

ఆమెకు రాణా గుర్తొచ్చాడు.

ఒక క్రిమినల్‌ని న్యాయపరంగా లాకప్‌లో వుంచటం కోసం మొత్తం రాజకీయ నాయకులందరితోనూ ఒంటరిగా పోరాడి, ఓడిపోయిన ఇన్‌స్పెక్టర్.

చాలా చిన్న పోలీస్‌స్టేషన్‌లోని చిన్న అధికారి అయితేనేం ఆమెకతను చాలు.

వయసు ఆమెని ఓడిస్తూంది. కానీ తెలివితేటల్ని ఓడించలేదుగా.

ఓటమి అంటూ తప్పనిసరి అయినప్పుడు నరాలు చిట్లేలా ఆఖరి ఎత్తువేయటమే నిజమైన ఆటగాడి లక్షణం.

ఆమె వెంటనే రాణాని కలుసుకోవటానికి బయల్దేరింది.

## 16

తన భవిష్యత్తు ఏమిటా అని రాణా రెండ్రోజుల్నుంచీ ఆలోచిస్తున్నా ఏమీ తోచలేదు. వీరదాసుకి దాదాపు ప్రతి సాయంత్రమూ అభినందన సభలు జరుగుతూనే వున్నాయి. వీరదాసు జైల్లో వుండటాన్ని కూడా ఒక గొప్ప కార్యంగా చిత్రీకరించి రాజకీయ నాయకులు ఇచ్చే

ఉపన్యాసాలు వింటూంటే మతిపోతూంది. ప్రజాభిప్రాయాన్ని మార్చటం ఇంత సులభమా అనిపిస్తూంది.

తనని సస్పెండ్ చేస్తున్నట్టు హోం మినిష్టర్ చెప్పేసి వెళ్ళిపోయాక రాణా మరి పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళలేదు. అఫీషియల్ ఆర్డర్స్‌కోసం వెయిట్ చేస్తూ వుండిపోయాడు.

"ఏం జరిగింది?" అభిషిక్త అడిగింది.

అతడు చెప్పాడు.

ఆ అమ్మాయి చాలాసేపు ఏమీ మాట్లాడకుండా ఆలోచిస్తూ వుండిపోయింది. చివరికి "మనం తప్పు చేయకపోతే మనకేం జరగదన్నావ్‌గా. మరెందుకు చేశావ్?" అని అడిగింది. ఆ అమ్మాయి ఇంతసేపూ ఏం గుర్తు తెచ్చుకోవటానికి ప్రయత్నించిందో అతడికి అర్థమైంది.

మొట్టమొదటిసారి స్టూవర్ట్‌పురం ట్రాన్స్‌ఫరై వస్తూన్నప్పుడు, ఆ పాప తల్లితో కలిసి ప్రయాణించింది. తండ్రి జైలులో వున్నాడని తెలిసి, తమ వాళ్ళకి ధైర్యం చెపుతూ ఆ మాటలు అన్నాడు. ఇప్పుడు అని అబద్ధమని తేలింది. పోలిటిక్స్ వర్సెస్ పోలీస్‌లో మొదటిదానిదే ఎప్పుడూ పైచేయి అని ఋజువైంది. ఈ కథకి ముగింపు ఇంతే.

"ఇది ఇలా జరగటానికి వీల్లేదు" అలకనంద అంది. ఎప్పుడూ పూజలూ, పునస్కారాలూ చేసుకునే ఆమె నోటివెంట అలాంటి మాటలు రావటం చూసి, అతడు ఆశ్చర్యంతో "మరింక ఎలా జరుగుతుంది?" అని అడిగాడు.

"నేను ఉద్యమం లేవదీస్తాను" అన్నదామె.

అంత విషాదంలో కూడా అతడికి నవ్వొచ్చింది.

"ఉద్యమమా?" అన్నాడు నవ్వుతూ. ఆమె నవ్వలేదు. అతడి పక్కన వచ్చి కూర్చుంటూ, "రాణా, ఒకప్పుడు నువ్వు చెప్పావు గుర్తుందా-- చైతన్యం అనేది ఎక్కణ్ణుంచో రాదు, ప్రజల్లోంచే వస్తుంది అని -- మరి ప్రజలంటే ఎవరు? నువ్వు -- నేను -- మనమే కదా. ఆగు అలా నవ్వకు. సుప్రభాతంతో మొదలుపెట్టి ఉపవాసంతో దినచర్య పూర్తిచేసే ఈ అలకనంద ఇలా మాట్లాడుతుందేమిటి అని ఆశ్చర్యపోకు. నేను ప్రారంభిస్తాను. అది ఎక్కడికి వెళ్ళి ఆగుతుందో, లేక మొదట్లోనే చప్పబడిపోతుందో కాలమే నిర్ణయించనీ, ఝాన్సీరాణీలూ, రుద్రమదేవులూ ఎక్కణ్ణుంచో పుట్టరు. నీ మాటల్లో చెప్పాలంటే మనుష్యుల్లోంచి పుడతారు."

"నీ ఆవేశం చూస్తూంటే నాకు భయంగా వుంది. కానీ వాళ్ళు రాజకీయ నాయకులు. ప్రజల్తో ఆడుకునే సామర్థ్యం కలవాళ్ళు. జనాల్ని వాళ్ళే సమీకరించగలరు గానీ, నువ్వూ నేనూ ఏమీ చెయ్యలేం."

"అలా అనుకుంటే ఏమీ చెయ్యలేం రాణా! నువ్వు నవ్వుకోనంటే నీకో ఉదాహరణ చెపుతాను. మొన్న మన ఊళ్ళో వరుసగా నాలుగు రోజులు బంద్‌లు జరిగాయి గుర్తుందా. ఏవేవో కారణాలు. ఆ నాలుగు రోజులు బంద్‌లు జరిగాయి గుర్తుందా. ఏవేవో కారణాలు. ఆ నాలుగు రోజుల్లో ఒకటి ఏకాదశి కానీ నేను గుడికి వెళ్ళటానికి కూడా వీల్లేక పోయింది. ఆ

కసితో నేను ఏమనుకున్నానో తెలుసా? జనం అంతా కలిసి తలో పది రూపాయలు చందా వేసుకుని, వీలైతే రౌడీలకి ఆ డబ్బు ఇచ్చి ఒక సంవత్సరంపాటు ఈ ఊళ్ళో ఏ బందూ జరగకుండా చూసే ఏర్పాటు చేసుకుంటే ఎలా వుంటుందీ అని! ప్రస్తుత సామాజిక పరిణామాలవల్ల భక్తిలోంచే ఇంత కసి ఏర్పడుతుంటే, ఒక మంచి కారణం కోసం నేను చేసే ఈ పోరాటానికి. చూద్దాం ఈ ఊళ్ళో ఎంతమంది నన్ను సపోర్ట్ చేస్తారో .....

*  *  *  *  *

ఆమె ఉపాధ్యాయ కాలనీ వాళ్ళని కలుసుకుంది. వాళ్ళు ఆమె భావాలను సపోర్ట్ చేశారు. ఆ సాయంత్రం గ్రంథాలయం హాల్లో ఒక మీటింగ్ జరిగింది. ఊహించని విధంగా జనం క్రిక్కిరిసి పోయారు. ఆ మరుసటి రోజు ప్లే గ్రౌండ్‌లో సభ ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించుకున్నారు. సభ విజయవంతమైంది. దాదాపు వెయ్యిమంది దాకా వచ్చారు. ఎమ్మెల్యే ఎం. పీలకి ఈ విషయం తెలిసినా పెద్ద పట్టించుకోలేదు. నవ్వుకున్నారు.

ఆ రాత్రి ఉపాధ్యాయ కాలనీ వాళ్ళు కొంతమందిని తీసుకొచ్చారు. తరువాత మీటింగ్ తాలూకు బాధ్యత వాళ్ళు తీసుకున్నారు. రాత్రికి రాత్రి వేల సంఖ్యలో పాంప్లెట్లు పోస్టర్లు ప్రింట్ అయ్యాయి. "నిజాయితీ గల ఇన్‌స్పెక్టర్‌మీద చర్య ఆపు చెయ్యాలి' ..... 'గూండా వ్యతిరేక పోరాటం వర్థిల్లాలి' లాటి నినాదాలతో పోస్టర్లు వెలిశాయి.

ప్రొద్దున్నకల్లా ఊరంతా వెలిసిన ఆ పోస్టర్లు చూసి నాయుడు, పులిరాజు కంగారుపడ్డారు.

"చూశావా రాణా -- ఉద్యమం ఎలా సాగుతుందో" అంది అలక ఉద్వేగంగా. ఆ అమ్మాయికి ఇదొక అద్భుతమైన అనుభవం. కానీ రాణా నిర్లిప్తంగానే వున్నాడు. ఆమె అంది. "ఒక మంచి కారణంకోసం నిలబడితే జనం ఎలా సపోర్ట్ చేస్తారో చూశావా! అందరం కలిసి ముఖ్యమంత్రికి ఒక విన్నపం పంపుదామనుకుంటున్నాం. సాయంత్రం సభకి దాదాపు యాభైవేల మందిదాకా రావొచ్చు. పక్క ఊళ్ళనుంచి కూడా జనాన్ని సమీకరిస్తున్నారు."

రాణా పెద్ద ఉత్సాహం చూపకుండా, "మొన్న కాలనీవాళ్ళతో వచ్చిన యువకులు ఎవరో తెలుసా?" అని అడిగాడు.

"కేంద్రపార్టీ, రాష్ట్రపార్టీ కాక అధికారంలో ఎక్కడాలేని మూడో పార్టీ అది. ఈ సంఘటనని క్యాష్ చేసుకోవాలని చూస్తుంది ఆ పార్టీ. ఇప్పుడే ఆ రాజకీయ బయటపడటం ఇష్టంలేక వేరే పేరుమీద వర్కర్లని పంపింది. తరువాత ..... అంటే ఈ ఉద్యమం బలం పుంజుకుంటే, అప్పుడది బయట కొస్తుందన్న మాట."

అలక్‌నంద విస్తుబోయింది. "ఇందులోనూ రాజకీయమా?"

“అవును అలకా. విద్య, కార్మికశక్తి, పోలీస్, ఆర్థికవ్యవస్థ ..... వీటిలో ఏ అలజడి వస్తుందని తెలిసినా వెంటనే అందులో ప్రవేశించేది రాజకీయాలు. మేధావులు మన సామ్రాజ్యాన్ని అలా అల్లారు.”

“మరి దీనికి విమోచనం లేదా?”

“ఏదో అద్భుతం ఈ దేశ చరిత్రలో జరిగితే తప్ప ..... ” ఆగి అన్నాడు.

“ ..... లేదు.”

ఈ కథకి సంబంధించినంతవరకూ అలాటి అద్భుతం మరుసటిరోజు జరిగింది.

* * * * *

స్కూలు ప్లే గ్రౌండ్స్‌లో జరగబోయే మీటింగ్‌కి వ్యతిరేకంగా అదేరోజు, అదే సమయాన ‘వీరదాసు విమోచన సమితి’ మరో మీటింగ్ ఏర్పాటు చేస్తుందన్న వార్త నగరంలో పాకిపోయింది. దీనిని ఎమ్మెల్యే నాయుడు, ఎం.పి రాజు నిర్వహిస్తున్నారని వాల్‌పోస్టర్‌లు వెలిశాయి. అదే సభలో వీరదాసుకి పౌరసన్మానం ఏర్పాటుచేశారు. కనీ వినీ ఎరుగని రీతిలో ఈ సభని నిర్వహించాలని వాళ్ళు కంకణం కట్టుకున్నారు.

ఆ సభకి ముఖ్య అతిథిగా కామిని వస్తోంది.

అదీ ట్రంప్ కార్డు.

వెండి తెరమీద బంగారు వెలుగు--

ఆ ఒక్క క్వాలిఫికేషన్ చాలు ఇసుకవేస్తే రాలనంత జనాన్ని తీసుకురావటానికి! మరో అట్రాక్షన్ --

ఆమె హోంమినిష్టర్ భార్య.

గూండాయిజానికి వ్యతిరేకంగా జరిగే సభ ఒకవైపు.

దానికి పోటీగా ఇంకొక సభ మరోవైపు.

ఆ సభకి హోంమినిష్టర్ భార్య ముఖ్య అతిధి!!!

ఇంతకన్నా సంచలన వార్త మరొకటి ఏముంటుంది?

రాణాని సపోర్ట్‌చేసే సామాన్యప్రజలు, అలక్‌నందతో సహా మానసికంగా కృంగిపోయారు ఈ పరిణామానికి. పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం అయింది వారి పరిస్థితి.

భార్య నిర్ణయానికి రెడ్డి మాత్రం చాలా సంతోషించాడు. ఆమె అంత తొందరగా వప్పుకుంటుందని అతడు వూహించలేదు. దాదాపు తను ముఖ్యమంత్రి అయిపోయినట్టు, రాష్ట్రాన్ని విడగొట్టి ఆంధ్రదేశానికి ప్రధాని అయినట్టే వూహించుకుంటున్నాడు.

ఇంకో గంటలో ఆమె బయల్దేరబోతూందనగా అరవింద్ చౌరసియా ఆమెకు ఫోన్ చేశాడు. “ఏమైంది? మీ ఆయన నేను చెప్పినదానికి వప్పుకున్నాడా?”

“వప్పుకోవడమే కాదు. మిమ్మల్ని ఎప్పుడు కలుసుకుందామా అని ఉవ్విళ్ళూరుతున్నాడు-”

"మళ్ళీ నువ్వూరెళ్ళిపోతున్నావ్‌గా. అయిదు నిమిషాల్లో వస్తున్నాను. ప్రైవేట్ మీటింగ్ ఏర్పాటు చెయ్యి."

"మన గెస్ట్ హవుస్‌కి తీసుకురానా?"

"తీసుకురా. వెంటనే."

భర్తతో కలిసి ఆమె చౌరసియాని కలుసుకుంది. చౌరసియా రెడ్డికి షేక్ హాండిస్తూ "మనిద్దరం ఇలా దగ్గిరకావటం నాకు చాలా సంతోషంగా వుంది. మిమ్మల్ని అంతకుముందు చాలాసార్లు కలుసుకున్నా, ఇలా కాబోయే ముఖ్యమంత్రి హోదాలో అందరికన్నా ముందు నేనే మీకు కంగ్రాచ్యులేషన్స్ చెప్పగలిగే అవకాశం దొరకటం నా అదృష్టంగా భావిస్తున్నాను." అన్నాడు. అతడు మాట్లాడిన ఇంగ్లీషులో సగం రెడ్డికి అర్థంకాలేదు. చౌరసియా కొనసాగించాడు.

"విషయం చాలా సున్నితమైంది. అంత భయంకరమైంది కూడా. అందుకే కామినిగారితో మీకు కబురు చేశాను."

కామిని మధ్యలో కల్పించుకుని, "ఆయన ముందు నన్ను 'గారు' అనక్కర్లేదు. మీకూ నాకూ మధ్యవున్న సంబంధం నా భర్తకి చెప్పాను. ఆయన చాలా సంతోషించారు కూడా" అని ఆగింది. రెడ్డి, చౌరసియా నిశ్చేష్టులై వుండగా, ఆమె నవ్వి "ఎందుకలా వుండిపోయారు? యుద్ధానికి ముందు ఒక స్త్రీ తన భర్తనీ, ప్రియుడినీ ఒకే పక్షంగా కలవటం అనేది రామాయణ, మహాభారతాల్లో కూడా జరిగి వుండదు" అన్నది.

చౌరసియా తేరుకుని, తనుకూడా నవ్వుతూ, "ఇప్పుడు యుద్ధం ఏమున్నది?" అన్నాడు విషయాన్ని తేలిక చేస్తున్నట్టు.

ఆ తరువాత వాళ్ళిద్దరూ మాట్లాడుకునే సంభాషణలో కామిని పాల్గొనలేదు. కేవలం ప్రేక్షకురాలిలా చూస్తూండిపోయింది. ఆ సంభాషణని రహస్యంగా రికార్డు చేస్తూ.

* * * * *

అర్థరాత్రి తలుపు చప్పుడవడంతో రాణా ఆశ్చర్యపోతూ తీశాడు. ఎదురుగా వున్న కామినిని చూసి మరింత విస్మయంతో "మీరా" అన్నాడు.

"కామిని మొహంలో అలసట కొట్టొచ్చినట్టు కనబడుతోంది. దాదాపు నాలుగు వందల కిలోమీటర్లు వచ్చింది ఆమె మీటింగ్‌కి హాజరువడానికి.

"చాలాకాలం తరువాత కలుసుకున్నాం కదూ స్టూవర్ట్‌పురానికి మీరు ఇన్‌స్పెక్టర్‌గా వచ్చే మొదటి అధ్యాయంలో ..... " అంది.

"అవును. ఇప్పుడు ఈ చివరి అధ్యాయంలో మళ్ళీ" అన్నాడు.

"ఇది చివరి అధ్యాయం అని ఎందుకనుకుంటున్నారు?"

"ఒకటి రెండు రోజుల్లోనే ఆర్డర్లు వస్తాయి కాబట్టి."

"మనం కలుసుకోవటం ఇది చివరిసారి అయి వుండవచ్చేమోగానీ, మీరు మాత్రం

ఇన్‌స్పెక్టర్‌గానే కొనసాగుతారు. మిమ్మల్నెవరూ సస్పెండ్ చేయలేరు. ప్రజావాహిన్ని కదిల్చి, మీరు మీటింగ్ పెట్టారుకదా."

"దాన్ని విఫలం చెయ్యటానికి పని గట్టుకుని హైద్రాబాద్ నుంచి మీరొచ్చారుగా."

"కాదు. మిమ్మల్ని ఒక సహాయం అడగటానికి వచ్చాను."

అతడు విస్మయాన్ని అణుచుకుని "నన్నా" అన్నాడు.

"రేపు మీ మీటింగ్ జరగకూడదు. మా ఒక్క మీటింగే జరగాలి" అంది. అతడి మొహం ఎర్రబడింది. కోపాన్ని అణుచుకుంటూ, "ఇటువంటి మీటింగ్‌వల్ల ఏదో లాభం వుంటుందని నేనూ నమ్మటంలేదు. అంత మాత్రాన మావాళ్ళు పెట్టిన మీటింగ్‌ని నేను ఆపుచేస్తానని ఎలా అనుకున్నావ్?" అన్నాడు.

"నన్ను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు రాణా. నేను ఒకప్పటి కామినిని కాదు. అప్పుడు నేను పూర్తి అహంతో, ఆత్మవిశ్వాసం అనే ముసుగులో వుండేదాన్ని. ఇప్పుడు నేను ఎదిగాను. ప్రతి మనిషీ ప్రతి స్టేజీలోనూ అలాగే అనుకుంటూ వుంటాడని నాకు తెలుసు. కాని నా ఎదుగుదల ఆత్మసంతృప్తి, అన్వేషణకి సంబంధించినది. ఇంతకుముందు ఎన్నడూ లేని సంతృప్తి ఈ రోజు నాకూ దొరుకుతూ వుంది. నా మీద ఏ మాత్రం నమ్మకమున్నా నీ మీటింగ్ ఆపుచేయించు. నా మీటింగ్‌కి రా. డ్యూటీలో రా. అక్కడొక అద్భుతం జరుగుతుంది. నువ్వు వూహించలేని నిజాలు నేను అక్కడ బయటపెడతాను" అని ఆమె చీకట్లో కలిసిపోయింది.

రాణా అటువైపే చూస్తూ వుండిపోయాడు.

*  *  *  *  *

మరుసటిరోజు మీటింగ్ కాన్సిల్ అయిందన్న వార్త తెలిసింది. కామిని కళ్ళు చెమర్చాయి. తనమీద ఇంతవరకూ అంత నమ్మకముంచిన వాళ్ళెవరూ లేరు భర్తా, ప్రియుడితో సహా .....

తను రాణాకి శత్రువు. తనభర్త అతడి ఉద్యోగం పోవటానికి కారకుడు. అయినా సరే- అతడు తనని నమ్మాడు ఇప్పుడిక తనమీద మహత్తరమైన బాధ్యత వుంది చాలా కష్టమైన పని అది .....

మీటింగ్ విరమించుకొన్న మూడో పార్టీ వాళ్ళు "సినిమా నటుల్ని ఆయుధంగా వాడుకుని అవతలి పార్టీ అదే సమయానికి మరో మీటింగ్ పెట్టటంవల్ల తాము తమ మీటింగ్ పోస్ట్‌పోన్ చేసుకుంటున్నట్టు" ప్రకటించాను. ఇప్పుడా జనంకూడా తన మీటింగ్‌కి వస్తారని తెలుసు ఆమెకి.

ఆ మీటింగ్‌లో ఈ దేశద్రోహం గురించి చెప్పాలని ఆమె ఉద్దేశ్యం. ఇది మొత్తం దేశాన్నే కుదిపేస్తుందని ఆమెకి తెలుసు.

తనతోపాటు తీసుకొచ్చిన క్యాసెట్ టేప్‌రికార్డర్‌లో పెట్టుకుంది. అబ్దుల్ సత్తార్, అరవింద్ చౌరసియా, టి.కె. రెడ్డి, గూఢచార, వ్యాపార రాజకీయ జీవితానికి అది ఫుల్‌స్టాప్

పెట్టబోయే క్యాసెట్.

మీటింగ్‌కి ఇంకో అయిదు గంటలు మాత్రమే టైముంది. టి.వి. కవరేజికోసం దూరదర్శన్ వాళ్ళుకూడా వచ్చారని తెలిసింది.

కామిని వస్తోంది కాబట్టి దాదాపు లక్షమంది జనం హాజరువుతారని అంచనా. వీరదాసుకి పౌరసన్మానం.

క్యాసెట్‌లో సంభాషణ సరీగా రికార్డయిందో లేదో మరోసారి సరిచూసుకోవటంకోసం ఆమె టేప్‌ని 'ఆన్' చేసింది.

చాలాసేపు నిశ్శబ్దం తరువాత చిన్న నవ్వు వినిపించింది.

అది అరవింద్ చౌరసియాది. అంటే తన ప్లాన్ అంతా ముందే గ్రహించాడన్నమాట. టేప్ సంగతికూడా -- ఆమె మొహం రక్తం లేనట్టు పాలిపోయింది. ఒక్కసారిగా పాతిక అంతస్థులమేడ కూలిపోయినట్టు అనిపించింది. ఆమె చేతివేళ్ళు వణకసాగాయి. మీటింగ్ ప్రారంభం కావటానికి ఇంకెంతసేపో టైమ్‌లేదు. ఈ అస్త్రం ఆధారంగానే ఆమె ఇంత ప్లాన్ చేసింది అది ఆఖరి క్షణంలో నిర్వీర్యమైపోయింది.

ఆమెముందు క్యాసెట్ ఎగతాళి చేస్తున్నట్టు వుంది.

అరవింద్ చౌరసియా ఆమెమీద సాధించిన ఆఖరి విజయంలా వుంది అది.

కొంచెంసేపు స్తబ్ధంగా వున్న తరువాత, ఆమె నెమ్మదిగా తేరుకుని మామూలు మనిషి అయింది. వీరదాసు పౌర సన్మానాన్ని రికార్డు చేయడానికి వచ్చిన దూరదర్శన్ వారిని కలుసుకుంది. "మొత్తం మీటింగ్ అంతా రికార్డు చేస్తారా? లేక కావల్సిందే చేస్తారా?"

"మొత్తమంతా వీడియో తీసి కావల్సింది ఎడిట్ చేసుకుంటాం మాడమ్."

"థాంక్యూ"అని వాళ్ళని పంపివేసింది.

ఇంకో అరగంటలో మీటింగ్ ప్రారంభం కానున్నది అనగా ఆమెను సభా ప్రాంగణానికి తీసుకువెళ్ళడానికి పులిరాజు వచ్చాడు. "కూర్చోండి. ఇంకా టైమ్ వుందిగా వెళ్దాం" అంది.

ఇద్దరూ మాట్లాడుకుంటూ వుండగా నాయుడు ఇంటినుంచి టిఫిన్ వచ్చింది. పనివాడు నలుగురు నేను రికమెండ్ చేసినవాళ్ళు వుండాలి."

"తప్పకుండా" ఆమె తన ప్లేటులోని స్వీట్ తీసి అతడికి వేస్తూ అంది. "ఇంత కష్టపడి వీరదాసుని బయటికి తీసుకొచ్చాం. అందర్నీ గెలిపిస్తాడో లేదో చూడాలి. అది అంత సులభం కాదనుకుంటాను."

"మా పార్టీ సెంటర్‌నుంచి సపోర్ట్ చేస్తుందికదా. మాక్కావల్సింది ప్రస్తుత ముఖ్యమంత్రి కూలిపోయి, మా పార్టీ మనిషి అధికారంలోకి రావడం! మీ ఆయన మా పార్టీలో కలిసిపోతున్నాడు కాబట్టి ఇక సమస్యే లేదు. కాస్త స్వీట్ తీసుకో అమ్మాయ్."

"వద్దండీ మేం సినిమాల్లో పని చేసేవాళ్ళంకదా. స్వీట్లు తినకూడదు" అని ఆగి, ఆమె అన్నది-- "మా ఆయన బహుశ మీ పార్టీలో చేరరనుకుంటాను."

అతడికి స్వీట్ గొంతుకు అడ్డుపడింది. "అంటే" అన్నాడు.

"నాకు పూర్తిగా తెలీదు పులిరాజుగారూ. ఈ విషయం నిర్ధారించి వాళ్ళు చెప్పేవరకూ నేను మీతో అనకూడదు. కానీ నా వూహ అది" అని తలవంచుకుని "నాకూ, మా ఆయనకీ పడటంలేదు. త్వరలోనే మేము విడాకులు తీసుకోబోతున్నాం. అందుకే మీకిది ముందే చెపుతున్నాను" అంది. పులిరాజు ఇంకా షాక్‌నుంచి తేరుకోలేదు.

"నీకెందుకొచ్చిందీ ఆలోచన?" సందిగ్ధంగా అడిగాడు.

"వీరదాసు ఈ ఏరియాలో చాలా పాపులర్ అయి వుండవచ్చు. కానీ రాష్ట్రంలో అతడి కంట్రోలు ఎంత? అదలా వుంచండి. మా ఆయన పార్టీ మార్చి మీ పార్టీలో చేరి ముఖ్యమంత్రి అవుతాడనుకోండి. ఎంతకాలం పదవిలో వుండగలడు? అసమ్మతి వర్గం వూరుకుంటుందా? ఎన్నో ఏళ్ళనుంచీ పార్టీనే నమ్ముకున్న వాళ్ళని వదిలి, కొత్తగా చేరిన వాడిని ముఖ్యమంత్రిని చేస్తే అది కూలిపోదూ? అప్పుడు కేంద్రం మరో రాష్ట్ర నాయకుడిని ఎన్నుకొమ్మని కోరితే, నాయుడు, మా ఆయన్ల గతి ఏమిటి? వాళ్ళు మిమ్మల్ని అంత సులభంగా ఎలా నమ్ముతారు?"

"మరిదంతా ఎందుకు చేశారు?"

"వాళ్ళేం చేశారు? ఏదీ చెయ్యలేదు. అంతా మీరే చేసి సాయం చేశారు. మొదట్లో వీరదాస్ రిలీజ్ అవకుండా అడ్డుపడ్డారు. తరువాత రాయబారానికి వచ్చారు. మా వాళ్ళు దాన్ని నమ్మినట్టు నటించి వీరదాస్‌ని విడిపించుకున్నారు. వాళ్ళ కార్యమే నెరవేరింది కదా."

పులిరాజు మొహం జేవురించింది. "బద్మాష్‌లు ..... వాళ్ళని ప్రాణాల్తో వుండనివ్వను" అన్నాడు. రేపు ఢిల్లీలో తన అధిష్టానవర్గానికి మొహం ఎలా చూపించాలో అతడికి తెలియడం లేదు.

"ఇదంతా నేను వూహించింది మాత్రమే. రాజకీయాల్లో నాకు పెద్దగా పరిచయం లేదు. చాలాకాలం హోంమినిష్టర్‌గా వుండడంకంటే కొద్దికాలంపాటు ముఖ్యమంత్రిగా వుండటమే బెటర్ అని మా ఆయన అనుకుంటే బహుశ పార్టీ మార్చవచ్చు."

పులిరాజు చాలాసేపు అన్యమనస్కంగా వుండి. "వెళ్దామా -టైమ్ అయింది" అన్నాడు. అంతలో ఫోన్ వచ్చింది. నాయుడు దగ్గిర్నుంచి- ఆమె మాట్లాడి ఫోన్ పెట్టేస్తూ "టిఫిన్ బావుందా అని అడిగాడు. స్వీట్ తిననని చెప్పాను" అంది.

అయిదు నిముషాల తరువాత ఇద్దరూ సభాప్రాంగణానికి చేరుకున్నారు. కారు దిగుతూ పులిరాజు అన్నాడు. "నువ్వు చెపినదంతా నిజమయితే నేను నాయుడ్ని బ్రతకనివ్వను. సారీ ..... మీ ఆయన్ను కూడా."

*         *         *         *         *

సభ జనంతో కళకళలాడుతూంది. కిక్కిరిసినట్టున్నారు జనం. ముందు నాయుడు మాట్లాడాడు. తరువాత పులిరాజు. అతడు కుర్చీలోంచి లేవబోతూంటే కామిని దగ్గరకొచ్చి ఆమె డ్రైవర్ ఏదో మాట్లాడటం కనిపించింది. ఆమె మొహం పాలిపోయింది. "నిజమా" అని గొణగటం అతడు చూశాడు.

ఆమె కుర్చీ దగ్గిరకు వస్తూ "ఏమైంది?" అని అడిగాడు.

"మా బోయ్ చనిపోయాడట. ఏదో తిన్నాడట ఫుడ్ పాయిజనింగ్."

పులిరాజు మైకు దగ్గిరకు వెళ్ళి మాట్లాడటం ప్రారంభించిన అయిదు నిముషాలకు గుండెల్లో మంట బయల్దేరింది.

విషయం కొద్ది కొద్దిగా తెలుస్తున్నట్టు అనిపించింది. తలతిప్పి నాయుడు వైపు చూశాడు. నాయుడు నవ్వుతున్నట్టు కనిపించాడు. పక్కనే వీరదాసుకూడా అలాగే వున్నాడు.

గుండెల్లో మంట ఎక్కువైంది. వళ్ళంతా చెమట్లు పడుతున్నాయి. తనన్న ఆఖరి మాటలు గుర్తొచ్చాయి. " ..... నేను వాళ్ళని బ్రతకనివ్వను" అన్నాడు తను.

..... ఇప్పుడు వాళ్ళే బ్రతకనివ్వడం లేదు తనని.

కామిని చెప్పినట్టు వాళ్ళు తమ పని పూర్తి చేసుకున్నారు. వీరదాసుని విడిపించుకున్నారు. ఇప్పుడా విషయమంతా బయటకు రానివ్వకుండా తనని పైకి పంపించేస్తున్నారు.

నాయుడు పంపిన స్వీట్లలో విషం కలిపి వుంది. కామిని ఇంట్లో సర్వెంటు చనిపోయాడు. కామిని మాటలు --

"నాకూ మా ఆయనకీ పడటం లేదు. త్వరలోనే విడాకులు తీసుకోబోతున్నాం--- "

అంటే --

కామినినీ తననీ కలిపి చంపటానికి ప్రయత్నించారన్న మాట! తను అక్కడికి వెళ్తే-- తను ఆమెతో కలిసి తింటాడని వూహించి వుంటారు. అందులోనూ తనకి స్వీట్స్ అంటే ఇష్టం.

అతడికి ప్రాణం పోతున్నట్టు అనిపించింది. కామిని వైపు చూశాడు. ఆమెకూడా విషయం గ్రహించినట్టు పాలిపోయిన మొహంతో చూస్తోంది. వీరదాసు నవ్వుతున్నాడు.

రాజకీయాల్ని రాజకీయంతోనే కొట్టాలి.

"ప్రియమైన ప్రజలారా" అన్నాడు. "ఇంకొంచెం సేపట్లో నా ప్రాణం పోతుంది. పోయే ముందు కొన్ని విషయాలు మీకు చెప్పాలి."

సభ ఒక్కసారిగా నిశ్శబ్దమైంది. ఎవరూ ఊహించని పరిణామం అది. అతడి పార్టీ మనుషుల్లో కదలిక.

"వీరదాస్‌ని విడిపించడానికి హోంమినిష్టర్ సలహా మీద నా కూతుర్ని కిడ్నాప్ చేసింది మేమే. కేవలం రాజకీయ లాభం కోసం స్వంత కూతుర్ని కిడ్నాప్ చేశాము."

ఉప్పెన లాటి గోల.

రెండు నిముషాల పాటు ఎవరేం అరుస్తున్నదీ తెలియలేదు. పులిరాజు చెయ్యెత్తాడు. మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు. రెండు పార్టీలూ కలపటం దగ్గర్నుంచీ- తన ప్రాణాలు తీసే ప్రయత్నం వరకూ--

అంతే ఎవరు ఎవర్ని కొట్టుకుంటున్నారో తెలీదు. ఎవరు ఎవర్ని పొడుస్తున్నారో తెలీదు. చాలామంది పోలీసులున్నారు. కానీ వాళ్ళు అంతమంది జనాన్ని ఎలా కంట్రోలు చేయగలరు?

పులిరాజు మనుషులు మరీ రెచ్చిపోయారు. పోలీసులు ఎమ్మెల్యే నాయుడుచుట్టూ వలయంగా నిలబడి దూరంగా తీసుకువెళ్ళటానికి ప్రయత్నిస్తున్నారు. అప్పటికే పులిరాజు మనుష్యుల చేతుల్లో ఆయుధాలు ప్రత్యక్షమయ్యాయి.

రాణా, కామినిని కారు దగ్గిరకు తీసుకువెళ్ళే ప్రయత్నంలో వున్నాడు పార్టీ కార్యకర్తలు ఆమెను పెద్దగా పట్టించుకోలేదు కానీ, సినిమా నటి అవటంవల్ల రాజకీయాలకి సంబంధంలేని జనం ఆమెను దగ్గిరనుంచి తాకటానికీ, చూడటానికీ చుట్టుముట్టసాగారు. ఒకపక్క రక్తపాతం, మరొకవైపు ఈ హడావుడి.

ఈ లోపులో పులిరాజుకి స్పృహ వచ్చింది. పక్కనే వున్న డాక్టర్ ఎవరో ఇంజెక్షన్ ఇచ్చి 'పెద్ద హాస్పిటల్‌కి తీసుకువెళ్ళింది' అంటున్నారు. అతడి బాధ అంతా చేత్తో తీసేసినట్టు పోయింది. కార్యకర్తలందరూ ఆశ్చర్యంతో చూస్తుండగా వెళ్ళి ఎమ్మెల్యే నాయుడి మెడ పట్టుకున్నాడు. ఈ హఠాత్పరిణామానికి విస్తుబోయిన ఎమ్మెల్యే తాలూకు మనుష్యులు క్షణంలో తేరుకుని, పులిరాజుని పొడవటానికి తయారయ్యారు. వీరదాసు వాళ్ళ మధ్యకి పరుగెత్తాడు. దూరంనుంచి ఎవరో "ఛార్జ్" అని అరిచారు. డియస్పీ కంఠంలా వుందది.

"కాల్చు" అంది కామిని.

రాణా ఆమెవైపు విస్మయంగా చూశాడు.

"ముగ్గురూ ఒకచోట కలిశారు. ఈ గొడవలో ఎవరికీ అనుమానం రాదు -- కాల్చెయ్" అంది. అతడికింకా అర్థంకాలేదు.

ఆమె అన్నది "పోలీస్ వర్సెస్ పొలిటిక్స్ పొలిటీషియన్స్ మీద పోలీసులు పైచేయి అయ్యే క్షణాలు అరుదుగా వస్తూవుంటాయి. ఆ ముగ్గురూ మళ్ళీ నీకు దొరకరు చంపెయ్యి."

అతడికి అప్పటికి అర్థం అయింది. "చట్టరీత్యా బంధించటం వేరు. వ్యక్తిగత కక్షలకోసం చట్టాన్ని అతిక్రమించటం వేరు" అన్నాడు.

"కానీ వాళ్ళు నీ తండ్రిని ---"

"అయినా సరే." దృఢంగా అన్నాడు. అతడివైపు ఆమె కన్నార్పకుండా చూసింది.

..... కొంతమంది వ్యక్తులు ఎందుకు అంత గొప్ప వాళ్ళవుతారో ఆ క్షణం ఆమెకి తెలిసింది.

తను చూసిన ప్రపంచానికి దూరంగా వేరే ప్రపంచం ఎలా వుంటుందో అప్పుడు

చూసింది.

ఆమెను కారువరకూ తీసుకువెళ్ళటానికి అతడికి చాలా కష్టమైంది. ఆమె మాత్రం చుట్టూ వున్న జనాన్ని పట్టించుకోలేదు. "అనుకున్న దాన్ని పూర్తిచేశాను. వాళ్ళచేత మొత్తమంతా చెప్పించాలనుకున్నాను. చెప్పించాను" అంది నడుస్తూ. ఆమె కళ్ళు అంతిమ విజయం తాలూకు వెలుగుతో మెరుస్తున్నాయి.

"నేను వేసిన ట్రాప్‌లో సరీగ్గా పడ్డాడు! రీజనల్ రిసెర్చి లాబ్‌లో నా స్నేహితురాలు సరిఅయిన మందే ఇచ్చింది. పాపం ..... అంతా వాళ్ళు పంపిన స్వీట్స్ ప్రభావం అనుకున్నాడు. నిజం అంతా కక్కేశాడు."

అతడికి ఆశ్చర్యంగా వుంది. ఆమె చిన్నపిల్లలా మాట్లాడుతూంది. ఏదో మత్తులో వున్నట్టు మాట్లాడుతూంది. అప్పటివరకూ పెద్ద మాఫియా గాంగ్‌లోవుండి, ఒక్కసారిగా పోలీసులకి అప్రూవర్‌గా మారి చెప్పే మనిషి ఏ విధమైన ట్రాన్స్‌లో వుంటాడో ఆ విధంగా వుంది. ఒక రకమైన సంధి ప్రేలాపన ..... జీవితపు ఒక స్టేజిలో రెండు విభిన్న సిద్ధాంతాల సంధి యుగంలో మనిషి ఒక మౌలికమైన సత్యాన్ని తెలుసుకున్నాక కలిగే వైరాగ్యపు టానందాన్ని ఆమె అనుభవిస్తున్నట్టు కనబడుతూంది.

ఆమెను కారెక్కించి రాణా వెనుదిరిగి జనంలోకి వచ్చాడు. పులిరాజు, నాయుడు కలిసి మాట్లాడుకోవటంతో, పులిరాజు మామూలుగా వుండటంతో తాత్కాలికావేశాలు తగ్గాయి. తనేం మాట్లాడాడో, ఎలా మొత్తం అందర్నీ ఇరికించాడో పులిరాజుకి అర్థమైపోయింది. విలేఖర్లు అప్పుడే పరుగెత్తుతున్నారు. అతడు మాట్లాడిన ప్రతిమాటా దూరదర్శన్ రికార్డుల్లో కెక్కిపోయింది.

అంతా నిశ్శబ్దంగా చూస్తున్నది వీరదాస్ ఒక్కడే. అగ్నిపర్వతంలా వున్నాడు అతడు. పేలబోయేముందు నిశ్శబ్దంగా -- నిశ్చలంగా వుండే అగ్నిపర్వతం!!! అతడి మనసు కుతకుతా ఉడికిపోతోంది. అక్కడికక్కడే పులిరాజుని పొడిచి చంపెయ్యాలన్న కోర్కెని బలవంతంగా అణుచుకున్నాడు. వడిగా వెళ్ళి తన కారెక్కి 'పోనియ్యి' అన్నాడు.

"ఎక్కడికి సాబ్?"

"అరె బేవకూఫ్-- ఆ కారు వెనుకే పోనియ్" దాన్ని ఎలాగయినా పట్టుకో" అని అరిచాడు. సరీగ్గా రెండు నిమిషాల్లో కామిని కారుని అతని కారు క్రాస్ చేసింది.

రాత్రి తొమ్మిది దాటి వుంటుంది.

వీరదాసు కారు దిగి, ఆమె దగ్గిరగా వచ్చి కారులోంచి బయటకు లాగాడు. అతడి చేతిలో కత్తి మెరుస్తూంది. కామిని డ్రైవరు, కారు వదిలేసి చీకట్లో పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు.

వీరదాసు కామిని జుట్టు పట్టుకున్నాడు.

చీకట్లో వీధి నిర్మానుష్యమైంది.

"ఇంతవరకూ నేను వేసిన ఏ ప్లానూ పాడవలేదు. మొట్టమొదటి సారి నీ వల్ల అయింది. చాలా గొప్పగా పథకం వేశావ్. నీ తెలివితేటలను తల్చుకుంటే నాకు మతిపోయింది. ఈ క్షణం నిన్ను నడిబజార్లో ఇలాగే రేప్ చెయ్యాలని వుంది కానీ ప్రస్తుతం ఆ మూడ్‌లో లేను."

ఈ హఠాత్ పరిణామాన్ని వూహించని కామిని అలాగే గుడ్లప్పగించి చూస్తోంది.

అతడు నవ్వేడు.

"పులిరాజు, నాయుడూ- వీళ్ళు రాజకీయ నాయకులు. ఎత్తులూ పైఎత్తులూ వాళ్ళు వేస్తారు. మీకూ మీకూ సరిపోతుంది. నాదంతా సూటి వ్యవహారమే అందుకే ఇలా-" అంటూ కత్తి తీశాడు.

కామిని వెళ్ళిన వెంటనే వీరదాసు కారెక్కటం రాణా చూశాడు.

అతడికి అనుమానం కలిగి, దానితోపాటే ఫాలో అవటంకోసం, జనంలోంచి తన వెహికల్ తీసుకుని బయటపడి వచ్చేసరికి ఈ సంఘటన జరుగుతూంది.

అతడు జేబులోంచి రివాల్వర్ తీసి వీరదాసుని షూట్ చెయ్యబోయాడు. ట్రిగ్గర్ నొక్కాడు.

'టప్'మని చప్పుడైంది. పేల్లేదు. వంద అడుగుల దూరమున్నా అంతటి నిశ్శబ్దంలో ఆ చిన్న శబ్దమే వీరదాసుని తాకింది. అతడు వెనుదిరిగి చూశాడు.

రాణా చేతుల మధ్య పిస్టల్‌తో కనబడ్డాడు. పేలని పిస్టల్‌తో.

వీరదాసు నవ్వేడు. అతడు ఎందుకు నవ్వుతున్నాడో రాణాకి అర్థమైంది. రాణాకి తన డిపార్ట్‌మెంట్ మీద కోపంతో కూడిన నిస్సహాయత లాటి ఫీలింగ్ కలిగింది.

పరుగెత్తాడు.

సత్తువనంతా కాళ్ళలోకి తీసుకుని అతడు వాళ్ళవైపు పరుగెత్తాడు. మధ్య మధ్యలో ట్రిగ్గర్ నొక్కే ప్రయత్నం చేస్తూ.

వీరదాసుకి ఇది ఆటలా కనిపించింది. రాణా నిజంగానే తుఫాను వేగంతో వస్తున్నాడు. రాణా తనకి ఎంత దూరంలో వుండగా తను ఈమె ప్రాణాలు తీయగలడు? కత్తిని ఎంత వేగంగా గుచ్చగలడు? తను ఒక్కపోటు పొడిస్తే ఈ ప్రపంచంలో ఏ డాక్టరూ ఆ ప్రాణిని రక్షించలేడు. పది కత్తి పోట్లతో కూడా శత్రువు బ్రతికాడంటే అంతకంటే ఒక రౌడీకి అవమానం లేదు.

రాణా ఇంకా పాతిక అడుగుల దూరంలో వున్నాడనగా వీరదాసు మెరుపు వేగంతో కత్తి ఎత్తాడు. సరీగ్గా గెడ్డానికి రెండు అంగుళాల క్రింద మెడనరం కాస్త తెగేలా ..... అంటే ప్రపంచంలో ఇక ఏ డాక్టరూ రక్షించలేడు.

కత్తి గాలిని సర్రున కోస్తూ. చీకటిని చీలుస్తూ దిగుతోంది.

అప్పుడు పేలింది పిస్టల్.

అంత క్లోజ్డ్‌రేంజిలో పేల్చటంతో వీరదాసు కపాలం రెండుగా చీలి-మెదడు

బయటకొచ్చింది. ఏ గడ్డనైతే తన చేతుల్తో అతడు రక్తపంకిలం చేశాడో, అదే భూమి చేతులు సాచి అతడి రక్తసిక్త శరీరాన్ని ఆహ్వానించింది.

కామిని అలాగే చూస్తూ నిలబడి వుంది.

రాణా ఆమె దగ్గిరగా వచ్చాడు.

అది కృతజ్ఞతతో, లేక అతడి వేగానికి ఆశ్చర్యపోయిందో, తన ప్రాణాలు ఆఖరి క్షణంలో ఆ విధంగా రక్షింపబడటంతో సంభ్రమం చెందిందో, అదీకాక అతడి మీద ముందునుంచి వున్న భారం ఆ విధమైన రూపం దాల్చిందో గాని, అతడి వేగాన్ని నిరోధించకుండా అలాగే ఆహ్వానించి, అతడి మోహాన్ని తన చేతుల మధ్య ఇముడ్చుకుని- ముద్దు పెట్టుకుంది.

అతడి వేగంకన్నా తనది ఎక్కువ తనది ఎక్కువ అని నిరూపించటానికా అన్నట్టు కనురెప్పపాటు కాలంలో అక్కడినుంచి కారులో అదృశ్యమైంది.

రాణా అటొకసారి చూసి, నెమ్మదిగా మోకాళ్ళమీద వంగాడు. ప్రాణం పోయేముందు కొద్దిపాటి సమయం మాట తెలుస్తుందంటారు. అందుకే అతడు వీరదాసుతో అన్నాడు.

"నేను నిన్ను చట్టరీత్యానే చంపాను."

ఉపసంహారం

"నీ అంత మూర్ఖురాలు ఈ ప్రపంచంలో ఇంకెవరూ వుండరు" అన్నాడు అరవింద్ చౌరసియా. అతని చేతిలో వైన్ గ్లాస్ వుంది.

"ఛాయిస్ నీకే వదిలిపెడుతున్నాడు. చెప్పు నిన్నెలా చంపను?" అడిగాడతడు. ఆమె మాట్లాడలేదు. ఆమెని కుర్చీకి కట్టేశాడు. అతడు శాడిస్టిక్‌గా చాలాసేపు హింసించాడు. అతడిలో అంత రాక్షసుడు దాగివున్నాడని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. ఆమె కంటి క్రింద నుంచి రక్తం కారుతోంది.

"మా రాజకీయ సెటప్‌ని పునాదుల్తో సహా కదిలించి వేశావు అంతవరకూ నువ్వు సెక్సెస్సే కానీ వెంటనే అక్కణ్ణుంచి పారిపోకుండా మళ్ళీ రావటమే నువ్వు చేసిన తప్పు. నువ్వు నా ప్రియురాలివి కాబట్టి నేను నిన్ను వదిలిపెడతావని నువ్వు అనుకుంటే అది నీ రెండో తప్పు. నా దారికి అడ్డువచ్చిన ఎవర్నీ నేను క్షమించను. నువ్వు నాకు ద్రోహం చేసిన తరువాత పారిపోయి వుంటే, ఈ ప్రపంచంలో ఎక్కడ దాక్కున్నా, నిన్ను చంపటంలో ఆనందం పొందివుండేవాడిని. ఇప్పుడు ఆ 'వేట' ఎలానూ లేదు కాబట్టి నిన్ను సుదీర్ఘంగా చంపటంతో ఆనందం పొందుతాను. అసలు మా సంభాషణ రికార్డు చేసినప్పుడే నిన్ను చంపాల్సింది. నీ టేప్ చెరిపి ఆనందించాను. కానీ నువ్వు ఇంత పెద్ద ఎత్తు వేస్తావనుకోలేదు. పులిరాజు అనుమానబీజం నాటకంలో చాలా బాగా సక్సెస్ అయ్యావ్. వీరదాసు మరణం కూడా నన్నేమీ బాధపెట్టడం లేదు. నేనూ సత్తార్ కలిసి మరో ప్లాన్ వేస్తాం. ఈసారి ఎవరాపగలరు? మా ప్లాన్ ఆపటానికి పాపం నువ్వుండవుగా ..... ఊఁ చెప్పు. ఎలా చావాలనుకుంటున్నావ్ నువ్వు?కత్తి

తీస్తూ అడిగాడు. “ ..... మణికట్టు నరం కోసేసి నీళ్ళలో పెట్టనా? ఇక్కడున్న వాటిలో అన్నిటికన్నా సింపిల్ డెత్ అది” అంటూ నవ్వేడు.

ఆమె అతడివైపు తలెత్తి చూసింది. ఆ కళ్ళలో ప్రేమ, ఆప్యాయత, జాలీ, అభ్యర్థనా వున్నాయి. “అరవింద్!” అంది. ఎప్పుడో గానీ ఆమె యిలా పిలవదు. ‘నువ్వు నన్ను రెండు ప్రశ్నలడిగావ్. ఇంత ద్రోహం చేశాక ఎందుకు మళ్ళీ వచ్చావ్? నేనూరుకుంటానా?’ అని మొదటి ప్రశ్న? నువ్వు వూరుకోవని నాకు తెలుసు అరవింద్. నన్ను చంపుతావని నాకు తెలుసు. అయినా ఎందుకొచ్చానో తెలుసా? నిన్ను ప్రేమిస్తున్నానని చెప్పటానికి. నీ చేతుల్లో ప్రాణం వదలటానికి.”

అతడామెవైపు అనుమానంగా చూశాడు. “చూడూ- నువ్వు నటివి. ఇలా ప్రేమగా మాట్లాడితే కరిగి నిన్ను వదిలిపెడతాననుకోకు.”

“నన్ను నమ్మే అవసరం లేదు. ఒక్కసారి ముద్దు పెట్టుకో ..... చివరి ముద్దు ..... స్త్రీ హృదయం పురుషుడు ఎప్పుడూ అర్థం చేసుకోలేదు. మన ప్రేమలో కాసింతనయినా నిజాయితీ వుండి వుంటుంది. లేకపోతే ఇంత కాలం కలసి ప్రణయం సాగించం. నా ఆఖరి కోరిక తీర్చవా?” ఆమె కళ్ళల్లో తడి కదలాడింది. అతడు ఇక ఆగలేకపోయాడు. ఆమె దగ్గిరగా వచ్చి పెదవుల మీద పెదవులు అన్చాడు. ఆమె చేతులు వెనక్కి కట్టేసి వున్నాయి. ఆమె వక్షం అతడికి బలంగా తాకుతుంది. ఆమె నాలుక అతడి పెదవుల్ని చీల్చి అతడి పంటి వరుసని సుతారంగా స్పృశించింది. అతడిలో క్రమంగా ఆవేశం ఎక్కువైంది. అతడి నాలుక ఆమె అంగుటిని తాకింది. ఆమె మొహం దూరంగా జరిపి నవ్వింది.

“స్త్రీలు ప్రియుళ్ళకి అధరామృతాన్ని ఇస్తారట కదూ” అంది తలను వెనక్కి వాల్చి.

ఈ అసందర్భ ప్రేలాపన అర్థంకాక “అంటే” అన్నాడు. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా--

“నీ రెండో ప్రశ్నకి నా సమాధానం ఏమిటో వినలేదు నువ్వు?” అంది.

“ఏమిటా ప్రశ్న? ఏమిటా సమాధానం?” విసుగ్గా అడిగాడు.

“అబ్దుల్ సత్తార్‌తో నే వేసిన ప్లాన్‌ని ఎవరాపగలరు? అని”

“మరి సమాధానం ఏమిటి?”

“నేను ఆపగలను- అని. ఆపగలనేమిటి? ఆపాను కూడా.”

“ఎలా”

“అధర జలాలతో కలిపి హాలాహలాన్ని ఇవ్వటం ద్వారా!” అని “ ..... ఇంకో అయిదు నిముషాల్లో ఇద్దరం చనిపోతున్నాం చౌరసియా” అంటూ నవ్వింది. “ ..... నేను చాలా గొప్ప నటిని అన్న విషయం మర్చిపోకు. ఆ ధైర్యంతోనే చిగుళ్ళ వెనక్కి పొటాషియం కాంపౌండ్ కాప్సూల్ పెట్టుకొచ్చాను. నేను ప్రపంచంలో ఎక్కడ దాక్కున్నా నన్ను పట్టుకుని చంపుతావని నాకు తెలుసు. అందుకని నేనే స్వయంగా వచ్చి లొంగిపోయాను. నేనే మరణించాక సత్తార్‌తో

కలసి నీ ప్లాన్ సాగిస్తావనీ నాకు తెలుసు. అందుకని నేను స్వయంగా నీ దగ్గరికి వచ్చాను. నిన్ను చంపి, ఆ తృప్తితో మరణిస్తున్నాను."

అతడు ప్రతిమలా అలా చూస్తుండిపోయాడు. అప్పటికే ఇద్దరి శరీరాల్లో మార్పు వస్తోంది.

"ఏ చట్టమూ నిన్ను ఏమీ చేయలేదు. రాణా కూడా నిన్నేమీ చేయలేడు. అందుకని నేనే రాశాను. ఆ తృప్తితోనే మ....ర...ణి..." ఆమె తల వెనక్కి వాలిపోతుంది. అతడింకా దిగ్భ్రమ నుంచి తేరుకోలేదు. ఫోన్ వరకూ చేతిని సాచేశక్తి కూడా లేదు. ఆఖరి క్షణంలో అతడు ఆలోచించింది- 'ఇన్ని ఎత్తులూ పైఎత్తులూ వేసి రాజకీయాల్లో రాణించింది, దేశాన్ని విడగొట్టడంలో తనకి ఎందుకు సహకరించలేదా?' అని.

'కేవలం రాణా ప్రేరణవల్లే' అన్న సమాధానం మనసుకి తోచక ముందే అతడి ప్రాణం గాలిలో కలిసిపోయింది. పక్కనే కామిని శరీరం పడివుంది. నమ్మే వారెవరూలేక, బ్రతికినంత కాలమూ నటనలో జీవించిన ఆ స్త్రీ మరణం ముందు క్షణంవరకూ కూడా నటననే ఆశ్రయించవలసి వచ్చింది. దాన్నే విధివిలాస మంటారేమో.

ఈ కథ ముగించే ముందు మరో రెండు విషయాలు చెప్పవలసి వుంటుంది.

పులిరాజు, నాయుడు పార్టీల నుంచి బహిష్కరింపబడ్డారు. ప్రస్తుతం జైల్లో- కొత్తపార్టీ స్థాపనకి మంతనాలు సాగిస్తున్నారు. పెద్ద పెద్ద రాజకీయ పార్టీలన్నీ జైళ్ళలోనే కదా పుట్టింది!

రాణా ప్రమోషన్ మీద గిరిజనాభివృద్ధి శాఖ సెక్యూరిటీ చీఫ్‌గా పంపబడ్డాడు.

------- ***** ------